

ఈనాడు



విజయవాడ 24-10-2024 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 74

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మహిళలకు దీపావళి కానుక



3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు

- డెలివరీ అయిన 48 గంటల్లో ఖాతాలో సొమ్ము జమ
- విశాఖలో శారదాపీఠానికి 15 ఎకరాల కేటాయింపు రద్దు
- ఇసుక పూర్తిగా ఉచితం.. సీనరేజ్, డీఎంఎఫ్, జీఎస్టీ రద్దు
- ఆలయ పాలకమండలి సభ్యుల సంఖ్య మరో రెండు పెంపు
- వాటిలో బ్రాహ్మణులు, నాయీబ్రాహ్మణులకు అవకాశం
- టెండర్లకు న్యాయ సమీక్ష విధానం రద్దు

మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

ఈనాడు - అమరావతి

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మహిళలకు దీపావళి కానుక ప్రకటించింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ హామీని ఈ నెల 31 నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. గ్యాస్ డెలివరీ అయిన 48 గంటల్లో ఆ సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా ఏర్పాటు చేసింది. ప్రజలు ఎవరైనా ఉచితంగా ఇసుక పొందేలా సీనరేజ్ తదితరాలు రద్దు, ఆలయ పాలకమండళ్లలో సభ్యుల సంఖ్య మరో రెండు పెంపు, వాటిలో ఓ స్థానంలో బ్రాహ్మణులను నియమించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలను మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత (మిగతా 3లో)

చీకటి పాలనలోని జీఓలన్నీ అందుబాటులో..

గత ప్రభుత్వ చీకటి పాలనలో ఉద్దేశపూర్వకంగానే జీఓలను దాచేశారు. 2021 ఆగస్టు 15 నుంచి ఈ ఏడాది ఆగస్టు 27 వరకు పోర్టల్‌లో పెట్టని ఆ జీఓలన్నీ కూడా అప్‌లోడ్ చేసేలా నిర్ణయం. కూటమి ప్రభుత్వంలో జీఓలన్నీ జీఓఐఆర్ పోర్టల్‌లో ఆగస్టు 27 నుంచి పొందుపరుస్తున్నాం.

తల్లి, చెల్లిపైనే కోర్టుకెక్కిన జగన్



నాపై షర్మిల తప్పుడు ప్రచారం

- మా మధ్య ప్రేమ, అనుబంధానికి బీటలు
- అందుకే ఆస్తిలో వాటా ఇవ్వరాదని నిర్ణయం
- గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసుకుంటున్నా
- వాటాల బదలాయింపు రద్దు చేయండి
- ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించిన జగన్
- షర్మిలకు, విజయమ్మకు ట్రైబ్యునల్ నోటీసులు

ఈనాడు - హైదరాబాద్

మాట తప్పను.. మడమ తిప్పను అని పదే పదే చెప్పే వైకాపా అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత కుటుంబంలోని తల్లి, చెల్లి విషయంలోనే మాట తప్పి, మడమ తిప్పారు. ప్రేమతో చెల్లికి ఆస్తులు ఇస్తానని అవగాహన ఒప్పందం కుదుర్చుకుని మరీ ఇప్పుడు తూచ్ అన్నారు. రాజకీయంగా విభేదించారన్న కారణంగా తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలపై ఏకంగా కోర్టుకెక్కారు. షర్మిల రాజకీయంగా, వ్యక్తిగతంగా ఆరోపణలు చేసి తన పరువు, ప్రతిష్ఠలను దెబ్బతీశారని, ఆమెకు తనపై ప్రేమ లేదని తేలిందని, అందువల్ల చెల్లికి ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసుకుంటున్నానని వెల్లడించారు. సరస్వతి పవర్ కంపెనీలో తనకు, తన భార్య భారతీరెడ్డికి ఉన్న వాటాలను, సరస్వతిలోనే తమకు చెందిన క్లాసిక్ రియాల్టీ అనే మరో కంపెనీకి ఉన్న వాటాల్లో అధిక భాగాన్ని తల్లి విజయమ్మ పేరుతో సరస్వతి కంపెనీ బోర్డు అక్రమంగా బదలాయించిందంటూ భారతి, క్లాసిక్ రియాల్టీలతో కలిపి జగన్‌మోహన్‌రెడ్డి హైదరాబాద్ (జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్) ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేశారు.

కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుకు సంబంధించిన వివాదాలు పరిష్కారమయ్యాక కొన్ని ఆస్తులను అన్నా చెల్లెళ్ల మధ్య ప్రేమ, అనుబంధంలో భాగంగా చెల్లెలు షర్మిలకు బదలాయించాలని గతంలో నిర్ణయించినట్లు జగన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇందుకుగాను 2019 ఆగస్టు 31న షర్మిలతో (మిగతా 12లో)





జగనన్నా.. ఇంత అన్యాయమా!

- నాన్న తన ఆస్తుల్లో మనవలూ మనవరాళ్లకు సమాన వాటా అన్నారు..
- నాకు అరకొరగా ఇచ్చి వెళ్లగొట్టాలని చూశావ్..
- రక్త సంబంధం వదులుకోలేక సరేనన్నా
- అది ఇవ్వడానికీ ఏడుపేనా?
- తల్లినీ, చెల్లినీ కోర్టుకీడ్చేంత నీచానికి ఒడిగట్టావా?

నీకు, అవినాష్‌కు వ్యతిరేకంగా మాట్లాడొద్దని షరతులేంటి?

మాజీ సీఎం జగన్‌కు ఆయన సోదరి షర్మిల ఘాటు లేఖ

ఈనాడు, అమరావతి: తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంపాదించిన ఆస్తుల్లో తనకు, తన పిల్లలకు దక్కాల్సిన వాటా ఇవ్వకుండా.. సోదరుడు జగన్ అన్యాయం చేశారని వైఎస్ షర్మిల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అరకొర ఆస్తులిచ్చి వెళ్లగొట్టాలని చూడటమే కాకుండా, ఆస్తుల పంపకానికి సంబంధించి తనతో చేసుకున్న ఒప్పందాన్ని కూడా తుంగలో తొక్కారని మండిపడ్డారు. తల్లిపైనా, చెల్లిపైనా కేసు పెట్టి, కుటుంబాన్ని కోర్టుకీడ్చేంత నీచానికి ఒడిగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తుల విషయం సెటిల్ చేసుకోవాలంటే.. జగన్‌కు, అవినాష్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడకూడదని తనకు షరతు పెట్టడంపై (మిగతా 12లో)

నన్ను రాజకీయంగా వ్యతిరేకించావ్ 12లో

- నీకు రాసిచ్చిన ఆస్తుల్ని వెనక్కి తీసుకుంటా!
- నీపై ప్రేమ, ఆప్యాయతలు పోయాయి
- నీ ఆలోచన మారితే వాటిని పునరుద్ధరిస్తా

వైఎస్ షర్మిలకు జగన్ లేఖ

సంక్షేమం పేరుతో జగన్ లూటీ చేశారు

- అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని వెనక్కి నెట్టారు
- పార్టీలో ఆయనవన్నీ ఏకపక్ష నిర్ణయాలే



మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ధ్వజం

వైకాపాకు రాజీనామా

3లో



రష్యాలోని కజన్‌లో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్

సరిహద్దు వివాదాలతో శాంతి కోల్పోవద్దు

- ప్రత్యేక ప్రతినిధుల చర్చలు పునరుద్ధరిద్దాం
- ద్వైపాక్షిక భేటీలో భారత్-చైనా ఉద్ఘాటన

3లో

ఐదేళ్ల తర్వాత జిన్‌పింగ్‌తో మోదీ భేటీ

శారదాపీఠం భూముల్లో అక్రమాలు అన్నీ ఇన్నీ కావు

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు డిజిటల్, అమరావతి: శారదాపీఠం భూముల్లో సాగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఎకరం రూ.20 కోట్ల ధర పలికే భూమిని కేవలం రూ.లక్ష చొప్పున 15 ఎకరాలను అప్పనంగా కట్టబెట్టారని వివరించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. 'సాంస్కృతిక కళాశాల ఏర్పాటు పేరుతో భూములను తీసుకుని వాటిని శారదా పీఠానికి మళ్లించుకునేందుకు అక్రమాలు చేశారు. వాటిని గుర్తించాం కాబట్టే లీజును రద్దు చేశాం. ఎర్రమట్టి దిబ్బలను సైతం గత పాలకులు కొల్లగొట్టారు. అక్రమాలన్నింటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

స్వామి అడుగులకు మడుగులు!

- భూముల కేటాయింపులో ఉల్లంఘనలు
- ట్రస్టీ పేరుతో అభ్యర్థన.. ఉత్తరాధికారి పేరుతో కేటాయింపులు
- నాటి వైకాపా పాలనలో సర్వం మాయ

ఈనాడు-అమరావతి, విశాఖపట్నం: వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదా పీఠానికి నాటి వైకాపా ప్రభుత్వం అడుగడుగునా వత్తాసు పలికింది. రూ.225 కోట్ల విలువచేసే 15 ఎకరాలను.. నిబంధనలు ఉల్లంఘించి రూ.15 లక్షలకు కట్టబెట్టారు. ఒకసారి ఉత్తరాధికారి, మరోసారి ట్రస్టీ పేరుతో వ్యవహారాలు నడిపి గందరగోళానికి తెరతీశారు. అభ్యర్థన ఒకరి పేరుతో రాగా.. కేటాయింపు మరొకరి పేరున జరిగింది. గత జులై 15న ముఖ్యమంత్రి చంద్రబాబు 'సహజ వనరుల దోపిడీ' పేరుతో విడుదల చేసిన శ్వేతపత్రంలో శారదా పీఠానికి కేటాయించిన భూముల వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. తదుపరి చర్యల్లో భాగంగా కలెక్టర్ నుంచి అందిన నివేదికపై మంత్రివర్గంలో చర్చించి ఎన్డీయే ప్రభుత్వం రద్దుచేసింది. భూముల కేటాయింపులో విశాఖ జిల్లా అధికార యంత్రాంగం గుర్తించిన ప్రధాన ఉల్లంఘనలు ఇవీ..

★ నిబంధనల ప్రకారం ట్రస్టు నిర్వాహకులు, పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేరున కాకుండా పీఠం ఉత్తరాధికారి పేరున ఆ భూములను బదలాయించకూడదు.

★ తొలుత 2.9.2021న పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి 15 ఎకరాలు కావాలని అభ్యర్థించారు. శాశ్వత బదలాయింపు కోసం ఉత్తరాధికారి ఫారం-29లో వివరాలు పూర్తిచేసి సమర్పించాల్సి ఉన్నా.. అవేమీ చేయలేదు.

★ అప్పటి ప్రభుత్వం స్వాత్మానందేంద్ర అభ్యర్థన మేరకు 24.10.2021లో భూములు బదలాయింపు జీఓ 571 ఇచ్చేసింది. ఆ తర్వాత పీఠం ట్రస్టీ చాగంటి ప్రకాశరావు ఫారం-29లో వివరాలు నింపి దరఖాస్తు చేశారు.

★ 29.11.2021న శారదా పీఠం ట్రస్టీ పేరున భూమిని బదలాయిస్తూ జీఓ 343ను ఇచ్చింది. వాస్తవానికి ఫారం-29 ఎవరు సమర్పిస్తారో వారి పేరున బదలాయించాలి. ఇక్కడ ట్రస్టీ చేయడంతో ఆయన పేరున జీఓ ఇచ్చారు. మొదట ఉత్తరాధికారి పేరున ఒక జీఓ ఇచ్చి, ట్రస్టీ పేరున మరొకటి విడుదల చేశారు.

★ తర్వాత భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా, సర్వే నంబర్లు మార్చి ఇవ్వాలని శారదా పీఠం ట్రస్టీ అప్పటి రెవెన్యూ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

★ వెంటనే రెండు సర్వే నంబర్లలో ఉన్న భూములను ఒకే సర్వే నంబరు కింద మార్చి సవరించిన ఉత్తర్వులను ట్రస్టీ పేరున ఇచ్చారు. శాశ్వత బదలాయింపు ఉత్తర్వుల్లో స్వాత్మానందేంద్ర సరస్వతి పేరున ఇచ్చిన దాంట్లోనూ మార్చారు. 8.2.2022న నాటి ప్రభుత్వం 343 బదలాయింపు ఉత్తర్వులను సవరించి కొత్తగా శారదా పీఠం ఉత్తరాధికారి పేరున జీఓ 64ను కొత్తగా ఇచ్చింది. ఇలా ఒక్కోసారి ఒక్కొక్కరి పేరున నచ్చినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

★ 20.11.2023న ఆధ్యాత్మిక, ట్రస్టు అవసరాల కోసం ఈ భూమిని ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రయత్నించారు. అందు కోసం అప్పటి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పీఠం ఉత్తరాధికారి లేఖ రాశారు. వడ్డించే వాడు మనవాడైతే అన్నీ వస్తాయన్నట్లుగా ఒక రాయి వేశారు.

★ ఆ ప్రతిపాదించిన స్థలంలో ఘాట్ రోడ్డు నిర్మించేశారు. ప్రస్తుతం ఒక బోరు, షెడ్డు ఉంది.

రేపటి నుంచి మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన

లాస్‌వేగాస్‌లో ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం

ఈనాడు డిజిటల్, అమరావతి: విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నుంచి వచ్చే నెల 1 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. ఆయా తేదీల్లో పలు సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలపై చర్చిస్తారు. ఇందులో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒరాకిల్ సంస్థ ప్రతినిధులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో 25న సమావేశమవుతారు. పత్ర సినర్జీస్, బోసన్, స్పాన్‌ఐఓ, క్లారిటీ, ఎడోబ్, స్కేలర్, జనరల్ అటమిక్స్ సంస్థల ప్రతినిధులు, భారత కాన్సుల్ జనరల్‌తో 26న భేటీ అవుతారు. ఆస్టిన్‌లోని పలు కంపెనీల ప్రతినిధులతో 27న, రెడ్‌మండ్‌లో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో 28న భేటీ కానున్నారు. 29న అమెజాన్ సహా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం కావడంతోపాటు ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ నెల 30న కూడా వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. 31న జార్జియాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. న్యూయార్క్‌లో పెట్టుబడిదారులతో నవంబరు 1న సమావేశమవుతారు.

గ్రహం అనుగ్రహం — 24-10-2024 గురువారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం

అష్టమి: తె.5-57 తదుపరి నవమి; **పునర్వసు:** ఉ.11-26 తదుపరి పుష్యమి **వర్జ్యం:** రా. 7-40 నుంచి 9-18 వరకు; **అమృత ఘడియలు:** ఉ. 9-00 నుంచి 10-37 వరకు, తిరిగి తె. 5-32 నుంచి; **దుర్ముహూర్తం:** ఉ. 9-49 నుంచి 10-35 వరకు, తిరిగి మ. 2-26 నుంచి 3-12 వరకు

రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు

సూర్యోదయం: ఉ. 5.59; **సూర్యాస్తమయం:** సా.5.31

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.5	23.0
నెల్లూరు	35.2	26.6
తిరుపతి	35.0	24.0
కర్నూలు	34.4	24.7
విశాఖపట్నం	34.4	24.2
ఒంగోలు	34.1	26.4
అనంతపురం	34.1	23.5
నరసాపురం	34.0	25.2
గుంటూరు	34.0	25.0
కడప	34.0	24.0
విజయవాడ	33.9	24.6
తాడేపల్లిగూడెం	33.4	24.3
శ్రీకాకుళం	33.0	25.0
విజయనగరం	32.0	24.0
హైదరాబాద్	31.9	21.6

విద్యాసాగర్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: ముంబయి సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో విజయవాడ కోర్టు ఈ ఏడాది సెప్టెంబర్ 23న తనకు రిమాండ్ విధించడాన్ని సవాల్ చేస్తూ వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో బుధవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి ప్రకటించారు. సాధ్యమైనంత త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు.

రాజ్యలక్ష్మి దాతృత్వం ఆదర్శప్రాయం

- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అయ్యప్పరాజుకు రూ.15 లక్షల చెక్కు అందిస్తున్న జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి, సావిత్రమ్మ తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్యాంకులో దాచుకున్న రూ.61 లక్షల నగదును తన మరణానంతరం సామాజిక, స్వచ్ఛంద సేవా సంస్థలకు దానం చేసిన జీఎస్టీ విశ్రాంత సూపరింటెండెంట్ శిష్ట్లా రాజ్యలక్ష్మి దాతృత్వం అందరికీ ఆదర్శప్రాయమని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. గుంటూరు కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో నరసింహారెడ్డి చేతుల మీదుగా వివిధ సేవా సంస్థలకు బుధవారం చెక్కులు అందజేశారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ రాజ్యలక్ష్మి ఆదర్శ నిర్ణయం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె భౌతికంగా లేనప్పటికీ, తన దాతృత్వం ద్వారా అందరికీ మార్గదర్శిగా మిగిలిపోతారన్నారు. అనంతరం రాజ్యలక్ష్మి రాసిన వీలునామా ప్రకారం అమ్మ ఛారిటబుల్ ట్రస్టుకు రూ.15 లక్షలు, శిర్డీ సాయి సేవా ట్రస్ట్‌కు రూ.10 లక్షలు, శిష్ట్లా రాజ్యలక్ష్మి పేరుతో ఏర్పాటైన మెమోరియల్ ట్రస్ట్‌కు రూ.36 లక్షలు (చెక్కుల రూపంలో) రాజ్యలక్ష్మి తల్లి సావిత్రమ్మ సమక్షంలో ఆయా సంస్థల ప్రతినిధులు అయ్యప్పరాజు, దేవరశెట్టి సురేష్, చిట్టే వెంకట్‌లకు అందజేశారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి సోదరుడు రామకృష్ణ, ఐఆర్ఎస్ అధికారులు బి.లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వరరావు, మనోజ్‌కుమార్, కమల్ సీనా, రవికుమార్, నాగరాజు, జీఎస్టీ అధికారులు సీహెచ్.వెంకటేశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, సీహెచ్.ఈశ్వర్, యుగంధర్, మూర్తి, పింఛనర్ల సంఘం తరఫున వివేకానంద, పీవీ సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు: మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీని రీయింబర్స్‌మెంట్ చేయనున్నట్లు వెల్లడించారు. ట్రెండ్‌కు తగ్గట్టుగా నేత కార్మికులకు శిక్షణ ఇచ్చి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. మంగళగిరిలోని చేనేత కార్యాలయంలో బుధవారం వివిధ జిల్లాల డీడీలు, ఏడీలతో ఆమె సమీక్ష నిర్వహించారు. 'చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించేందుకు కసరత్తు ప్రారంభించాం. చీరాలలో నూతనంగా టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేస్తాం' అని పేర్కొన్నారు.



ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా అనురాధ



ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నూతన ఛైర్‌పర్సన్‌గా విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎ.ఆర్.అనురాధను రాష్ట్రప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఏపీ ఇంటెలిజెన్స్ విభాగానికి అధిపతిగా పనిచేసిన మొదటి మహిళా ఐపీఎస్‌గా 1987 బ్యాచ్‌కి చెందిన అనురాధ గుర్తింపు పొందారు. ఈమె భర్త సురేంద్రబాబు ఐపీఎస్ అధికారిగా రాష్ట్రంలో కీలక బాధ్యతలు నిర్వర్తించి, పదవీ విరమణ చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ ఛైర్మన్‌గా వ్యవహరించిన గౌతమ్ సవాంగ్ ఈ ఏడాది జులై 4న రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఛైర్మన్ పదవి ఖాళీగా ఉంది. కొత్త ఛైర్మన్ రాకతో నోటిఫికేషన్లు, నియామక జాబితాలు వెలువడేందుకు మార్గం సుగమమైంది.

వందే భారత్ స్లీపర్ బోగీ సిద్ధం



వడపళని, న్యూస్‌టుడే: రైలు ప్రయాణికులు ఎదురు చూస్తున్న వందేభారత్ స్లీపర్ బోగీలు చెన్నై ఐసీఎఫ్(ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ)లో తయారవుతున్నాయి. ప్రయోగాత్మకంగా సిద్ధం చేసిన ఓ బోగీని ఐసీఎఫ్ అధికారులు బుధవారం పాత్రికేయులకు చూపారు. బోగీలో ఎలాంటి ఇబ్బంది లేకుండా 1,200 కి.మీ. ప్రయాణించేందుకు అవసరమైన సదుపాయాలు ఉంటాయని జనరల్ మేనేజరు యు.సుబ్బారావు తెలిపారు. గంటకు గరిష్ఠంగా 160 కి.మీ. వేగంతో పయనించేలా రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇందులో మొబైల్ ఛార్జింగ్, మేగజైన్లు, టేబుల్, చిన్నపాటి లైట్, సామగ్రి కోసం విశాల స్థలం, వేడి నీరు, సీసీ కెమెరాలు, అత్యవసర సమయాల్లో డ్రైవరుతో మాట్లాడే సౌకర్యం, బయో వాక్యూమ్ మరుగుదొడ్లు ఉన్నాయని వివరించారు.



స్లీపర్ బోగీ లోపల ఇలా..



రష్యాలోని కజన్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్న ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్

సరిహద్దు వివాదాలతో శాంతి కోల్పోవద్దు

కజన్: పరిణతి, పరస్పర గౌరవాలతో వ్యవహరించడం ద్వారా శాంతియుత, సుస్థిర సంబంధాలను కొనసాగించుకోవాలని భారత ప్రధాని నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ అంగీకారానికి వచ్చారు. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రష్యాలోని కజన్‌కు వచ్చిన అగ్రనేతలిద్దరూ బుధవారం దాదాపు 50 నిమిషాలపాటు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. విభేదాలను పక్కనపెట్టాలని స్థూలంగా ఒక అవగాహనకు వచ్చారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత గత ఐదేళ్లలో ఈ ఇద్దరు నేతలు ఇలాంటి చర్చల కోసం ముఖాముఖి భేటీ కావడం ఇదే తొలిసారి. తూర్పు లద్దాఖ్ సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకునేందుకు కుదిరిన ఒప్పందాన్ని వారిద్దరూ ఈ సందర్భంగా ధ్రువీకరించారు. ప్రత్యేక ప్రతినిధుల స్థాయిలో చర్చల్ని పునఃప్రారంభించాలని నిర్ణయించారు. వివాదాలను పరిష్కరించడంలో, సరిహద్దుల్లో శాంతిని కొనసాగించడంలో వీరు కీలకపాత్ర పోషిస్తారని మోదీ, జిన్‌పింగ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. వివాదాలు, విభేదాలను తగిన రీతిలో పరిష్కరించుకోవాల్సిన ఆవశ్యకతను మోదీ నొక్కిచెప్పారు. శాంతి-సామరస్యతకు భంగం కలిగించే స్థాయికి వాటిని తీసుకువెళ్లనివ్వొద్దని అన్నారు. సున్నితత్వాన్ని పరస్పరం అర్థం చేసుకోవడం, ఒకరినొకరు గౌరవించుకోవడం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలకు మార్గనిర్దేశం లభిస్తుందని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.

సమాంతరంగా అభివృద్ధి చెందుదామన్న చైనా

పెద్దవైన రెండు ఇరుగుపొరుగు దేశాలు సామరస్యతతో మెలగుతూ, సమాంతరంగా అభివృద్ధి చెందాలని, దీనికి తగ్గ మార్గాన్ని అన్వేషించడంలో కలిసి పనిచేయాలని జిన్‌పింగ్ ఆకాంక్షించారు. అభివృద్ధి ఆకాంక్షల్ని సాకారం చేసుకోవడంలో ఒకరికొకరు సహాయకారిగా ఉండాలని చెప్పారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ వార్తాసంస్థ జిన్హువా వెల్లడించింది. రెండు భారీస్థాయి వర్ధమాన దేశాలు ఒకదానినొకటి ఎలా చూస్తాయనే అంశంపై ఆధారపడి ఇరుదేశాల సంబంధాలు ఉంటాయని జిన్‌పింగ్ అన్నారు. అభివృద్ధే రెండు దేశాల భారీ లక్ష్యమని చెప్పారు. ఒకదానికొకటి ముప్పుగానో, పోటీదారుగానో కాకుండా అభివృద్ధికి అవకాశంగానే అర్థం చేసుకోవాలన్నారు. దేశాల మధ్య సంబంధాలు కొన్ని విభేదాలతో దెబ్బతినరాదని, ఆ దిశగా నిర్మాణాత్మకంగా భేటీ కొనసాగడం గొప్ప పరిణామమని జిన్హువా పేర్కొంది.

సమావేశానికి ఏర్పాట్లు: మిస్రీ

సాధ్యమైనంత త్వరగా ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధులు సమావేశమై తమ ప్రయత్నాలు కొనసాగించాలని నేతలిద్దరూ ఆకాంక్షించినట్లు భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ విలేకరులకు తెలిపారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. 2019 డిసెంబరు తర్వాత ఈ సమావేశాలు జరగలేదని గుర్తుచేశారు. వ్యూహాత్మక, దీర్ఘకాల దృక్కోణాల్లో ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమీక్షించినట్లు వెల్లడించారు. భారత్-చైనా మధ్య స్థిరమైన సంబంధాలు ఉండడం ప్రాంతీయంగా సానుకూల ప్రభావాన్ని చూపిస్తుందని, ప్రపంచ శాంతికి, సుసంపన్నతకు కూడా అది దోహదం చేస్తుందని పేర్కొన్నారు. సరిహద్దులో ప్రశాంతత నెలకొనడం వల్ల ఇరుదేశాల సంబంధాలు సాధారణ స్థాయికి చేరుకుంటాయని చెప్పారు.

ఉజ్బెక్, యూఏఈ అధ్యక్షులతో మోదీ భేటీ

ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షౌకత్ మిర్జియొయెవ్, యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌లతో మోదీ విడివిడిగా ద్వైపాక్షిక భేటీలు జరిపారు. సమావేశాలు ముగిసిన తర్వాత ఆయన దిల్లీకి బయల్దేరారు. పర్యటన ప్రభావవంతంగా ముగిసిందని విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది.

మహిళలకు దీపావళి కానుక

(మొదటి పేజీ తరువాయి)

విలేకర్లకు వెల్లడించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

నాలుగు నెలలకో సిలిండర్

- ఈ నెల 31 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు కానుంది. దీనికి మూడు, నాలుగు రోజుల ముందు నుంచి బుకింగ్స్ ప్రారంభించనున్నాం.
- సిలిండర్ ధరను లబ్ధిదారు డెలివరీ సమయంలో చెల్లించాలి. 48 గంటల్లో ఆ డబ్బులు తిరిగి, వారి బ్యాంక్ ఖాతాలో జమవుతాయి. ఈ నెల 31 నుంచి మార్చి నెలాఖరులోపు ఒక దఫా సిలిండర్ పొందొచ్చు.
- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి నాలుగు నెలలకు ఓ సిలిండర్ చొప్పున ఉచితంగా ఇస్తాం. 2025 ఏప్రిల్ 1 నుంచి జులై నెలాఖరు వరకు మొదటిది, ఆగస్టు 1 నుంచి నవంబరు నెలాఖరు వరకు రెండోది, డిసెంబరు 1 నుంచి 2026 మార్చి నెలాఖరు వరకు మూడో సిలిండర్ పొందేలా అవకాశం కల్పించాం.
- ఓ విడతలో సిలిండర్లపై రాయితీ కింద రూ.894.92 కోట్ల చొప్పున 3 విడతల్లో కలిపి రూ.2,684 కోట్లు ప్రభుత్వం భారం భరిస్తుంది. ఒక్కో విడతకు చెందిన రాయితీ సొమ్మును అడ్వాన్సుగా ముందే ఆయా చమురు కంపెనీలకు చెల్లించేలా ఏర్పాటు చేశాం.

ఇసుక పూర్తిగా ఉచితం

- ఇసుక పూర్తిగా ఉచితంగా అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. దానిపై సీనరేజ్, జిల్లా ఖనిజ నిధి (డీఎంఎఫ్), ఖనిజాన్వేషణ నిధి (మెరిట్), జీఎస్టీ వంటివన్నీ రద్దు.
- ఎవరైనా సొంత వాహనం తెచ్చుకొని నదిలో ఇసుక తీసుకెళ్లొచ్చు. నదీ పరీవాహక ప్రాంతాల గ్రామాల వారు ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లొచ్చు. అయితే వీరు గనులశాఖ వెబ్‌సైట్‌లో గానీ, గ్రామ, వార్డు సచివాలయంలోగానీ, రీచ్ వద్ద గానీ వివరాలు నమోదు చేసుకోవాలి.
- ఉచిత ఇసుకను అక్రమ రవాణా చేసినా, దుర్వినియోగం చేసినా కఠిన చర్యలు. పదేపదే అక్రమ రవాణా చేస్తే పీడీ కేసుల నమోదు.
- ఇసుక లభ్యత లేని 5 జిల్లాల్లో నిల్వలు అందుబాటులో ఉంచేందుకు మినరల్ డీలర్ లైసెన్సుల జారీ.



సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు, ఉన్నతాధికారులు

శారదా పీఠానికి రూ.225 కోట్ల భూకేటాయింపు రద్దు

విశాఖపట్నం జిల్లాలో శారదాపీఠానికి రూ.225 కోట్ల విలువైన 15 ఎకరాల భూమిని ఎకరా రూ.లక్ష చొప్పున కేటాయిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల రద్దుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పీఠం నిర్వాహకులు వేద, సాంస్కృతిక పాఠశాల ఆరంభిస్తామని తొలుత దరఖాస్తు చేసుకొని, వేర్వేరు జీఓలు జారీ చేయించుకున్నారు. ప్రభుత్వ భూమిని వ్యాపారానికి ఉపయోగించుకోవాలని చూశారు. ఆ భూములతో శారదా పీఠానికి ఆదాయం పెంచుకునే ఉద్దేశంతో పాత జీఓను సవరించాలని స్వరూపానంద వారసుడు స్వాత్మానందేంద్రతో సీఎంకి లేఖ రాయించారు. సముద్ర తీరంలో వాణిజ్య, నివాస ప్రాంతాలకు భూములు కేటాయించాలని కోరారు. జీఓలో మాత్రం వేద విద్య వ్యాప్తికి, పీఠం కార్యకలాపాలకు అని ఉంది. అందుకే ఈ భూ కేటాయింపు రద్దుకు నిర్ణయించాం. తిరుమలలో ఇదే పీఠానికి 9 వేల చదరపు గజాలు కేటాయిస్తే, 24-25 వేల చదరపు గజాల్లో భవనాలు నిర్మించి, అందులో గదులు అద్దెకిస్తున్నారు. ఈ ఉల్లంఘనలపైనా పరిశీలించి త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటాం.

టెండర్ల అక్రమాలను రిటైర్డ్ జడ్జితో ఆమోదించుకున్నారు

గత ప్రభుత్వంలో టెండర్లలో చేసిన అక్రమాలకు రిటైర్డ్ జడ్జితో ఆమోదం పొందేలా చూసేందుకే న్యాయ సమీక్ష విధానం తీసుకొచ్చారు. రూ.100 కోట్ల కంటే ఎక్కువ విలువైన టెండర్లు న్యాయ సమీక్ష అనంతరం పిలిచేలా ఏర్పాటు. పారదర్శక విధానమని చెప్పినా, ఎక్కడా టెండర్ల సంఖ్య పెరగలేదు. పూర్తిగా దోపిడీకి అవకాశం కల్పించారు. అందుకే టెండర్లకు న్యాయ సమీక్ష విధానాన్ని రద్దు చేసి, పాత విధానంలోనే నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయం.

రూ.1,800 కోట్ల రుణానికి హామీ

- ఏపీ పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో వరి సేకరణ కోసం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రూ.1,800 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ హామీకి కేబినెట్ ఆమోదం.

ఆలయ పాలకమండళ్లలో బ్రాహ్మణులకు చోటు

ఆలయాల పాలకవర్గంలో మరో ఇద్దరు సభ్యుల సంఖ్యను పెంచేలా, అందులో బ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణుల నుంచి ఒక్కొక్కరిని నామినేట్ చేసేలా శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టడానికి చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం.

- గత ప్రభుత్వంలో ఆలయ పాలకవర్గాల్లో ఓ సభ్యుడిగా నాయీ బ్రాహ్మణులను నియమిస్తూ ఉత్తర్వు ఇచ్చినా, సభ్యుల సంఖ్య పెంచలేదు. దీనివల్ల పాలకవర్గ సభ్యుల్లోని రిజర్వేషన్ల కింద బీసీలకు సంబంధించి నాయీ బ్రాహ్మణులకు అవకాశం దక్కుతున్నప్పటికీ, ఇతర బీసీలకు అవకాశం ఉండటం లేదు. ఇప్పుడు పెంచిన ఇద్దరు సభ్యుల్లో ఒకటి బ్రాహ్మణులకు, మరొకటి నాయీబ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తాం. మిగిలిన సభ్యుల్లో గతంలో మాదిరిగా రిజర్వేషన్ల అమలుకు వీలు కలుగుతుంది.

- ఏపీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (విజయవాడ) నుంచి ఏపీ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ తీసుకున్న రూ.80 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారంటీ కొనసాగించేందుకు ఆమోదం.

నాడు పప్పుబెల్లాల్లా భూకేటాయింపులు: కొలుసు

గత ప్రభుత్వంలో పప్పు బెల్లాల్లా భూములు కేటాయించేసి, అందినకాడికి దోచేశారని మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వంలో ఇసుకను ఆదాయ వనరుగా వాడుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. కొన్ని కంపెనీల పేరిట దోపిడీ చేశారని.. అవి రూ.1,000-1,200 కోట్ల బకాయిలు ఉన్నప్పటికీ, వాటికి జగన్ క్లీన్‌చిట్ ఇచ్చారని మండిపడ్డారు. ఎన్జీటీ నిబంధనల వల్లే ఈ నెల 15 వరకు నదుల్లో ఇసుక తవ్వకాలు చేపట్టలేకపోయామన్నారు. గత ప్రభుత్వ పెద్దలు మద్యం డిస్టిలరీలను స్వాధీనం చేసుకొని, తమకు నచ్చిన బ్రాండ్లు తయారుచేసి దోచుకున్నారని విమర్శించారు. వాటిలో సోదాలు కొనసాగుతున్నాయని, ఆ అక్రమాలన్నీ సీఐడీ విచారణలో బయటకు వస్తాయని చెప్పారు. రాష్ట్రంలో త్వరలో కొత్త రేషన్‌కార్డులు అందజేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

ఉచిత న్యాయసేవలపై విస్తృత ప్రచారం కల్పించాలి

అన్ని న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు నిర్దేశం

ఈనాడు, దిల్లీ: ఉచిత న్యాయసేవల గురించి తెలియకపోవడం, ఆర్థిక సమస్యలు, ఇతర కారణాలతో చాలా రాష్ట్రాల్లో శిక్షపడిన వారు హైకోర్టులకు అప్పీలు చేసుకోలేకపోతున్నట్లు సుప్రీంకోర్టు ఆవేదన వ్యక్తంచేసింది. హైకోర్టులు, దిగువ కోర్టులు క్రిమినల్ కేసుల్లో శిక్షలు విధిస్తూ లేదా బెయిల్ పిటిషన్లను డిస్మిస్ చేస్తూ తీర్పులు ఇచ్చినప్పుడు, అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల వివరాలను అదే తీర్పు కాపీలకు జతచేయాలని నిర్దేశించింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఖైదీలకు ఉచిత న్యాయసేవలు అందించే కేసులో ఇచ్చిన తీర్పులో స్పష్టంచేసింది. ఈ తీర్పు ప్రతిని అన్ని హైకోర్టులకు పంపాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. "ఏదైనా కేసులో నిందితులకు శిక్ష విధిస్తూనో, వారి పిటిషన్లను డిస్మిస్ చేస్తూనో, నిర్దోషులుగా విడుదల చేస్తూ కింది కోర్టులు ఇచ్చిన తీర్పులను కొట్టివేస్తూనో, బెయిల్ దరఖాస్తులను తిరస్కరిస్తూనో తీర్పులు ఇచ్చిన సందర్భాల్లో.. వాటి ద్వారా ప్రభావితమయ్యే వ్యక్తులు తదుపరి న్యాయ పరిష్కారాలు వెతుక్కోవడానికి అవకాశం కల్పించాలి. ఉచిత న్యాయసేవల సమాచారాన్ని అన్ని హైకోర్టులూ తమ వెబ్‌పేజీలో ఉంచాలి" అని సుప్రీంకోర్టు ఆదేశించింది. సెప్టెంబరు 6వతేదీ నాటికి ఏపీలో శిక్షపడిన 1,751 దోషుల్లో 1,415 మంది హైకోర్టులలో అప్పీలు చేసుకోగా, 336 మంది ఎలాంటి అప్పీలు చేయలేదని తెలిపింది.

అమరావతి డ్రోన్ సదస్సు.. దేశానికి దిశానిర్దేశం

- సవాళ్లపై నిపుణుల మేధోమథనం
- ప్రదర్శన తిలకించేందుకు భారీగా వచ్చిన విద్యార్థులు.. రైతులు

ఈనాడు, అమరావతి: డ్రోన్ సాంకేతిక రంగంలో దేశానికి దిశానిర్దేశం చేసేలా.. సీఎం చంద్రబాబు దార్శనికతకు అమరావతి డ్రోన్ సదస్సు-2024 ద్వారా ముందడుగు పడిందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి డ్రోన్ రాజధానిగా మార్చాలన్న ఆయన ఆకాంక్షలకు అనుగుణంగా అర్థవంతమైన చర్చలు, సూచనలు సదస్సులో జరిగాయన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన అమరావతి డ్రోన్ సమిట్-2024 బుధవారంతో ముగిసింది. 'రాబోయే ఐదేళ్లలో డ్రోన్ల రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయి. డ్రోన్ టెక్ ఆవిష్కరణలకు సదస్సు గొప్ప ముందడుగు అవుతుంది. ఇదే ఉత్సాహంతో పరిశోధన, అభివృద్ధి, డ్రోన్ యూజ్ కేసుల రూపకల్పన, వివిధ రంగాల్లో వినియోగంలో గణనీయమైన అభివృద్ధికి అవకాశం కలుగుతుంది. యువతలో మేధస్సుకు కొదవ లేదు. పెట్టుబడుల పరంగా కొన్ని సవాళ్లు ఉన్నాయి. వాటిని ఎదుర్కొనేలా స్టార్టప్‌లను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తాయన్న భరోసా సదస్సు ద్వారా లభించింది'' అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

సవాళ్లను ఎదుర్కొనేలా..

నిపుణులు, ప్రభుత్వ అధికారులతో కూడిన ప్యానళ్లు సదస్సు రెండోరోజు బుధవారం పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించాయి. ఐఐటీ మద్రాస్ డిఫెన్స్ డ్రోన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ హెచ్‌ఎస్‌ఎన్ మూర్తి పర్యవేక్షణలో వార్ విత్ ఇండిజనస్ డ్రోన్ అండ్ యాంటీ డ్రోన్ టెక్నాలజీస్‌పై ప్రభావవంతమైన చర్చ జరిగింది. హంచ్ మొబిలిటీకి చెందిన అమిత్ దత్తా నేతృత్వంలో భారతీయ డ్రోన్ రంగంలో పెట్టుబడులపరంగా సవాళ్లపై చర్చ జరగ్గా.. రెడ్‌వింగ్ ల్యాబ్స్ కో ఫౌండర్ అన్షుల్ శర్మ ఆధ్వర్యంలో ఆరోగ్య రంగంలో ఏరియల్ మెడికల్ సపోర్ట్ డ్రోన్ అంబులెన్స్‌లపై చర్చ జరిగింది. మారుమూల గ్రామాల ప్రజలు, గిరిజనులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో డ్రోన్ సాంకేతికతల అనుసంధానం.. సాధ్యాసాధ్యాలపై చర్చ జరిగింది. డిజిటల్ భూ రికార్డుల రూపకల్పనలో డ్రోన్ సాంకేతికత వినియోగంపై ప్రకాశం జిల్లా జేసీ రోణంకి గోపాలకృష్ణ కీలక ప్రసంగం చేశారు. మానవవనరుల అభివృద్ధిపై డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు స్మిత్ షా నేతృత్వంలో చర్చ జరిగింది. ఇటీవల విజయవాడ వరదల సమయంలో డ్రోన్ సేవలపై ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేష్‌కుమార్ పీపీటీని ప్రెజెంట్ చేశారు.



ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగించే డ్రోన్ గురించి అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

రైతులు, విద్యార్థుల ఆసక్తి

సదస్సులో భాగంగా 50 స్టాళ్లను ఏర్పాటుచేశారు. ప్రదర్శనకు ఉంచిన డ్రోన్లను రైతులు, విద్యార్థులు ఆసక్తిగా చూశారు. డ్రోన్ సాంకేతికత గురించి స్టాళ్ల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వాటివల్ల ఉపయోగాలేంటి? ఎంత బరువు తీసుకెళ్తుంది? తయారీకి విడిభాగాలు ఎక్కడ దొరుకుతాయనే అంశాలపై అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. వ్యవసాయరంగంలో డ్రోన్ల వినియోగంపై విస్తృత ప్రచారం ఉండడంతో.. వాటి ఉపయోగాలు తెలుసుకునేందుకు రైతులు భారీగా తరలివచ్చారు. వ్యవసాయంలో వాటి వినియోగానికి ఉన్న వెసులుబాటు గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు.

సంక్షేమం పేరుతో జగన్ లూటీ చేశారు

మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ధ్వజం

గుంటూరు (ఏఎన్‌యూ), న్యూస్‌టుడే: వైకాపాలో జగన్ అన్నీ తానై వ్యవహరించడం, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం, ఓటమిపై ఎలాంటి సమీక్షా చేయకపోవడం, ఎవరినీ పట్టించుకోకపోవడం వల్లే ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ తెలిపారు. తానే రాజు, మంత్రినన్న చందంగా ఆయన వ్యవహరించడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామ సమీపంలోని తన నివాసంలో బుధవారం విలేకర్లతో ఆమె మాట్లాడారు. ప్రజలను, పార్టీ కార్యకర్తలను మరోసారి మోసం చేయడానికి గుడ్‌బుక్ అని జగన్ చెబుతున్నారని పేర్కొన్నారు. ఐదేళ్లు పార్టీని నమ్ముకొని అన్నీ కోల్పోయిన వారికి ఎలాంటి క్షమాపణలూ చెప్పకుండా గుడ్‌బుక్‌లో ప్రమోషన్లు ఇస్తామనడమంటే ఇది రాజకీయ పార్టీనా? లేదా ప్రైవేటు కంపెనీనా? అనే అనుమానం కలుగుతోందని విమర్శించారు. ఇంత జరిగినా ఏ కోశానా ఆయనలో మార్పు లేదని చెప్పారు. ఒక్కసారి అధికారంలోకి రాగానే జగన్ ఇలా మారారేంటనే సందేహం అందరిలోనూ ఉందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎలా వ్యవహరించారో చూసి భారీ మెజారిటీనిస్తే సంక్షేమం పేరుతో ప్రజలను లూటీ చేశారని ఆరోపించారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని వెనక్కి నెట్టారని విమర్శించారు. నియంతలాగా వ్యవహరించారని, మద్యం పేరుతో భారీ దోపిడీకి తెర తీశారని అన్నారు. మద్యం ధరలు పెంచి పేదలను నిలువునా దోచుకున్న జగన్‌కు వారిపై ప్రేమ ఎక్కడుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆ రోజు ఇంత ప్రేమ ఏదీ?

తాను మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా మహిళలకు వీలైనంతగా సేవలందించానని పద్మ గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు జరుగుతున్న దాడులకంటే గతంలో ఎక్కువగానే ఉండేవని.. అప్పుడు దేవతల యుగం, స్వర్ణయుగం అనుకుంటే పొరపాటేనని చెప్పారు. ఆ రోజు వికృతమైన దాడులు జరిగినా ఏనాడూ ఎందుకు స్పందించలేదని జగన్‌ను ప్రశ్నించారు. నాటి హోంమంత్రి ఎవరినీ పరామర్శించలేదని అన్నారు. ఆ రోజు ఇంత ప్రేమ ఏమైందని ప్రశ్నించారు. తమకు ఎంతో గౌరవం ఇస్తున్నారని విజయమ్మ, షర్మిల కూడా భ్రమపడ్డారని.. అందరిదీ అదే పరిస్థితి అని, ప్రస్తుతం సొంతవారే జగన్ వద్ద లేరని చెప్పారు. రాజకీయాలు చేయడానికి మహిళలే దొరికారా? అని నిలదీశారు. జగన్ చుట్టూ ఉన్నవాళ్లంతా ఒక బ్రహ్మపదార్థమని, వారు ఎప్పుడెలా వ్యవహరిస్తారో ఎవరూ అంచనా వేయలేరని వ్యాఖ్యానించారు. జగన్ వద్ద 2, 3 స్థానాలలో ఉన్నామని అనుకుంటున్నవారు ఇప్పుడు ఆయన పేరు చెబితేనే వెయ్యి కి.మీ. పారిపోతున్నారని చెప్పారు. తాను ఏ పార్టీలోనూ చేరడం లేదని వివరించారు. ఎప్పుడూ ఒంటరిని కాదని, జగన్‌ను 11 స్థానాలకు పరిమితం చేసిన అనేక మంది తన వెనక ఉన్నారని చెప్పారు. ప్రజాతీర్పు అనంతరం ఈ అసంతృప్తిని దాచే అవసరం కానీ, వేచి చూడాలని కానీ అనిపించడం లేదని అన్నారు. కచ్చితంగా రాజకీయాల్లోనే ఉంటానని స్పష్టం చేశారు.

'దానా' తుపాను తీవ్రరూపం

- నేటి అర్ధరాత్రి తర్వాత తీరం దాటే అవకాశం
- ఉత్తరాంధ్ర జిల్లాలకు భారీ వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో 'దానా' తుపాను తీవ్రత క్రమంగా పెరుగుతోంది. గురువారం ఉదయంలోగా తీవ్ర తుపానుగా రూపాంతరం చెందనుంది. ఒడిశాలోని పూరీ, పశ్చిమబెంగాల్‌లోని సాగర్ ద్వీపానికి మధ్యలో బిత్తర్‌కనిక, ధమ్రా (ఒడిశా)కు సమీపంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాములోగా తీరం దాటవచ్చని వాతావరణశాఖ పేర్కొంది. ఆ సమయంలో గంటకు గరిష్ఠంగా 120 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని హెచ్చరించింది. ఇది దాదాపు 36 గంటలు తీవ్ర తుపానుగా కొనసాగుతుందని అంచనా. దీని ప్రభావంతో ఒడిశా, పశ్చిమబెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో 21 సెం.మీ. కంటే ఎక్కువ వర్షపాతం, మిగిలిన ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముంది.

తీరం వెంబడి ఈదురుగాలులు: రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవవచ్చని అమరావతి వాతావరణ కేంద్రం ముఖ్య అధికారి స్టెల్లా తెలిపారు. 'దానా' తుపాను ప్రభావంతో శుక్రవారం ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశముందన్నారు. కృష్ణపట్నం, వాడరేవు, నిజాంపట్నం, మచిలీపట్నం, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టులకు రెండో నంబరు హెచ్చరిక జారీ చేసినట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం ముఖ్య అధికారి కేవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. తీరం వెంబడి గురువారం రాత్రి వరకు 80 నుంచి 100 కి.మీ. వేగంతో, గురువారం రాత్రి నుంచి 100 నుంచి 110 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని విపత్తుల నిర్వహణ కేంద్రం ఎండీ కూర్మనాథ్ తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

200కు పైగా రైళ్లు రద్దు

'దానా' తుపాను నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఈస్టర్న్ రైల్వే సీల్దా డివిజన్‌లో గురువారం రాత్రి 8 గంటల నుంచి శుక్రవారం ఉదయం 10 గంటల మధ్య 190 రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు దక్షిణ మధ్య రైల్వే 14 రైళ్లను రద్దు చేసింది. ఇప్పటి వరకు దాదాపు 200 రైలు సర్వీసులను రద్దు చేయడం లేదా దారిమళ్లించినట్లు సమాచారం.

ఒడిశాలో పరీక్షలు వాయిదా

మరోవైపు, ఈ తుపానుతో ఒడిశా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే 23వ తేదీ నుంచి 25 వరకు జరగాల్సిన పరీక్షలన్నింటినీ రద్దు చేసింది. ఈ నెల 27న జరగాల్సిన ఒడిశా సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షను సైతం వాయిదా వేశారు. కొత్త తేదీని తర్వాత ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.


ఎంపీ విజయసాయి కుమార్తెపై ఏం చర్యలు తీసుకున్నారు?

- భీమిలి బీచ్ ఆక్రమణపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యిందా?
- పూర్తి వివరాలు సమర్పించండి
- జీవీఎంసీ అధికారులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: విశాఖ జిల్లా భీమిలి బీచ్ వద్ద సముద్రానికి అతి సమీపంలో, కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జడ్) నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి, ఇతర బాధ్యులను శిక్షించేందుకు ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పాలని జీవీఎంసీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ ఏమైనా నమోదు అయ్యిందా అని ప్రశ్నించింది. బాధ్యులను శిక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరిస్తూ నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. విశాఖ జిల్లా భీమిలి బీచ్ వద్ద సముద్రానికి అతి సమీపంలో సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి విజయసాయిరెడ్డి కుమార్తె పెనకా నేహారెడ్డి కాంక్రీట్ ప్రహరీ నిర్మించడాన్ని సవాలు చేస్తూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో పిల్ వేసిన విషయం తెలిసిందే. ఇటీవల ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం అక్కడి నిర్మాణాలను తక్షణం తొలగించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించింది.

- బుధవారం జరిగిన విచారణలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఆదేశాల నేపథ్యంలో అక్కడి నిర్మాణాలను కూల్చివేశామన్నారు. సీఆర్‌జడ్ అధికారులు ఆ ప్రాంతంలో సర్వే చేస్తున్నారని, వారి నుంచి నివేదిక కోసం వేచి చూస్తున్నామన్నారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయని తెలిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్.మూర్తి వాదనలు వినిపిస్తూ.. ప్రహరీని మాత్రమే కూల్చారన్నారు. ఇతర నిర్మాణాలను అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిన వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టం కింద శిక్షించవచ్చన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. బాధ్యులను శిక్షించేందుకు ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పాలని అధికారులను ఆదేశించింది.

'విన్ కార్డ్' పద్ధతిని అనుసరించండి



సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి 'విన్ కార్డ్' పద్ధతి సత్ఫలితాన్నిచ్చింది. నా లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రతి వారం నేను దృష్టిపెట్టాల్సిన అయిదు అంశాలను ఆ కార్డుపై రాసుకుంటాను. పురోగతిని ఎప్పటికప్పుడు కొలవడానికి వీలుగా 'ఎన్ని, ఎంత, ఎప్పటిలోపు' లాంటి గీటురాళ్లతో ఆ అంశాలుండేలా జాగ్రత్త తీసుకుంటాను. పనిలో నా ఏకాగ్రత చెదరకుండా ఆ కార్డు ఉపకరిస్తుంది. మీరు కూడా ఈ పద్ధతిని అనుసరించి చూడండి.

– సాహిల్ బ్లూమ్, రచయిత

ఈనాడు

సన్నద్ధత ప్రాణావసరం!

దాహమేసినప్పుడే బావి తవ్వుతాననడం తెలివిమాలినతనం. విపత్తుల నిర్వహణలో దేశీయంగా రాజ్యమేలుతున్నదీ అటువంటి అవివేకమే. ప్రకృతి వైపరీత్యాల వేళ తాత్కాలిక ఉపశమన చర్యలతో సరిపెట్టేస్తున్న ప్రభుత్వాలు నష్టనివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలను అనుసరించట్లేదు. దాంతో ప్రజలకు ఏటా అగచాట్లు తప్పట్లేదు. ముఖ్యంగా వరదల్లో సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలే బాధిత ప్రజానీకం దుర్భరావస్థలు చెప్పనలవి కానివి. ఇక రహదారులూ వంతెనలూ కొట్టుకుపోవడం, ఇతర మౌలిక సదుపాయాలు సర్వనాశనం కావడం తదితరాలతో వరద ప్రభావిత ప్రాంతాల్లో జనజీవనం గాడినపడటానికి ఎంతకాలం పడుతుందో ఎవరికీ తెలియదు. ఈ నేపథ్యంలో వరద ఉత్పాతాలను సమర్థంగా కాచుకునే విధానాల రూపకల్పనపై ఉభయ తెలుగు రాష్ట్రాలు దృష్టిసారించాయి. తెలంగాణలో వరద నిర్వహణ ప్రణాళిక-2024 తయారీ వడివడిగా సాగుతోంది. ఏపీ ప్రభుత్వమేమో జిల్లా, నగర విపత్తు నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేయడంలో నిమగ్నమైంది. ఆకస్మిక వరదల ముప్పు తీవ్రతరమవుతున్న పరిస్థితుల్లో రెండు రాష్ట్రాల చొరవ ప్రశంసనీయమైనది... ప్రజాభద్రత దృష్ట్యా అత్యావశ్యకమైనదీ!

గడచిన ఏడు దశాబ్దాల్లో వరదల ధాటికి ఉత్తర్‌ప్రదేశ్‌లోనే ప్రాణనష్టం అత్యధికంగా సంభవిస్తే- ఆ తరవాత ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువమంది కడతేరిపోయారు. 1953-2021 మధ్యకాలంలో వరదల మూలంగా విపరీతమైన ఆర్థిక నష్టాన్ని చవిచూసింది పశ్చిమ బెంగాల్ అయితే, ఆ జాబితాలో రెండో స్థానం ఏపీదే. గత పదేళ్లలో ఏడు సంవత్సరాలు తెలంగాణలో వరదలు విధ్వంసం సృష్టించాయి. వాటి కారణంగా రాష్ట్రం రూ.12వేల కోట్లకు పైగా నష్టపోయింది. వంకలూ నదులూ పోటెత్తి పొలాలూ జనావాసాలను ముంచేయడంతో 2012-2021 నడుమ దేశవ్యాప్తంగా రూ.2.76 లక్షల కోట్లకు పైగా గంగపాలయ్యాయి. ఆసేతుహిమాచలం 9.88 కోట్ల ఎకరాల భూమికి వరదల ప్రమాదం పొంచి ఉందని ప్రభుత్వ నివేదికలు చాటుతున్నాయి. ఎప్పుడో 1980లో జాతీయ వరదల సంఘం వేసిన అంచనాలివి. వాతావరణ మార్పుల మూలంగా గతంతో పోలిస్తే మరింత భూభాగం వరదల బారిన పడుతోంది. కాంటూరు మ్యాపులు, ఉపగ్రహ చిత్రాల సాయంతో వరద పీడిత ప్రాంతాలను కొత్తగా శాస్త్రీయంగా గుర్తించాలని నిపుణులు ఎప్పటినుంచో మొత్తుకుంటున్నారు. కానీ, ఎవరు ఆలకిస్తున్నారు?

విపత్తు నష్టాలను తగ్గించాలంటే- ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలి. ఏయే ప్రాంతాల్లో ఎలాంటి వైపరీత్యాలు ఎంతమేరకు చోటుచేసుకునే ముప్పుందో నిర్ధారించాలి. పాలకులు దాన్ని పట్టించుకోకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? వరదల నియంత్రణలో నిష్క్రియా ధోరణుల నుంచి ప్రగతిశీల నిర్వహణ విధానాలకు మారాలన్న ఐఐటీ-బాంబే నిపుణుల మేలిమి సూచన సైతం అరణ్యరోదనే అవుతోంది. కర్బన ఉద్గారాల ఉద్ధృతితో కట్టుతప్పుతున్న భూతాపం- లెక్కకుమిక్కిలి ప్రకృతి ఉత్పాతాలకు కారణమవుతోంది. కుండపోత వానలు ఇకపై పెరగనున్నాయని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. వాటికితోడు తీరుతెన్నూ లేని అభివృద్ధి పనులు, జలవనరుల ఆక్రమణలతో వరదల తీవ్రత అధికమవుతోంది. వాటి నియంత్రణ రాష్ట్రాల పరిధిలోనిదైనా, అంతర్రాష్ట్ర నదీ ప్రవాహాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వమే ప్రధాన బాధ్యత వహించాలని పార్లమెంటరీ సంఘం లోగడ సూచించింది. ఆ మేరకు కేంద్రం పూనిక వహిస్తేనే వరదల గుప్పిట్లోంచి దేశం తెప్పరిల్లుతుంది. ఏటా వృథాగా సముద్రం పాలవుతున్న అపార అమూల్య జలరాశిని పదిలపరచుకోగలిగితే భారతావనికి నీటికష్టాలూ తీరతాయి!

చమురు... దోబూచులాట!

ప్రపంచం హరిత ఇంధనాలవైపు పరుగు మొదలుపెట్టింది. ఫలితంగా రానున్న కాలంలో చమురుకు గిరాకీ తగ్గనుంది. అయినప్పటికీ, ఇతరత్రా అవసరాల కోసం కొన్నేళ్లపాటు చమురు ఉత్పత్తి, వినియోగం పెరిగే అవకాశాలే అధికంగా కనిపిస్తున్నాయి. మరోవైపు, ప్రపంచంలో చమురు ఉత్పత్తి, శుద్ధి సామర్థ్యం సైతం పెరిగిపోతుండటంతో ఈ రంగంలో విచిత్ర పరిస్థితి నెలకొంది.

ప్రస్తుతం ఆసియా దేశాల్లో విమానయానం, పెట్రోకెమికల్స్ రంగాలు వేగంగా విస్తరిస్తున్నాయి. అధిక ఆర్థికాభివృద్ధి రేట్లను అందుకోగలుగుతున్నాయి. ఈ అంశం కారణంగానే క్రమంలో మరికొన్ని సంవత్సరాలపాటు చమురు వినియోగం, ఉత్పత్తి పెరగనున్నాయని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) తాజా నివేదిక ఆయిల్-2024 తెలిపింది. ఇది ప్రపంచ వాణిజ్యం, పెట్టుబడులపై మార్పుల ప్రభావాన్ని విశ్లేషించింది.

గిరాకీ తగ్గి... ఉత్పత్తి పెరిగి...

ప్రస్తుతానికి చమురు వినియోగం పెరుగుతున్నా, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఊపందుకుంటోంది. సాధారణ మోటారు వాహనాలు కూడా తక్కువ ఇంధనంతోనే పరుగులు తీస్తున్నాయి. పశ్చిమాసియాలో విద్యుదుత్పాదనకు చమురు వినియోగం తగ్గుతోంది. చైనా తదితర దేశాల ఆర్థిక వ్యవస్థలు రూపాంతరం చెందుతున్నాయి. ఈ కారణాల వల్ల ముందుముందు చమురుకు గిరాకీ తగ్గుతుందని ఐఈఏ లెక్కగట్టింది. 2023లో ప్రపంచమంతటా జీవ ఇంధనాలు సహా చమురుకు దినసరి గిరాకీ 10.2 కోట్ల పీపాలు. ఈ దశాబ్దాంతానికి అది కొంత పెరిగి 10.6 కోట్ల పీపాల దగ్గర స్థిరపడవచ్చు. మరోవైపు ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాలలోని దేశాలు చమురు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాయి. ఫలితంగా 2030 నాటికి ప్రపంచ దినసరి చమురు ఉత్పత్తి సామర్థ్యం 11.4 కోట్ల పీపాలకు చేరనున్నది. అప్పటి గిరాకీ కన్నా 80 లక్షల పీపాలు అదనంగా ఉత్పత్తి అవుతాయన్నమాట.



ఇంధన వినియోగంలో మార్పులు

కొవిడ్-19 సంక్షోభ సమయంలో తప్ప మరెన్నడూ ఇంత భారీ అదనపు ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రపంచం చూడలేదు. కొవిడ్ తరవాత హరిత ఇంధనాల వినియోగం పెరుగుతూ వస్తోంది. చైనా ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలు కూడా మారుతూ వస్తున్నాయి. దీనివల్లనే అంతర్జాతీయంగా గతంతో పోలిస్తే ఇప్పుడు చమురుకు గిరాకీ తగ్గుతోంది. ఇప్పటికీ చమురుకు గిరాకీ ఉన్నప్పటికీ అది గతంలో మాదిరిగా ఏటేటా అధికంగా పెరగకపోవచ్చు. ఈ ఏడాది చమురుకు అదనపు గిరాకీ రోజుకు 10 లక్షల పీపాలను మించకపోవచ్చు. 2023 నాటితో పోలిస్తే 2030లో అదనపు గిరాకీ రోజుకు 32 లక్షల పీపాల మేర ఉండవచ్చు. భారతదేశంలో మోటారు రవాణా, విమానయాన రంగాలు అధికంగా చమురును వినియోగించుకోవడమే దీనికి కారణం. దీన్ని అదుపు చేయడానికి సమర్థ విధానాలను చేపట్టాలి. ఇంధన వినియోగంలోనూ మార్పులు తీసుకురావాలి. భారత్, చైనా, ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే సంపన్న దేశాల్లో చమురు గిరాకీ క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. 2023లో సంపన్న దేశాల చమురు వినియోగం రోజుకు 4.6 కోట్ల పీపాల చమురు కాగా, 2030 నాటికి అది 4.3 కోట్ల పీపాలకు తగ్గనుంది. మరోవైపు జీవ ఇంధనాలు, సహజవాయు ద్రవాల సరఫరా నానాటికి పెరుగుతోంది. 2027 తరవాత ఆసియా దేశాల్లో అదనపు ఉత్పత్తి సామర్థ్య సృష్టి కూడా నెమ్మదించనున్నది. వెరసి 2030కల్లా పలు చమురు శుద్ధి కర్మాగారాలు మూతపడవచ్చు. మరోవైపు, తక్కువ ఇంధనంతోనే ఎక్కువ ఫలితాలు సాధించే సత్తాను ప్రపంచం సంతరించుకుంటున్నది. 1973లో 1000 డాలర్ల విలువైన జీడీపీని సాధించడానికి దాదాపు ఒక పీపా చమురు వినియోగం జరిగేది. 2019నాటికి అదే జీడీపీ సాధనకు 0.43 పీపా చమురు సరిపోయింది. అంటే 57 శాతం తక్కువ చమురుతోనే గతంలో కన్నా ఎక్కువ ఫలితాన్ని సాధించగలుగుతున్నామన్నమాట. ఇది పోనుపోను చమురు వినియోగం తగ్గిపోవడానికి దారితీస్తుంది.

సరైన విధానాలతో ముందడుగు

ప్రస్తుత ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం వల్ల పశ్చిమాసియాలో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ఇరాన్ చమురు, సహజ వాయు కర్మాగారాలు, క్షేత్రాల మీద ఇజ్రాయెల్ కనుక దాడి చేస్తే ధరలు మరింత పెరిగిపోతాయి. ఇరాన్ దినసరి చమురు ఉత్పత్తి 33 లక్షల పీపాలు. తనపై ఇజ్రాయెల్ దాడి చేస్తే అంతర్జాతీయ చమురు ఎగుమతులు, దిగుమతుల మార్గమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తుంది. దీంతో చమురు సరఫరా తగ్గి ధరలు విజృంభిస్తాయి. ప్రపంచార్థికం దెబ్బతింటుంది. ముఖ్యంగా తన చమురు, గ్యాస్ అవసరాల్లో 88శాతాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకునే భారతదేశానికి ఇది పెను విఘాతం అవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ చమురు మీదనే ఆధారపడి ఉండటం గమనార్హం.

ఇజ్రాయెల్-హమాస్-ఇరాన్ సంక్షోభం చమురు ఉత్పత్తిని దెబ్బతీస్తే, ఆ కొరతను తీర్చడానికి ఒపెక్ ప్లస్ దేశాలు కచ్చితంగా ఉత్పత్తి పెంచుతాయి. లిబియా వంటి దేశాల్లో చమురు ఉత్పత్తి మళ్లీ మొదలైతే గిరాకీకి తగ్గ సరఫరా సాధ్యపడుతుంది. చైనా నుంచి గిరాకీ తగ్గడమూ చమురు ధరలకు కళ్లెం వేస్తుంది. అయితే పశ్చిమాసియా యుద్ధం ముదరడం భారత ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రం మంచిది కాదు. యుద్ధం వల్ల చమురు సరఫరా పడిపోతే ధరలు అనివార్యంగా పెరుగుతాయి. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి తీసుకునే చర్యలు పెట్టుబడులను దెబ్బతీస్తాయి. ప్రపంచంలో చమురుకు పెరిగిన గిరాకీలో 22శాతానికి భారతదేశమే కారణం. ప్రపంచ జీడీపీలో భారత్ వాటా ఎనిమిది శాతం. చమురు విషయంలో అనిశ్చితి మన ఆర్థికాన్ని కుంగదీయకుండా నివారించడానికి ప్రభుత్వం సరైన విధానాలతో ముందుకెళ్లాలి.



పీవీ రావు
ఆర్థిక, సామాజిక విశ్లేషకులు



ప్రవర్తనే... పరిచయపత్రం!


వ్యవహార శైలిలోనే మన వ్యక్తిత్వం కనిపిస్తుంది. నడతే మన నాగరికతకు అద్దం పడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రవర్తనే మన పరిచయ పత్రమవుతుంది. వస్త్రధారణ నుంచి ఆహారపు అలవాట్ల వరకు, ఆతిథ్య సంస్కృతి నుంచి సభ్యత వరకు, సంభాషణల సంస్కారాల నుంచి సభామర్యాదల వరకు ప్రతిదీ మన స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. చూడటానికి చిన్న విషయాల్లాగే అనిపించినా, ఆలోచిస్తే మెరుగైన మానవ సంబంధాలకు అవే ప్రధాన కారణమవుతాయని అర్థమవుతుంది. మనం ఏవి ఇస్తే, అవే మనకు తిరిగి వస్తాయన్న సూత్రం గౌరవ మర్యాదలకు కూడా వర్తిస్తుంది. మనం రాళ్లు విసిరి మనపై పూలవానలు కురవాలనుకుంటే ఎలా?

సభ్యతా సంస్కారాలను... చూసైనా నేర్చుకోవాలి, చెప్పినప్పుడైనా మార్చుకోవాలి. మనవల్ల ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా విజ్ఞతతో మెలిగేవారే వివేకవంతులు. సంఘజీవులమైన మనం సాటి మనిషికి అసౌకర్యం కలగకుండా నడచుకోలేనప్పుడు మన చదువులకు, హోదాలకు విలువే లేదు. మనిషి ఎక్కడో నిర్మానుష్య వనాల్లో ఒంటరిగా ఏ కొండపైనో జీవిస్తున్నప్పుడు సభ్యతా, సంస్కారం, మర్యాద, మన్ననలతో పనిలేదు. కానీ ఆ కొండపై మరో వ్యక్తి వచ్చినప్పుడే వాటి అవసరం తెలుస్తుంది. సామరస్యంగా మసలుకోకపోతే ఘర్షణ తలెత్తుతుంది.

ముంబయికి చెందిన రుక్సానా ఎయిసా అనే రచయిత్రి వ్యక్తుల నడవడికకు సంబంధించి ఏకంగా ఓ పుస్తకాన్నే రాశారు. 'ది గోల్డెన్ కోడ్' పేరిట విడుదలైన ఈ పుస్తకం బహుళ జనాదరణను పొందింది. రుక్సానా విమానయాన రంగంలో ఉన్నతోద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తూ, వృత్తిరీత్యా ఎన్నో దేశాల్లో పర్యటించారు. ఆ అనుభవంతో ఆమె సభ్యసమాజంలో మనుషుల మధ్య సామరస్య సంబంధాలకు ఎంత ప్రాధాన్యముందో ప్రస్తావించారు. తాను పరిశీలించిన అంశాలకు అక్షరరూపమిస్తూ రుక్సానా- సామాజిక సంస్కారాల తాలూకు విలువైన విషయాలను తన పుస్తకంలో క్రోడీకరించారు. వ్యక్తి విజయం, సామాజిక విజయంపై ఆధారపడి ఉందని చెప్పకనే చెప్పారు. అందుకే ఆ పుస్తకం శీర్షికకు 'మాస్టరింగ్ ది ఆర్ట్ ఆఫ్ సోషల్ సక్సెస్' అన్న ట్యాగ్ లైన్‌నీ జోడించారు.

సకల సాంకేతిక సౌలభ్యాల మధ్య... పరుగెత్తయినా పాలే తాగాలనుకునే పాశ్చాత్య ప్రపంచంలో, పౌరులు పొరుగువారిపై ఎంతో శ్రద్ధ చూపుతారట. ఎదుటి వారి స్వేచ్ఛకు ఏ మాత్రం భంగం కలగకుండా, పక్కవారి మనసెరిగి మసలుకుంటారట. తమ అవసరాలు తీరటం కన్నా తోటివారికి అసౌకర్యం కలగకుండా ఉండటమే ముఖ్యమని భావిస్తారట. ఎంత మంచి సంస్కారం! ఇలాంటి పలు అంశాలను ప్రస్తావిస్తూ రచయిత్రి రుక్సానా భారతీయులం మనం ఇంకా ఆ విషయంలో వెనకబడే ఉన్నామని అసంతృప్తి వ్యక్తం చేస్తారు. మనం మారాల్సిన అవసరాన్ని పరోక్షంగా ఎత్తిచూపిస్తారు.

– చైతన్య



ప్రోగ్రెస్ కార్డులకు పరిమితమయ్యే చదువు కాదు, ఇరవై ఒకటో శతాబ్దానికి అవసరమైన నాలెడ్జ్ సిస్టమ్ కావాలిప్పుడు. సైన్స్, ఆర్ట్స్, కామర్స్... తదితర విభాగాలన్నీ దేనికదే ప్రత్యేకం అన్నట్లు కాకుండా ఒకే చెట్టు కొమ్మల్లా అనుసంధానమై ఉండాలి. ఉన్నత విద్య ఉద్యోగార్హత కలిగించాలి.

– డాక్టర్ కె.కస్తూరి రంగన్, 'ఇస్రో' మాజీ ఛైర్మన్

భ్రమల పంజరంలో...

ఆత్మవిశ్వాసం, దైవ విశ్వాసం మనిషికి ఉండాల్సిన ముఖ్య లక్షణాలు. భగవంతుడి విశ్వాసాన్ని చూరగొనేలా మనల్ని మనం తయారుచేసుకోవాలి.

ఓ వ్యక్తి రామకృష్ణ పరమహంస దగ్గరికి వెళ్లి 'మానవ ప్రయత్నం గొప్పదా? దైవానుగ్రహం గొప్పదా?' అని అడిగాడు. దానికి ఆయన 'వస్త్రాన్ని కత్తిరించే కత్తెరలో రెండు కత్తులు ఉంటాయి. వాటిలో ఏ కత్తి వస్త్రాన్ని కత్తిరించిందంటే ఏమని చెబుతారు?' అన్నారు. సాధకుడిలో ప్రయత్నం, నిబద్ధత, సచ్ఛీలత, నిగ్రహం ఉంటే అతనిపై దైవకృప కచ్చితంగా ఉంటుంది. భగవంతుడి అనుగ్రహం పొందిన వ్యక్తి సాధనామార్గంలో ఎటువంటి విఘ్నాలు ఎదురైనా వాటన్నింటిని అధిగమించి ముందుకు సాగగలుగుతాడు.



సాధారణంగా సాధకులు ఊహాజనిత భావనలతో ఉంటారు. ఓ వ్యక్తి అష్టాంగ యోగంలో ఓ అంశంపై తీవ్ర సాధన చేసేవాడు. అతను ఓ రోజు తన గురువు దగ్గరికి వెళ్లి 'నాకు సమాధి అనుభూతి కలిగింది. కాబట్టి అంతకన్నా ఉత్తమమైంది ఏదైనా ఉంటే వివరించండి' అని అడిగాడు. దానికి ఆ గురువు చిరునవ్వు నవ్వి... 'ముందు ఆ భ్రమ నుంచి బయటపడు' అన్నాడు. చాలామంది సాధకులు ఆధ్యాత్మిక జీవితం పట్ల సరైన అవగాహన లేక భ్రమల్లో బతుకుతుంటారు. తమకు ఏవేవో ఆధ్యాత్మిక అనుభూతులు కలిగినట్లు ఊహించుకుంటారు. ఆధ్యాత్మిక జీవితంలో ఏ భ్రమలకు తావివ్వకుండా ఉండాలంటే- మొదట శరణాగతి భావన అలవడాలి. భక్తిశ్రద్ధలతో అంతర్యామిలో ఐక్యమయ్యే మార్గాన్ని అన్వేషించడమే మానవ ప్రయత్న లక్షణం.

శరణాగతిని అలవర్చుకోవడానికి ప్రయత్నం అత్యవసరం. ఆధ్యాత్మిక జీవన ప్రారంభ దశలో భగవంతుడు మనకు దూరంగా ఎక్కడో ఉన్నాడని అనిపిస్తుంది. సంపూర్ణ శరణాగతితో, ప్రయత్నంతో సాధన చేస్తున్న కొద్దీ మనం భగవంతునిలో భాగమే అని అనుభవంతో తెలుస్తుంది. ఆ స్థితికి చేరుకోవటమే సాధన పరమోద్దేశం. ఆ ఆనందమయ స్థితిని పొందాలంటే ముందుగా ఇంద్రియాల నియంత్రణ ఎంతో అవసరం.

'ఆలస్యం హి మనుష్యనాం శరీరస్థో మహాన్ రిపుః నాస్త్యుద్యమ సమో బంధుః కృత్వాయం నావసీదతి'- సోమరితనం, ఏమరుపాటు మనుషులకు మహాశత్రువులు. మనుషులకు ప్రయత్నాన్ని మించిన చుట్టం మరొకటి లేదు. ప్రయత్నం చేసినవాడు ఎన్నటికీ వైఫల్యాన్ని పొందడు. అవిరళ కృషి, అకుంఠిత దీక్ష, ప్రజ్ఞ, ప్రయత్నాలవల్ల ఎంతోమంది జీవితంలో ఉన్నత స్థితిని పొందారు. 'దైవ సంపాదితో దోషో మానుషేణ మయాజితః...' అనగా దైవవిధి కారణంగా ఏర్పడిన దోషాన్ని నేను మానుష ప్రయత్నం ద్వారా తొలగించుకున్నాను... అని రాముడే చెప్పాడు. కాబట్టి ప్రయత్నానికి దూరంగా ఉండి విజయానికి దగ్గర కావాలనుకుంటే సాధ్యపడదు.

– ఎం.వెంకటేశ్వర రావు



విదేశీ జైళ్లలో...

ఉపాధి వేటలో ఎంతోమంది భారతీయులు విదేశాలకు వెళ్తున్నారు. అక్కడ కేసుల్లో చిక్కుకొని జైలుపాలవుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి 9,728 మంది భారతీయులు 86 దేశాల్లోని జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నారు లేదా విచారణ ఖైదీలుగా ఉన్నారు. ఏయే దేశాల్లో భారతీయ ఖైదీలు ఎందరున్నారంటే...

సౌదీ అరేబియా	2,594
యూఏఈ	2,308
నేపాల్	1,282
ఖతార్	588
కువైట్	386
మలేసియా	379
బహ్రెయిన్	313
యూకే	282
ఒమన్	176
చైనా	174
యూఎస్ఏ	164
ఇటలీ	154

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)


'పట్టు' కోల్పోతున్న సాగుదారులు

తెలుగు రాష్ట్రాల్లో వరికి, పత్తికి ప్రత్యామ్నాయంగా మల్బరీ సాగును ఎంచుకున్న రైతులకు మొదట్లో లాభాల పంటపండింది. ఇప్పుడు నష్టాలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా కరోనా తర్వాత పరిస్థితులు తలకిందులయ్యాయి. పెట్టుబడి విపరీతంగా పెరిగింది. గిట్టుబాటు ధర అంతకంతకూ తగ్గుతోంది. ఇతర పంటల కంటే సెరికల్చర్ నయమని నమ్మి పదేళ్లుగా సాగు చేస్తున్నవారూ కొన్ని ప్రాంతాల్లో మల్బరీ షెడ్లను తొలగిస్తున్నారు. మళ్లీ పత్తి, వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఈసారి కురిసిన వర్షాలు, వాతావరణ పరిస్థితుల కారణంగా మరింతగా నష్టపోయారు. వానలకు పట్టు పురుగులు తడి మేత మేయక గూళ్లు అల్లడం లేదని రైతులు వాపోతున్నారు. చేనులో ఎప్పుడూ ఊట ఉండటంతో ఆకు ఎదగడం లేదు. వేరుకుళ్లు, ఇతర తెగుళ్ల కారణంగా మల్బరీ కాత సరిగా కాయట్లేదు. దీని వల్ల తోటలు ఎండిపోతున్నాయి. శాస్త్రవేత్తల సలహాలూ సూచనలు పాటించినా, కొన్నాళ్లపాటు పంట మార్పిడి చేసినా ఫలితం దక్కడం లేదు. ఏటా ఎనిమిది పంటలు తీసే రైతులకు అందులో నాలుగు నష్టాలనే తెస్తున్నాయి.

విభిన్న వాతావరణ పరిస్థితులు, పురుగు మందుల ప్రభావంతో పట్టు రైతులు కుదేలవుతున్నారు. ఉదయం చల్లగా, మధ్యాహ్నం అధిక వేడిమి ఉండటం, సాయంత్రం వర్షం కురవడం ఇటీవల పరిపాటిగా మారింది. నేల తడి ఆరేలోపే వాన కురుస్తోంది. దీంతో తడి మల్బరీ ఆకులను పట్టు పురుగులు తినడం లేదు. ఫలితంగా అవి నాణ్యమైన గూళ్లు అల్లక రైతులు నష్టపోతున్నారు.

పెట్టుబడి భారం

అధిక శ్రమ, కూలీల కొరత, లాభాలు తగ్గడం పట్టు పరిశ్రమకు ప్రతిబంధకంగా మారాయి. 1.10 ఎకరాల్లో మల్బరీ సాగుకు కొవిడ్‌కు ముందు రూ.20 వేలదాకా ఖర్చయ్యేది. ఇప్పుడు రూ.32 వేలకు పైగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. నాడు వంద గుడ్లకు రూ.2500 వ్యయం కాగా, ఇప్పుడు రూ.3800 వరకు అవుతోంది. కూలీల ఖర్చులోనూ అదే పరిస్థితి. గతంలో ఒక మనిషికి రూ.400 ఉంటే, ఇప్పుడు రూ.600 కూలీ ఇస్తున్నారు. డీఏపీ, ఇతర ఎరువులకు ధర పెరిగింది. జనగామ, హైదరాబాద్ మార్కెట్‌లో గరిష్ఠంగా కిలో పట్టుగూళ్లు రూ.550 పలుకుతున్నా, అందరికీ ఈ ధర దక్కితే లాభాలు వచ్చేవి. కానీ, గూళ్లు నాణ్యంగా లేవని కిలోకు రూ.250 నుంచి రూ.400 వరకే చెల్లిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత వైకాపా పాలనలో కిలోకు ప్రోత్సాహకాన్ని రూ.50 నుంచి రూ.100 వరకు పెంచుతామని ఇవ్వకపోవడంతో రైతులు నష్టాల పాలయ్యారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల్లో మల్బరీ సాగుచేస్తున్న 20 వేల మంది రైతులకు వైకాపా హయాంలోనే రూ.57 కోట్ల వరకు ప్రోత్సాహక నిధులు రావాల్సి ఉంది. స్థానిక మార్కెట్‌లో గిట్టుబాటు ధర దక్కడం లేదని అక్కడి రైతులు పొరుగున ఉన్న కర్ణాటకకు వెళ్లి విక్రయిస్తున్నారు. ప్రోత్సాహక నిధులు ఇచ్చి, మార్కెట్‌లో ధరను పర్యవేక్షిస్తే గత అయిదేళ్లలో దెబ్బతిన్న సెరికల్చర్ మళ్లీ మరింత జీవం పోసుకుంటుంది. తెలంగాణలో ప్రోత్సాహక నిధులు ఇస్తున్నప్పటికీ- సీడ్ సరిగా లేకపోవడం, అధిక వర్షాలు, తెగుళ్లకు తోడు గిట్టుబాటు ధర దక్కక నష్టపోతున్నట్లు రైతులు చెబుతున్నారు.




పురుగు మందుల ప్రభావం

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రల్లో తొమ్మిది నెలల క్రితం మేత తిన్న పురుగులు బలిష్ఠంగా పెరిగి, గూళ్లు అల్లడం మానేసినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇలాంటి ప్రభావం తెలంగాణలో మరింత తీవ్రంగా కనిపించింది. దాదాపు మూడు పంటలు పోయాయి. కేంద్ర పట్టు పరిశోధన, శిక్షణ సంస్థ (సీఎస్ఆర్టీఐ) శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి నమూనాలు సేకరించారు. వాటిపై పరిశోధనలు చేసి పురుగు మందుల ప్రభావమని తేల్చారు. మల్బరీ తోటల చుట్టూ పత్తి, మిర్చి తోటలు సాగు చేయడం, వాటిలో రోగాల నివారణకు విపరీతంగా పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల పరిసరాల్లో వాతావరణం కలుషితమవుతోంది. మందుల అవశేషాలు, వాసన మల్బరీ తోటలపై ప్రభావం చూపాయి. ఆ ఆకులు తిన్న పట్టు పురుగులు చనిపోతున్నాయి. బతికి ఉన్న వాటి హార్మోన్లపై ప్రభావం పడి గూళ్లు అల్లడం లేదని శాస్త్రవేత్తలు గుర్తించారు. సీడ్ బాగానే ఉంటోందని, వేరుకుళ్లు, ఇతర రోగాలు, వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైతులు షెడ్డు పరిసరాల్లో రోగాలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలని, సమర్థ యాజమాన్య చర్యలతో దిగుబడి పెరుగుతుందని సూచిస్తున్నారు.

– కూన వెంకటేశ్వర్లు

మేమే ఎందుకు?

నందనవనంలో రకరకాల పూల మొక్కలు ఉండేవి. ఆ పువ్వుల్లోని మకరందాన్ని తేనెటీగలు తాగేసేవి. వాటిలో మకరందం పూర్తయినా కూడా పువ్వులను పొడుస్తూనే ఉండేవి. దాంతో ఒకసారి ఓ పువ్వు మిగతా వాటితో.. 'ఈ తేనెటీగలు మనలోని మకరందాన్ని తాగేసిందే కాకుండా.. ఇంకా పొడుస్తూ బాధపెడుతున్నాయి' అంది. 'అవును మా పరిస్థితి కూడా అలాగే ఉంది' అని బదులిచ్చాయా పువ్వులు. ఇదంతా విన్న తేనెటీగ.. 'మేము మీ నుంచి మకరందాన్ని సేకరించి తేనెగా మారుస్తాం. ఇతర జంతువులు, మనుషులకూ అందిస్తాం. అయినా.. అది మా బాధ్యత. మిమ్మల్ని బాధపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు' అంది.



అప్పుడు పువ్వులు.. 'మిగతా జంతువులు, మనుషులకు తేనెను ఇవ్వడం కోసం ఎందుకు మీరు మా వెంట పడతారు' అని అడిగాయి. 'మేము మాత్రమే పువ్వుల్లోని మకరందాన్ని తేనెగా మార్చగలం. వేం కష్టపడి అన్ని పువ్వుల్లోని తేనెను ఒక చోటకు చేరుస్తాం. అది మనుషులు తీసుకుంటారు. కొన్నిసార్లు మనం చేసే పనులు ఎదుటివాళ్లకు ఎంతో మంచి చేస్తాయి. అలాంటిదే ఇది కూడా! మీరు మకరందాన్ని అందిస్తే.. మేము తేనెగా మార్చి వాళ్లకు ఇస్తాం. కాబట్టి మనం చేయాల్సిన పనిని ఎప్పుడూ ఇబ్బందిగా అనుకోకూడదు. నిస్వార్థంగా ఉంటూ బాధ్యతగా దాన్ని పూర్తి చేయాలి అర్థమైందా!' అంది తేనెటీగ. ఆ మాటలు విని అలాగేనంటూ బదులిచ్చాయి పువ్వులు.

– పుల్లట సంతోష్

హాయ్! బుజ్జీ!!



అక్షరాల చెట్టు

ఈ అక్షరాలతో అర్థవంతమైన పదం తయారు చేయండి.

జవాబు: EXPERIMENT

email: hai@eenadu.in





అమరపురి.. సృజన సిరి..

ఘనంగా రెండు రోజుల డ్రోన్ సమ్మిట్

ఆశ్చర్యపరిచిన ఆధునిక, సాంకేతిక ప్రదర్శనలు

ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి

మంగళగిరిలో రెండో రోజు ప్రదర్శనకు ఉంచిన ఆధునిక డ్రోన్లను చూసి విద్యార్థులు.. గొప్ప అనుభూతికి లోనయ్యారు. తమకు ఇప్పటివరకూ వీటి గురించి ఇంత అవగాహన లేదని.. తొలిసారి ఇలాంటివి చూస్తున్నామని తెలిపారు. తాము కూడా పెద్దయ్యాక డ్రోన్లను తయారుచేస్తామని విద్యార్థులు ఆనందంగా చెప్పారు. ఇవి చూసి ఎంతో స్ఫూర్తి పొందామని, భవిష్యత్తులో డ్రోన్ల విప్లవం రానుందని.. ఇవన్నీ ప్రత్యేక నిదర్శనమని ఇంజినీరింగ్ విద్యార్థులు పేర్కొన్నారు. తాము ఇప్పటికే పొలాల్లో డ్రోన్లతో పురుగు మందులను పిచికారీ చేయిస్తున్నట్లు కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, మంగళగిరి, గుంటూరు ప్రాంతాల రైతులు ఆనందంగా తెలిపారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల సాయం మరింత పెరిగితే.. రైతులకు ఎంతో ప్రయోజనకరమన్నారు.

రైతన్నకు తోడుగా.. విహార్

ఐఐటీ మద్రాసు విద్యార్థులు, అధ్యాపకుల సహాయంతో 'విహార్' పేరుతో డ్రోన్‌ను తయారు చేశారు. ఐఐటీ ప్రాంగణంలోనే స్టార్టప్ కంపెనీ పెట్టారు. ఈ డ్రోన్‌ను క్రిమిసంహారక మందులు, విత్తనాలు చల్లడానికి వాడవచ్చు. డ్రోన్ కింద అమర్చిన డబ్బాలో మందులను ఉంచి.. పిచికారీ చేయొచ్చు. రైతులు సులభంగా విత్తనాలను కూడా పొలాల్లో చల్లుకోవచ్చు. 30 కిలోల బరువు ఉండే ఈ డ్రోన్‌కు.. 10 లీటర్ల ద్రావణం ఒకేసారి పైకి తీసుకెళ్లి పిచికారీ చేసే సత్తా ఉంది. రెండు గంటల్లో 30 ఎకరాలకు పురుగుమందు పిచికారీ చేయగలదు. 100 అడుగుల ఎత్తు ఎగురుతుంది. తమ డ్రోన్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) నుంచి టైప్ సర్టిఫికేషన్ ఉందని సంస్థకు చెందిన విఘ్నేశ్ వెల్లడించారు.


విహార్ డ్రోన్

ఈ డ్రోన్లు చూస్తే ఆశ్చర్యం వేస్తోంది..



నేను 12 ఎకరాల్లో వరి, మినుము పండిస్తున్నా. ఇటీవల డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేయించా. పంపు సెట్లతో కొడితే.. రోజులు పడుతుంది. పనివారూ దొరకడం లేదు. సొంతంగా డ్రోన్ కొంటే.. నాతోపాటు మా ఊరి రైతులకూ ఉపకరిస్తుందనే ఉద్దేశంతో చూసేందుకు ఇక్కడికి వచ్చా. పెట్రోలు, బ్యాటరీతో ఎక్కువ సమయం ఎగిరే డ్రోన్‌ను కొంటా. ఈ డ్రోన్లను చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంది.

- వి.నర్సింగరావు, రైతు, గుడివాడ



అమరావతి డ్రోన్ సమ్మిట్ చూసేందుకు విజయవాడ, గుంటూరు సహా చుట్టుపక్కల ప్రాంతాల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ ప్రాంతాల రైతులు, ప్రజలు భారీగా విచ్చేసి డ్రోన్ల ప్రదర్శనను తిలకించారు. విజయవాడ కృష్ణా తీరంలో తొలి రోజు నిర్వహించిన.. 5,500 డ్రోన్ల ప్రదర్శన చూపరులను కట్టిపడేసింది. రెండో రోజు డ్రోన్ల సాంకేతికత, సమాజ అవసరాలకు ఎలా వినియోగించాలనే అంశాలపై.. మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్‌లో నిర్వహించిన.. సమావేశాల్లో నిపుణులు పాల్గొని..అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన.. సమ్మిట్‌లో దేశవ్యాప్త సాంకేతిక నిపుణులు వచ్చి తాము రూపొందించిన ఆధునిక డ్రోన్లను ప్రదర్శించి.. ఔరా అనిపించారు.

సర్వైలెన్స్, మ్యాపింగ్‌కు.. సిగ్మా25



'సిగ్మా-25' డ్రోన్ అందరినీ ఆకర్షిస్తోంది. సర్వైలెన్స్, మ్యాపింగ్ సహా పలు అవసరాలకు దీనిని వాడొచ్చు. ఇన్‌డ్రోన్స్ సంస్థ రూపొందించిన ఈ డ్రోన్ అత్యంత తేలికైంది. కేవలం 3.5 కిలోల కంటే తక్కువ బరువు ఉంటుంది. 50 నిమిషాల్లో నాలుగు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని పక్కాగా సర్వే చేస్తుంది. రైల్వే ట్రాక్, రహదారులు, వంతెనలు, ఆయిల్, గ్యాస్ రిఫైనరీలు, వ్యవసాయం, గనులు, విపత్తులు, టెలీకమ్యూనికేషన్, నిర్మాణం, స్మార్ట్ సిటీల నిర్వహణ వంటి అన్ని అవసరాలకూ వాడవచ్చు. ఈ డ్రోన్‌లో పగలు, రాత్రీ అత్యంత నాణ్యమైన వీడియోలను రికార్డుచేసే అత్యాధునిక కెమెరా అమర్చారు. బహిరంగ సభలు, ఉత్సవాల నిర్వహణకూ వాడవచ్చు.

రైతులకు, గిరిజనులకు భరోసా...




పెనమలూరు కుర్రాడు **శామ్యూల్** ప్రభుత్వ యంత్రాంగానికి ఉపకరించే డ్రోన్ రూపొందించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చదివి స్వీడన్‌లో కంట్రోల్ సిస్టమ్స్ ఇంజినీర్‌గా పనిచేశారు. ప్రస్తుతం స్వదేశానికి వచ్చేసి.. విజయవాడ శివార్లలో డ్రోన్‌హబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను నెలకొల్పారు. రెండు రకాల డ్రోన్లను రూపొందించారు. ఒకటి అడవులు, కొండగుట్టల్లో ఉండే తండాల్లోని వారికి అత్యంత తేలికగా సరకులు, మందులు సహా ఏ అవసరం ఉన్నా తీసుకెళ్లి ఇచ్చే డ్రోన్. మరొకటి... ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే ఆటోమేటిక్ డ్రోన్. సాధారణంగా పొలానికి పురుగు పడితే.. మొత్తం పంటకు పిచికారీ చేస్తారు. కానీ.. ఎక్కడ పురుగు పట్టిందో ఆ ప్రదేశాన్నే పక్కాగా ఆధునిక కెమెరా, ఏఐ ద్వారా గుర్తించి.. మందును సరిగ్గా అక్కడే ఈ డ్రోన్ పిచికారీ చేస్తుంది. తద్వారా పురుగు మందు వినియోగం సగానికి తగ్గించొచ్చు. ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ల సహకారంతో దీనిని రూపొందించారు.

సాగులో సగం ఖర్చు తగ్గుతోంది..



20 ఎకరాలు కౌలుకు చేస్తున్నా. నాలుగేళ్లుగా పురుగు మందులు పిచికారీ చేయిస్తున్నా. సాధారణంగా ఇద్దరు మనుషులు రెండు రోజుల్లో 20 ఎకరాలకు మందులు జల్లుతున్నారు. ఒకరికి రోజుకు రూ.500 చొప్పున రూ.2 వేలు ఖర్చు. అదే డ్రోన్‌తో 5 గంటల్లో పని పూర్తయి.. రూ.వెయ్యి వెచ్చిస్తే చాలు. పైగా డ్రోన్‌తో మందుల పిచికారీ చేస్తే వృథా తగ్గుతోంది.

- ఎన్. వెంకటేశ్వరరావు, రైతు, తాడేపల్లి


విద్యార్థికి విజ్ఞానం


డ్రోన్ సమ్మిట్ విజయవంతంగా నడిపించిన బృందాన్ని అభినందిస్తున్న ఉన్నతాధికారులు

విద్యుత్తు బస్సులకు ప్రతిపాదనలు

విజయవాడకు 100, అమరావతికి 50

కేంద్రానికి ఆర్టీసీ అధికారుల ప్రతిపాదన

ఈనాడు - అమరావతి: పర్యావరణ హితం కోరుతూ సంప్రదాయ ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రజారవాణా వ్యవస్థలో విద్యుత్తు బస్సులను ప్రవేశపెట్టేందుకు దృష్టి సారించింది. 'పీఎం ఈ - బస్ సేవ' పథకం కింద విద్యుత్తు బస్సుల కోసం కేంద్రానికి ఆర్టీసీ ప్రతిపాదనలు సమర్పించింది. ఇటీవల ఆర్టీసీ అధికారులు దిల్లీ వెళ్లి కేంద్రానికి అందజేశారు. దేశీయంగా వివిధ నగరాల్లో ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో ప్రజా రవాణా అవసరాల కోసం ఈ బస్సులను కేంద్రం ప్రవేశపెట్టనుంది. ఇందుకు దేశీయంగా టెండర్లు పిలిచాక జనాభా ప్రాతిపదికన విజయవాడ నగరానికి వంద బస్సులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్తుతో నడిచే బస్సుల నిర్వహణ వ్యయం తక్కువే. ఒకసారి ఛార్జింగ్ చేస్తే వందకు పైగా కి.మీ. నడుస్తాయి. విజయవాడ నగరంలో కార్బన్ మోనాక్సైడ్ ఆందోళనకర స్థాయిలో నమోదవుతోంది. ప్రస్తుతం సిటీ సర్వీసుల్లో చాలా బస్సులు ఎక్కువ కి.మీ. తిరిగాయి. ఇవి కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్తు బస్సులు వస్తే వాయు కాలుష్యం తగ్గే వీలుంది.



అన్నీ విద్యాధరపురం డిపోకే !

గతంతో పోలిస్తే.. తాజా ప్రతిపాదనల్లో డిపోలను మార్చారు. విద్యాధరపురం, గవర్నర్‌పేట-2 డిపోలకు విద్యుత్తు బస్సులను ప్రతిపాదించారు. వీటిని మార్చి అన్నింటినీ విద్యాధరపురం డిపో కోసమే ప్రతిపాదించారు. అక్కడే బస్సుల ఛార్జింగ్ కోసం 6000 కేవీఏ సామర్థ్యంతో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లను నగరంలో 15 రూట్లలో వంద బస్సులను తిప్పనున్నారు. కబేళా - గవర్నమెంట్ ప్రెస్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ - ఆటోనగర్, కాళేశ్వరరావు మార్కెట్ - ఆటోనగర్, హెచ్‌బీ కాలనీ - ఆటోనగర్, రైల్వేస్టేషన్ - ఆటోనగర్, హెచ్‌బీ కాలనీ - పెనమలూరు, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ - తాడిగడప, ఎన్ఎస్‌బీ నగర్ - ఆటోనగర్, సిటీబస్ పోర్టు - మైలవరం, సిటీ బస్‌పోర్టు - విస్సన్నపేట, కేఆర్ మార్కెట్ - పామర్రు, పీఎన్‌బీఎస్ - విస్సన్నపేట మార్గాల్లో వీటిని నడపాలని ప్రతిపాదించారు.

రాజధానిలోని పలు రూట్లలో..

రాజధాని పునర్నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో విద్యుత్తు బస్సులను అమరావతికి కూడా ప్రతిపాదించారు. ఏడు రూట్లలో తిప్పేందుకు 50 బస్సులు అవసరమని తేల్చారు. విజయవాడ నగరంలో డిపోల నుంచి ప్రస్తుతం తిరుగుతున్నాయి. విద్యుత్తు బస్సులన్నీ గుంటూరు జిల్లా మంగళగిరి డిపోకు బదిలీ చేస్తారు. మంగళగిరి - గుంటూరు, మంగళగిరి - సచివాలయం, మంగళగిరి - హైకోర్టు, పీఎన్‌బీఎస్ - అమరావతి, విజయవాడ రైల్వేస్టేషన్ - ఎయిమ్స్, పీఎన్‌బీఎస్ - హైకోర్టు, పీఎన్‌బీఎస్ - సచివాలయం రూట్లో సిటీ ఆర్డినరీ, పల్లెవెలుగు బస్సులను తిప్పేందుకు అధికారులు యోచిస్తున్నారు.

ఇంటికి దీపం.. ఇంటికి శుభం

ఈనాడు - అమరావతి

- 10 లక్షల కుటుంబాలకు మేలు
- దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు
- ఏడాదికి రూ.250 కోట్ల మేర లబ్ధి

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సూపర్-6 పథకాల్లో తొలి పథకాన్ని ప్రారంభించనుంది. ఏడాదికి మూడు వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించే ఏర్పాట్లు చేసింది. వచ్చే దీపావళి నుంచి ఈ పథకం ప్రారంభం కానుంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో దాదాపు 10 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని అంచనా. ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడంతో ఒక కుటుంబానికి దాదాపు రూ.2,500 చొప్పున.. రూ.250 కోట్లు ప్రభుత్వం భరించాల్సి ఉంది. దీనిపై విధివిధానాలు రావాల్సి ఉందని జిల్లా అధికారులు చెబుతున్నారు.

ఇదీ లెక్క...

ఉమ్మడి జిల్లాలో వంట గ్యాస్ కనెక్షన్లు దాదాపు 12.61 లక్షలు ఉన్నాయి. వీటిలో బీపీఎల్.. ఏపీఎల్ కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ పథకాన్ని బీపీఎల్ కుటుంబాలకు వర్తింపజేసే వీలుంది. ఇప్పటికే కేంద్రం సంపన్న వర్గాలకు ఇచ్చే గ్యాస్ సబ్సిడీ వదులుకోవాలని సూచిస్తోంది. ఈనేపథ్యంలో ఉచిత సిలిండర్ బీపీఎల్ కుటుంబాలకే వర్తింపజేసే వీలుంది. ముందుగా మొత్తం ధర చెల్లించాలనీ.. తర్వాత లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో సిలిండర్ ధర జమ కానుంది. ప్రస్తుతం వంట గ్యాస్ 14 కేజీల సిలిండర్ ధర రూ.827.50. దీనిలో కేంద్ర ప్రభుత్వ రాయితీ నామమాత్రమే.. మొత్తం రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. ఆ మేరకు జిల్లాలో తెల్లకార్డులు ఉన్న వారికే వర్తించవచ్చు.



రేషన్ కార్డుల వివరాలు

	ఎన్టీఆర్	కృష్ణా
తెల్లకార్డులు	5,89,011	5,33,288
వంటగ్యాస్ కనెక్షన్లు (అన్ని రకాలు)	6,55,000	6,06,423
సిలిండర్ల వినియోగం (నగటున, అన్ని కంపెనీలు)	3.50లక్షలు	3.25లక్షలు

తెల్లకార్డుదారులకు ఊరట...

గ్రామీణంలో కార్డులు ఉన్న వారిలో కొందరికి వంట గ్యాస్ కనెక్షన్లు లేవు. డీఆర్‌డీఏ ద్వారా గతంలో తెదేపా ప్రభుత్వం దీపం పథకం కింద కనెక్షన్లు ఇచ్చింది. వీటి అన్నింటికి ఉచిత సిలిండర్ పథకం వర్తింపజేస్తారు. బియ్యం కార్డులు ఉన్న వారు.. ఏటా నాలుగు సిలిండర్లు గరిష్ఠంగా వినియోగిస్తున్నట్లు అంచనా. అంతకు మించి వినియోగం లేదు. ప్రభుత్వం మూడు సిలిండర్లు మాత్రమే ఉచితంగా అందిస్తుంది. ఇండేన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్ కంపెనీలు సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. ఇవికాక విజయవాడ నగరంలో అపార్టుమెంట్లకు.. కొన్ని కంపెనీలు నేరుగా వంట గ్యాస్ పంపిణీ చేస్తున్నాయి. వీటికి సబ్సిడీ సిలిండర్లు ఉండకపోవచ్చని అంచనా.

వివరాలు సేకరించని అధికారులు..!

సూపర్-6 పథకాల అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంటే.. కనీసం ఆ వివరాలను కూడా సేకరించని స్థితిలో పౌరసరఫరాల శాఖ (ప్రజాపంపిణీ వ్యవస్థ) అధికారులు ఉన్నారు. తమ పరిధిలో ఉన్న బీపీఎల్ కుటుంబాల వంట గ్యాస్ కనెక్షన్ల వివరాలు అందుబాటులో లేవు. దీంతో మల్లగుల్లాలు పడుతున్నారు. ఆయిల్ కంపెనీల ద్వారా సేకరించాలని చెబుతున్నారు. తమకు ఎలాంటి మార్గదర్శకాలు అందలేదనీ.. తమను ప్రభుత్వం వివరాలు అడగలేదని కృష్ణా జిల్లా డీఎస్వో పార్వతి 'ఈనాడు'తో చెప్పారు. మార్గదర్శకాలు అందాల్సి ఉందని ఎన్టీఆర్ డీఎస్వో పాపారావు తెలిపారు.


సీతానగరం వైపు నదిలోకి కుంగిపోతున్న రక్షణ గోడ


కూలిన రక్షణ గోడ వద్ద ముళ్లకంపలు అడ్డుగా పెట్టారిలా..

కూలిపోతోంది.. కదలి రండి

ప్రకాశం బ్యారేజీ చెంతన కృష్ణానది వెంబడి రక్షణ గోడ దెబ్బతినడంతో సందర్శకులు భయాందోళనలకు గురవుతున్నారు. నదీ ప్రవాహాన్ని తిలకించేందుకు నిత్యం సందర్శకులు తరలివస్తుంటారు. గోడ వెంబడి కాసేపు సేద తీరి సెల్ఫీలతో సందడి చేస్తుంటారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా సీతానగరం వైపు ఉన్న రక్షణ గోడ నదిలోకి కుంగిపోతోంది. కొంత మేర కూలిపోగా.. జలవనరులశాఖ అధికారులు తాత్కాలికంగా ముళ్ల కంప అడ్డుగా వేసి వదిలేశారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా సందర్శకులు నదిలో పడిపోయే అవకాశం లేకపోలేదు. దీనికి తోడు బ్యారేజీ 39వ పిల్లరు వద్ద పాదచారుల బాట వెంబడి రెయిలింగ్ వంగి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- ఈనాడు అమరావతి, న్యూస్‌టుడే తాడేపల్లి


బ్యారేజీ మధ్యలో రెయిలింగ్ లోపలకు ఒరిగి..

ప్లాట్లు పొందిన వారికి వారంలో రిజిస్ట్రేషన్లు

సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్ వెల్లడి

ఈనాడు, అమరావతి: లాటరీలో రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు ఎటువంటి జాప్యం లేకుండా వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని సీఆర్డీఏ అదనపు కమిషనర్ సాయి సూర్య ప్రవీణ్‌చంద్ అన్నారు. విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఈ-లాటరీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయించారు. అనంతరం వారికి కేటాయింపు పత్రాలను అందజేశారు. కురగల్లు-1, 2, అబ్బరాజుపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, మల్కాపురం, ఉద్దండరాయునిపాలెం, శాఖమూరు, తుళ్లూరు-1, 2, మందడం- 1, 2 గ్రామాల పరిధిలోని 23 మంది రైతులకు 68 కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్ల తాలూకా పత్రాలను ఇచ్చారు.


రైతుకు ప్లాట్ల కేటాయింపు పత్రం అందజేస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ సాయిసూర్య ప్రవీణ్‌చంద్

భద్రత.. చెదిరినది


ఇద్దరు తప్ప ఎవరూ లైఫ్ జాకెట్లు వేసుకోకుండా కృష్ణానదిలో విహారం

గత నెల కృష్ణానదికి వచ్చిన వరద కారణంగా పర్యాటక శాఖ తీవ్రంగా నష్టపోయింది. పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో ఉన్న బోట్లు, లైఫ్ జాకెట్లు బురదగా మారి.. పాడై అధ్వానంగా తయారయ్యాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన పర్యాటకులు పున్నమి ఘాట్ నుంచి భవానీ ద్వీపానికి కృష్ణానదిలో బోటులో ప్రయాణించాల్సి ఉంటుంది. లైఫ్ జాకెట్లు వేసుకోవాలని బోటు ఎక్కిన పర్యాటకులకు సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే పాడై మురికిగా మారిన వాటిని ఎలా వేసుకుంటామంటూ పర్యాటకులు బోటు సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. కొత్త లైఫ్ జాకెట్లు త్వరితగతిన తెప్పించి పర్యాటకులకు అందుబాటులో ఉంచాలని వారు కోరుతున్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో కనిపించిన చిత్రాలివి.

\- ఈనాడు, అమరావతి


వరద కారణంగా పాడైన లైఫ్ జాకెట్లు


అధ్వానంగా ఉన్న వాటిని చూపుతున్న పర్యాటకుడు

నగరంలో 24.2 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో పలు చోట్ల వర్షాలు కురిశాయి. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం వరకు నమోదైన వివరాల ప్రకారం.. మొత్తం 102.6 మి.మీ. వర్షం పడగా, సగటు వర్షపాతం 5.13 మి.మీ.గా ఉంది. విజయవాడ పశ్చిమ, సెంట్రల్ 24.2, విజయవాడ తూర్పు 23.6, విజయవాడ ఉత్తరం 23.4, విజయవాడ గ్రామీణం 4.8, ఇబ్రహీంపట్నం 1, జగ్గయ్యపేటలో 1.4 మి.మీ. మేర వర్షం పడింది.

సంపూర్ణ అక్షరాస్యతకే 'ఉల్లాస్'

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ క్రమంలో సదరు కార్యక్రమంపై నగరంలోని కలెక్టరేట్ నుంచి ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా బుధవారం జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో గూగుల్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. 15 ఏళ్ల పైగా వయస్సున్న వారిలో నిరక్షరాస్యులను గుర్తించి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో తొలి దశలో 7,000 మందిని గుర్తించి, అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీవోఏ), క్లస్టర్ కోఆర్డినేటర్ల ద్వారా గుర్తించిన వారికి శిక్షణ ఇచ్చేందుకు ప్రతి 10 మందికి ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. [illegible] నవంబరు నుంచి సాయంత్రం రెండు గంటల పాటు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. [illegible] నోడల్ అధికారి జి.ప్రసాదరావు, డీఈవో, ఏపీసీ, ఎస్ పీడీలు తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయాపన చేయకుండా దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో కలపాల్సిందేనని విశ్రాంత డీజీపీ, బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. దీనిపై జరుగుతున్న పోరాటాలకు పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. గురువారం ఏపీలో పర్యటించనున్న బాలకృష్ణన్ కమిషన్ ముందు తమ వైఖరి వెల్లడిస్తామని స్పష్టం చేశారు. క్రిస్టియన్ కోఆర్డినేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ బుధవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనందకుమార్ మాట్లాడుతూ అగ్రకులాల నుంచి వచ్చిన బిషప్ల నుంచి పాస్టర్ల వరకు దళితులను అంటరానివారిగానే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.బాబూరావు, తమిళనాడు ఏపీసీ అధ్యక్షుడు దయాపాత్ర, ప్రముఖ రచయిత డాక్టర్ తెన్నేటి జయరాజు, బిషప్ కె.శాంతిసాగర్, న్యాయవాది కరణం తిరుపతిరావు, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బి.జార్జిముల్లర్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల పాస్టర్లు, మతగురువులు పాల్గొన్నారు.

షేర్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట మోసం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుందంటూ నమ్మించి మోసం చేసిన జాదవ్ రాజశేఖరరావు అనే వ్యక్తిపై సైబర్‌క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. అయోధ్యనగర్‌కు చెందిన వరుణ్ సాయి ఐటీ ఉద్యోగి. ఆయనకు జాదవ్ రాజశేఖరరావు ఫోన్ చేసి షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధికలాభాలు వస్తాయని చెప్పి పెట్టుబడులు పెట్టమనడంతో నిరాకరించారు. తరచూ ఫోన్ చేసి ఆదాయాల గురించి చెబుతుండటంతో ఆకర్షితులై విడతల వారీగా రూ.10.09లక్షలు అతను చెప్పిన ఖాతాలకు పంపించారు. తరువాత మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో /కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ [illegible]

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

[illegible]

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు


ప్రయాణికుడికి అందజేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే రైల్వే శాఖ లక్ష్యమని డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ అన్నారు. బుధవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో 'రైల్ చౌపాల్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ప్రయాణికులను నేరుగా కలిసి తమ సమస్యలు తెలుసుకోవడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలని కోరారు. అనంతరం ప్రయాణికులకు [illegible] అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, సీనియర్ డీసీఎం [illegible], సీనియర్ డీఎంఈ ఎం.సంజయ్, డీసీఎం ఎం.డి.అలీ ఖాన్, స్టేషన్ డైరెక్టర్ ఎం.శైలజ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయవాడ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 311/2023
Between
[illegible]
తేదీ: 04-11-2024
[illegible]

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ బ్రాంచి, [illegible] విజయవాడ - 521225

బంగారు నగల వేలం ప్రకటన

[illegible] తేది. 06-11-2024, [illegible]

క్రమ సం.	లోను ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	మొత్తం తూకం (గ్రాములలో)
		విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ బ్రాంచి	
1.	127316540001034	బొమ్మిశెట్టి వెంకట సత్య నాగ కిషోర్ బాబు	178
2.	127316540001037	బొమ్మిశెట్టి వెంకట సత్య నాగ కిషోర్ బాబు	102
3.	127316540001079	బొమ్మిశెట్టి వెంకట సత్య నాగ కిషోర్ బాబు	121
4.	127316540001239	బొమ్మిశెట్టి వెంకట సత్య నాగ కిషోర్ బాబు	157

తేది. 23-11-2024, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, విజయవాడ

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆఫీస్ చిరునామా : 29-37-141, 2వ ఫ్లోర్, రామ మంధిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : **1. శ్రీ వినోద్ నందమూరి,** తండ్రి : శ్రీ వెంకటేశ్వరరావు, [illegible] నివాసం : ఇ.నెం.40-3/1-46/4, ఫ్లాట్ నెం.ఎస్-2, గీతాంజలి అపార్ట్‌మెంట్స్, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ, కృష్ణాజిల్లా - 520010. **2. నందమూరి లక్ష్మి,** [illegible] నివాసం : ఇ.నెం.1-53, నిమ్మకూరు గ్రామం, పామర్రు మండలం, కృష్ణాజిల్లా - 521158. మరియు [illegible] **3. నందమూరి లక్ష్మి కుమారి,** [illegible] **4. నందమూరి శ్రీ వినయ్,** [illegible] ఇ.నెం.1-53, నిమ్మకూరు గ్రామం, పామర్రు మండలం, కృష్ణాజిల్లా - 521158. మరియు **నందమూరి శ్రీ వినయ్,** తండ్రి : శ్రీ వెంకటేశ్వరరావు, నివాసం : ఇ.నెం.40-3/1-46/4, ఫ్లాట్ నెం.ఎస్-2, గీతాంజలి అపార్ట్‌మెంట్స్, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా. **5. కొమ్మూరు జాన్ రవి కుమార్,** తండ్రి : కె. పాల్ నరసింహారావు, నివాసం : ఇ.నెం.54-14/8-35/1, ఫ్లాట్ నెం.6, మధురం అపార్ట్‌మెంట్, రోడ్ నెం.3, భారతి నగర్, వినాయక్ థియేటర్ ఎదురుగా, విజయవాడ, కృష్ణాజిల్లా - 520008.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **శ్రీ వినోద్ నందమూరి, నందమూరి లక్ష్మి కుమారి & నందమూరి శ్రీ వినయ్‌లకు** చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. VIJA4TF1905170004

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు విజయవాడ-4లో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.05.05.2022**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది.05.05.2022** నాటికి బకాయి మొత్తం **రూ.35,52,761/-** (అక్షరాల ముప్పై ఐదు లక్షల యాభై రెండు వేల ఏడు వందల అరవై ఒక్క రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ/ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది.10.10.2022**న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో **తేది.28.05.2024**న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.

సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఇ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఇ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఇ-వేలం జరిగే తేది మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.

అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు అయిన ఇటీవల వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.1096/2019, పామర్రు ఎస్ఆర్‌ఓ ప్రకారం శ్రీ వినోద్ నందమూరి, నందమూరి లక్ష్మి కుమారి & నందమూరి శ్రీ వినయ్ గార్లకు చెందినది

కృష్ణాజిల్లా, పామర్రు సబ్ డిస్ట్రిక్ట్, పామర్రు మండలం, నిమ్మకూరు గ్రామ పంచాయితీ ఏరియా, నిమ్మకూరు గ్రామం, ఆర్.ఎస్.నెం.321 మరియు రీ సర్వే ప్రకారం గల ఆర్.ఎస్.నెం.321/2, డోర్ నెం.2-103 దగ్గర 1518 చ॥గ॥లు లేదా 1275.12 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం. **హద్దులు : తూర్పు :** ఎపిఆర్‌జెసి స్కూల్ యొక్క ప్రహరీ గోడ - 71.06 అ॥లు, **పడమర :** పంచాయితీ రోడ్డు - 71.06 అ॥లు, **ఉత్తరం :** నందమూరి నందేశ్వరరావు గారి ఉమ్మడి దారి - 191.00 అ॥లు, **దక్షిణం :** నందమూరి వెంకటేశ్వరరావు మరియు నందమూరి లక్ష్మణ స్వామి గార్ల ఉమ్మడి దారి - 191.06 అ॥లు.,

పైన తెలిపిన హద్దులలో విస్తీర్ణం 1518 చ॥గ॥లు లేదా 1275.12 చ॥మీ॥ల స్థలం మాత్రమే. (ఈ ఆస్తి డాక్యుమెంట్ నెం.2206/2018, పామర్రు ఎస్ఆర్‌ఓ ప్రకారం "బి షెడ్యూలు" లోని ఐటమ్ నెం.3 ప్రకారం కలదు).

ప్రదేశం : విజయవాడ
తేది : 18-10-2024
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆఫీస్ చిరునామా : 29-37-141, 2వ ఫ్లోర్, రామ మంధిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : **1. జనార్ధనరావు అడ్డేపల్లి,** తండ్రి : సత్యనారాయణ, ఎఎస్ఆర్ బార్ & రెస్టారెంట్, డి.నెం.5-68/1, ఆర్‌సిఎమ్ స్కూల్ వీధి, ఇబ్రహీంపట్నం, కృష్ణాజిల్లా - 521456. **2. సంకా జయప్రద,** భర్త : శ్రీనివాసరావు, డి.నెం.7-63/సి, చిట్టాలవారి వీధి, తిరువూరు, కృష్ణాజిల్లా - 521235. **3. అడ్డేపల్లి జగన్ మోహన్ రావు,** తండ్రి : సత్యనారాయణ, డి.నెం.5-68/1, ఆర్‌సిఎమ్ స్కూల్ వీధి, ఇబ్రహీంపట్నం, కృష్ణాజిల్లా - 521456. **4. రాజా వెంకట దుర్గ కిరణ్,** తండ్రి : హనుమంతరావు, డి.నెం.6-34, గుంటుపల్లి, కృష్ణాజిల్లా - 521241. **5. అడ్డేపల్లి విజయ లక్ష్మి,** భర్త : సత్యనారాయణ, డి.నెం.5-58, ఆర్‌సిఎమ్ స్కూల్ వీధి, ఇబ్రహీంపట్నం, కృష్ణాజిల్లా - 521456. **6. కష్టవాయి శుభ భారతి,** భర్త: శ్రీనివాసరావు, డి.నెం.1-323, తిరుపతమ్మ గుడి దగ్గర, కానూరు, విజయవాడ, కృష్ణాజిల్లా - 520007.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **జనార్ధనరావు అడ్డేపల్లి, సంకా జయప్రద, అడ్డేపల్లి జగన్ మోహన్ రావు, అడ్డేపల్లి విజయ లక్ష్మి మరియు కష్టవాయి శుభ భారతి కు** చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం.లు IBPATTF1504280012 & IBPATTF1607080002

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు ఇబ్రహీంపట్నంలో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.27.01.2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది.27.01.2023** నాటికి బకాయి మొత్తం **రూ.1,92,88,463/-** (అక్షరాల ఒక కోటి తొంభై రెండు లక్షల ఎనభై ఎనిమిది వేల నాలుగు వందల అరవై మూడు రూపాయలు మాత్రమే) + **రూ.51,36,022/-** (అక్షరాల యాభై ఒక్క లక్షల ముప్పై ఆరు వేల ఇరవై రెండు రూపాయలు మాత్రమే). **మొత్తం కలిపి రూ.2,44,24,485/-** (అక్షరాల రెండు కోట్ల నలభై నాలుగు లక్షల ఇరవై నాలుగు వేల నాలుగు వందల ఎనభై ఐదు రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ/ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు [illegible]

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.2532/2015 & 3568/2016, [illegible]

[illegible]

ప్రదేశం : విజయవాడ
తేది : 18-10-2024
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆఫీస్ చిరునామా : 29-37-141, 2వ ఫ్లోర్, రామ మంధిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : 1. వెంకట రాంబాబు పోతిన, తండ్రి : రామారావు పోతిన, (క్రొత్త) డి.నెం.4-1-106, కెటి రోడ్డు, ఫైర్ స్టేషన్ ఎదురుగా, లంబాడిపేట, విజయవాడ టౌన్, కృష్ణాజిల్లా. 2. దుర్గ భవాని, భర్త : రాంబాబు, కొత్త డి.నెం.4-1-106, కెటి రోడ్డు, ఫైర్ స్టేషన్ ఎదురుగా, లంబాడిపేట, విజయవాడ టౌన్, కృష్ణాజిల్లా. 3. శివ కుమార్, ప్రశాంతి హాస్పిటల్ వెనుక వైపు, బందర్ రోడ్డు, లబ్బీపేట, విజయవాడ టౌన్, కృష్ణాజిల్లా.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **వెంకట రాంబాబు పోతినకు** చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. IBPATTF1809300011

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు ఇబ్రహీంపట్నంలో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.24.07.2022**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది.24.07.2022** నాటికి బకాయి మొత్తం **రూ.70,85,416/-** (అక్షరాల డెబ్బై లక్షల ఎనభై ఐదు వేల నాలుగు వందల పదహారు రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ/ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది.08.02.2023**న [illegible]

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.5633/2018, [illegible]

[illegible] గ్రామ పంచాయితీ ఏరియా పట్ట ఆర్.ఎస్.నెం.158/2ఏ లోని ఎ.0.63 సెంట్లు లేదా 3049.2 చ॥గ॥లు విస్తీర్ణం గల శేరి మెట్ట భూమి (తదనంతరం వ్యవసాయేతర అవసరాలకు మార్చారు). హద్దులు : తూర్పు : కాటంనేని చలపతిరావు గారి ఆస్తి, దక్షిణం: కాటంనేని నాగేశ్వరరావు గారి ఆస్తి, పడమర : గంగుల రోశయ్య గారి ఆస్తి, ఉత్తరం : పోతిన వెంకట రాంబాబు గారి ఆస్తి.

ప్రదేశం : విజయవాడ
తేది : 18-10-2024
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆఫీస్ చిరునామా : 29-37-141, 2వ ఫ్లోర్, రామ మంధిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : 1. ఎస్.ఎస్. నాయుడు పౌల్ట్రీస్ మరియు టికెన్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : శొంఠి నరసింహారావు, 5-7/8-145, కెవిల్ రావు నగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, వార్డు-5, విజయవాడ అర్బన్, కృష్ణాజిల్లా - 520001. 2. **శొంఠి నరసింహారావు,** తండ్రి : శొంఠి ముక్తేశ్వరరావు, నివాసం : ఇ.నెం.5-6/4-17ఎ, హెచ్.ఎల్. రావు నగర్, చిట్టి నగర్, కలరా హాస్పిటల్ ఎదురుగా, విజయవాడ, కృష్ణాజిల్లా - 520001. 3. **శొంఠి గుడేరమ్మ,** భర్త : శొంఠి ముక్తేశ్వరరావు, నివాసం : ఇ.నెం.5-6/4-17ఎ, హెచ్.ఎల్. రావు నగర్, చిట్టి నగర్, కలరా హాస్పిటల్ ఎదురుగా, విజయవాడ, కృష్ణాజిల్లా - 520001. 4. **శొంఠి లక్ష్మి,** భర్త : ఎస్. నరసింహారావు, నివాసం : ఇ.నెం.5-6/4-17ఎ, హెచ్.ఎల్. రావు నగర్, చిట్టి నగర్, కలరా హాస్పిటల్ ఎదురుగా, విజయవాడ, కృష్ణాజిల్లా - 520001.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : శొంఠి నరసింహారావుకు చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. VIJA4TF1902190001

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు విజయవాడ-4లో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది)

[illegible]

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.1239/2019, [illegible]

[illegible]

ప్రదేశం : విజయవాడ
తేది : 18-10-2024
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆఫీస్ చిరునామా : 29-37-141, 2వ ఫ్లోర్, రామ మంధిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : 1. **రామారావు కొద్రకుంట,** తండ్రి : కృష్ణయ్య, డి.నెం.11-64-25, గులాం మోహిద్దీన్ వీధి, ఫిష్ మార్కెట్, కొత్తపేట, విజయవాడ టౌన్, ఎన్‌టిఆర్ జిల్లా - 520001. 2. **కొద్రకుంట భూలక్ష్మి,** డి.నెం.11-64-25, గులాం మోహిద్దీన్ వీధి, ఫిష్ మార్కెట్, కొత్తపేట, విజయవాడ టౌన్, ఎన్‌టిఆర్ జిల్లా - 520001. 3. **చిరుకూరు కోటేశ్వరరావు,** తండ్రి : సుబ్బయ్య, డి.నెం.76-1-19/1, పాత హెచ్‌బి కాలనీ, భవానీపురం, విజయవాడ టౌన్, ఎన్‌టిఆర్ జిల్లా - 520012.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **రామారావు కొద్రకుంటకు** చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. VIJA2TF1408300002

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు విజయవాడ-2లో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.27.01.2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది.27.01.2023** నాటికి బకాయి మొత్తం **రూ.3,36,34,415/-** (అక్షరాల మూడు కోట్ల [illegible]

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.2472/2014, [illegible]

[illegible] మెట్ట భూమి. హద్దులు : తూర్పు : సర్కార్ రోడ్డు, దక్షిణం : పిల్లా కనకమ్మ గారి భూమి, పడమర : పోతిన సింహాచలం గారి భూమి, ఉత్తరం : పోతిన దుర్గారావు మొ॥ వారి భూమి. పైన తెలిపిన హద్దులలో విస్తీర్ణం ఎ.0.47 సెంట్లు లేదా 0.190 హెక్టార్లు సేరి మెట్ట భూమి మాత్రమే. (ఈ ఆస్తి డాక్యుమెంట్ నెం.192/2012, నున్న ఎస్ఆర్‌ఓ ప్రకారం కలదు).

ప్రదేశం : విజయవాడ
తేది : 18-10-2024
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆఫీస్ చిరునామా : 29-37-141, 2వ ఫ్లోర్, రామ మంధిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : 1. **నరేంద్ర కుమార్ కోడూరు,** తండ్రి : పూర్ణ చంద్రరావు, డి.నెం.21-3-39/బి, భగత్‌సింగ్ రోడ్డు, ముత్యాలంపాడు, విజయవాడ - 520011. 2. **కోడూరు లక్ష్మి కుమారి,** భర్త : పూర్ణ చంద్రరావు, డి.నెం.21-3-39/బి, భగత్‌సింగ్ రోడ్డు, ముత్యాలంపాడు, విజయవాడ - 520011. 3. **బెల్లంకొండ రఘునాథ స్వామి,** తండ్రి : చిన్న వీర భద్రయ్య, డి.నెం.21-5-28/1, పసుపాల వారి వీధి, ముత్యాలంపాడు, విజయవాడ అర్బన్, సత్యనారాయణపురం, ఎన్‌టిఆర్ జిల్లా - 520011.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **నరేంద్ర కుమార్ కోడూరు కు** చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. VIJA4TF1606210001

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు విజయవాడ-4లో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.27.01.2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న [illegible]

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.2063/2016, [illegible]

[illegible]

ప్రదేశం : విజయవాడ
తేది : 18-10-2024
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

తిరువూరు

• తిరువూరు • మైలవరం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలతో కరస్పాండెంట్ సురేష్, హెచ్ఎం రమేష్

విద్యార్థుల సృజనకు పదును

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలోని సృజనకు పదును పెట్టుకోవచ్చని స్థానిక గౌతమ్ పాఠశాల కరస్పాండెంట్ జి.సురేష్ పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పరీక్షల్లో భాగంగా బుధవారం ఆ పాఠశాలలో..'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీ పరీక్షలు నిర్వహించారు. పోటీల్లో బీవీఎన్ జాహ్నవి, జె.జయశ్రీ, జి.హర్షితలు మొదటి మూడు స్థానాలు సాధించి, బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.రమేష్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎస్.మణికుమార్ అండర్-17 బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.క్రిస్టోఫర్, హెచ్.అంజయ్య బుధవారం తెలిపారు. జగ్గయ్యపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో ప్రతిభ చూపి ఎంపికైన తమ విద్యార్థి త్వరలో అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు.



మణికుమార్‌తో ఉపాధ్యాయులు

అండర్ -14 విభాగంలో..

గంపలగూడెం: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వేల్పుల వరలక్ష్మి అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బి.కిరణ్‌కుమార్, పీడీ బి.రాంబాబు బుధవారం తెలిపారు. జగ్గయ్యపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో ప్రతిభ చూపి ఎంపికైన తమ విద్యార్థిని త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.



వరలక్ష్మితో అధ్యాపకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

మట్టి దిబ్బల తొలగింపు

స్పందనకు సందనం

మండలంలోని పుల్లూరు శివారు చిలుకూరివారిగూడెంలో మురుగు కాలువలకు అడ్డంగా మట్టి దిబ్బలు ఉండడంతో మురుగు నీరంతా రహదారిపైకి చేరుతున్న వైనంపై స్థానికుల ఫిర్యాదును ఎంపీడీవో పి.అనురాధ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో తొలగింపు చర్యలను చేపడుతున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

మూడు గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నేడు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో భూములు రీసర్వే జరిగిన తిరువూరు మండలం ముష్టికుంట్ల, గంపలగూడెం, ఎ.కొండూరు మండలం తూర్పు మాధవరంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తామని ఆ మండలాల రెవెన్యూ అధికారులు తెలిపారు.

వసతులు రానున్నాయ్

సెంటు పట్టా లబ్ధిదారులకు మంచి రోజులు

కొండపల్లి, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వ సానుకూలతతో జగనన్న కాలనీ వాసులకు మంచి రోజులు రానున్నాయి. గత కలెక్టర్ సృజన ఆదేశాలతో విజయవాడ జోనల్ కమిషనర్ రమ్యకీర్తన పురపాలికలోని కొండపల్లి, ఇబ్రహీంపట్నం సెంటు పట్టాల్లో నిర్మించాల్సిన మురుగు కాలువలు, తాగునీటి సౌకర్యానికి సంబంధించి అవసరమైన అంచనాలను రూపొందించారు. ఆ అంచనాలు గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో అన్ని మౌలిక వసతులను త్వరలో ఆచరణలోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో సెంటు పట్టా గృహస్థులకు త్వరలో మౌలిక వసతులు ఏర్పాటు కానున్నాయి.

అట్టహాసంగా ప్రారంభించినా

గత ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా ప్రారంభించిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఐదేళ్ల పాటు కష్టాల్లో కూరుకుపోయాయి. అనేక మంది లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాల్లో బేస్ మట్టం పనులు పూర్తి చేసుకొని అంతటితో వదిలేయగా.. ఇళ్లు నిర్మించుకొని నివాసాలు ఉండే వారికి మాత్రం కనీస మౌలిక సదుపాయాలు లేక అవస్థలు తప్పలేదు. గత నెలలో కాలనీ మీదకు వచ్చిన వరద ధాటికి కాలనీలు జల దిగ్బంధమయ్యాయి. కూటమి ప్రభుత్వం, దాతలు స్పందించి పది రోజుల పాటు ఆహార పానియాలు సమకూర్చి అక్కడి వారిని ఆదుకున్నారు.



వర్షం పడినప్పుడు కాలనీ రహదారుల పరిస్థితి (పాత చిత్రం)

పురపాలికలో ఇదీ పరిస్థితి

కొండపల్లి పురపాలిక పరిధిలో ఇబ్రహీంపట్నం సడక్‌రోడ్డు, కొండపల్లి శివారు, ఈలప్రోలు వద్ద గత ప్రభుత్వంలో సెంటు పట్టాలు కేటాయించారు. ఇబ్రహీంపట్నం కాలనీల్లో 1,600 ప్లాట్లకు గానూ 650 మంది నిర్మాణాలు పూర్తి చేసుకోగా.. కొండపల్లి శివారు ఈలప్రోలు, శాంతి నగర్‌లలోని 1,500 ప్లాట్లగానూ 450 మంది నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. అయితే వాటిల్లో గత ప్రభుత్వం మౌలిక వసతుల ఏర్పాటు చేయకపోవడంతో నానా తిప్పలు పడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో సమస్యలు తీరనున్నాయని కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళికలు రూపొందిస్తున్నాం

- కమిషనర్ పి.శ్రీనివాసరావు

సెంటు పట్టా భూముల్లో మౌలిక వసతుల బాధ్యత పూర్తిగా గృహ నిర్మాణ శాఖదే. పురపాలిక పరిధిలో ఉన్నా, దాని బాధ్యతలు ఆ శాఖనే నిర్వహించాల్సి ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్కడ కల్పించాల్సిన మౌలిక వసతులను గుర్తించాం. ఉన్నతాధికారులు దానిపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు. త్వరలోనే వివిధ శాఖల ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పనకు అడుగు ముందుకు పడనుంది.

కాల్వల్లో పూడిక తీత

జి.కొండూరు: నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీత ప్రారంభించింది. పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఆధ్వర్యంలో ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి. కూటమి నాయకులు ప్రత్తిపాటి ఆదాం, వెంకటనారాయణ, రవి, శ్రీనివాసరావు, రహ్మతుల్లా, స్వామి, వీరయ్య, నారాయణ, చింతయ్య తదితరులు పాల్గొని పనులు పర్యవేక్షిస్తున్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో రేపూడి బజార్‌లో బుధవారం సాయంత్రం అందిన సమాచారం మేరకు దాడి చేసిన కోడిపందేలు వేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు సెక్టార్-2 ఎస్సై వి.వెంకట్రావు తెలిపారు. నిందితుల నుంచి రూ.2,820, రెండు కోడిపుంజులు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

నరసాపురం(విస్సన్నపేట): మండలంలోని నరసాపురంలో బుధవారం విజయవాడ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో నాటుసారా విక్రయిస్తున్న అంగోతు శంకర్‌ను అరెస్టు చేసినట్లు తిరువూరు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణమూర్తి తెలిపారు. నిందితుడి వద్ద 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుని తిరువూరు న్యాయస్థానంలో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని, నూజివీడు ఉపకారాగారానికి తరలించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

స్పందించారు.. గుంతలు పూడ్చారు



ఈనాడు కథనానికి స్పందన

మండలంలోని కందులపాడు గంగినేని ఎర్రుపాలెం కేజీవై రహదారి విస్తరణ అభివృద్ధి పనులు గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. సమస్యపై ఈ నెల 9వ తేదీన ఈనాడులో 'వామ్మో మోకాలి లోతు గుంతలు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు, గుత్తేదారులు ఎట్టకేలకు పనులు ప్రారంభించారు. ముందుగా ఇటీవల సంభవించిన వరదలకు కోతకు గురైన గుంతలు ఏర్పడిన ప్రాంతాన్ని సరిచేస్తున్నారు. అనంతరం రహదారి విస్తరణ అభివృద్ధి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**



బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రంగాపురంలోని డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం జిల్లా వైద్యశాఖ అధికారిణి డాక్టర్.సుహాసిని, బాలస్వాహస్త (ఆర్‌బీఎస్‌కె) నోడ్ అధికారిణి డాక్టర్ మాధవిలు తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందజేస్తున్న భోజనశాలను, వసతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆర్‌వో ప్లాంట్‌ను తనిఖీ చేసి నీటి లభ్యతపై ప్రిన్సిపల్ తబితకు సూచనలు, సలహాలు అందజేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలన చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్.సందేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



భోజనశాల పరిశీలిస్తున్న అధికారులు

తెలుగు ఉపాధ్యాయులకు తరగతులు

తిరువూరు, న్యూస్‌టుడే: పదో తరగతి 2024-25 విద్యా సంవత్సరంలో నూరుశాతం ఫలితాల సాధించడమే లక్ష్యంగా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలని తిరువూరు బాలికోన్నత పాఠశాల హెచ్ఎం పి.సత్యనారాయణరాజు సూచించారు. నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల్లో తెలుగు బోధించే 33 మంది ఉపాధ్యాయులకు మారిన పాఠ్యపుస్తకాలపై బుధవారం పునఃశ్చరణ తరగతి నిర్వహించారు. మారిన పాఠ్యపుస్తకాల బ్లూప్రింట్, బోధనలో మెలకువలు, మంచి మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణులు అవ్వడానికి బోధించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈవో శ్యామ్‌సుందరరావు, ఆర్పీలు పాల్గొన్నారు. గురువారం హిందీ బోధించే ఉపాధ్యాయులకు తరగతి నిర్వహిస్తారు.



తిరువూరు బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

మధిర శాఖ కాల్వకు 655 క్యూసెక్కుల సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మధిర బ్రాంచి కెనాల్‌కు బుధవారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 655 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 224 క్యూసెక్కులు చేరగా, దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు 50, పెదకొమిర 20, మధిర 25, నిదానపురం 40 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

పక్షం రోజుల్లో ఫిర్యాదులు పరిష్కరిస్తాం

కొర్లమండ(విస్సన్నపేట), న్యూస్‌టుడే: తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో నిర్వహిస్తున్న గ్రామసభల ద్వారా భూ సంబంధిత సమస్యలపై రైతులు ఇచ్చిన ఫిర్యాదులను పక్షం రోజుల్లో పరిష్కరిస్తామని ఆర్డీవో కె.మాధురి తెలిపారు. కొర్లమండలో బుధవారం జరిగిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. తహసీల్దారు లక్ష్మీకల్యాణి, డివిజనల్ సర్వేయర్ సారంగపాణి, సీనియర్ సహాయకులు కె.రవికుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.



కొర్లమండలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి, పక్కన తహసీల్దార్ లక్ష్మీకళ్యాణి



సబ్బాపాడులో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, అధికారులు

గ్రామ సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు

కొర్లమండ గ్రామసభలో పాల్గొన్న ఆర్డీవో మాధురికి పలువురు రైతులు గ్రామ సచివాలయం సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. సచివాలయం ఊరికి వెలుపల ఉండడంతో సిబ్బంది విధులకు సక్రమంగా రావడం లేదని, రైతులు పని నిమిత్తం వెళ్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. స్పందించిన ఆమె గ్రామ సచివాలయాన్ని తరచూ తనిఖీ చేస్తామన్నారు.

కుమ్మరికుంట్ల(ఎ.కొండూరు): కుమ్మరికుంట్లలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో భూ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని 31 మంది రైతులు అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు బి.ఆశయ్య తెలిపారు. సర్పంచి ఎల్.గీతామహాలక్ష్మి, మండల సర్వేయర్ దుర్గారావు పాల్గొన్నారు.

అనుముల్లంక(గంపలగూడెం): అనుముల్లంకలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో 40 మంది రైతులు అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు వి.రాజకుమారి తెలిపారు. ఆర్ఐ ఎం.వీరభద్రరావు, మండల సర్వేయర్ సాంబశివరావు, వీఆర్వో కనకదుర్గారావు పాల్గొన్నారు.

చిట్టేల(తిరువూరు): చిట్టేల గ్రామసభలో రైతుల 63 అర్జీలు అందాయని తహసీల్దారు కె.లక్ష్మి తెలిపారు. సర్పంచి తమ్మలపల్లి శ్రీనివాసరావు, మండల సర్వేయరు ఎన్.గోపాలకృష్ణ, ఆర్ఐ బి.మోహన్‌రావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం(గ్రామీణం): మూలపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ భూ రీ సర్వే గ్రామసభలో ఎనిమిది మంది రైతులు తమ పొలం సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దాలని తహసీల్దారు వెంకటేశ్వర్లుకు అర్జీలు సమర్పించారు. ఉప తహసీల్దారు సుజాత, సర్వేయర్ భాను, గ్రామకార్యదర్శి అనిల్ కుమార్, రెవెన్యూ అధికారి నరేంద్ర పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే గ్రామసభలను ఉపయోగించుకుని రైతులు తమ భూసమస్యలను పరిష్కారించుకోవాలని తిరువూరు ఆర్డీవో మాధురి అన్నారు. బుధవారం రుద్రవరం గ్రామ సచివాలయం నిర్వహించిన గ్రామసభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ జె.సుశీలదేవి, ఉపసర్పంచి బి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

మైలవరం, న్యూస్‌టుడే: భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సబ్బాపాడులో గ్రామసభ నిర్వహించి, ప్రజల నుంచి 24 దరఖాస్తులు స్వీకరించారు. ఏడీ సర్వే తివిక్రమ్, సర్పంచి శ్రీనివాసరావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జి.కొండూరు: మండలంలోని గుర్రాజుపాలెంలో రెవెన్యూ గ్రామ సభ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులు హాజరై తమ సమస్యలను సిబ్బందికి తెలియజేయగా క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీఆర్వో రాజేష్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాల దొంగను పోలీసులు అరెస్టు చేశారు. సత్తుపల్లిలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసీపీ ఎ.రఘు బుధవారం వివరాలు వెల్లడించారు. పెనుబల్లి మండలంలోని ఉప్పలచెలక సెంటర్‌లో ఎస్సై వెంకటేశ్ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. బంజర్ నుంచి కొత్తగూడెం వైపునకు నంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్న స్కూటీని ఆపారు. విచారించగా తనది ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం కనుమూరుకు చెందిన షేక్ మౌలాలీగా తేలింది. వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించడం కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ నెల 17న రాత్రి పాతకారాయిగూడెంలో ఇంటి ఆరుబయట నిలిపి ఉన్న స్కూటీని దొంగతనం చేసి తరలిస్తున్నట్లుగా దర్యాప్తులో తేలింది. గతంలో తిరువూరు బస్టాండ్‌లో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనాన్ని కూడా దొంగిలించగా ఆయా ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.

తెలుగు మహిళపై దాడి

గంపలగూడె: గోసవీడులో బుధవారం రాత్రి తెలుగు మహిళ గద్దల హర్షితపై దాడి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన 8 మంది వైకాపా వర్గీయులు నాపై అకారణంగా దాడి చేశారని హర్షిత ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బాధితురాలిని కుటుంబీకులు చికిత్స నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మద్యం సీసాల స్వాధీనం

వావిలాల (తిరువూరు) : వావిలాల సమీపంలో బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో తెలంగాణ మద్యం అక్రమంగా తరలిస్తున్న బుచ్చాల హనుమంతరావును అరెస్టు చేసినట్లు సెక్టార్-1ఎస్సై సత్యనారాయణ తెలిపారు. నిందితుడి వద్ద రూ.14,910 విలువైన 111 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తిరస్కరించిన దరఖాస్తులు పరిశీలించండి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వరద బాధితుల పరిహారానికి సంబంధించి తిరస్కరించిన దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని సీపీఎం మండల కార్యదర్శి మహేష్ అన్నారు. కొండపల్లి అంబేడ్కర్ కాలనీ వాసులు తహసీల్దారు వై.వెంకటేశ్వర్లును బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఏసుపాదం, కోటేశ్వరరావు, సోమేష్, లక్ష్మీ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుపై కేంద్రం పునరాలోచించాలి



మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

కొండపల్లి, న్యూస్‌టుడే: వక్ఫ్ బిల్లుపై కేంద్రం పునరాలోచించాలని ముస్లిం మత పెద్దలు కోరారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే వక్ఫ్‌బోర్డు బిల్లుపై కొండపల్లి షాబుఖారీ మసీదు ఆవరణలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన బిల్లులో వక్ఫ్ ఆస్తులకు రక్షణ కరవవుతుందన్నారు. దేశ వ్యాప్తంగా ముస్లింలు దీనిపై పోరాటాలకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆ బిల్లుతో వక్ఫ్ ఆస్తులు ఇతరుల చేతికి వెళ్లే ప్రమాదం ఉందని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికే అనేక ముస్లిం ఆస్తులు ఇతరుల చేతుల్లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అల్తాఫ్ రజాబాబా, ముఫ్తీ సుల్తాన్ రజా, అజ్మీరే సాజిద్ హుస్సేన్, సలాహుద్దీన్, షాహీద్ రజా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గండ్రాయి జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ శిక్షకుడు వై.గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలంటే విద్యార్థి దశ ఎంతో కీలకమైందని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాకపోకల పునరుద్ధరణ

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద మల్లింపు రోడ్డుకు బుధవారం తెదేపా నాయకుడు బి.నారాయణ ఆధ్వర్యంలో మరమ్మతులు పూర్తి చేయడంతో రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. సోమవారం ఎగువున కురిసిన భారీ వర్షానికి కట్లేరుకు వరద నీరు చేరింది. మంగళవారం మళ్లింపు రోడ్డుపై వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. వరదకు మళ్లింపు రోడ్డుపై మట్టి కొట్టుకుపోయి రాళ్లు బయటపడ్డాయి. మరమ్మతులు చేయడంతో వాహనాలు మళ్లీ రోడ్డుపై తిరుగుతున్నాయి.



మళ్లింపు రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న తెదేపా నాయకులు

గుంతలెక్కువ.. రోడ్డు తక్కువ

భారీ గుంతలతో అత్యంత దుర్భరంగా మారిన ఇబ్రహీంపట్నం ఖిల్లా రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. విజయవాడ -హైదరాబాద్ జాతీయరహదారి నుంచి ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు వరకు ఉన్న ఈ మార్గం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. గడిచిన ఐదేళ్లలో కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఏడాదికేడాది గుంతలు పెద్దవై వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పర్యాటకులు కొండపల్లి ఖిల్లా సందర్శించాలన్నా, ఖిల్లాపై ఉన్న దూరదర్శన్ కేంద్రానికి వెళ్లాలన్నా, రెండు ప్రధాన ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు దాదాపు రెండు వందల కుటుంబాలు నివసించే కాలనీలకు వెళ్లడానికి ఇదే కీలక మార్గం. సామర్థ్యానికి మించి బూడిద చెరువు నుంచి నిత్యం వందలాది బూడిద వాహనాల రాకపోకల సాగించడం మూలానే రోడ్డుకు ఈ దుస్థితికి చేరిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని మరమ్మతులు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నంగ్రామీణం**



దేశానికి రక్షణ కవచం పోలీసులు



విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన కల్పిస్తున్న సీఐ గిరిబాబు

తిరువూరు, న్యూస్‌టుడే: దేశం కోసం, ప్రజల కోసం పోలీసులు నిరంతరం రక్షణ కవచంగా విధులు నిర్వహిస్తారని సీఐ కె.గిరిబాబు తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఠాణాలో బుధవారం గీతమ్స్ విద్యాలయం విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన కల్పించారు. కేసులు నమోదు, నిందితులు అరెస్టు, దస్త్రాలు నిర్వహణ, ఆయుధాలు, 100, 112 నంబర్లకు కాల్ చేయడం, సీసీ కెమేరాల ఉపయోగాల గురించి తెలిపారు. సెక్టార్-2 ఎస్సై వి.వెంకట్రావు, హెడ్ కానిస్టేబుల్ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఈ-పంట భౌతిక రశీదులు

తిరువూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఈ-పంట నమోదు రశీదులను రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏల వద్ద తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పిట్టల పద్మ రైతులకు సూచించారు. మండలంలో చౌటపల్లిలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులతో కలిసి వరిలో కంకులను పరిశీలించారు. వరిలో గింజలు పాలు పోసుకునే దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

భరోసా.. ఇక హైలెస్సా

కూటమి ప్రభుత్వ హామీతో రహదారి అభివృద్ధి పనులు

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే:

ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని దొనబండ కీసర రహదారి అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ఐదేళ్లుగా ఈ మార్గం అడుగడుగునా గుంతలు పడి దారుణంగా తయారైంది. చిలుకూరు, దాములూరు, కొత్తపేట, ఆత్కురులతో పాటు మరో నాలుగు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ఈ రహదారి నుంచే ప్రయాణాలు సాగిస్తుంటారు. దొనబండ నుంచి కీసర వరకు 14 కిమీ మేర ఎక్కడికక్కడే గోతులు పడి కోతకు గురవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పనులు ప్రారంభమయ్యాయి...

వర్షాకాలంలో రహదారిలోని ఏనుగుగడ్డ వాగుపై ఉన్న లోలెవల్ వంతెనల వద్ద వాగు వరద వంతెనపై ఐదారు అడుగులు నిలిచి రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయేవి. అధికారులు చర్యలు చేపట్టి గుంతలు పూడ్చించి రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని ఈనాడులో పదే పదే కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రయాణికులు కూడా ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ప్రభుత్వవర్గాల నుంచి వచ్చిన హామీ, భరోసాలతో గుత్తేదారుడు పనులు ప్రారంభించారు.



ముమ్మరంగా జరుగుతున్న దొనబండ కీసర రహదారి పనులు

నాడు ఒక్క రూపాయి ఇవ్వలేదు..

గతంలోనే దెబ్బతిన రహదారి ఇటీవల వర్షాలకు మరింత దుస్థితికి చేరింది. వైకాపా ప్రభుత్వంలోనే రోడ్డు అభివృద్ధికి రూ.13 కోట్లు మంజూరు చేసింది. అయితే పనులు చేసినా బిల్లులు సకాలంలో మంజూరు కావనే ఉద్దేశంతో గుత్తేదారుడు ముందుకు రాలేదు. రహదారి అభివృద్ధి పనులతోపాటు ఏనుగుగడ్డ వాగుపై ఉన్న లోలెవల్ వంతెనలను హైలెవల్‌గా అభివృద్ధి చేయాలని చిలుకూరు సర్పంచి సురేష్ విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు పునశ్చరణ తరగతులు

గవర్నర్‌పేట: ఎన్టీఆర్ జిల్లాలో 10వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు పునశ్చరణ తరగతులను ఉపయోగించి రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి 30 వరకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు పునశ్చరణ తరగతులను గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూల్లో బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని ప్రారంభించిన యు.వి.సుబ్బారావు మాట్లాడుతూ సబ్జెక్టుల వారీగా జరిగే ఈ తరగతులను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా నిర్వహించే ఈ తరగతులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్లుగా తీసుకున్నామన్నారు. తొలి రోజు తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వగా దాదాపు 90 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో నార్త్ ఎంఈఓ వెంకటేశ్వర్లు, సీవీఆర్ స్కూలు ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, నాగరాజు, శైలజ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాతరాజరాజేశ్వరీపేట నివాసితుల ఆందోళన

ఎవరి ఇళ్లూ కూల్చరని ఎంపీ హామీ

చిట్టినగర్, న్యూస్‌టుడే: 56వ డివిజన్ పాత రాజరాజేశ్వరీపేటలో నాలుగు దశాబ్దాలకు పైగా తాము నివాసం ఉంటున్నామని, తమ ఇళ్లను రైల్వే అధికారులు తొలగించకుండా చూడాలంటూ బాధితులు బుధవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ప్రభుత్వం ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ 5వ రోజూ స్థానికులు నిరసన కొనసాగించారు. కార్యక్రమంలో కుర్షీదా, షాహీన్, పాండు, అఫ్సర్, శ్రీనివాసరావు, మున్నీ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి ఆర్ఆర్‌పేట వాసుల నిరసన



బాధితులతో మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్

ఎన్డీఏ ప్రభుత్వంలో అన్యాయం జరగదు..

ఎన్డీయే ప్రభుత్వంలో ఎవరికీ అన్యాయం జరగదని పాత రాజరాజేశ్వరీపేట రైల్వే స్థలాల్లో నివాసితులకు ఎంపీ కేశినేని శివనాథ్ అభయం ఇచ్చారు. బుధవారం సాయంత్రం ర్యాంపు రోడ్డులోని నిరసన శిబిరానికి ఎంపీ వచ్చి నిరసన తెలుపుతున్న స్థానికులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యకు ముందుగా తాత్కాలిక పరిష్కారం చూద్దామన్నారు. అనంతరం శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని, ఎవరి ఇళ్లు కూల్చరని చెప్పారు.

ఎంతకష్టం వచ్చిందో..!





ద్విచక్రవాహనదారుడి పాట్లు

విజయవాడ పశ్చిమ బైపాస్‌పై వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా గొల్లపూడి వద్ద రహదారిని గుత్తేదారు సంస్థ సిబ్బంది లోతుగా తవ్వడంతో ఆ గుంతలను కష్టంగా దాటుకుంటూ వెళ్తున్నారు. చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. బైపాస్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనచోదకులు ఇబ్బందుల గురవుతున్నారు. బైపాస్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేస్తే నున్న, గన్నవరం, హనుమాన్‌జంక్షన్ తదితర ప్రాంతాలకు సులభంగా వెళ్లవచ్చని వేగంగా పనులు పూర్తి చేయాలని వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, గొల్లపూడి

బ్యాలెట్‌తోనే ఎన్నికలు నిర్వహించాలి

మాజీ ఎంపీ డాక్టర్ చింతా మోహన్

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్న చోట భాజపా ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తోందని మాజీ ఎంపీ డాక్టర్ చింతా మోహన్ ఆరోపించారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం నిలబడాలంటే బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బుధవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ బాగా నష్టపోయిందన్నారు. ప్రస్తుతం బడ్జెట్ ప్రవేశపెట్టే పరిస్థితులు లేకపోవడం విచారకరమన్నారు. పోలవరం ప్రాజెక్టు మరో పదేళ్ల వరకు పూర్తి కాదని, గతంలో ముఖ్యమంత్రుల వద్ద పని చేసిన ఒక అధికారి కలిసి ఈ విషయాన్ని ప్రస్తావించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు కట్టే సామర్థ్యం ఇక్కడి కాంట్రాక్టర్లకు లేదని, ఒకవేళ కట్టినా అది కూలిపోతుందని చెప్పారన్నారు. ఈ ప్రాజెక్టును కట్టే సామర్థ్యం ఉన్న కంపెనీలు ప్రపంచంలో మూడే ఉన్నాయని అవి చైనా, అమెరికా, జర్మనీలో ఉన్నట్లు ఆయన చెప్పినట్లు తెలిపారు. రాజధాని అమరావతి పూర్తి కావాలంటే మరో పదేళ్లు పడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు చూసినా అమరావతి, పోలవరం అంటున్నారని మొన్న లడ్డూ, నేడు డ్రోన్ ఇలా నెలకో అంశాన్ని తెరపైకి తెచ్చి ఉత్సాహంగా గడుపుతున్నారని విమర్శించారు. కేంద్రం స్వప్రయోజనాల కోసం దళితులను మాల, మాదిగలుగా విడగొట్టారన్నారు. హరియాణాలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ఈవీఎంల ట్యాంపరింగేనని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఆయన కోరారు.

అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న ఉచిత ఇసుక

తిరువూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేసిన ఉచిత ఇసుక విధానం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. అసలైన వినియోగదారులకు అందకుండానే దోపిడీదారుల పాలవుతోంది. తిరువూరు మండలం చింతలపాడు-గానుగపాడు మధ్య ఉన్న వాగులో ఇసుకను రెండు రోజులుగా వందల సంఖ్యలో ట్రాక్టర్లలో అక్రమంగా తరలించుకుపోతున్నారు. భవన నిర్మాణ కార్మికులు, చేతి వృత్తిదారులకు ఉపాధి కల్పించే ధ్యేయంతో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుండగా ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే కట్టడాలు, నిర్మాణాలకు ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. అయితే ఉచిత ఇసుకను లబ్ధిదారులకు అందించడంలో మార్గదర్శకాలు పూర్తి స్పష్టత లేకపోవడంతో.. ఇసుక మాఫియా రెచ్చిపోతున్నారు.



గానుగపాడు రేవులో ఇసుక కోసం వచ్చిన వందల ట్రాక్టర్లు

ఒక్కో ట్రాక్టరుకు రూ.3 వేలుంట: రహదారి పనులకు చెందిన దండు వందలాది ఇసుక ట్రాక్టర్లు కట్ల ముందు వెళుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మరోవైపు గానుగపాడు రేవులో ఇసుక తోడుతున్న ప్రదేశానికి దగ్గరలోనే వంతెన, చెక్ డ్యామ్ ఉంది. ఇసుక ఇలానే తవ్వుతూ పోతే వంతెన పిల్లర్ల పునాదులు కదిలి వరదల సమయంలో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మరోవైపు రేవు నుంచి బయటకు తరలిస్తున్న ఒక్కో ఇసుక ట్రాక్టరుకు రూ.3వేలు, రూ.3500 వరకు విక్రయిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు సిబ్బంది అండ దండలతో కూడా వసూలు చేస్తున్నారని చెప్పుకుంటున్నారు. ఏమైనా అధికారులు పర్యవేక్షణలో ఉచిత ఇసుకను అసలైన వినియోగదారులకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కోనేరు రంగారావు సిఫార్సులు అమలు చేయాలి



మాట్లాడుతున్న సుబ్బారావు, సమావేశమైన ప్రతినిధులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయాలని, భూమి లేని ప్రతి పేద రైతు కుటుంబానికి భూ పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో లోపాలు, తప్పులు, అక్రమాలు జరిగాయని భావిస్తే రెవెన్యూ కార్యాలయాల్లో చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందన్నారు. ఇప్పుడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని గత ప్రభుత్వం రూపొందించిన కొత్త భూమి రికార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచకుండా నిర్వహించే సదస్సుల వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ రీసర్వే పూర్తి చేసి కొత్త రికార్డులను ఇచ్చి కిలోకి తీసుకొచ్చిన గ్రామాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరి వెల్లడించాలని కోరారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ కార్యాలయంలో విచారించే రికార్డ్ ఆఫ్ రైట్స్ యాక్ట్ కేసులన్నింటిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉండే డీఆర్వో బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని దీంతో రెవెన్యూ కేసులు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయని ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.నటరాజ్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయాల్లో ఉండిన చేతిరాత 1బి రికార్డులను ఆయా మండలాలకు పంపాలని కోరారు. సమావేశంలో బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, కార్యదర్శి శేఖర్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు కృష్ణా వర్సిటీ జట్టు



ఎంపికైన క్రీడాకారులతో కమిటీ సభ్యులు

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల పురుషుల బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే కృష్ణా వర్సిటీ జట్టును ఎంపిక కమిటీ చైర్మన్ ఎం.రవిశంకర్ బుధవారం వెల్లడించారు. జట్టులో పీబీ సిద్ధార్థ కళాశాలకు చెందిన ప్రహన్‌కుమార్, వై.నాగకల్యాణ్, ఎస్.పోతురాజు, ఎ. ఈశ్వర్‌సాయి, కానూరు ఎస్వీడీ న్యాయ కళాశాలకు చెందిన టీఆర్ఎన్‌వీ సాయికృష్ణ, పవిత్ర డిగ్రీ కళాశాలకు చెందిన బి.చిద్విరాయ్, నున్న వికాస్ వ్యాయామ విద్య కళాశాలకు చెందిన కె.విజయ విహారి స్థానం సాధించారని ఆయన తెలిపారు.

ఉత్సాహంగా వర్సిటీ కబడ్డీ టోర్నీ ప్రారంభం



కబడ్డీ కోర్టును ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక ఎస్సార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలను బుధవారం కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి ప్రారంభించారు. అనంతరం టోర్నీలో పాల్గొన్న పలు జట్ల క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకున్నారు. 11 జట్లు తలపడగా.. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో ప్రారంభించామని టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి, కళాశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి డి.యుగంధర్ తెలిపారు. తొలి రోజు ఆటలు ముగిసే సమయానికి ఆతిథ్య ఎస్సార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల, ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల (ఉయ్యూరు)జట్లు లీగ్ దశలో ప్రవేశించాయి. డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మైలవరం), పీబీ సిద్ధార్థ కళాశాల జట్ల మధ్య లీగ్ ప్రవేశ మ్యాచ్ జరుగనుంది. లీగ్‌లో ప్రవేశించిన నాలుగు జట్ల మధ్య గురువారం మ్యాచ్‌లు జరుగుతాయని యుగంధర్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : అయోధ్యనగర్ లోటస్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో సోమవారం అర్ధరాత్రి తరువాత జరిగిన హత్య కేసులో నిందితుడైన సాగి నరసింహరాజును అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. నరసింహరాజు తన స్నేహితుడైన మహమ్మద్ రఫీతో లోటస్‌లోని తన ఫ్లాట్‌లో ఉన్నారు. వారి మధ్య వివాదం జరిగి మద్యం మత్తులో తనపై మహమ్మద్ రఫీ కత్తెరతో దాడి చేయబోయాడని టవల్‌తో గొంతు నులమడంతో చనిపోయాడని నరసింహరాజు చెబుతున్నారు. పోలీసులు నిందితుడిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. 14 రోజుల రిమాండ్ విధించగా జిల్లా జైలుకు తరలించారు.



వంకాయలు-40, టమాటా-38/42, బెండ-44, పచ్చిమిర్చి-44, కాకర-38, బీర-40, క్యాలీ ఫ్లవర్-30/35, క్యాబేజి-32, క్యారెట్-48, దొండ-30, బంగాళదుంప-38, ఉల్లిపాయలు-48, గోరు చిక్కుళ్లు-32, దోస-36, సొర-20/25, పొట్ల-20/25, అరటికాయ-5/6, చామదుంప-36, అల్లం-70/140, మునగ-7/8, ఆకు కూరలు (కట్ట)-4, కంద-56, బీట్ రూట్-34, కీరదోస-32, బీన్స్-130, క్యాప్సికమ్-75, నిమ్మ (డజను)-32/40, కొత్తిమీర కట్ట-20/10, పుదీనా-5/20, ముల్లంగి-8, పచ్చిమామిడి-14/15 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, (విజయవాడ)**

అంతర పంటతో ప్రయోజనాలు మెండు

కంచికచర్ల, వీరులపాడు, న్యూస్‌టుడే

రైతేరాజు



తోటలో కలుపు మొక్కలు ఏరుతున్న రైతు రాజశేఖర్

విభిన్న పద్ధతులు ఆచరిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకుంటున్నారు వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన రైతు వెంపటి రాజశేఖర్. 4 ఎకరాల పొలంలో మామిడి, జామ మొక్కలు నాటిన అతను పంట కాలం వృథా కాకుండా... ఖరీఫ్ సీజన్‌లో సాళ్ల మధ్య పెసర పైరు వేశారు. వరదల కారణంగా కొంత పంట నష్టపోయినప్పటికీ నిరాశ చెందలేదు.

పెసర కోత అనంతరం పండ్ల మొక్కల మధ్యలో కూరగాయలు సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకు పొలాన్ని సిద్ధం చేసి మొక్కల మధ్య ఖాళీల్లో టమాటా మొక్కలు నాటారు. నాలుగెకరాల పండ్ల తోటలో టమాట సుమారు ఒక ఎకరాలో పండిస్తున్నారు. టమాటా సాగు చేయడానికి అతను ప్రత్యేకంగా ఖర్చు పెట్టింది కేవలం రూ.15 వేలు మాత్రమే.

పెట్టుబడి తక్కువ..

టమాట ఎత్తు పెరిగిన తరువాత సాళ్ల మధ్యలోని ఖాళీ స్థలంలో ఇతర కాయగూరల సాగు చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. పండ్ల తోటలో అంతర పంటల వల్ల సాగు ఖర్చు సగానికి సగం తగ్గుతుందని ఆయన వివరించారు. పండ్ల మొక్కలకు పురుగు, చీడపీడలు ఆశించకుండా వాడే రసాయనాలే కాయగూరల మొక్కలకు సరిపోతాయని, వాటికి ప్రత్యేకంగా పిచికారీ చేసే పని ఉండదని చెబుతున్నారు. పండ్ల మొక్కలకు అందించే నీరే కాయగూరలకు సరిపోతుందని, వాటికి వేసిన ఎరువులే కాయగూరలకు పనికి వస్తాయని వివరించారు. పెట్టుబడి తక్కువ దిగుబడి అధికంగా వస్తుందని చెప్పారు. అంతర పంటలను ప్రతి సీజన్‌కు మార్చి మార్చి వేయడం ద్వారా పండ్ల తోటల్లో వచ్చే చీడపీడలకు కూడా అడ్డుకట్ట వేయవచ్చని వివరించారు. ఒకే పంట కాలంలో విభిన్న పంటలు సాగు చేస్తూ సహచర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న: వంగ పంటకు అనువైన నేలలు, విత్తే కాలం, విత్తన మోతాదు గురించి వివరించండి?

– ఎన్.రంగారావు, రైతు, మల్లంపల్లి

సమాధానం: వంగ ఉష్ణ మండల పంట. నీటి ఎద్దడి తట్టుకోగలదు. సారవంతమైన, మురుగు నీరు పోయే అన్ని రకాల నేలలు సాగుకు అనుకూలం. నేల ఉదజని సూచిక 5.5-6.5 మధ్య ఉంటే మేలు. ఏడాది పొడవునా పండించవచ్చు. అక్టోబరు, నవంబరు నెలలైతే మరింత అనుకూలం. ఎకరానికి సూటి రకాలైతే 260 గ్రా., సంకర రకాలైతే 124 గ్రాముల విత్తనం సరిపోతుంది. నారుమడిలో విత్తు వేసి దాదాపు 30-35 రోజుల వయసు గల మొక్కలను ప్రధాన పొలంలో నాటుకోవాలి. గుబురు రకాలైతే 50×50 సెం.మీ. ఎడంతో నాటుకోవాలి.

– వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం

- న్యూస్‌టుడే, ఘంటసాల

మినుముకు ఆశించే పురుగులు.. నివారణ

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే



మారుకా మచ్చల పురుగు

ప్రస్తుతం కొందరు రైతులు మినుము పంట సాగు చేస్తున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల్లో పైరుకు ఆశిస్తున్న పురుగులు, నివారణ చర్యల గురించి ఏవో నాగేశ్వరరావు వివరించారు.

మారుకా మచ్చల పురుగు: ఇది పైరుకు ఆశిస్తే మొగ్గ, పూత, పిందె దశల్లో ఆకులను జల్లెడలా చేసి నష్టం పరుస్తుంది. పూత దశలో పూలను గూడుగా చేసి లోపల పదార్థాన్ని తింటుంది. కాయలు తయారయ్యేటప్పుడు రంధ్రం చేసి లోపల గింజ తిని నష్టం కలుగజేస్తుంది. **నివారణ:** పురుగు ఉధృతి అధికంగా ఉంటే స్పైనసాడ్ 0.3 మి.లీ., లేదంటే ఎమామెక్టినబెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రైనాక్సిపైర్ 0.3 మి.లీ., ఫ్లూబెండమైడ్ 0.2 మి.గ్రా. లీటరు నీటిలో కలిపి చల్లటి వేళ పైరు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

కాండపు ఈగ: ఇది కాండంలో చేరి తినడం వల్ల మొక్క ఎండిపోతుంది. ఎక్కువగా తొలకరి పైరుపై ఆశిస్తుంది.

నివారణ: ఎసిఫేట్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఆకుపచ్చ తెగులు: ఈ తెగులు సోకిన ఆకులపై చిన్న గుండ్రని గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. అనుకూల వాతావరణంలో వలయాకారంగా మారి ఆకులు ఎండి రాలిపోతాయి. **నివారణ:** లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా కాపరాక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

తుపాను వేళ.. పశు సంరక్షణ ఇలా..

కంకిపాడు, న్యూస్‌టుడే

రానున్న రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో భారీ వర్షాలు పడి... వరద ముంచుకొస్తే పశు సంరక్షణకు పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పశువైద్యాధికారి కె.మాధవరావు వివరించారు.

విపత్తుకు ముందు... విపత్తు ప్రాంతంలో తాము ఉన్నదీ.. లేనిదీ నిర్ధారించుకోవాలి. అధికారుల సూచనల మేరకు అప్రమత్తం కావాలి. పశువును వరద ప్రాంతానికి దూరంగా ఉంచాలి. తాళ్లు, దాణా, పచ్చి/ఎండు గడ్డి, ప్రాథమిక చికిత్స ఔషధాలు, బీమా పత్రాలు, బకెట్లు, టార్చ్‌లైట్, దుప్పట్లు తదితరాలతో కూడిన విపత్తు పెట్టె సిద్ధం చేసుకోవాలి. వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. పశువులు తప్పిపోకుండా చెవిపోగు వేయించాలి. గాలికి ఊడిపడే వస్తువులు, మండే స్వభావం ఉన్న పదార్థాలను పాక చుట్టుపక్కల ఉంచకూడదు.

వర్షాలు పడినప్పుడు.. పశువులు ఒత్తిడితో బెదరకుండా చూడాలి. శుభ్రమైన నీరు అందుబాటులో ఉంచాలి. నలతగా ఉన్నా, జబ్బు పడినా వెంటనే పశువైద్యశాలకు తోలుకెళ్లాలి. దాణా, మేత పొదుపుగా వాడాలి. అన్ని పశువులను ఒకేచోట ఉంచరాదు. పశువు మృతి చెందితే దూరంగా గుంత తీసి పూడ్చాలి. జబ్బవాపు, గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి.



సాధారణ స్థితి వచ్చాక.. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేదాకా పోషణపై శ్రద్ధ అవసరం. శుభ్రమైన నీరు అందుబాటులో ఉంచాలి. మురికి నీరు తాగకుండా జాగ్రత్త పడాలి. ముంపునకు గురైన పాక ఆరబెట్టాలి. వైద్య పరీక్షలు చేయించాలి. పశువులు, షెడ్డుకు జరిగిన నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. పశువు మృతి చెందితే బీమా కోసం దరఖాస్తు చేయాలి.

దారి దాటాలంటే హడల్!

రామవరప్పాడు రింగ్ వద్ద నిత్యం ప్రమాదాలు

గత నెల 15న పాత రాజీవ్‌నగర్‌కు చెందిన లింగమనేని ప్రభు కుమార్ తల్లి కృష్ణ కుమారితో పాటు గుణదలలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. రామవరప్పాడు రింగ్ నుంచి గుణదల రోడ్డు వైపునకు తిరుగుతుండగా బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన తల్లీ కుమారులు అక్కడికక్కడే మృతి చెందారు.

ఈ ఏడాది జూన్ 21న రామవరప్పాడుకు చెందిన మత్తి మురళీ కుమారుడు దుర్గ ప్రసాద్‌ను ద్విచక్ర వాహనంపై సిద్దార్థ మెడికల్ కళాశాల మైదానానికి క్రికెట్ కోచింగ్ తీసుకు వెళ్తున్నాడు. రామవరప్పాడు రింగ్ నుంచి గుణదల రోడ్డు వైపునకు తిరుగుతుండగా.. ఓ లారీ వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రి కొడుకులు ఇద్దరు కింద పడిపోగా, కుమారుడిపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, న్యూస్‌టుడే

విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు రింగ్ వద్ద నిత్యం ప్రమాదాలతో ప్రజలు ప్రాణాలు హరిస్తూ రాకాసి జంక్షన్‌గా మారింది. వాహనదారులు దీన్ని దాటాలంటేనే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. దీని గుండా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

ప్రమాదానికి కారణాలేంటి..

గన్నవరం వైపు నుంచి బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే వాహనాలు రామవరప్పాడు రింగ్ వద్ద ఆగకుండా వెళ్లేందుకు పోలీసు అధికారులు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా వెళ్లే వాహనాలు రామవరప్పాడు రింగ్ సిగ్నల్స్‌తో సంబంధం లేకుండా వెళ్లిపోవడంతో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందనేది పోలీసుల ఆలోచన. కానీ ఫ్రీ లెఫ్ట్‌ను తక్కువ వెడల్పుతో ఏర్పాటు చేశారు.

ఇలా చేస్తే మేలు

●● బెంజ్ సర్కిల్ వైపు వాహనాలు వెళ్లేందుకు రామవరప్పాడు రింగ్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్రీ లెఫ్ట్ మార్గం వెడల్పు పెంచాలి. బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే భారీ వాహనాలు కచ్చితంగా ఫ్రీ లెఫ్ట్ నుంచే వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

●● సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందిని కేటాయించాలి. గుణదల వైపు వెళ్లే వాహనాలు మాత్రమే సాధారణ మార్గంలో వెళ్లేలా చూస్తే ఈ జంక్షన్ వద్ద ప్రమాదాలు దాదాపుగా నివారించవచ్చు.



ఫ్రీ లెఫ్ట్ వెడల్పు తక్కువగా ఉండడంతో నేరుగానే బెంజ్ సర్కిల్ వైపు వెళ్తున్న భారీ వాహనాలు

దీంతో భారీ వాహనాలు దీని నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే భారీ వాహనాలతో మిగిలిన వాహనాలు కూడా ఫ్రీ లెఫ్ట్‌లో కాకుండా సాధారణ మార్గంలోనే వాహనాలు వెళ్తున్నాయి. గుణదల రోడ్డులోకి వెళ్లే వాహనాలు రామవరప్పాడు రింగ్ వద్ద మీదుగా వెళ్తుంటారు. బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే భారీ వాహనాలు, గుణదల వైపు వెళ్లే వాహనాలు ఒకేసారి వదలడంతో ఆ వాహనాల పక్కన నుంచి ద్విచక్ర వాహనాలు గుణదల రోడ్డులోకి తిరుగుతున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 8 మంది ఇదే తరహా ప్రమాదంలో ఈ జంక్షన్ వద్ద మృతి చెందారు. అయినప్పటికీ అధికారులు నివారణ చర్యలపై దృష్టి సారించలేదు.

చంద్రబాబు దార్శనికతతో డ్రోన్ హాక్‌థాన్‌లో రికార్డులు

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు శివనాథ్(చిన్ని), సీఎం రమేష్, ఎమ్మెల్యేలు సత్యనారాయణ, విజయకుమార్‌లకు చిత్రపటం ఇస్తున్న అధికారులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత వల్లే డ్రోన్ హాక్‌థాన్‌లో ఐదు గిన్నిస్ రికార్డులు నమోదు అయ్యాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఇంద్రకీలాద్రిపై జగన్మాత దుర్గమ్మను ఎంపీలు కేశినేని శివనాథ్, సీఎం రమేష్‌లతో కలిసి ఆయన బుధవారం దర్శించుకున్నారు. అనంతరం మంత్రి, ఎంపీలు మాట్లాడుతూ జగన్మాత దుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డ్రోన్ సమ్మిట్ విజయవంతం అయ్యిందన్నారు. అంతకముందు దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వారికి వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. వారి వెంట మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా దేశాభివృద్ధి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న భాజపా నాయకులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా దేశాన్ని మరింత అభివృద్ధి పథం దిశగా అంకిత, సేవా భావంతో పని చేయనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దిల్లీ నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న కేంద్రమంత్రికి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, భాజపా సీనియర్ నేతలు సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు బుధవారం ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నేతృత్వంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత వంద రోజుల్లో అనేక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. పేదలకు సంబంధించిన సంక్షేమ పథకాల అమలు, ప్రపంచంలోని దేశాల మధ్య సయోధ్య కుదిర్చే విషయంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు.

29 నుంచి వైద్య మిత్రల సమ్మె

గాంధీనగర్, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారం కోరుతూ వైద్య మిత్రలు ఈ నెల 29వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నారని ఏపీ గ్రామ, సచివాలయ ఏఎన్ఎం హెల్త్ సెక్రటరీస్ ఆదర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తెలిపారు. బుధవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ వైద్య మిత్రలు 17ఏళ్లుగా క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని కోరారు. అంగన్‌వాడీ సమస్యలపై ముఖ్యమంత్రిని కలసి వినతిపత్రం ఇచ్చామని, ఇంత వరకు పరిష్కారం కాలేదన్నారు. మధ్యాహ్న భోజనం, ఆశా కార్మికుల సమస్యలు కూడా పరిష్కరించలేదన్నారు. ఆ రోజు జరిగే సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొంటాయని తెలిపారు. ఇసుక అవకతవకలపై నవంబరు 11న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

బ్యారేజీ 40 గేట్లు మూసివేత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద బుధవారం వరద ప్రవాహం మరింత తగ్గు ముఖం పట్టింది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 81,330 క్యూసెక్కుల నీరు రాగా, సాయంత్రం 6 గంటలకు 25,350 క్యూసెక్కులకు తగ్గింది. 30 గేట్లను అడుగు మేర ఎత్తారు. మిగతా 40 గేట్లు మూసివేశారు. సముద్రంలోకి 21,750, పంట కాల్వలకు 12,831 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పులిచింతల నుంచి 18,999, మునేరు (కీసర) నుంచి 5,989, పాలేరు నుంచి 362 క్యూసెక్కుల మేర వస్తోంది.

కాల్వలకు నీటి విడుదల పెంపు..

ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు నీటి విడుదలను పెంచారు. మొత్తం 12,831 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 7,822, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,009 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 4,188, ఏలూరు కాల్వకు 1,302, కేఈబీ కాల్వకు 1,102, బందరు కాల్వకు 1,300 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

దరఖాస్తుల గడువు 25 వరకు పొడిగింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు కొనసాగే శిక్షణ కోసం దరఖాస్తుల దాఖలు గడువును ఈ నెల 21 నుంచి 25 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అభ్యర్థులు http:///jnanabhumi.ap.gov.in (జ్ఞానభూమి) ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

కేడీసీఏ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం




ఏసీఏ అధ్యక్షుడు శివనాథ్‌తో కార్యవర్గ సభ్యులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా క్రికెట్ సంఘం (కేడీసీఏ) నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.వెంకట రత్నం బుధవారం ప్రకటించారు. కేడీసీఏలోని ఆరు పోస్టులకు నామినేషన్లు స్వీకరించారు. ఈ నెల 7న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఒక్కో పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ అర్హత పొందడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఆయన తెలిపారు. కేడీసీఏ నూతన అధ్యక్షుడిగా పొట్లూరి శ్రీనివాస్‌చౌదరి, ఉపాధ్యక్షుడిగా బండారు శ్రీనివాసరావు, కార్యదర్శిగా మేడసాని రవీంద్రచౌదరి, సంయుక్త కార్యదర్శిగా వెల్లమర్తి రజనీకాంత్, కోశాధికారిగా మొహమ్మద్ సాధిక్, కౌన్సిలర్‌గా పఠాన్ బాజీ షరీఫ్‌ఖాన్ ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు.... ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్‌ని నగరంలోని ఆయన కార్యాలయంలో కలిశారు. వారిని ఆయన అభినందించారు.

29న సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రమే అర్హులని చెప్పారు. ఆసక్తిగల ఉద్యోగులు ఆధార్‌కార్డు, గుర్తింపు కార్డు, హోదా, కార్యాలయ అధికారి ధ్రువీకరణతో 29న ఉదయం 8 గంటలకు ఐజీఎంసీ స్టేడియంలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 98662 45746 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

సీఎం సహాయ నిధికి విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కృష్ణారావు, రామకృష్ణారెడ్డి తదితరులు

పటమట, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల విరాళం అందించారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్ అందజేశారు. అసోసియేషన్‌లోని 3 వేల మందికిపైగా సభ్యులు తమ ఒకటిన్నర రోజుల పింఛను సీఎం సహాయనిధికి అందజేశారని చంద్రబాబుకు వివరించారు. సీఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు. సంఘం సలహాదారు ఎస్.వి.కృష్ణారావు, అధ్యక్షుడు ఎం.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.ఆర్.కె.రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా కమిటీ ఎన్నికలు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం జరిగాయి. ఎన్నికల్లో విజయవాడ, మచిలీపట్నం టీచింగ్, డెంటల్, ఆయుర్వేద, ఈఎస్ఐ, పీహెచ్‌సీల్లో శాశ్వత నర్సులుగా విధులు నిర్వహిస్తున్న వారు పాల్గొన్నారు. నర్సుల సంఘం అధ్యక్షురాలిగా షేక్ షమీవుల్ బేగం, ఉపాధ్యక్షురాలిగా ఇందిరా దేవి, కార్యదర్శిగా వేల్పుల జ్యోతి, కోశాధికారిగా కె.శివలీల.. మరో ఐదు మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు ప్రతి మూడేళ్లకోసారి జరుగుతాయని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎ.ధర్మారావు తెలిపారు.

పార్కుల్లో వాకింగ్ ట్రాకులు పెంచాలి

ఈనాడు డిజిటల్, అమరావతి: పట్టణ, నగర ప్రాంతాల్లోని ప్రజల సౌకర్యార్థం పార్కుల్లో నడక దారులను పెంచాలని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్(ఏపీసీసీఐఎఫ్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబుకు ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఉదయం పూట నడకకు సరైన ప్రదేశాలు లేకపోవడంతో ఎక్కువ మంది రోడ్లపైకి వస్తున్నారని.. దీంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు కుక్కల బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. విద్యాసంస్థల ఆట స్థలాలలో ప్రజలకు ఉదయం, సాయంత్రం నడక, వ్యాయామాలు చేసుకునేందుకు కొంత సమయం వరకు వీలు కల్పించేలా ప్రభుత్వం జీవో జారీచేయాలని కోరారు.

ఛాంపియన్



బెంగళూరు ఫలితం ఏమాత్రం ఊహించనిదే. సొంతగడ్డపై ఆడుతున్నా.. ఫేవరెట్‌గా బరిలోకి దిగినా.. సూపర్ ఫామ్‌లో ఉన్నా.. ఎన్నో ఇబ్బందులతో సిరీస్‌కు వచ్చిన న్యూజిలాండ్ చేతిలో పరాజయం టీమ్‌ఇండియాకు పెద్ద షాక్. అంచనాలన్నీ తలకిందులైన వేళ సిరీస్‌లో అనూహ్యంగా వెనుకబడ్డ రోహిత్‌సేన.. ఇప్పుడు లెక్క సరిచేయాలనే పట్టుదలతో ఉంది. కివీస్‌తో రెండో టెస్టు నేటి నుంచే. ఓటమి నేపథ్యంలో కాస్త ఒత్తిడి ఉన్నా.. భారత్ మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అదే సమయంలో కివీస్ రెట్టించిన విశ్వాసంతో ఉంది. భారత్‌లో తొలిసారి టెస్టు సిరీస్ నెగ్గాలనే లక్ష్యంతో పోరుకు సిద్ధమైంది. అయితే బెంగళూరులో ఆ జట్టు పేసర్లకు లభించిన సహకారం పుణెలో లభించదు. భారత స్పిన్నర్లు కీలక పాత్ర పోషించే అవకాశముంది.

ఉదయం 9.30 నుంచి



లెక్క సరిచేయాలని..

- పట్టుదలతో టీమ్‌ఇండియా
- న్యూజిలాండ్‌తో రెండో టెస్టు నేటి నుంచే

పుణె

లెక్క సరిచేయాలనే పట్టుదలతో భారత్.. సిరీస్‌పై ఆశలతో కివీస్. పుణెలో రసవత్తర సమరానికి వేళైంది. రెండు జట్ల మధ్య గురువారం నుంచే రెండో టెస్టు. బెంగళూరులో తొలి ఇన్నింగ్స్‌లో 46కే కుప్పకూలిన రోహిత్ బృందం.. రెండో ఇన్నింగ్స్‌లో పోరాడినప్పటికీ మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయిన సంగతి తెలిసిందే. చాలా ఏళ్ల తర్వాత భారత్‌లో సాధించిన ఆ విజయం కివీస్ విశ్వాసాన్ని పెంచింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌పై కన్నేసిన భారత్‌కు.. ఆస్ట్రేలియా పర్యటనకు ముందు మిగిలిన ఈ రెండు టెస్టుల్లో నెగ్గడం చాలా ముఖ్యం. సొంతగడ్డపై భారత్ 0-1తో వెనుకబడడం అరుదు. 2017లో ఆస్ట్రేలియాపై, 2021లో ఇంగ్లాండ్‌పై ఇలాగే వెనుకబడ్డా.. బలంగా పుంజుకుని సిరీస్‌ను గెలుచుకుంది. కానీ అవి నాలుగు టెస్టుల సిరీస్‌లు. ఈ తరం భారత ఆటగాళ్లు.. ప్రస్తుతం కివీస్‌తో సిరీస్‌లో ఉన్న స్థితిలో ఎప్పుడూ లేరు. దీంతో వాళ్లపై ఒత్తిడి ఉంటుంది. అయితే తొలి టెస్టులో ఓటమి చవిచూసినా ఈ మ్యాచ్‌లో భారతే ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. పరిస్థితులు అనూహ్యంగా కలిసి రావడంతో బెంగళూరులో పైచేయి సాధించిన కివీస్.. ఇక్కడ ఎలా ఆడుతుందో చూడాలి.

వాళ్లు నిలబడితే..: బెంగళూరులో తొలి ఇన్నింగ్స్ భారత్‌కు దిమ్మదిరిగే షాకే. ఆసీస్ పర్యటన నేపథ్యంలో బ్యాటర్లకు అది మేలుకొలుపు. ఏమాత్రం ఊహించని విధంగా పేసర్లకు విపరీతంగా సహకరించిన పిచ్‌పై ఒరోర్క్, హెన్రీ, సౌథీ ధాటికి టీమ్‌ఇండియా బ్యాటర్లు తేలిపోయారు. అయితే మ్యాచ్ చేజారినా అక్కడే మన బ్యాటర్లు పుంజుకోవడం సానుకూలాంశం. యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ సూపర్ బ్యాటింగ్‌తో రెండో ఇన్నింగ్స్‌లో 150 పరుగులతో సత్తా చాటాడు. పునరాగమన హీరో రిషబ్ పంత్ కూడా అదరగొట్టాడు. వీళ్లిద్దరి భాగస్వామ్యం ఓ దశలో భారత్‌లో ఆశలు రేపింది కూడా. మరోవైపు సీనియర్ ఆటగాళ్లు కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి అర్ధశతకాలు సాధించి లయను అందుకున్నట్లు కనిపించారు. కానీ వీరి నుంచి జట్టు భారీ ఇన్నింగ్స్‌లు ఆశిస్తోంది. వీళ్లు నిలబడితే భారత్‌కు తిరుగుండదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ సత్తా చాటాల్సివుంది.

కివీస్ ఉత్సాహంగా..: న్యూజిలాండ్ జట్టు ఇప్పటి వరకు భారత్‌లో సిరీస్ నెగ్గలేదు. ఇప్పుడు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదలతో ఆ జట్టు ఉంది. రచిన్ రవీంద్ర, కాన్వే, విల్ యంగ్‌ల ఫామ్ ఆ జట్టుకు సానుకూలాంశం. అదే సమయంలో మిచెల్, బ్లండెల్, కెప్టెన్ లేథమ్ కూడా రాణించాలని కివీస్ ఆశిస్తోంది. అనుకూలించే పిచ్‌పై భారత స్పిన్నర్లను వీళ్లెలా ఎదుర్కొంటారన్నది ఆ జట్టుకు కీలకం. ఇక బెంగళూరులో బాగా సహకరించిన పిచ్‌పై విజృంభించిన కివీస్ పేసర్లకు పుణెలో భారత్‌ను నిలువరించడం సవాలే. సౌథీ, ఒరోర్క్‌లలో ఒకరిని తప్పించి కివీస్‌కు అదనపు స్పిన్నర్‌ను తీసుకునే అవకాశముంది. శాంట్నర్‌కు అవకాశం దక్కొచ్చు.

తుది జట్లు (అంచనా)...

భారత్: యశస్వి జైస్వాల్, రోహిత్, గిల్, కోహ్లి, పంత్, సర్ఫరాజ్/రాహుల్, జడేజా, అశ్విన్, కుల్‌దీప్ యాదవ్, బుమ్రా, ఆకాశ్‌దీప్/సిరాజ్.

న్యూజిలాండ్: లేథమ్, కాన్వే, విల్ యంగ్, రచిన్ రవీంద్ర, మిచెల్, బ్లండెల్, గ్లెన్ ఫిలిప్స్, శాంట్నర్, సౌథీ/ఒరోర్క్, హెన్రీ, అజాజ్ పటేల్

పిచ్..

బెంగళూరులో ఓటమి నేపథ్యంలో పుణె పిచ్ విషయంలో భారత్ జాగ్రత్త పడింది. ఈ పిచ్‌పై పచ్చిక లేదు. కివీస్ పేసర్లు.. తొలి టెస్టులోలా ప్రభావం చూపే అవకాశం లేదు. మందకొడి పిచ్ నుంచి మ్యాచ్ సాగుతున్నకొద్దీ స్పిన్నర్లకు మరింత సహకారం లభిస్తుంది. మ్యాచ్‌కు ఎలాంటి వర్షం ముప్పు లేదు. అయిదు రోజులూ ఎండ కాస్తుంది.

19 టెస్టు క్రికెట్లో మూడు వేల పరుగుల మైలురాయిని అందుకోవడానికి రాహుల్ చేయాల్సిన పరుగులు.



రాహులా.. సర్ఫరాజా!

మెడపట్టేయడంతో మొదటి టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్ తిరిగి అందుబాటులో రానుండడం భారత్‌కు సంతోషాన్నిచ్చే విషయం. కానీ ఎవరిని తప్పిస్తారన్నదే ఇప్పుడు పెద్ద ప్రశ్న. గిల్ గైర్హాజరీలో అవకాశం దక్కించుకున్న సర్ఫరాజ్ అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకోగా.. సీనియర్ ఆటగాడు కేఎల్ రాహుల్ పేలవ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొన్నాడు. వీరిలో ఒకరికే చోటుంది. రాహుల్‌కు ఎక్కువ అవకాశాలిస్తామని కోచ్ గంభీర్ అన్నప్పటికీ... సర్ఫరాజ్ తన బ్యాటింగ్‌తో తుది జట్టు నుంచి తప్పించలేని పరిస్థితి కల్పించాడు. ఇక పిచ్ నుంచి మంచి టర్న్ లభించనుండడంతో భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఖాయం. అశ్విన్, జడేజా, కుల్‌దీప్ స్పిన్ భారాన్ని పంచుకుంటారు. ఈ త్రయం ఆతిథ్య జట్టుకు పెద్ద బలం. వీరి మాయాజాలానికి నిలవడం కివీస్‌కు పెను సవాలే. ఇక తొలి టెస్టులో అంతగా ఆకట్టుకోలేకపోయిన ఫాస్ట్‌బౌలర్ సిరాజ్ స్థానంలో ఆకాశ్‌దీప్‌ను తీసుకునే అవకాశముంది.

పంత్ ఫిట్

రిషబ్ పంత్ రెండో టెస్టులో ఆడుతున్నాడు. తొలి టెస్టు సందర్భంగా మోకాలి నొప్పితో పంత్ కాస్త ఇబ్బందిపడడంతో.. పుణెలో అతడు బరిలోకి దిగడంపై సందేహాలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. అయితే అతడికెలాంటి సమస్యలూ లేవని కోచ్ గంభీర్ స్పష్టం చేశాడు. పంత్ బాగానే ఉన్నాడా అన్న ప్రశ్నకు అతడు బదులిస్తూ.. "చాలా బాగున్నాడు. గురువారం అతడు వికెట్‌కీపింగ్ చేస్తాడు. అతడికి ఎలాంటి ఫిట్‌నెస్ సమస్యలూ లేవు" అని చెప్పాడు. శుభ్‌మన్ గిల్ కూడా రెండో టెస్టులో ఆడతాడని గంభీర్ చెప్పాడు.

20 ఓవర్లు.. 344 పరుగులు



టీ20ల్లో జింబాబ్వే ప్రపంచ రికార్డు

నైరోబి: బంతి పడితే బాదుడే.. అయితే ఫోర్ లేదంటే సిక్సర్! ఏదో కంప్యూటర్ గేమ్ ఆడినట్లు మైదానంలో జింబాబ్వే బ్యాటర్లు వీర విధ్వంసం సృష్టించారు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా జింబాబ్వే చరిత్ర సృష్టించింది. టీ20 ప్రపంచకప్ ఉప ప్రాంతీయ ఆఫ్రికా క్వాలిఫయర్‌లో భాగంగా బుధవారం గాంబియాతో జింబాబ్వే మ్యాచ్ ఈ ఊచకోతకు సాక్షిగా నిలిచింది. ప్రత్యర్థి అసలే కూన. ఇంకేముంది దొరికిందే అవకాశం అన్నట్లు.. ఆకాశమే హద్దుగా చెలరేగిన జింబాబ్వే 20 ఓవర్లలో 4 వికెట్లకు 344 పరుగులు చేసింది. గతేడాది ఆసియా క్రీడల్లో మంగోలియాపై నేపాల్ (314) నెలకొల్పిన రికార్డును ఇప్పుడు జింబాబ్వే తిరగరాసింది. ఆ జట్టు కెప్టెన్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సికందర్ రజా (133 నాటౌట్; 43 బంతుల్లో 7×4, 15×6) ఎడాపెడా బౌండరీలు బాదేశాడు. టీ20ల్లో శతకం సాధించిన తొలి జింబాబ్వే ఆటగాడిగా నిలిచాడు. అతనితో పాటు మరుమణి (62; 19 బంతుల్లో 9×4, 4×6), క్లైవ్ మదాండె (53 నాటౌట్; 17 బంతుల్లో 3×4, 5×6), బెనెట్ (50; 26 బంతుల్లో 7×4, 1×6) కూడా చెలరేగి జట్టుకు రికార్డు స్కోరు అందించారు. జొబార్టె (0/93) ఓ టీ20 మ్యాచ్‌లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న బౌలర్‌గా చెత్త రికార్డు ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం ఛేదనలో గాంబియా 14.4 ఓవర్లలో 54కే కుప్పకూలడంతో 290 పరుగుల తేడాతో జింబాబ్వే గెలిచింది. ఎంగరవ (3/13), మవుతా (3/10) బంతితో మెరిశారు. టెస్టులు ఆడే దేశాల పరంగానూ టీమ్‌ఇండియా (ఈ నెలలో బంగ్లాదేశ్‌పై 297)ను వెనక్కి నెట్టి అత్యధిక స్కోరు రికార్డును జింబాబ్వే సొంతం చేసుకుంది.



ఎదురులేని భారత్-ఎ

ఒమన్‌పై ఘనవిజయం

అల్ అమెరత్: ఏసీసీ టీ20 వర్ధమాన జట్ల ఆసియా కప్‌లో తిలక్ వర్మ నేతృత్వంలోని భారత్-ఎ గ్రూప్ దశను అజేయంగా ముగించింది. ఇంతకుముందే సెమీఫైనల్‌కు అర్హత సాధించిన ఆ జట్టు గ్రూప్-బిలో తన ఆఖరి మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఒమన్‌పై ఘనవిజయం సాధించింది. బుధవారం మొదట ఒమన్ 5 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. మహ్మద్ నదీమ్ (41; 49 బంతుల్లో 3×4) టాప్ స్కోరర్. రసిఖ్ సలామ్ (1/23), సాయి కిశోర్ (1/21) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఆయుష్ బదోని (51; 27 బంతుల్లో 6×4, 2×6) చెలరేగడంతో లక్ష్యాన్ని భారత్-ఎ 15.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. తిలక్ వర్మ (36 నాటౌట్; 30 బంతుల్లో 1×4, 2×6), అభిషేక్ శర్మ (34; 15 బంతుల్లో 5×4, 1×6) రాణించారు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్. . గ్రూప్-బిలో అగ్రస్థానంలో నిలిచింది. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్-ఎ జట్టును ఢీకొంటుంది.


శ్రీలంకదే వన్డే సిరీస్

రెండో వన్డేలో విండీస్‌పై విజయం

పల్లెకెలె: సొంతగడ్డపై టీ20 సిరీస్‌లో విండీస్‌ను చిత్తుచేసిన శ్రీలంక.. ఇప్పుడు వన్డే సిరీస్‌నూ సొంతం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో వన్డే మిగిలి ఉండగానే 2-0తో దక్కించుకుంది. బుధవారం వర్ష ప్రభావిత రెండో వన్డేలో లంక 5 వికెట్ల తేడాతో గెలిచింది. వర్షం కారణంగా ఇన్నింగ్స్‌ను 44 ఓవర్లకు కుదించి ఈ మ్యాచ్ నిర్వహించారు. మొదట హసరంగ (4/40), అసిత (3/35), తీక్షణ (3/25) ధాటికి విండీస్ 36 ఓవర్లలో 189 పరుగులకే ఆలౌటైంది. ఆ జట్టులో షెఫానె రూథర్‌ఫర్డ్ (80), గుడకేశ్ మోటీ (50 నాటౌట్) మాత్రమే రాణించారు. ఓ దశలో 58/8తో పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును 9వ వికెట్‌కు 119 పరుగులు జోడించి వీళ్లు ఆదుకున్నారు. అనంతరం ఛేదనలో కెప్టెన్ చరిత్ అసలంక (62 నాటౌట్) రాణించడంతో లక్ష్యాన్ని లంక 38.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. మధుష్క (38), సమరవిక్రమ (38) కూడా బ్యాటింగ్‌లో మెరిశారు.

హర్మన్‌కు పరీక్ష

నేడు న్యూజిలాండ్‌తో భారత్ తొలి వన్డే



మధ్యాహ్నం 1.30 నుంచి

అహ్మదాబాద్: బలమైన జట్టుగా మహిళల టీ20 ప్రపంచకప్ బరిలో దిగిన భారత్.. చివరికి ఉసూరుమనిపించింది. సెమీస్ అయినా చేరకుండానే గ్రూప్ దశలోనే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. జట్టు వైఫల్యం నేపథ్యంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై చర్యలుంటాయని, జట్టులో ప్రక్షాళనకు శ్రీకారం చుడతారనే వార్తలొచ్చాయి. కానీ న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తలపడే టీమ్‌ఇండియాకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్‌ను కొనసాగించారు. హర్మన్‌కు పరీక్షగా మారిన ఈ సిరీస్‌లో తొలి వన్డే గురువారం జరుగుతోంది. పొట్టి కప్‌లో విఫలమైన భారత్.. ఇక వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్ దిశగా ఈ సిరీస్‌తోనే తొలి అడుగు వేయబోతోంది. వేర్వేరు కారణాలతో వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్, సీనియర్ ఆల్‌రౌండర్ ఆశ శోభన, పేసర్ పూజ వస్త్రాకర్ ఈ సిరీస్‌కు దూరమవడం హర్మన్‌పై మరింత ఒత్తిడిని పెంచేదే. యువ క్రీడాకారులు, సీనియర్లతో కూడిన జట్టును ఆమె సమర్థంగా నడిపించాల్సిన అవసరముంది. ఓపెనర్లు షెఫాలి, స్మృతి మంధాన రాణించడం జట్టుకు కీలకం. మిడిలార్డర్ బాధ్యతను జెమీమాతో కలిసి హర్మన్ పంచుకోనుంది. మరోవైపు ఇటీవల టీ20 విశ్వవిజేతగా నిలిచిన న్యూజిలాండ్ ఇప్పుడు భారత్‌తో సిరీస్‌లోనూ సత్తాచాటాలనే ఉత్సాహంతో ఉంది. కెప్టెన్ సోఫీ డివైన్, సుజీ బేట్స్, జొనాస్, లియా తహుహు తదితరులు కివీస్‌కు కీలకం కానున్నారు.




కోహ్లీని దాటిన పంత్

దుబాయ్: ఐసీసీ ప్రపంచ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని వికెట్ కీపర్ రిషబ్ పంత్ అధిగమించాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన బ్యాటర్ల జాబితాలో మూడు స్థానాలు మెరుగైన పంత్ ఆరో ర్యాంకు సొంతం చేసుకున్నాడు. ఒక స్థానం కిందకి పడిపోయిన కోహ్లి ఎనిమిదో ర్యాంకు సాధించాడు. ఓపెనర్ యశస్వి జైశ్వాల్ 4, కెప్టెన్ రోహిత్‌శర్మ 15వ స్థానాల్లో నిలిచారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో జస్‌ప్రీత్ బుమ్రా నంబర్‌వన్, రవిచంద్రన్ అశ్విన్ రెండో ర్యాంకులతో కొనసాగుతున్నారు. రవీంద్ర జడేజా ఉమ్మడిగా ఆరో స్థానంలో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా, అశ్విన్ వరుసగా తొలి రెండు ర్యాంకులు కైవసం చేసుకున్నారు.

మోండోట్రాక్ కావాలి: నీరజ్

దిల్లీ: పటియాలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్)లో మోండోట్రాక్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా విజ్ఞప్తి చేశాడు. జాతీయ క్రీడా పరిపాలన ముసాయిదా బిల్లుపై చర్చ సందర్భంగా మోండోట్రాక్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని నీరజ్ కోరాడు. వర్చువల్‌గా ఈ భేటీకి హాజరైన నీరజ్.. మోండోట్రాక్ కోసం 2018-19 నుంచి మాట్లాడుతున్నట్లు తెలిపాడు. ఇప్పుడు అన్ని దేశాల్లో మోండోట్రాక్‌పైనే పోటీలు నిర్వహిస్తున్నారని క్రీడల మంత్రికి దృష్టికి తీసుకొచ్చాడు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో క్రీడాకారుల ప్రదర్శన మెరుగవడానికి, గాయాల ప్రమాదం తగ్గించడానికి మోండోట్రాక్ ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ టోర్నీలు, విదేశాల్లో సాధనకు మోండోట్రాక్‌ను వాడుతున్నారు. ప్రస్తుతం ఎన్ఐఎస్‌లో సంప్రదాయ సింథటిక్ ట్రాక్‌పై క్రీడాకారులు సాధన చేస్తున్నారు.



జర్మనీని ఆపలేక

భారత హాకీ జట్టు ఓటమి

దిల్లీ: 2014 తర్వాత దేశ రాజధానిలో తొలి అంతర్జాతీయ హాకీ మ్యాచ్. భారత జట్టుపై అంచనాలు పెట్టుకున్న అభిమానులు ఎక్కువ సంఖ్యలోనే స్టేడియానికి వచ్చారు. ప్రత్యర్థి ఏమో యువ జట్టుతో కూడిన జర్మనీ. అయినా టీమ్‌ఇండియా విఫలమైంది. అవకాశాలను వృథా చేసుకుంది. ఓటమి వైపు నిలిచి అభిమానులను నిరుత్సాహపరిచింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం స్థానిక మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో జరిగిన తొలి పోరులో భారత్ 0-2 తేడాతో చిత్తయింది. జర్మనీ తరపున హెన్రిక్ (4వ నిమిషంలో), కెప్టెన్ లుకాస్ (30వ) చెరో గోల్ కొట్టారు. పారిస్ ఒలింపిక్స్ సెమీస్‌లో జర్మనీ చేతిలోనే హర్మన్‌ప్రీత్ సేన ఓడిన సంగతి తెలిసిందే. ఈ పర్యటన కోసం జర్మనీ యువ జట్టును పంపించింది. అయినా భారత్ ఈ మ్యాచ్‌లో నిలబడలేకపోయింది. ఆరంభం నుంచి ప్రత్యర్థి దూకుడు ప్రదర్శించింది. భారత రక్షణశ్రేణి వైఫల్యాన్ని సొమ్ము చేసుకుని మొదట్లోనే హెన్రిక్ గోల్‌తో జర్మనీ ఖాతా తెరిచింది. ఆ తర్వాత లభించిన పెనాల్టీ కార్నర్లలో భారత్ ఒక్కదాన్ని కూడా సద్వినియోగం చేసుకోలేకపోయింది. ప్రపంచంలోనే ఉత్తమ డ్రాగ్‌ఫ్లికర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న హర్మన్‌ప్రీత్ కూడా విఫలమయ్యాడు. మరోవైపు పెనాల్టీ కార్నర్‌ను ఉపయోగించుకుని లుకాస్ కొట్టిన గోల్‌తో ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకున్న జర్మనీ.. చివరి వరకూ జోరు కొనసాగించి విజేతగా నిలిచింది. రెండో మ్యాచ్ గురువారం జరుగుతుంది.

పుణెరికి తలైవాస్ షాక్

ఈనాడు, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో తమిళ్ తలైవాస్ జోరు కొనసాగిస్తోంది. డిఫెండింగ్ ఛాంపియన్ పుణెరి పల్టాన్‌కు షాకిచ్చిన ఆ జట్టు వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. బుధవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 35-30 తేడాతో పుణెరిపై గెలిచింది. రైడింగ్‌లో నరేందర్ (9), సచిన్ (8).. ట్యాక్లింగ్‌లో నితేశ్ కుమార్ (5) రాణించి జట్టును గెలిపించారు. ఆరంభం నుంచి తలైవాస్ దూకుడు ప్రదర్శించింది. చూస్తుండగానే 4-0తో దూసుకెళ్లింది. 8వ నిమిషంలో పుణెరిని ఆలౌట్ చేసి 14-11తో పైచేయి కొనసాగించింది. తొలి అర్ధభాగాన్ని 19-15తో ముగించిన తలైవాస్.. విరామం తర్వాత కూడా జోరు ప్రదర్శించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ప్రత్యర్థి జట్టులో మోహిత్ (13) ఒంటరి పోరాటం చేసినప్పటికీ ఆధిక్యాన్ని కాపాడుకుని తలైవాస్ విజేతగా నిలిచింది. మరో మ్యాచ్‌లో యు ముంబా 33-27తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది.


పుణెరి, తలైవాస్ మ్యాచ్‌లో...

ప్రొ కబడ్డీలో ఈనాడు: బెంగాల్ వారియర్స్ × యూపీ యోధాస్ (రాత్రి 8 నుంచి) హరియాణా స్టీలర్స్ × జైపూర్ పింక్ పాంథర్స్ (రాత్రి 9 నుంచి)

యువ భారత్ జోరుకు బ్రేక్

జొహోర్ బహ్రు: సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ హాకీ టోర్నీలో యువ భారత్ జోరుకు కళ్లెం పడింది. హ్యాట్రిక్ విజయాల తర్వాత భారత్ ఈ టోర్నీలో తొలి ఓటమిని మూటగట్టుకుంది. బుధవారం జట్టు 0-4 తేడాతో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. ప్రత్యర్థి జట్టులో డైకిన్ స్టాంగర్ (33వ, 39వ, 53వ నిమిషాల్లో), పాట్రిక్ ఆండ్రూ (29వ) రాణించారు. ఈ మ్యాచ్‌లో ఓడినప్పటికీ పాయింట్ల పట్టికలో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. మూడు విజయాల కారణంగా 9 పాయింట్లు ఖాతాలో ఉన్నాయి. న్యూజిలాండ్ (8), ఆస్ట్రేలియా (7) వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రౌండ్ రాబిన్ దశలో మరో మ్యాచ్ ఆడాల్సిన నేపథ్యంలో భారత్ ఫైనల్ చేరేందుకు మెరుగైన అవకాశాలున్నాయి.


చాడ్ రికార్డు డబుల్ సెంచరీ

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ బ్యాటర్ చాడ్ బోవ్స్ (205; 110 బంతుల్లో 27×4, 7×6) దేశవాళీ లిస్ట్-ఎ (వన్డే) క్రికెట్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించాడు. బుధవారం ఫోర్డ్ ట్రోఫీలో భాగంగా ఒటాగోతో మ్యాచ్‌లో కాంటర్‌బరీ తరపున చాడ్ 103 బంతుల్లోనే ద్విశతకం అందుకున్నాడు. గతంలో విజయ్ హజారే ట్రోఫీలో నారాయణ్ జగదీశన్ (2021-22, తమిళనాడు), మార్ష్ కప్‌లో ట్రావిస్ హెడ్ (2022, సౌత్ ఆస్ట్రేలియా) 114 బంతుల్లో డబుల్ సెంచరీలు సాధించగా.. ఆ రికార్డును చాడ్ తిరగరాశాడు. ఇక ఈ మ్యాచ్‌లో కాంటర్‌బరీ 240 పరుగుల ఆధిక్యంతో ఒటాగోపై నెగ్గింది. తొలుత కాంటర్‌బరీ 50 ఓవర్లలో 9 వికెట్లకు 343 పరుగులు సాధించింది. బదులుగా ఒటాగో 24.5 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది.

ఇక షూటింగ్ లీగ్

దిల్లీ: దేశంలోనే మొట్టమొదటి సారిగా ఫ్రాంఛైజీ ఆధారిత షూటింగ్ లీగ్ ఆఫ్ ఇండియా (ఎస్ఎల్ఐ)ను నిర్వహించనున్నట్లు భారత జాతీయ రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) బుధవారం ప్రకటించింది. అధ్యక్షుడు కలికేశ్ నారాయణ్ సింగ్ దేవ్ ప్రతిపాదనకు ఎన్ఆర్ఏఐ పాలక మండలి ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) అనుమతులు తీసుకున్న తర్వాత ఎస్ఎల్ఐ షెడ్యూల్ ఖరారు కానుంది. వచ్చే ఏడాది మార్చిలో లీగ్ జరిగే అవకాశముంది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో భారత షూటర్లు మూడు పతకాలు సాధించారు.

ఆదుకున్న హసన్.. బంగ్లా 283/7



మీర్‌పుర్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో మెహదీ హసన్ మిరాజ్ (87 బ్యాటింగ్; 171 బంతుల్లో 9×4, 1×6), జాకిర్ అలీ (58; 111 బంతుల్లో 7×4) బంగ్లాదేశ్‌ను ఆదుకున్నారు. 202 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన దక్షిణాఫ్రికా మూడో రోజే పని ముగించేలా కనిపించినా.. టెయిలెండర్లు అద్భుతమైన పోరాటంతో ప్రతిఘటిస్తున్నారు. ఓవర్‌నైట్ స్కోరు 101/3తో బుధవారం ఉదయం ఆట కొనసాగించిన బంగ్లా మూడో రోజు మ్యాచ్ నిలిచే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 7 వికెట్లకు 283 పరుగులు సాధించింది. ఒకదశలో 112 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి ఇన్నింగ్స్ ఓటమి అంచుల్లో ఉన్న బంగ్లాకు హసన్, జాకిర్ అర్ధ సెంచరీలతో అండగా నిలిచారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 138 పరుగులు జోడించి ఆతిథ్య జట్టును ఇన్నింగ్స్ ఓటమి నుంచి బయటపడేశారు. సఫారీ బౌలర్లలో రబాడ (4/35), కేశవ్ మహరాజ్ (3/105) రాణించారు. చివర్లో వర్షం అంతరాయం కలిగించడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. ప్రస్తుతం బంగ్లా ఖాతాలో 81 పరుగులు ఉన్నాయి. మెహదీ హసన్, నయీం హసన్ (16 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

పండగల సీజన్లో అందరి ముందూ ఒకటే సవాలు.. ఇల్లు సర్దుకోవడం. ఏళ్లుగా తిరగేయని పుస్తకాలు, వాడకుండా పడేసిన ఛార్జర్లు, ఎప్పటికీ చూడని డీవీడీలూ-సీడీలూ, ఉపయోగంలేని వంట పాత్రలు, వాడ్డానికి వీలులేకున్నా దాచిన బట్టలు.. ఇంటి నిండా ఇలాంటివెన్నో. 'ఇల్లు కట్టి చూడు...' అనే సామెతను ఇప్పుడు 'ఇల్లు సర్ది చూడు'గా మార్చాలేమో! 'మరి దీనికి పరిష్కారం లేదా?' అంటే ఎందుకు లేదు!



ఇల్లు సర్ది చూడు!

తరాలుగా వస్తోన్న పాత వస్తువులకు తోడు అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా కొనే వాటితో ఇల్లు గోడౌన్‌లా మారిపోతుంది. స్టోర్ రూమ్‌లోనే కాదు అల్మరాల్లో, కిచెన్ సొరుగుల్లో, బాల్కనీలో, మంచం కిందా... ఎక్కడ చూసినా వాడకుండా దాచిన వస్తువులే! ఈ గందరగోళానికి కారణం మనమే. చాలా వస్తువుల్ని ఎప్పుడైనా అవసరం పడతాయనే ఉద్దేశంతో కొంటుంటాం. కానీ ఏళ్ల పాటు ఆరోజు రానే రాదు. డబ్బు పెట్టి కొన్నాం కదా అని వాటిని పడేయడానికి మనసొప్పదు. ఇవి కాకుండా పాత బట్టలు, వినియోగంలోలేని ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, పిల్లల బొమ్మలు, అలంకార వస్తువులు... ఎన్నెన్నో! ఎంత డబ్బు పెట్టి కొన్నా, అవి కొంత కాలం తర్వాత ఉపయోగపడవు. పండగలప్పుడు ఇల్లు సర్దుతామా... ఎంత చెత్త ఉందో అప్పుడు గుర్తిస్తాం! కానీ ఏవి పడేయాలో ఓ పట్టాన తేల్చుకోలేం. మనం వస్తువులకు యజమానులం తప్ప బానిసలం కాదని గుర్తించుకుంటే మీ పని తేలిగ్గా పూర్తవుతుంది.

జపనీస్ పద్ధతిలో..

ఇల్లు సర్దుకోవడం గురించి జపాన్‌కు చెందిన ఆర్గనైజింగ్ కన్సల్టెంట్ మారీ కండో రూపొందించిన 'కాన్‌మారీ' విధానం కొన్ని సూచనలు చేస్తుంది. ఈమె స్ఫూర్తితో మన దేశంలో అలాంటి సంస్థలు అనేకం వచ్చాయి కూడా. కాన్‌మారీ ఏం చెబుతోందంటే...

- ఇంటిని సర్దే ముందు, ఎలా ఉంటే బావుంటుందనుకుంటున్నారో ఊహించుకోవాలి. రోజూ ఎక్కడ, ఎంత సమయం గడపాలనుకుంటున్నారో నిర్ణయించుకోవాలి.
- కొన్నింటి విషయంలో ఉంచాలా, పడేయాలా అనే మీమాంస ఉంటుంది. దీన్ని అధిగమించడానికి 'కాన్సెప్ట్ ఆఫ్ స్పార్కింగ్ జాయ్'ను పాటించండి. వస్తువుని పట్టుకోగానే మనసుకి హాయిగా అనిపిస్తే వాటిని ఉంచాలట. అవి జ్ఞాపకాలు, అనుబంధాలకు సంబంధించినవి కావొచ్చు మరి!
- వస్తువుల్ని భాగాలుగా విభజించి వాటికి ప్రత్యేకమైన చోటుని కేటాయించాలి. అలా చేస్తే ఇల్లు సర్దడం సులభమే కాదు, తేలిక కూడా. వస్తువుని వాడాక తిరిగి తీసిన చోటే పెట్టేస్తారు.
- పుస్తకాలు, ఇతర వస్తువుల్ని అరల్లో నిలువుగా పెడితే గుర్తించడం తేలికట. దుస్తుల్నీ వీలైతే హ్యాంగర్లకు వేలాడదీయండి. ఎంపిక సులభమవుతుంది.
- స్టేషనరీ, మందులు, పిల్లల బొమ్మలు.. తదితరాల కోసం ప్రత్యేక పెట్టెలు ఉంచితే.. వాడాక తిరిగి అందులోనే సులువుగా పెట్టేయొచ్చు.
- ఇక, పడేసే వాటిని కృతజ్ఞతా భావంతో పడేయాలట. ఆ వస్తువు ఉండటంవల్ల ఎలా మేలు జరిగిందో గుర్తుచేసుకోవాలట. అప్పుడు మనసు తేలిక పడుతుంది.

ఇవీ గుర్తుపెట్టుకోండి..

- ఇల్లు తరచూ సర్దలేకపోవడానికి మరో కారణం.. అది ఒక్క రోజులో అయ్యే పని కాదని... నిజమే కానీ, వాయిదా పరిష్కారం కాదుగా! అందుకని వంటగది, హాల్, బెడ్‌రూమ్, స్టోర్‌రూమ్, బాల్కనీ.. ఇలా విభజించుకుని రోజుకొకటి సర్దుకుంటే వారంలో పూర్తయిపోతుంది.
- బయటకు కనిపించని ఫ్రిజ్ లోపలా దృష్టి పెట్టండి. ముందుగా డిఫ్రాస్ట్ చేసి వేడి సబ్బునీళ్లు, వెనిగర్ కలిసిన ద్రావణంతో శుభ్రం చేయాలి.
- సోఫా, మంచం, కిటికీలూ, అద్దాలూ.. ఇలా ఇంట్లోని ప్రతిదానిపైనా దృష్టి పెడితే మీ ఇల్లు అద్దంలా మెరిసిపోతుంది.

హోర్డింగ్ డిజార్డర్

క్రితంసారి ఆఫర్లకి కొన్న వస్తువుల్ని తెరవనైనా తెరవరు. పండగ ఆఫర్ అనగానే ఇంకేవో కొనేస్తారు. కొనాలన్న ఆ తపన నుంచి.. ఎంత చెప్పినా బయటపడరు. దీన్నే 'హోర్డింగ్ డిజార్డర్'గా చెబుతోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. 'మన దగ్గర అన్నీ ఉండాలి..' అనే ఆలోచనే దీనికి కారణం. అవసరానికి, ఇష్టానికి మధ్య సమన్వయం లోపించి అనవసర వస్తువులు కొనడమే ఈ డిజార్డర్. హోర్డింగ్ డిజార్డర్‌తో డిప్రెషన్, డెమెన్షియా లాంటి సమస్యలూ వస్తాయట. 'డిజిటల్ హోర్డింగ్' మరో కొత్త సమస్య. డిజిటల్ పుస్తకాలు, సినిమాలూ, ఫొటోల్ని ఫోన్లూ, హార్డ్ డ్రైవ్‌లూ, డిస్కుల్లో దాచిపెడుతుంటారు. వాటిని చూసేందుకు సమయమే ఉండదు. అలాగని డిలీట్ చేయరు.

ఏం తింటే బీపీ తగ్గుతుంది?

నేను ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగం చేస్తున్నా. నియంత్రణ లేకుండా ఏమీ తినను కానీ, అధిక బరువు ఉన్నా. ఈ మధ్య రక్తపోటు బారినా పడ్డా. ఎందుకిలా? నేను ఆహారంలో ఎలాంటి మార్పు చేసుకోవాలి?

- పద్మజ, అనంతపురం

అధిక రక్తపోటుకి అనారోగ్యం, జీవనశైలి, కుటుంబ చరిత్ర, జన్యువులు, బరువుతో పాటు శరీరంలో కొవ్వు మోతాదు ఎక్కువగా ఉండటం వంటివన్నీ కారణాలే. అలానే, మన వ్యక్తిత్వం అంటే... సమస్యలను అధిగమించే తీరు, ఆందోళన, ఒత్తిడి... లాంటివి కూడా ప్రభావం చూపిస్తాయి. అయితే, ముందు మన శరీర అవసరాలని గుర్తించాలి. తరవాత అందుకు తగ్గట్లుగా పోషకాలను తీసుకుంటూ, వ్యాయామాలూ చేస్తే ఈ సమస్యను అధిగమించొచ్చు. ఆరోగ్యంగా ఉన్న సాధారణ వ్యక్తికి రోజూ చెంచా ఉప్పు తీసుకుంటే చాలు. దీంతో పాటు కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి ఇతర ఖనిజాలు కూడా శరీరానికి అందాలి. ఆహారంలో మేలైన కొవ్వుల మోతాదుని పెంచుకోవడంతోపాటు విటమిన్ ఇ, సి, సెలీనియం, జింక్ వంటివీ అవసరమే. ఫోలిక్ యాసిడ్, ఫైటోకెమికల్స్ రక్తాన్ని చిక్కబడనివ్వవు. పొట్టుతో ఉన్న గింజధాన్యాలతోపాటు ఆకుకూరలు, కాయగూరలు, అల్లం, వెల్లుల్లి వంటివి తీసుకోవాలి. అలానే, రోజూ కనీసం ముప్పై గ్రాముల నూనెగింజలు, నట్స్ తినండి. అయితే, రోజుకి నాలుగైదు చెంచాలకు మించి నూనె వాడకూడదు. రైస్‌బ్రాన్, నువ్వులు, ఆవ నూనెల్ని వినియోగించండి. ఎక్కువ ఉడికించని ఆహారాన్ని తీసుకోవాలి. సలాడ్స్‌ని ఎంచుకోవచ్చు. నాటుకోడి, చేప తినొచ్చు. కాల్షియం కూడా అధికరక్తపోటుని అదుపులో ఉంచగలదు.. వీటి మీద దృష్టిపెట్టడంతో పాటు బరువునీ తగ్గించుకోవాలి. ఒత్తిడినీ నియంత్రించుకోవాలి. వీటితో పాటు రోజూ వ్యాయామం చేయడం, తగిన విశ్రాంతి తీసుకోవడమూ తప్పనిసరి. ఈ అలవాట్లన్నీ అధికరక్తపోటుని రానివ్వవు. వచ్చినా ఇతర అనారోగ్యాలకు కారణం కానివ్వవు.

డియర్ వసుంధర



డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

వైరల్



వినూత్నంగా చెప్పేస్తున్నారు!

విషయాన్ని చెప్పడంలో ఒక్కొక్కరిది ఒక్కో పంథా. తాజాగా లఖ్‌నవూలోని మహిళా బైకర్లు వినూత్న రీతిలో సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. స్థానిక సంస్థ నిర్వహించిన 'ఆల్ విమెన్ బైక్ ర్యాలీ'లో సంప్రదాయ వస్త్రధారణలో అనేకమంది మహిళలు పాల్గొన్నారు. చీరలు, సల్వార్‌లు ధరించి షాహీద్ పాత్ నుంచి రాణా ప్రతాప్ మార్గ్ వరకూ ప్లకార్డులతో, బైక్‌లు నడుపుతూ వెళ్లారు. అంతేకాదు, 'సశస్త్ర సీమా బల్' అనే కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లోని మహిళలూ యూనిఫామ్‌లు ధరించి ఇందులో పాల్గొనడం అందరి దృష్టినీ ఆకర్షించింది. వీరంతా కలిసి వ్యాక్సిన్, సర్వైకల్ క్యాన్సర్ గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బెస్ట్ యూనిఫామ్, బెస్ట్ డ్రెస్డ్ బైకర్, బెస్ట్ మెసేజ్ వంటి అనేక కేటగిరీల్లో అవార్డులూ అందుకున్నారు కొందరు మగువలు. విషయానికి వినూత్నత తోడైతే అది అందరికీ చేరుతుంది. అలానే ఇప్పుడు ఈ ఆల్ విమెన్ ర్యాలీ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



బంగారం-వెండి

23న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,340	7,300
వెండి (గ్రా)	112.00	110.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	80,340	80,780	78,570	78,000	81,200	80,800	81,500	80,900	79,780	79,350
ఆర్నమెంట్	74,200	73,800	73,400	73,100	75,190	74,820	75,000	74,430	73,400	73,000
వెండి (కిలో)	99,442	101,423	101,800	100,600	99,500	98,000	99,900	99,800	109,000	107,000

నయాట్రెండ్



సాంత్వన కోసం...

ఉద్యోగం, సంపాదన, నూతన లక్ష్యాలు... కారణాలేమైతేనేం అమ్మాయిలది ఉరుకుల పరుగుల జీవితమే. ఒత్తిడి పెరిగిపోయి హార్మోనుల అసమతుల్యత, హృద్రోగాలూ వచ్చేస్తున్నాయి. అయితే, వీటితోపాటే ఎప్పటికప్పుడు ఆరోగ్యంకోసం 'వెల్‌నెస్ ట్రెండ్'లూ వస్తున్నాయి. వాటిలో ఒకటే 'అటానమస్ సెన్సరీ మెరీడియన్ రెస్పాన్స్' ట్రెండ్. దీన్నే సింపుల్‌గా ఏఎస్ఎమ్ఆర్ అని అంటారు. అందులో ఏం చేస్తారో తెలుసా?

చిన్నతనంలోనే కాదు ఇప్పటికీ చాలామందికి బబుల్ ర్యాప్ చూస్తే దాన్ని టపీమని ఒత్తేయాలనిపిస్తుంది. మెత్తగా, నున్నగా ఉన్న ఇసుకలో బొమ్మలు వేయాలనిపిస్తుంది. ఈ అనుభూతులన్నింటికీ కారణం జ్ఞానేంద్రియాలే. అందుకే మానసిక ప్రశాంతత పొందడానికి అప్పుడప్పుడూ జ్ఞానేంద్రియాలను ఉత్తేజపరుస్తుండాలి. అందులో భాగంగా వచ్చిందే ఈ ఏఎస్ఎమ్ఆర్ ట్రెండ్ కూడా. దీన్లో భాగంగా మైక్రోఫోన్‌లో మంద్రంగా మాట్లాడడం, చిన్న శబ్దాలు చేయడం, నెమ్మదిగా చేతివేళ్లను కదిలించే లాంటి వీడియోలు చూడడం లేదా వినడం చేస్తారు. ఇక రంగురంగుల సబ్బుల్ని చాకుతో తురమడం, మెత్తగా జెల్లీలా ఉన్న పదార్థాలను తాకుతుండే వీడియోలు చూడడమూ దీన్లో భాగమే. అంతెందుకు మన తలకు ఎవరైనా మసాజ్ చేసినా, చెవిలో ఇయర్‌బడ్‌తో మనకు మనమే సుతిమెత్తగా తిప్పినా అలాంటి అనుభూతినే పొందుతాం. ఆ సంతృప్తే... అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేస్తుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ చేసిన పరిశోధనలు చెబుతున్నాయి.

హాయినిచ్చే ఇలాంటి వీడియోలను చూసినప్పుడు మెదడులో రివార్డు, ఎమోషనల్ భాగాలు యాక్టివేట్ అవుతాయట. న్యూరో హార్మోనులైన ఆక్సిటోసిన్, డోపమైన్, ఎండార్ఫిన్లు విడుదలై మూడ్‌ని మెరుగుపరుస్తాయట. అనేక దీర్ఘకాల నొప్పులనూ తగ్గిస్తాయట. ఏకాగ్రతను పెంచడంతోపాటు, రిలాక్స్ అయ్యేలా చేసి మంచి నిద్ర పట్టేలానూ చేస్తాయట. ఆందోళన, ఒత్తిడి, బీపీ వంటి సమస్యలూ తగ్గిపోతాయి. అందుకే, ఎప్పుడైనా నిద్రపట్టనప్పుడూ, ఆందోళనగా అనిపించినప్పుడూ... సౌకర్యవంతంగా ఓ కుర్చీలోనో, బెడ్‌మీదో కూర్చొని ఇలాంటి వీడియోలు చూడండి. మనసు కుదుటపడుతుంది. అలా అని అదేపనిగానూ చూడకూడదు. దానివల్ల మన సెన్సెస్ మొద్దుబారిపోతాయి. మందు వ్యాధిని తగ్గిస్తుందని అతిగా వాడం కదా! ఇదీ అలానే. కాబట్టి, ఎప్పుడైనా ఓసారి ప్రయత్నించండి.

భారతీయ పరిశోధకురాలికి రూ.6.7 కోట్లు



అమెరికాలో స్థిరపడిన భారతీయ చరిత్రకారిణి, రచయిత శైలజ పాయిక్ ప్రఖ్యాత మ్యాక్‌ఆర్థర్ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు. తమ విజ్ఞానం, సృజనాత్మకతలతో అత్యుత్తమ స్థాయిలో పరిశోధనలూ, రచనలూ చేసేవారికి ఈ స్కాలర్‌షిప్ అందిస్తారు. దీనికే 'జీనియస్ గ్రాంట్' అనే పేరుంది. శైలజ రూ.6.7కోట్ల విలువైన గ్రాంట్‌ను అందుకోనున్నారు. ఆధునిక భారతదేశంలో.. దళితులు, జెండర్, సెక్సువాలిటీ అంశాలమీద అధ్యయనానికి ఈ నిధులు కేటాయించనున్నారు శైలజ. మహారాష్ట్రలోని పేద దళిత కుటుంబంలో పుట్టిన ఆమె... పుణెలోని ఓ మురికివాడలో పెరిగారు. అక్కడే సావిత్రిబాయి పులే యూనివర్సిటీ నుంచి పీజీ చేసి, ఫోర్డ్ స్కాలర్‌షిప్‌తో యూకేలోని వార్విక్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. ప్రస్తుతం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటిలో చరిత్ర బోధిస్తున్నారు. తన రచనలతో దళిత స్త్రీల గురించి లోతైన అంశాల్ని వెలుగులోకి తెస్తుంటారు శైలజ. ఆంగ్లం, హిందీ, మరాఠీ పత్రికలూ, పుస్తకాలను పరిశోధిస్తూ, పట్టణ, గ్రామీణ దళిత మహిళల్ని ఇంటర్వ్యూలూ చేస్తూ ఆ వివరాల్ని పుస్తక రూపంలో అందిస్తున్నారు. 'దళిత్ విమెన్స్ ఎడ్యుకేషన్ ఇన్ మోడర్న్ ఇండియా: డబుల్ డిస్క్రిమినేషన్' శైలజ మొదటి పుస్తకం. దీన్లో 20వ శతాబ్దంలో మహారాష్ట్ర దళిత మహిళలు చదువుకోవడానికి పడ్డ కష్టాల్ని కళ్లకు కట్టారు. 'వల్గారిటీ ఆఫ్ క్యాస్ట్: దళిత్స్, సెక్సువాలిటీ అండ్ హ్యూమానిటీ ఇన్ మోడర్న్ ఇండియా' పుస్తకంలో మహారాష్ట్రలో ప్రఖ్యాత జానపద నాటకం 'తమాషా' ప్రదర్శించే దళిత మహిళల కష్టాలు, వారిపై జరిగే లైంగిక దాడుల గురించి వివరించారు. తన తల్లిదండ్రులే జీవితంలో స్ఫూర్తి అంటారు శైలజ. ఈమె తండ్రి పగటి పూట పనిచేసుకుంటూనే, నైట్ కాలేజీలో చదువుకుని డిగ్రీ పూర్తిచేశారు. తల్లి చదివింది ఆరో తరగతే! అయినా, ముగ్గురు అమ్మాయిల్నీ స్కూల్ నుంచి వచ్చాక దగ్గరుండి చదివించేది. 'దళిత మహిళలు తమపైన జరుగుతున్న అణచివేతను అధిగమించి ఎలా ముందడుగు వేస్తున్నారో నేటి తరానికి తెలిసేలా పుస్తకాలు రాస్తున్నా. నన్నెవరూ 'జీనియస్' అని పిలవలేదు. కానీ ముళ్లు, రాళ్లతో నిండిన దారిలో ప్రయాణించి ఇక్కడ వరకూ చేరుకున్నా. కాబట్టి ఎవరైనా అలా పిలిస్తే వినయంగా స్వీకరిస్తా' అంటారు శైలజ. ఈ అవార్డు అందుకున్న నాలుగో భారతీయురాలు, మొదటి మహిళ.

అమ్మాయిలు... ఊరిని మార్చారు!

అమ్మాయిలు తలుచుకుంటే ఏం చేయగలరు? ఊరినే తీర్చిదిద్దగలరు. జనాల తలరాతలు మార్చగలరు. అంతేనా... అందరిచేతా శభాష్ అనిపించుకోగలరు. ఉదాహరణ కావాలా? అయితే వీరిని కలుసుకోండి.



చుడిన్





వేల అడుగుల ఎత్తులో... మంచు దుప్పటి కప్పుకొని ఉంటుంది పదమ్‌చెన్. తూర్పు సిక్కింలోని అందమైన గ్రామమిది. దగ్గర్లో పంగోలఖా వైల్డ్‌లైఫ్ శాంక్చురీ... ఇది రెడ్ పాండాలకు ప్రసిద్ధి. ఇంత సుందర ప్రాంతానికి పర్యటకులు రాకుండా ఉంటారా? వారితోపాటే ప్లాస్టిక్, చెత్త వచ్చి గుట్టలుగా పోగవడం మొదలైంది. ఇది పర్యావరణానికే కాదు, అక్కడి మూగజీవుల ఉనికికీ ప్రమాదంగా మారింది. అంతేకాదు, వృథా ఆహారం కోసం వచ్చే జంతువుల వల్ల మనుషులకీ.. . వాటిని తరిమికొట్టే ప్రయత్నంలో ఆ మూగజీవులకీ ఆపద వాటిల్లుతోంది. అవన్నీ చూసి తట్టుకోలేకపోయారు దావా చుడిన్ భూటియా. పదమ్‌చెన్ గ్రామ సర్పంచ్ ఆమె. 17 మంది అమ్మాయిలతో 'స్వచ్ఛతా సహయోగి' బృందం ఏర్పాటు చేశారీమె. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచే కాదు... చుట్టుపక్కల పర్వత ప్రాంతాల్లో చేరిన చెత్తనీ ఏరేయడం మొదలుపెట్టారు. చెత్తను పారేయొద్దంటూ పర్యటకులకు అవగాహన కల్పించడమే కాదు, బోర్డులూ ఏర్పాటు చేయించారు.

ఈమె కృషిని చూసిన డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా 'మెటల్ రికవరీ ఫెసిలిటీ' (ఎంఆర్ఎఫ్)ని ఏర్పాటు చేశారు. ఆసక్తి ఉన్నవారికి చెత్తను వేరు చేయడంలో, ఆహారవృథాని కంపోస్టుగా మార్చడంలో శిక్షణిచ్చారు. ఇక భూటియా బృందం ప్రతి ఇంటి నుంచి ఆ వృథాను సేకరించి దగ్గర్లోని ఎంఆర్ఎఫ్‌కి పంపుతారు. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు వాటితో బ్యాగులు, బుట్టలు తయారు చేసి, పర్యటకులకు అమ్మి, ఉపాధి పొందుతున్నారు. ఇప్పుడు గ్రామంలోని ప్రజలూ చెత్తను వేయడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. ఫలితమే ఊరు, దాని చుట్టుపక్కల కొండలు చెత్తరహితంగా కనిపిస్తున్నాయి. జంతువుల దాడులూ తగ్గాయి. అంతేకాదు, సిక్కిం ప్రభుత్వం పదమ్‌చెన్ గ్రామాన్ని 'పరిశుభ్రమైన గ్రామం'గా గుర్తించింది. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ కోసం రూ.16లక్షల గ్రాంట్‌నీ కేటాయించింది. 'ఇంటి నుంచే మార్పు మొదలవ్వాలనుకున్నాం. అందుకే జీరో వృథా కోసం ప్రణాళికలు రచించాం. అవన్నీ పక్కాగా అమలయ్యేలా చేశాం. కాబట్టే మాది పరిశుభ్రమైన గ్రామంగా నిలిచింది. మా స్ఫూర్తిని ఇతర గ్రామాలకూ విస్తరించాలనుకుంటున్నాం. భవిష్యత్ తరాలకు శుభ్రమైన పర్యావరణాన్ని అందించాలన్నదే మా తాపత్రయం' అంటోన్న భూటియా బృందాన్ని మెచ్చుకోవాల్సిందేగా మరి?



ఇంటి తోట

గుత్తులుగా పూసే బెగోనియా!



రంగు రంగు పూలతో నిండుగా కనిపించే బెగోనియా మొక్క... పెంచుకునే ప్రదేశానికి కొత్త శోభ తెస్తుంది. బాల్కనీల్లోనూ, వరండాల్లోనూ చక్కగా అమరిపోతుంది. మరి దీన్ని ఎలా పెంచుకోవాలో చూద్దామా!

బెగోనియా... ఒకప్పుడు చల్లటి పర్వత ప్రాంతాల్లో మాత్రమే పెరిగేది. ఇప్పుడు తేమగా ఉండే సమశీతోష్ణ ప్రదేశాల్లోనూ ఆర్నమెంటల్ ప్లాంట్‌గా ఎదుగుతోంది. ఈ మొక్క పూలే కాదు...ఆకులూ ఆకట్టుకుంటాయి. ఒకసారి నాటుకుంటే చాలు... గుత్తులు గుత్తులుగా ఏడాదంతా పూలనిస్తూనే ఉంటుంది. ఇందులో సుమారు రెండువేలకు పైగానే రకాలున్నాయట. హ్యాంగింగ్ బాస్కెట్‌లో, విండో ప్లాంటర్స్‌గా, రూఫ్‌గార్డెన్ పైనా...ఇలా ఎక్కడైనా దీన్ని పెంచుకోవచ్చు. కాకపోతే, ఇది కొంచెం సున్నితమైన మొక్క అందుకే, నేరుగా ఎండతగిలే చోట కాకుండా పాక్షికంగా నీడ ఉన్న ప్రదేశంలో పెంచుకోవాలి. ఎండ మరీ ఎక్కువగా ఉంటే ఇంటి లోపలకు మార్చుకోవడం మేలు.

పోషకాలు ఇస్తేనే...

బెగోనియా దుంపను నాటుకోవచ్చు లేదా విత్తనాల ద్వారానూ పెంచుకోవచ్చు. అయితే, విత్తనం ద్వారా పెంచాలనుకుంటే.. . ఇరవైశాతం మట్టి మిగిలిన భాగం పీట్‌మాస్, కోకోపీట్, వర్మీకంపోస్ట్ కలిపి కుండీల్లో నింపుకోవాలి. అదే, దుంపను నాటితే పీట్‌మాస్, కోకోపీట్, వర్మీ కంపోస్ట్, ఎర్రమట్టి కలిపి... దానికి గుప్పెడు బోన్‌మీల్‌నూ జతచేయాలి. అప్పుడే పూలు నిండుగా పూస్తాయి. ఇవి ఏక రంగుతో పాటు ద్వి, బహుళ వర్ణాల్లోనూ పూస్తాయి. బెగోనియాకు పోషకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలి. ముఖ్యంగా ఎన్‌పీకే సమగ్ర ఎరువు 20:20:20 చొప్పున మొక్కకు అందించాలి. అలానే ద్రవరూపంలో ఉండే మల్టీపర్పస్ ఫెర్టిలైజర్‌ను ఆరువారాలకోసారైనా ఆకుల మీద స్ప్రే చేసుకోవాలి. కనీసం రెండు మూడు నెలలకోసారైనా ఒక గుప్పెడు వర్మీ కంపోస్ట్, వేపపిండిని మొక్క మొదళ్ల దగ్గర మట్టిని మల్చింగ్ చేసి కలుపుకోవాలి. ఇలా చేయడం వల్ల మట్టిలోని తేమ ఆవిరైపోకుండా ఉంటుంది. మొక్కా ఆరోగ్యంగా ఎదుగుతుంది.

జగనన్నా.. ఇంత అన్యాయమా?

(మొదటి పేజీ తరువాయి)

ఆమె తీవ్రంగా మండిపడ్డారు. 'మీరు నైతికంగా దిగజారిపోయిన అథఃపాతాళపు లోతుల నుంచి పైకి వచ్చి, ఇప్పటికైనా మన తండ్రికి ఇచ్చిన మాటను నెరవేరుస్తారని, మన మధ్య కుదిరిన ఒప్పందానికి కట్టుబడి ఉంటారని ఆశిస్తున్నాను. అలా జరగాలని ప్రార్థిస్తున్నాను. ఇప్పటికీ మీరు అలాగే ఉండాలని నిర్ణయించుకుంటే.. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే.. హక్కుల్ని కాపాడుకోవడానికి చట్టపరంగా నాకున్న మార్గాల్లో వెళతాను' అంటూ వైకాపా అధ్యక్షుడు జగన్‌కు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఘాటుగా ప్రత్యుత్తరమిచ్చారు. జగన్ ఇటీవల తనకు రాసిన లేఖకు బదులుగా తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ, తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. తండ్రి ఆదేశాల్ని, అభిమతాన్ని గాలికొదిలేశారని, మాట తప్పి, మడమ తిప్పారని.. జగన్ నైజాన్ని తీవ్రంగా ఎండగట్టారు. నా రాజకీయ ప్రయాణం ఎలా ఉండాలో నిర్దేశించడానికి మీరెవరంటూ ఎదురుదాడికి దిగారు. ఆ లేఖపై షర్మిలతో పాటు, తల్లి విజయమ్మ కూడా సంతకం చేశారు. 'ప్రియమైన జగన్ అన్నా' అంటూ మొదలైన ఆ లేఖ ఇలా సాగింది.



నాన్నకిచ్చిన మాట ఏమైంది అన్నా!

మీరు ఇటీవల నాకు రాసిన లేఖపై తీవ్ర అభ్యంతరం తెలియజేస్తున్నా. నాన్న రాజశేఖరరెడ్డి ఆయన జీవితకాలంలో మన కుటుంబవనరుల ద్వారా సంపాదించిన ఆస్తులన్నీ నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానంగా చెందాలని విస్పష్టంగా ఆదేశించిన విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను. ఆయన ఆదేశాల్ని శిరసావహిస్తానని అప్పట్లో మీరు అంగీకరించారు. ఆయన మరణించాక మీరు మాట తప్పారు. ఇచ్చిన హామీని తుంగలో తొక్కారు. భారతి సిమెంట్స్, సాక్షి పత్రికలతో పాటు తన జీవితకాలంలో సంపాదించిన ఆస్తులన్నీ తన నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానంగా చెందాలని మన తండ్రి నిర్ద్వంద్వంగా ఆదేశించారు. ఆయన ఆదేశాలతో పాటు, ఇప్పటి వరకు మన మధ్య జరిగిన అన్ని చర్చలు, సంప్రదింపులు, ఒప్పందాలకు మన తల్లి విజయమ్మే సాక్షి. మీరు 'ఎంతో ప్రేమానురాగాల'తో చేసిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ)లో ప్రస్తావించిన ఆస్తుల వివరాలు మన తండ్రి ఇచ్చిన ఆదేశాల్ని పాక్షికంగా నెరవేర్చేలానే ఉన్నాయి. భారతి సిమెంట్స్, సాక్షిల్లో మెజారిటీ వాటాలు మీరే ఉంచుకున్నారు. అందుకే 'పాక్షికం' అన్న మాటను ఒత్తి చెబుతున్నాను. కానీ మీరు బలవంతులవడం, మీదే పైచేయి కావడం, మీరనుకున్నది తప్ప ఎవరి మాటనూ లెక్క చేయని పరిస్థితి ఉండటంతో.. మీరు ఎంఓయూలో ప్రస్తావించిన అరకొర ఆస్తుల్ని తీసుకుని వివాదాన్ని పరిష్కరించుకునేందుకు అంగీకరించాను. తోడబుట్టిన అన్నయ్యతో వివాదాన్ని కొనసాగించడం, కుటుంబాన్ని రచ్చకెక్కించడం ఇష్టం లేక మన ఆస్తిలో సమాన వాటా పొందేందుకు నాకున్న హక్కును వదులుకునేందుకు అంగీకరించాను.

అవి కూడా ఇవ్వకుండా కుట్రా?

నాకు అరకొర ఆస్తులు మాత్రమే ఇచ్చేలా 2019 ఆగస్టు 31న కుదిరిన ఆ ఒప్పందాన్ని అమలు చేసేందుకు కూడా మీకు మనసు రావడం లేదు. ఎంఓయూ ప్రకారం మీ సొంత చెల్లెలు, ఆమె పిల్లలకు చెందాల్సిన ఆస్తుల్ని వారికి దక్కకుండా చేసేందుకు కంకణం కట్టుకున్నారు. దాని కోసం ఏకంగా సొంత తల్లిపైనే కేసు పెట్టే స్థాయికి దిగజారారు. మహోన్నతుడైన మన తండ్రి నడిచిన మార్గానికి మీరు ఎంత దూరంగా వెళుతున్నారో చూసి దిగ్భ్రాంతి చెందుతున్నాను. నాన్న ఆకాంక్షలకు, మీరు గతంలో ఇచ్చిన హామీకి తూట్లు పొడుస్తూ ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దు చేయాలని చూస్తున్నారు. మీరు రాసిన లేఖ చట్టప్రకారం.. ఆ ఒప్పందానికి విరుద్ధంగా ఉంది. మీరు ఆ లేఖ రాయడం వెనుక ఉన్న దురుద్దేశం నన్ను తీవ్రంగా బాధించింది. నాన్న ఎప్పుడూ కలలో కూడా ఊహించని పని మీరు చేశారు. ఆయన ఎంతో ప్రేమగా చూసుకున్న భార్యపైనా, కుమార్తెపైనా కేసులు పెట్టడంతో పాటు, ఆస్తిలో ఆయన కుటుంబానికి చట్టబద్ధంగా దక్కాల్సిన వాటాను ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు.

ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే.. చట్టప్రకారం వెళతా

ఎంఓయూకి కాలం చెల్లదు. దానికి మీరు కట్టుబడాల్సిందే. మీరు దాన్ని ఏకపక్షంగా ఉపసంహరించుకోవడం చట్టప్రకారం కుదరదు. బెంగళూరులో 20 ఎకరాల్లో ఉన్న యలహంక ప్యాలెస్‌లో వాటాతో పాటు.. ఎంఓయూలో పేర్కొన్న ప్రతి అంశాన్నీ మీరు నెరవేర్చాల్సిందే. లేకపోతే మిమ్మల్ని చట్టప్రకారం బాధ్యుల్ని చేస్తాను. వాటన్నిటినీ మీరు ఎంఓయూలో పేర్కొనడంతో పాటు, మౌఖికంగానూ అంగీకరించారు. దానికి అమ్మే సాక్షి.

సరస్వతి పవర్ షేర్లు నాకు దక్కకుండా చేసేందుకే..

ఎంఓయూలో నా వాటాగా పేర్కొన్న సరస్వతి పవర్‌లోని షేర్లు మొత్తం ఒప్పందంపై సంతకం చేసిన వెంటనే నాకు బదలాయిస్తానని హామీ ఇచ్చారు. ఒప్పందం చేసుకుని అనేక సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చలేదు. పైగా భారతి, సండూర్ కంపెనీల షేర్లను అమ్మ కొనుగోలు చేశాక, మిగతా షేర్లను వాటి ఫోలియో నెంబర్లు సహా రాసిన గిఫ్ట్ డీడ్స్‌పై మీరు, మీ సతీమణి సంతకాలు చేసి గిఫ్ట్‌గా ఇచ్చాక... ఇప్పుడు మీరు దానిపై ఫిర్యాదు చేయడం, గగ్గోలు పెట్టడం సరికాదు. సరస్వతి పవర్ షేర్లపై అమ్మకు పూర్తి హక్కులు కల్పిస్తూ మీరు గిఫ్ట్ డీడ్లపై సంతకాలు చేశారు. సరస్వతి పవర్‌లో షేర్లు వదులుకోవడానికి అంగీకరించిన తర్వాత ఇప్పుడు మీరు అనవసర వివాదాలు లేవనెత్తుతూ కుటుంబాన్ని కోర్టుకీడ్చడం పద్ధతి కాదు. నాకు చట్టబద్ధంగా దక్కాల్సిన సరస్వతి పవర్ షేర్లు, దక్కకుండా చేయాలన్న దురుద్దేశంతోనే మీరు ఈ దురాగతానికి ఒడిగట్టారు.

మీకు, అవినాష్‌కు వ్యతిరేకంగా మాట్లాడొద్దనడం అసంబద్ధం

నా రాజకీయ జీవితం నా ఇష్టం. నా వృత్తిపరమైన వ్యవహారశైలి ఎలా ఉండాలో నిర్దేశించే అధికారం మీకు లేదు. బహిరంగ వేదికలపై మీకు, ఎంపీ అవినాష్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడకూడదన్న నిబంధనపై నన్ను సంతకం చేయమని కోరడం అసంబద్ధం. నాకు అరకొర ఆస్తులు మాత్రమే ఇస్తూ చేసుకున్న ఒప్పందంపై సెటిల్‌మెంట్‌కి అలాంటి అర్థంపర్థంలేని నిబంధన విధించడం సహేతుకం కాదు.

మామగా అది మీ బాధ్యత!

తన జీవితకాలంలో సంపాదించిన ఆస్తులన్నీ నలుగురు మనవళ్లకు చెందాలన్న నాన్న అభిమతాన్ని, నా రాజకీయ ప్రయాణంతో ముడిపెట్టాలని చూడటం సరికాదు. నాకు అన్నగా, నా పిల్లలతో రక్తసంబంధం ఉన్న మామగా, మీరు ఇష్టపూర్వకంగా సంతకం చేసిన ఒప్పందాన్ని తు.చ. తప్పక అమలు చేయడం మీ బాధ్యత. మీరు నైతికంగా దిగజారిపోయిన లోతుల నుంచి పైకి రావాలని, తండ్రి ఆదేశాలను నెరవేర్చాలని ఇప్పటికీ ఆశిస్తున్నాను. మీరు ఆ పని చేయకపోతే నా హక్కుల్ని కాపాడుకోవడానికి చట్టపరంగా నాకున్న మార్గాల్లో వెళతాను. ఈ వాస్తవాల్లోని గాఢతను మీకు గుర్తు చేయడానికి, ఈ పరిణామాలన్నింటికీ సాక్షిగా అమ్మ కూడా ఈ లేఖపై సంతకం చేసింది.

నన్ను వ్యతిరేకించావ్.. నీకు రాసిచ్చిన ఆస్తుల్ని వెనక్కి తీసుకుంటా!

- నీపై ప్రేమ, ఆప్యాయతలు పోయాయి
- వైఎస్ షర్మిలకు జగన్ లేఖ



ఈనాడు, అమరావతి: 'నన్ను రాజకీయంగా వ్యతిరేకించావు. నా వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యవహరించావు. బహిరంగంగా తప్పుడు ప్రకటనలు చేశావు. అసత్యాలు చెప్పావు. నాకు వ్యతిరేకంగా ఇలాంటి అనేక కార్యకలాపాలకు పాల్పడ్డావు. నీ చర్యలన్నీ తీవ్రంగా బాధించాయి. అందుకే సరస్వతి పవర్ కంపెనీలో గిఫ్ట్ డీడ్ కింద నీకు రాసిచ్చిన వాటాల్ని వెనక్కి తీసుకుంటున్నా' అని వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన సోదరి, వైఎస్ షర్మిలకు లేఖ రాశారు. మనిద్దరి మధ్య సత్సంబంధాలు లేవని, అందుకే గతంలో నీకు ఇస్తున్న వాటాల్ని రద్దు చేసుకుంటున్నానని లేఖలో పేర్కొన్నారు. ఆగస్టు 27న రాసిన ఈ లేఖను ఆయన తాజాగా ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేసిన పిటిషన్‌కు అనుబంధంగా జతపరిచారు. ప్రధానాంశాలివీ..

కృతజ్ఞత లేని నీపై ఎందుకు ప్రేమ చూపాలి?

- మన తండ్రి సంపాదించిన, వారసత్వంగా సంక్రమించిన ఆస్తుల్ని ఆయన బతికున్నప్పుడే ఇద్దరికీ సమానంగా పంచారు. ఆ తర్వాత నా సొంత శ్రమ, పెట్టుబడితో వ్యాపారాలు మొదలుపెట్టాను. వాటికి వారసత్వంతో ఎలాంటి సంబంధం లేదు.
- ఎంతో ప్రేమ, ఆప్యాయతతో కొన్ని ఆస్తుల్ని నీ పేరిట బదిలీ చేశాను. నీకు విశ్వాసం కల్పించేందుకు గిఫ్ట్ డీడ్ కింద మన అమ్మ పేరిట కూడా కొన్ని షేర్లు రాసిచ్చాను. న్యాయపరమైన చిక్కులు తొలిగాక భవిష్యత్తులో ఆ ఆస్తులు నీకు చెందేలా ఒప్పందం చేశా. ఇవి కాకుండా నీకు నేరుగా, అమ్మ ద్వారా గత దశాబ్ద కాలంలో రూ.200 కోట్లు ఇచ్చాను. ఎలాంటి ఆబ్లిగేషన్ లేకున్నా నీపై ప్రేమతోనే ఇవన్నీ చేశా.
- అయినా నువ్వు కనీస కృతజ్ఞత లేకుండా వ్యవహరించావు. నా శ్రేయస్సు గురించైనా ఆలోచించలేదు. అది నీ విచక్షణకే వదిలేస్తున్నా. నీ చర్యలు వ్యక్తిగతంగా నన్ను తీవ్రంగా బాధించాయి. నీపై ప్రేమ, ఆప్యాయత తగ్గిపోయింది. నాకు వ్యతిరేకంగా అనేక చర్యలకు పాల్పడ్డ నీపై ప్రేమ, ఆప్యాయత చూపాల్సిన అవసరం లేదు.
- నీ ఆలోచనలో, ప్రవర్తనలో ఏదైనా సానుకూల మార్పులు వస్తే నీ పట్ల నా ప్రేమ, ఆప్యాయత పునరుద్ధరిస్తా. కోర్టు కేసులన్నీ పరిష్కారమయ్యాక ఆస్తులకు సంబంధించి ఏం చేయాలి? ఏం చేయకూడదు? ఎంత చేయాలనే అంశాలు పునఃపరిశీలిస్తా.
- 'నాకు, వైఎస్ అవినాష్‌రెడ్డి, భారతికి వ్యతిరేకంగా నువ్వు మాట్లాడొద్దు. రాజకీయంగా నాకు వ్యతిరేకంగా ఉండొద్దు' అంటూ జగన్ షర్మిలకు మరో లేఖ రాసినట్లు తెలిసింది.

తల్లి, చెల్లిపైనే కోర్టుకెక్కిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. ఆస్తుల పంపకానికి షర్మిలకు ట్రస్టీగా విజయమ్మకు గిఫ్ట్‌డీడ్ చేసినట్లు పేర్కొన్నారు. సరస్వతిలో తనకు చెందిన సండూర్ కంపెనీ వాటాలు 46,71,707, భారతి డైరెక్టర్‌గా ఉన్న క్లాసిక్ రియాల్టీకి చెందిన 71.50 లక్షల వాటాలను విజయమ్మకు బదిలీ చేయగా మొత్తం 1,21,74,707 వాటాలతో ఆమె భాగం 48.99 శాతానికి చేరిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో వివాదాలు పరిష్కారమయ్యాక షర్మిలకు బదలాయించాలన్న ఉద్దేశంతో తల్లికి ఈ వాటాలను బదలాయించినట్లు తెలిపారు. తమకు సమాచారం లేకుండా సరస్వతి పవర్‌లో తన పేర ఉన్న మరో 76,26,294, భారతికి ఉన్న 40.50 లక్షల వాటాలన్నింటినీ తల్లి విజయమ్మ పేరుతో ఇటీవల సరస్వతి బోర్డు బదలాయించిందన్నారు. సరస్వతి కంపెనీలోనే క్లాసిక్ రియాల్టీకి చెందిన 12లక్షల వాటాల్లో 11,37,874 వాటాలను విజయమ్మ పేరిట, 62,126 వాటాలను చాగారి జనార్దన్‌రెడ్డి పేరిట బదలాయించిందని తెలిపారు. ఈ ప్రక్రియను ఆమోదిస్తూ జులై 6న సరస్వతి బోర్డు తీర్మానించడం చట్టవిరుద్ధమన్నారు. బోర్డు కేటాయింపులను రద్దుచేసి అంతకుముందు ఉన్నట్లుగా తనకు 74,26,294 (29.88 శాతం), భారతికి 40,50,000 వాటాలు (16.30 శాతం), విజయమ్మకు 1,21,74,207 వాటాలు (48.99 శాతం), క్లాసిక్ రియాల్టీకి 12,00,000 (4.83) వాటాలను పునరుద్ధరిస్తూ రికార్డులను సరిదిద్దేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. డైరెక్టర్‌గా చాగారి జనార్దన్‌రెడ్డి పేరును రికార్డుల్లోంచి తొలగించాలని కోరారు.

బదలాయింపులు చూసి షాక్ అయ్యా

సరస్వతి కంపెనీ తాజాగా సమర్పించిన రిటర్న్‌లో తమ పేర్లతో ఉన్న వాటాలను తల్లి విజయమ్మ, జనార్దన్‌రెడ్డిల పేర్లతో బదలాయించినట్లు చూసి షాక్‌కు గురైనట్లు జగన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. బోర్డు డైరెక్టర్ల నివేదిక ప్రకారం జులై 2నే ఆర్వోసీ రికార్డుల్లో విజయమ్మ, జనార్దన్‌రెడ్డిల పేర్లతో మొత్తం వాటాలున్నట్లు కనిపిస్తోందని, ఇందుకు సమర్పించిన తీర్మానాన్ని జులై 6న బోర్డు ఆమోదించినట్లు తెలుస్తోందన్నారు. తీర్మానానికి ముందే వాటాల మార్పిడిపై సరస్వతి డైరెక్టర్లు ఆర్వోసీకి నివేదిక పంపినట్లు తెలుస్తోందన్నారు. దీనిపై షర్మిలతో జులైలో చర్చించామని, సరస్వతి ఆస్తుల జప్తుపై యథాతథస్థితి కొనసాగించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో తాజాగా జరిగిన వాటాల బదలాయింపు చెల్లదని షర్మిలకు జులై 23న వెల్లడించినట్లు తెలిపారు. ఇందుకోసం ముందుగా న్యాయసలహా తీసుకున్నట్లు తెలిపామన్నారు. ఈ విషయాలన్నీ తెలిసీ ఒప్పందాలు లేకుండా వాటాలను బదలాయించడం చట్టవిరుద్ధమన్నారు. ఒప్పందానికి విరుద్ధంగా ఒరిజినల్ వాటాపత్రాల్లో తమ సంతకాలు లేకుండా జరిగిన బదలాయింపును రద్దు చేయాలని కోరారు. తనకు, భారతికి, క్లాసిక్ రియాల్టీకి కలిపి సరస్వతిలో 51.01% వాటా ఉండేలా రిజిస్టర్లను సరిదిద్దాలని, డైరెక్టర్ల జాబితాలో జనార్దన్‌రెడ్డి పేరు తొలగించాలని కోరారు.

గిఫ్ట్‌డీడ్ రద్దు కుదరదు!


చెల్లి షర్మిలకు ఆస్తి పంపకాల్లో భాగం ఇవ్వడానికి కుదిరిన ఒప్పందంలో భాగంగా ట్రస్టీగా తల్లి విజయమ్మ పేరుతో గిఫ్ట్‌డీడ్ చేసిన జగన్ ఇప్పుడు దాన్ని రద్దు చేసుకుంటానంటున్నారు. గిఫ్ట్‌డీడ్‌లో పేర్కొన్న ఆస్తులను ఆటంకాలు లేకుండా అనుభవించవచ్చని, ఇందులో దాతతోపాటు ఎవరూ జోక్యం చేసుకోరనేది ఒప్పందంలో కీలకాంశం. తనతో సహా ఎవరూ ఆస్తి పంపకాల్లో జోక్యం చేసుకోరని హామీ ఇచ్చాక దానికి విరుద్ధంగా రద్దు చేసుకోవడం చెల్లదని న్యాయనిపుణులు చెబుతున్నారు.

కృతజ్ఞత మరిచిన చెల్లి

ప్రేమానుబంధాలతో ఆస్తుల్లో వాటా ఇచ్చారన్న కృతజ్ఞత లేకుండా షర్మిల తనకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టిందని జగన్, భారతిలు పేర్కొన్నారు. అంతేగాకుండా అవాస్తవాలు, తప్పుడు ప్రకటనలు చేశారని పేర్కొన్నారు. ఈ చర్యలు తనను రాజకీయంగా వ్యతిరేకించడంతో పాటు వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతీశాయన్నారు. అంతేగాకుండా అన్నాచెల్లెళ్ల అనుబంధంపై ప్రభావం చూపి ప్రేమ, అనుబంధాలను తగ్గించేలా చేశాయన్నారు. రాజకీయ ప్రేరేపితురాలైన చెల్లి వ్యక్తిగతంగాను బురద చల్లారని, దీంతో ఆవేదనకు గురైన తాను తమ మధ్య ఎలాంటి ప్రేమ మిగలలేదని గుర్తించినట్లు తెలిపారు. అందుకే చెల్లికి ఇవ్వాలన్న వాటాలు ఇవ్వడానికి చేసిన అవగాహన ఒప్పందం, తల్లికి గిఫ్ట్‌డీడ్ అమలు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. షర్మిల దురుద్దేశపూరిత చర్యల ద్వారా వాటాల బదలాయింపు అక్రమంగా జరిగాయని పేర్కొన్నారు.

మంత్రులు స్పీడ్ పెంచాలి

- ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాలకు ఎందుకెళ్లలేదు?
- ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదు?
- ఏ సంఘటన జరిగినా వెంటనే స్పందించాలి
- మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు క్లాస్



ఈనాడు, అమరావతి: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో, ఏదైనా ఘటన జరిగినప్పుడు వేగంగా స్పందించడంలో మంత్రులు వెనకబడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రుల వేగం పెరగాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. "జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రుల్ని నియమించి 15 రోజులైంది. మీకు కేటాయించిన జిల్లాలకు ఇంకా ఎందుకు వెళ్లలేదు? మనకు ప్రతి క్షణం విలువైందే. ఇన్‌ఛార్జి మంత్రులుగా నియమించామంటే మరింత బాధ్యతగా వ్యవహరించాలి" అని మంత్రివర్గ సహచరులకు ఆయన చిన్నపాటి క్లాస్ తీసుకున్నారు. బుధవారం మంత్రివర్గ సమావేశంలో ఎజెండాలోని అంశాలపై చర్చ ముగిశాక... మంత్రుల పనితీరు గురించి సీఎం మాట్లాడారు. "ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు మంత్రులు సమర్థంగా చెప్పట్లేదు. పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, ఉచిత ఇసుక, ధరల నియంత్రణ వంటి అనేక కార్యక్రమాల్ని ఈ నాలుగు నెలల్లో ప్రభుత్వం చేసింది. ఉచిత సిలిండర్లు ఇవ్వబోతున్నాం. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీదే. జిల్లాల్లో ఏ ఘటన జరిగినా ఆ జిల్లా మంత్రి, ఇన్‌ఛార్జి మంత్రులు వెంటనే స్పందించాలి. విజయనగరం జిల్లా గుర్లలో అతిసారవ్యాధి గురించి తెలియగానే జిల్లా మంత్రి, ఇన్‌ఛార్జి మంత్రి, ఆరోగ్యశాఖ మంత్రులు స్పందించాలి కదా? మా శాఖ గురించే మాట్లాడతామని మంత్రులు గిరిగీసుకోవద్దు. అందరూ అన్ని సబ్జెక్టులూ మాట్లాడాలి. కొందరు మంత్రులు వారి శాఖల గురించీ మాట్లాడటం లేదు" అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వంపై విపక్షాలు బురద జల్లితే వెంటనే స్పందించాలని, వాస్తవాలేంటో ప్రజలకు చెప్పి, విపక్షాల విమర్శల్ని తిప్పికొట్టాలని ఆయన సూచించారు. "ప్రభుత్వం కొత్తగా ఏర్పడినప్పుడు వివిధ అవసరాల నిమిత్తం మన దగ్గరకు వచ్చే జనం రద్దీ ఎక్కువగానే ఉంటుంది. అలాగని ప్రాధాన్యాలు నిర్ణయించుకుని పనులు చేయకపోతే దెబ్బతింటాం. మీ జిల్లాల పర్యటనలు, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసుకోవాలి. రెండు నెలల్లో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో పట్టాలకెక్కాలి" అని ఆయన పేర్కొన్నారు.

ఉచిత ఇసుకపై మంత్రులదే బాధ్యత

ఉచిత ఇసుక విధానం సమర్థంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత మంత్రులు, ఇన్‌ఛార్జి మంత్రులదేనని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. ఇసుక తీసుకెళుతున్న ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లను ఎవరైనా అడ్డుకుంటే పీడీ చట్టం కింద కేసులు నమోదుచేయాలని ఆదేశించారు. ట్రాక్టర్ ఇసుక రూ.1500 నుంచి రూ.2,300కే వినియోగదారుల ఇళ్లకు చేరాలన్నారు. సీనరేజి, జీఎస్టీ రద్దు వల్ల ప్రభుత్వం రూ.264 కోట్లు కోల్పోతున్నా... ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని సంపూర్ణంగా అమలు చేసేందుకు ఆ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన వివరించారు. పట్టా భూముల్లో ఇసుక ధరల నియంత్రణ గురించి కొందరు మంత్రులు ప్రస్తావించగా... పట్టా భూముల్లో రైతులు ఇసుక తవ్వుకుని వారి ఇష్టప్రకారం అమ్ముకోవచ్చని, అయినా రేవుల్లో ఉచితంగా దొరుకుతున్నప్పుడు పట్టా భూముల్లోని ఇసుక ఎవరు కొంటారని సీఎం ప్రశ్నించారు. "ఇసుకపై నియంత్రణలన్నీ తొలగించి, సీనరేజి కూడా రద్దుచేశాక... ప్రజల స్పందన మంత్రులు తెలుసుకున్నారా? ఆ ఫీడ్‌బ్యాక్ మీ దగ్గర ఉండాలి కదా" అని సీఎం వ్యాఖ్యానించారు. దానిపై మంత్రులు రామనారాయణరెడ్డి, అచ్చెన్నాయుడు, పార్థసారథి స్పందిస్తూ... ఇసుక లభ్యత పెరిగిందని, కొన్ని ప్రాంతాల్లో ఇదివరకు రూ.70 వేలు ఉన్న టిప్పర్ ఇసుక ఇప్పుడు రూ.26 వేలకే దొరుకుతోందని పేర్కొన్నారు. ఇసుక తవ్వకం, రవాణాల్లో ఎక్కడా అవకతవకలు జరగడానికి వీల్లేదని, ఎవరైనా ఎక్కువ ధర తీసుకుంటున్నట్టు తేలితే కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు.

సిలిండర్లు స్వయంగా ఇస్తే బాగుంటుందేమో

ఉచిత సిలిండర్ల పథకంలో భాగంగా సిలిండరు కొన్న 48గంటల్లోగా సబ్సిడీ మొత్తాన్ని లబ్ధిదారు ఖాతాలో ప్రభుత్వం జమచేస్తుందని అధికారులు వివరించారు. దానిపై మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ... పింఛన్లు ఇంటింటికీ వెళ్లి ఇస్తున్నట్టే, సిలిండరు కూడా అందిస్తే బాగుంటుందని సూచించారు. లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో డబ్బు వేయడం కంటే ఇలా చేస్తే ఎక్కువ ప్రభావం ఉంటుందన్నారు. తనకూ అలాంటి ఆలోచన ఉందని, కానీ ఐదు రాష్ట్రాలు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాయని, ప్రస్తుతానికి అదే విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. మార్పులపై తర్వాత ఆలోచిద్దామన్నారు.

ఆరంచెల పరిశీలన ఉండదు

పింఛన్ల లబ్ధిదారుల అర్హత నిర్ణయించేందుకు వైకాపా ప్రభుత్వం అనుసరించిన ఆరంచెల పరిశీలన ఇకపై ఉండబోదని సీఎం స్పష్టంచేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హత లేకపోయినా చాలామందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారంటూ వస్తున్న ఫిర్యాదుల పరిశీలనకు కమిటీ వేయాలని మొదట అనుకున్నా, తర్వాత దాన్ని పక్కన పెట్టారు. అలాంటి ఫిర్యాదుల్ని గ్రామసభ ముందుంచి, అప్పుడు నిర్ణయించాలని మంత్రివర్గం తీర్మానించింది.

కేంద్రం చేస్తున్న అభివృద్ధినీ చెప్పాలి

ఎన్డీయే మిత్రపక్షాలతో సమన్వయం బృందస్ఫూర్తితో జరగాలని మంత్రులకు చంద్రబాబు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించీ ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్రంలో రెండు రైల్వే లైన్లు ఉన్నచోట కేంద్రం మరో రెండు లైన్లు వేస్తోందని, ఆర్‌ఓబీలను కేంద్రం సొంత నిధులతోనే నిర్మిస్తోందని, 70కిపైగా రైల్వేస్టేషన్లను ఆధునికీకరిస్తోందని ఆయన పేర్కొన్నారు. వీటి గురించి ప్రజలకు వివరించాలన్నారు.

ఎర్రమట్టి దిబ్బల్ని విధ్వంసం చేసినవారిని గుర్తించండి

విశాఖలో శారదా పీఠానికి గత ప్రభుత్వం రూ.225 కోట్ల విలువైన 15 ఎకరాల భూమిని రూ.15 లక్షలకే కట్టబెట్టడంపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. తిరుమలలోనూ శారదా పీఠం ఉల్లంఘనలకు పాల్పడిందని, ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిందన్న అంశం చర్చకు వచ్చింది. దాన్ని తర్వాత చూద్దామని, ప్రస్తుతానికి విశాఖలో భూ కేటాయింపుల్ని రద్దు చేద్దామని మంత్రివర్గం నిర్ణయించింది. విశాఖలో వారసత్వ సంపదగా ఉన్న ఎర్రమట్టి దిబ్బల్ని కూడా వైకాపా నాయకుల ఆధ్వర్యంలో ధ్వంసం చేయడంపై చర్చ జరిగింది. దానికి బాధ్యులెవరో గుర్తించి, ఎంత మేర విధ్వంసం జరిగిందో నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రివర్గం ఆదేశించింది.

ఆ ఆస్పత్రులన్నింటిలో సామర్థ్యం పెంపు

మంగళగిరిలోని 30 పడకల ఆస్పత్రి సామర్థ్యాన్ని 100 పడకలకు పెంచే అంశం చర్చకు వచ్చినప్పుడు మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 30 పడకల ఆస్పత్రి సామర్థ్యాన్ని జగన్ ప్రభుత్వం ఆరు పడకలకు తగ్గించేసిందని, దాన్ని పునరుద్ధరించాలని కోరారు. దానిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ... రాష్ట్రంలో అలాంటి ఆస్పత్రులు ఎక్కడున్నా పూర్వస్థితికి తీసుకొద్దామని తెలిపారు.

డిసెంబరు 15న ఆత్మార్పణ దినం

రాష్ట్ర అవతరణ దినోత్సవంగా ఏ తేదీని పరిగణనలోకి తీసుకోవాలన్న అంశంపై మంత్రివర్గ సమావేశంలో విస్తృతచర్చ జరిగింది. అమరజీవి పొట్టి శ్రీరాములు బలిదానం చేసిన డిసెంబరు 15వ తేదీని ఆయన గౌరవార్థం ఆత్మార్పణ దినంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఆయన ఆత్మార్పణ ఫలితంగా 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తేదీ, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ అవతరించిన తేదీ, రాష్ట్ర విభజన తర్వాత జూన్ 2న నవ్యాంధ్ర ఏర్పడిన తేదీల్లో దేన్ని అవతరణ దినోత్సవంగా నిర్వహిస్తే బాగుంటుందన్న అంశంపై మంత్రుల సలహాలు, సూచనలు కోరారు. జూన్ 2న నవనిర్మాణ దినంగా నిర్వహించాలని నిర్ణయించారు.

వరద బాధితులకు విరాళాలతో భరోసా



సీఎం చంద్రబాబుకు రూ.89 లక్షల చెక్కు అందజేస్తున్న టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: వరద బాధితుల సహాయార్థం టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు రూ.89,52,452 విరాళం చెక్కును గురువారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి అందజేశారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాల యాజమాన్యం-విద్యార్థులు, ప్రైవేట్ స్కూల్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సోమరాజు భూపతిరాజు, పి.వెంకట సుబ్బారావు రూ.5లక్షల చొప్పున చంద్రబాబుకు వేర్వేరుగా చెక్కులు అందించారు. నంద్యాల నియోజకవర్గ ప్రజల తరపున మంత్రి ఎన్ఎండీ ఫరూక్ రూ.4.10 లక్షలు ఇచ్చారు.



సచివాలయంలో మంత్రి లోకేశ్‌ను కలిసిన దక్షిణ కొరియాకు చెందిన ఎగ్జిమ్ బ్యాంకు ప్రతినిధులు

దక్షిణ కొరియా సంస్థల పెట్టుబడులకు సహకారం అందిస్తాం

- మంత్రి లోకేశ్‌తో భేటీలో ఎగ్జిమ్ బ్యాంకు ప్రతినిధులు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో దక్షిణ కొరియా సంస్థల పెట్టుబడులకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎగ్జిమ్ బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో చెన్నైలోని దక్షిణ కొరియా కాన్సుల్ జనరల్ కిమ్ చాంగ్ యున్‌తో, ఎగ్జిమ్ బ్యాంకు ఆఫ్ కొరియా ఈడీసీఎఫ్ ప్రతినిధులు కెవిన్ చోయ్, జంగ్ వాన్ రియూ తదితరులు బుధవారం సమావేశమయ్యారు. పెట్టుబడుల అనుకూల వాతావరణం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, అందిస్తున్న రాయితీలను ఈ సందర్భంగా ఎగ్జిమ్ బ్యాంకు ప్రతినిధులకు లోకేశ్ వివరించారు. పరిశ్రమలకు త్వరితగతిన అనుమతుల మంజూరుకు ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డును పునరుద్ధరించామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో కొరియా సంస్థల భాగస్వామ్యం కావాలని లోకేశ్ కోరారు.

మంగళగిరి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి రూ.52 కోట్లు

- మంత్రి లోకేశ్ చొరవతో నిధుల విడుదలకు మంత్రివర్గం ఆమోదం

తాడేపల్లి, న్యూస్‌టుడే: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో మంగళగిరి ప్రభుత్వ వైద్యశాల దశ తిరగనుంది. 30 పడకలుగా ఉన్న ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించనున్నారు. ఈ మేరకు రూ.52 కోట్లు మంజూరు చేయడానికి మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్, అప్పటి మంగళగిరి ఎమ్మెల్యే, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు నేతృత్వంలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఎయిమ్స్ నేతృత్వంలో అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌గా దీన్ని కొనసాగిస్తున్నారు. ఎంతోకాలం నుంచి వైద్యశాల భవనం శిథిలమై ప్రమాదభరితంగా మారింది. గత వైకాపా ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధిపై పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించింది. మంగళగిరి ఎమ్మెల్యేగా లోకేశ్ ఎన్నికైన తర్వాత.. ఆసుపత్రి పునరుద్ధరణపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. దీనిపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక అండతో డ్రోన్ల అంకురాలు

నిధుల కొరతతో పరిశోధనలు ముందుకెళ్లడం లేదు ● ప్రభుత్వం గ్రాంటు అందిస్తేనే సాంకేతికత వ్యాప్తికి అవకాశం

● బృంద చర్చలో పలువురు వక్తల అభిప్రాయం ● పారిశ్రామిక విధానంతో డ్రోన్ల రంగానికి మేలు ● ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్

ఈనాడు – అమరావతి

"డ్రోన్ల రంగంలో పరిశోధన, అభివృద్ధి కోసం స్టార్టప్‌లు (అంకుర సంస్థలు) నిధుల కొరత సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. డ్రోన్ల రంగంలో భారీగా పెట్టుబడులు.. ఆదాయం వచ్చే మార్గం ఉన్నా నిధుల సమస్య ఇబ్బంది పెడుతోంది. డ్రోన్ల స్టార్టప్ రంగానికి ఆర్థికంగా ఊతం అందిస్తే మెరుగైన సాంకేతికత అందించడం సాధ్యం. సర్వీస్, లాజిస్టిక్స్, వ్యవసాయ రంగాల్లో వినియోగం నానాటికీ పెరుగుతోంది. కానీ ప్రభుత్వాల నుంచి ఆశించినంత సహకారం లేదు. ఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు 2021 చట్టంలోని నిబంధనలను కేంద్రం సరళీకరించినా.. ఆశించిన ఫలితాలు రాకపోవడానికి ఇవన్నీ కారణాలు" అని నిపుణులు అభిప్రాయపడ్డారు. అమరావతి డ్రోన్ సదస్సు రెండోరోజు కార్యక్రమాల్లో భాగంగా "డ్రోన్ల రంగం విస్తరణకు అనుకూల వాతావరణం కల్పించడానికి ఉన్న అవకాశాలు.. నిధుల కోసం పెట్టుబడిదారులకు సవాళ్లు" అనే అంశంపై నిర్వహించిన బృందచర్చలో నిపుణులు డ్రోన్ రంగం విస్తరణకు ఉన్న అడ్డంకులను వివరించారు.

ప్రధాన అడ్డంకులు ఇవి

- నిధుల కొరతతో పూర్తిస్థాయిలో ఆర్ అండ్ డీ నిర్వహించలేకపోతున్నాం. ఉన్న వనరులతో సర్దుకుపోవాల్సి వస్తోంది.
- ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహకాలు అందిస్తే.. ఈ రంగంలో అద్భుతాలు ఆవిష్కరిస్తాం.
- స్టార్టప్‌లకు హ్యాండ్ హోల్డింగ్ అందించే వ్యవస్థను ప్రభుత్వాలు అందుబాటులోకి తేవాలి.
- వీటికి వ్యాపారాన్ని ప్రభుత్వాలే సమకూర్చేలా ఆలోచన చేయాలి.
- అంకురాల జాబితాను సేకరిస్తే.. దేశంలో ఎన్ని ఉన్నాయి? వాటి అవసరాలు ఏంటో తెలుసుకునే అవకాశం ఉంటుంది.
- ప్రభుత్వాలు టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేసి.. గ్రాంట్ల రూపంలో స్టార్టప్‌లకు ఆర్థిక సహకారాన్ని అందించాలి.



సదస్సులో మాట్లాడుతున్న సీఐఐ టాస్క్‌ఫోర్స్ షార్ట్‌హాల్ ఎయిర్ అండ్ మొబిలిటీ ఛైర్మన్ అమిత్ దత్తా. చిత్రంలో రాష్ట్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి నివాస్, డ్రోన్ సాంకేతికత అభివృద్ధి చేసే సంస్థల ప్రతినిధులు రోహన్, అమర్‌దీప్, నామన్ పుష్ప్

డ్రోన్ల రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు

రాష్ట్రంలో డ్రోన్ రంగం విస్తరణకు అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలులో ఉన్న పారిశ్రామిక విధానం.. డ్రోన్ల కోసం ప్రత్యేకవిధానం ద్వారా ఈ రంగం విస్తరణకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రైవేటు రంగం ద్వారా భారీ పెట్టుబడులను ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని తెలిపారు. బృందచర్చలో మాట్లాడుతూ.. "రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా స్థిర మూలధన పెట్టుబడిపై (ఎఫ్‌సీఐ) ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోంది. ఈ వెసులుబాట్లు డ్రోన్ పాలసీలో పెట్టుబడి పెట్టేవారికీ వర్తిస్తాయి. ఎఫ్‌సీఐపై కనీసం 10%.. గరిష్ఠంగా 35% వరకు మూలధనంపై ప్రోత్సాహకాలు పొందే అవకాశం ఉంటుంది. ప్రైవేటు పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎకరాకు రూ.5లక్షల వరకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుంది. ప్రభుత్వమే పార్కులను అభివృద్ధి చేసి ప్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమలకు స్పేస్‌ను అందిస్తుంది. పెట్టుబడుల ఆకర్షణకు అవసరమైన వాతావరణాన్ని కల్పించడంలో ఇవన్నీ కీలకం. ఈ తరహాలో 'డ్రోన్ టెక్‌జోన్'ను అందుబాటులోకి తీసుకురాబోతున్నాం" అని పేర్కొన్నారు.



స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన డ్రోన్‌ను ఆసక్తిగా చూస్తున్న విద్యార్థినులు

రక్షణ రంగంలో డ్రోన్లదే కీలక పాత్ర

● యుద్ధాల్లో విస్తృతం కానున్న వినియోగం

● ఆ మేరకు దేశీయంగా డ్రోన్ల తయారీ పెరగాలన్న నిపుణులు

యుద్ధరంగంలో డ్రోన్, యాంటీ డ్రోన్ సాంకేతికతల వినియోగం భవిష్యత్తులో మరింత విస్తృతం కానుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. వీటి ఫలితంగా యుద్ధ వ్యూహాలు, సన్నద్ధతలో గణనీయ మార్పులు చోటుచేసుకోనున్నాయని పేర్కొన్నారు. వీటిని అందిపుచ్చుకునేలా ఎప్పటికప్పుడు సాంకేతికతను మెరుగుపరుచుకుంటూ దేశీయంగా డ్రోన్ల తయారీ పెరగాలని పిలుపునిచ్చారు. సాయుధ దళాలు, పోలీసు బలగాలు వినియోగించే డిఫెన్స్ డ్రోన్లను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి పోయి.. ఇక్కడి నుంచి ఎగుమతులు చేసే స్థాయికి చేరుకోవాలని చెప్పారు. డ్రోన్ సమిట్‌లో భాగంగా రెండో రోజైన బుధవారం.. 'భవిష్యత్తు యుద్ధ రంగంలో దేశీయ డ్రోన్లు, యాంటీ డ్రోన్ సాంకేతికతల పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. మద్రాసు ఐఐటీ డిఫెన్స్ డ్రోన్ల విభాగాధిపతి హెచ్‌ఎస్‌ఎన్ మూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్ డీఐజీ ఎస్.సెంథిల్‌కుమార్ మాట్లాడుతూ 'అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్ల కోసం వినియోగించే డ్రోన్లలో విజిబిలిటీ చాలా తక్కువగా ఉంటోంది. సాధారణంగా ఇలాంటి కార్యకలాపాలకు ఎక్కువ సమయం పడుతుంది. అయితే డ్రోన్ల బ్యాటరీ సామర్థ్యం, అవి ఎగరగలిగే సమయం ఆ స్థాయిలో ఉండట్లేదు. రియల్ టైమ్ ఫుటేజీ పొందటమూ కొన్నిసార్లు సాధ్యపడట్లేదు. ఈ స్థాయి డ్రోన్ల కొనుగోలు, నిర్వహణకు చాలా ఎక్కువ ఖర్చవుతోంది. అర్బన్ యుద్ధక్షేత్రాలకు సంబంధించి ఇరుకైన ప్రదేశాల్లో వీటిని ఎగరేయడం ఇబ్బందవుతోంది. ఇలాంటి ప్రాక్టికల్ సమస్యలు, పరిమితులను పరిష్కరించేలా దేశీయ డ్రోన్లను తయారు చేయాలి' అని సంబంధిత సంస్థలను కోరారు. డ్రోన్ సాంకేతికత తయారీ సంస్థల ప్రతినిధులు అశ్విన్ శాస్త్రి, ప్రగదీశ్, జాన్ లివింగ్‌స్టన్, డా.నాగేంద్ర, గౌరవ్ శర్మ తదితరులు మాట్లాడారు.



2 కిలోల వస్తువులు తీసుకెళ్లగలిగే డ్రోన్

అమెరికా తరహాలో కన్సార్షియానికి నిధులివ్వాలి

'దేశీయంగా డిఫెన్స్ డ్రోన్ల తయారీ సాంకేతికతను మరింత అభివృద్ధి చేసేందుకు వీలుగా విద్యా సంస్థలు, జాతీయ స్థాయి ల్యాబ్‌లు, పరిశ్రమలతో కూడిన కన్సార్షియానికి ప్రభుత్వాలు నిధులివ్వాలి. అమెరికాలో ఈ నమూనా అమలు చేసి విజయం సాధించారు' అని కొందరు నిపుణులు అభిప్రాయపడ్డారు. వారి సూచనలివి.

- టెస్టింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సర్టిఫికేషన్ ఏజెన్సీలను ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాటు చేస్తే.. స్టార్టప్‌లు మరింత విస్తృతంగా వస్తాయి.
- పూర్తిస్థాయిలో దేశీయ డ్రోన్ తయారీకి వీలుగా వాటి విడిభాగాలూ మనమే ఉత్పత్తి చేయాలి.
- భద్రత బలగాలు, రాష్ట్ర పోలీసు విభాగాలు, సాయుధ దళాల అవసరాలకు తగ్గట్టుగా తయారీని పెంచాలి.
- యుద్ధరంగంలో శత్రువులు ఎగరవేసే డ్రోన్లను గుర్తించాలన్నా, వాటిని నాశనం చేయాలన్నా యాంటీ డ్రోన్ టెక్నాలజీ చాలా కీలకం. ఆ దిశగానూ అంకుర పరిశ్రమల ఏర్పాటుకు ఇదే అనువైన సమయం.



సదస్సులో మాట్లాడుతున్న బిగ్‌బ్యాంగ్ బూమ్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ శర్మ. చిత్రంలో డ్రోన్ సాంకేతికత తయారు చేసే సంస్థల ప్రతినిధులు నాగేంద్ర, ఆక్టోపస్ డీఐజీ సెంథిల్‌కుమార్, జాన్ లివింగ్‌స్టోన్, తదితరులు



మంగళగిరిలో జరిగిన అమరావతి డ్రోన్ సదస్సుకు బుధవారం హాజరైన ప్రతినిధులు

డ్వాక్రా మహిళలకు ఊతం

వ్యవసాయరంగంలో ఉన్న డ్వాక్రా మహిళలకు డ్రోన్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని వ్యవసాయ రంగంలో మందుల పిచికారీకి వినియోగించనున్నారు. తొలి విడతగా 100 మందికి ఇచ్చేలా కసరత్తు ప్రారంభించింది. ఆ మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా పీడీలకు ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నమో డ్రోన్ దీదీ కార్యక్రమాన్ని అనుసంధానించుకుని ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయనున్నారు. దీని కింద ఈ ఏడాదికి రాష్ట్రానికి 250 డ్రోన్లను కేంద్రం మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వారం, పది రోజుల్లో కేంద్రం నుంచి ఇందుకు సంబంధించిన సమాచారం రాష్ట్రానికి అందనుంది. డ్వాక్రా మహిళలకు అందించే ఒక్కో డ్రోన్ విలువ రూ.10 లక్షలు. దీన్ని వీరికి 80 శాతం రాయితీతో అందిస్తారు. అంటే రూ.8 లక్షల వరకు రాయితీగా అందనుంది. మిగతా రూ.2 లక్షలు లబ్ధిదారులు చెల్లించాలి. ఎంపిక చేసిన లబ్ధిదారులకు..పొలంలో డ్రోన్ ద్వారా మందులు చల్లడంపై శిక్షణ ఇస్తారు.

ప్రకృతి వైపరీత్యాలలో తోడు

- విజయవాడలో ఇటీవలి వరదల్లో సుమారు 6 లక్షల మంది చిక్కుకున్నారు. 1.8 లక్షల ఇళ్లు నీట మునిగాయి. మారుమూల ప్రాంతంలో ఉన్న వారికి ఆహారం, అత్యవసర మందులు అందని పరిస్థితి ఉంది. ఆ సమయంలో సేవలకు డ్రోన్లు వినియోగిస్తే ఎలా ఉంటుంది? వాటిని ఎలా వినియోగించాలని పరిశీలించాం. ఒక అప్లికేషన్ రూపొందించి.. కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాం.
- సహాయక చర్యల్లో 427 డ్రోన్లు వినియోగించాం. 846 మంది సాంకేతిక నిపుణుల సహకారం తీసుకున్నాం. 1,23,731 మందికి ఆహారం, మందులు అందించాం.
- వరద తగ్గిన తర్వాత పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన ప్రాంతాలను డ్రోన్ల ద్వారా మ్యాపింగ్ చేశాం. దోమల నియంత్రణ కోసం మనుషులు వెళ్లడానికి వీలు లేనిచోట్ల డ్రోన్ల ద్వారా మందు చల్లించాం.
- ఎన్ని ఇళ్లు వరదలో చిక్కుకున్నాయనే వివరాలను సేకరించాం.
- డ్రోన్ల ద్వారా సేకరించిన చిత్రాలతో ఏఐ ఆధారంగా అక్కడి వాస్తవ పరిస్థితిని అంచనా వేశాం.

- 'ప్రకృతి వైపరీత్యాల సమయంలో డ్రోన్ల వినియోగం' అంశంపై చర్చ సందర్భంగా ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేష్‌కుమార్

భూముల రీసర్వేలో కచ్చితత్వం

- 'శాస్త్రీయ విధానంలో డ్రోన్లతో భూముల రీసర్వే చేస్తే ప్లస్ ఆర్ మైనస్ పది సెంటీమీటర్ల మేర మాత్రమే వ్యత్యాసం రావచ్చు.
- ఒకే గ్రామంలో వేర్వేరుచోట్ల ఒకే వ్యక్తికి చెందిన భూములను కలిపి ఒకే ల్యాండ్ పార్సిల్ మ్యాప్ తయారవుతోంది. డ్రోన్ల ద్వారానే ఇది సాధ్యమవుతోంది
- గ్రామాల సరిహద్దులు, ప్రధాన కూడళ్ల గుర్తింపు జరుగుతోంది. గ్రామాల మ్యాపులు తయారవుతున్నాయి.
- డ్రోన్ల ద్వారా వచ్చే సమాచారం ఆధారంగా శాటిలైట్ అనుసంధానంతో పనిచేసే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కచ్చితమైన వివరాలు రీ-సర్వే ల్యాండ్ రిజిస్టర్లలో (ఆర్‌ఎల్‌ఆర్)నమోదవుతాయి. రియల్‌టైమ్ డేటా తయారవుతోంది. డ్రోన్ల ద్వారా తీసే ఫొటోలు, లభించే సమాచారం ఆధారంగానే ఇది సాధ్యమవుతోంది.
- తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణాన్ని కొలిచే వీలుంది. విలువైన సమయం ఆదా అవుతుంది. డిజిటల్ రికార్డులు తయారవుతున్నాయి.
- రోజుకు 500 నుంచి 700 ఎకరాల వరకు డ్రోన్ల ద్వారా ఫొటోలు తీసే అవకాశం ఉంది. రీఛార్జింగ్ బ్యాటరీలు వినియోగంలో ఉన్నాయి.
- వాతావరణ పరిస్థితుల ఆధారంగానే డ్రోన్లను వినియోగించవచ్చు. వాతావరణపరంగా ఆరేడు నెలల వరకు రకరకాల సమస్యలు వస్తుంటాయి.

- 'బిల్డింగ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ ఇన్ రూరల్ ఇండియా త్రూ డ్రోన్స్' అన్న అంశంపై ప్రకాశం జిల్లా జేసీ గోపాలకృష్ణ రోణంకి

అందుబాటులోకి సాంకేతిక వనరులు

డ్రోన్లు ఉపయోగించడమే కాకుండా సెన్సర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని విశ్లేషించి భద్రపరిచే సాంకేతికతను అభివృద్ధి చేయడం ద్వారా ఈ రంగం మరింత అభివృద్ధి సాధించగలదని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. డ్రోన్ల తయారీ సంస్థలకు ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. రైతుల్లోనూ డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించడంతోపాటు తగినన్ని సర్వీస్ సెంటర్లు అందుబాటులోకి తీసుకు రావాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. అమరావతి డ్రోన్ సమ్మిట్-2024లో భాగంగా బుధవారం మంగళగిరిలో 'ప్రజలందరికీ అందుబాటులోకి డ్రోన్ సాంకేతికత' అనే అంశంపై ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ప్రణవ్ పెద్దింటి సమన్వయకర్తగా నిర్వహించిన చర్చలో పలువురు నిపుణులు మాట్లాడారు. 'డ్రోన్ల వినియోగంపై ప్రజల్లో ఉన్న అపోహలు కూడా తొలగించాలి. అప్పుడే వీటి విస్తృతి మరింత పెరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వాలు ప్రయత్నించాలి. తక్కువ ఖర్చుతో డ్రోన్లతో ఎక్కువ ప్రయోజనం ఉందన్న విషయాన్ని ప్రజల్లోకి బాగా తీసుకెళ్లాలి' అని ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ రామచంద్రప్రసాద్ అన్నారు.

డ్రోన్ సదస్సు సక్సెస్

అమరావతి డ్రోన్ సదస్సులో వివిధ రంగాలకు చెందిన 62 మంది నిపుణులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేష్‌కుమార్ ప్రకటించారు. సదస్సులో నాలుగు కీలక ఉపన్యాసాలు జరగ్గా.. 62 ప్యానల్ స్పీకర్లు పాల్గొన్నారన్నారు. ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "డ్రోన్ల ప్రదర్శనకు 50 స్టాళ్లను ఏర్పాటు చేశాం. రెండు రోజుల్లో సుమారు 11 వేల మంది డ్రోన్ల ప్రదర్శన తిలకించారు. సదస్సుకు 4 వేల మందికి పైగా హాజరయ్యారు. డ్రోన్ సమిట్ అంచనాలకు మించి విజయవంతమైంది" అని పేర్కొన్నారు.

పోలవరం పైలట్ ప్రాజెక్టుగా నిలవాలి

అదే దోవలో మిగతావాటినీ పూర్తి చేయాలి

- ప్రధాన డ్యాం నిర్మాణ ప్రణాళిక తీసుకోండి
- కేంద్ర గడువులోపు పూర్తి చేయాలి
- జలవనరుల ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

ఈనాడు–అమరావతి: 'పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ పనులు త్వరగా పూర్తి చేయాలి. 2025 చివరికి పూర్తి చేసేలా చూడాలి. ప్రణాళిక షెడ్యూల్ మార్చాలి. ప్రధాన డ్యాం నిర్మాణ షెడ్యూల్ కూడా గుత్తేదారు కంపెనీ నుంచి ముందే తీసుకోవాలి. కేంద్రం గడువుకు తగ్గట్టుగా పనులు పూర్తి కావాలి. అవసరమైతే మేఘా, బావర్ కంపెనీ ప్రతినిధులతో చర్చిద్దాం. అన్ని ప్రాజెక్టులకు పోలవరం పైలట్‌గా నిలవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. షెడ్యూల్ మార్చి తీసుకువస్తే, పోలవరం ఎప్పటికి పూర్తి చేస్తామో స్పష్టంగా ప్రకటిద్దామన్నారు. 'జలవనరుల సంరక్షణలో సృజనాత్మకంగా ఆలోచించాలి. ఎక్కడెక్కడ ఆర్థిక వనరులు వెచ్చిస్తే నీటిని ఎంత సమర్థంగా వినియోగించుకోగలమో చక్కని ప్రణాళిక ఉండాలి. ప్రస్తుతం సిద్ధం చేసిన ప్రణాళికను నవీకరించి తీసుకురండి. ఒక ఏడాది వరద నీటిని సరిగా నిల్వ చేసుకునేలా.. రెండేళ్లు కరవు వచ్చినా ఇబ్బంది లేని విధంగా ప్రణాళిక ఉండాలి' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సీఎం కార్యాలయ కార్యదర్శి రాజమౌళి, ఈఎన్సీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



జలవనరుల శాఖపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు

పెండింగ్ బిల్లుల పైనా చర్చ

పోలవరం తొలిదశలో భూసేకరణ, పునరావాసం కోసం రూ.7,213 కోట్లు అవసరమని ప్రాజెక్టు పనులతో పాటు సమాంతరంగాను వీటిని చేపట్టవలసి ఉందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. పెండింగ్ బిల్లుల గురించి అధికారులు తెలియజేయగా వాటి చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని సీఎం తన కార్యాలయ అధికారులను ఆదేశించారు.

ఆరు ప్రాజెక్టులకు ప్రాధాన్యం

ఈ ఆర్థిక సంవత్సరంలో ఆరు సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చారు. వాటిని పూర్తి చేసేందుకు ఏయే వనరులు అవసరమో ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. పోలవరంతో పాటు చింతలపూడి ఎత్తిపోతల, వంశధార రెండో భాగం రెండోదశ, హంద్రీనీవా కాలువల వెడల్పు, కుప్పం కాలువ పెండింగ్ పనులతో పాటు లైనింగ్, వెలిగొండ ప్రాజెక్టు, గోదావరి పెన్నా అనుసంధానంపై సీఎం చర్చించారు.

హంద్రీనీవా వెడల్పునకు పచ్చజెండా

హంద్రీనీవా కాలువల వెడల్పు, లైనింగ్ పనులకు రూ. 2,561 కోట్లు ఖర్చవుతాయని అధికారులు తెలపగా ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతలకు రూ. 2,043 కోట్లు ఖర్చవుతుందని పేర్కొనగా వచ్చే సీజన్ నాటికి తొలిదశలో నీళ్లు ఇచ్చేలా చూడాలని చంద్రబాబు చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టులో తొలిదశలో 1.19 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా తొలుత పనులు పూర్తి చేయాలన్నారు. ఇందుకు రూ.1,458 కోట్లు ఖర్చవుతుందని అధికారులు పేర్కొన్నారు. వంశధార రెండోదశ రెండో భాగం పనులను రూ. 122 కోట్లు ఖర్చు చేసి వచ్చే సీజన్‌కే పూర్తి చేసి నీళ్లు ఇవ్వాలన్నారు.

నిర్వహణకు రూ.983 కోట్లు

రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణకు ఏడాదికి రూ. 983 కోట్లు ఖర్చవుతుందని అధికారులు పేర్కొనగా సీఎం అంగీకరించారు. గత ప్రభుత్వం 5 ఏళ్లకు కలిపి రూ. 275 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని అధికారులు తెలియజేశారు. పంట కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని పొరుగు సేవల విధానంలో తీసుకోవాలని సీఎం సూచించారు. నీటిపారుదల కార్పొరేషన్ పరిధిలో ఉన్న 1,047 ఎత్తిపోతల పథకాల నిర్వహణకు మరమ్మతులకు 10 ఏళ్ల యాన్యుటీ పద్ధతిలో ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

అటు తండ్రి మరణం.. ఇటు పుత్రుడి జననం

ఒకే ఆసుపత్రిలో రెండు ఘటనలు



శివ

రాజోలి, న్యూస్‌టుడే: తెలంగాణలోని జోగులాంబ గద్వాల్ జిల్లా. మండల కేంద్రం రాజోలిలో శివ (26) అనే యువకుడు పెట్రోలు బంకులో పనిచేస్తున్నాడు. ఏపీలోని ఉమ్మడి కర్నూలు జిల్లా బనగానిపల్లెకు చెందిన లక్ష్మితో అతడికి 14 నెలల కిందట వివాహమైంది. ఆమె గర్భం ధరించడంతో కాన్పు కోసం పుట్టింటికి వెళ్లింది. శివ మంగళవారం సాయంత్రం రాజోలిలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ఎస్సీ కాలనీ వద్ద అదుపు తప్పి పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో రాత్రి 8 గంటలకు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఈ విషయాన్ని బనగానిపల్లెలో ఉన్న లక్ష్మికి తెలిపినా.. ప్రాణాపాయం లేదని ధైర్యం చెప్పారు. సరిగ్గా మంగళవారం రాత్రే లక్ష్మికి పురిటినొప్పులు రాగా.. రాత్రి 10 గంటలకు ఆమెను కూడా కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోనే చేర్చారు. బుధవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో పరిస్థితి విషమించడంతో శివ మృతి చెందాడు. లక్ష్మి ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉండడంతో ఆ విషయాన్ని ఆమెకు చెప్పలేదు. అనంతరం వైద్యులు ఆమెకు సిజేరియన్ ద్వారా ప్రసవం చేయగా.. మగబిడ్డ జన్మించాడు. తండ్రి కన్నుమూసిన సుమారు గంట తర్వాత ఆ పసివాడు కళ్లు తెరిచాడు. పండంటి బిడ్డ పుట్టిన ఆనందాన్ని అనుభవించనీయకుండా.. శివ మృతి రూపంలో ఆ కుటుంబాన్ని విషాదం కమ్మేసింది.

సీఎంను కలిసిన ముస్లిం సంఘాల ప్రతినిధులు, ఎమ్మెల్యేలు

వక్ఫ్ చట్టం సవరణపై అభ్యంతరాల నివేదన



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం సంఘాల ప్రతినిధులు. చిత్రంలో మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ తదితరులు

ఈనాడు, అమరావతి: ఆలిండియా ముస్లిం లా బోర్డు సహా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు ముస్లిం సంఘాల ప్రతినిధులు, తెదేపా ఎమ్మెల్యేలు, రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ చట్టం సవరణపై తమ అభ్యంతరాలను తెలిపారు. వక్ఫ్ చట్టంలో మార్పులను పార్లమెంటులో వ్యతిరేకించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ ప్రతిపాదనల కారణంగా వక్ఫ్ బోర్డు నిర్వీర్యమవుతుందని, ముస్లిం సామాజిక వర్గం హక్కులు, మనోభావాలు దెబ్బతింటాయని వెల్లడించారు. దీనిపై చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని వారికి సీఎం తెలిపారు.

భవన నిర్మాణ పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ

పురపాలకశాఖ మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: భవన నిర్మాణ అనుమతుల పెండింగ్ దరఖాస్తుల తక్షణ పరిష్కారానికి పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తు వివరాలను 93987 33100, 93987 33101 నంబర్లకు వాట్సప్ ద్వారా, ఈ మెయిల్(apdpmshelpdesk@gmail.com)కూ పంపొచ్చని మంత్రి సూచించారు. అన్ని పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ప్రత్యేక విభాగం పని చేస్తుందని తెలిపారు. నిబంధనల ప్రకారం అన్ని రకాల డాక్యుమెంట్లు ఉండీ.. రుసుములు చెల్లించిన అన్ని అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు.

సిసోదియా పీఏ రూ.10 లక్షల చేతివాటం

ఈనాడు, అమరావతి: రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియాకు వ్యక్తిగత సహాయకుడిగా ఉన్న రాజశేఖర్ వివాదాస్పద భూమి పరిష్కార విషయంలో రూ.10 లక్షలను లంచంగా తీసుకున్నారు. తాత్కాలిక పద్ధతిలో ఏడెనిమిది ఏళ్ల నుంచి రాజశేఖర్ పనిచేస్తున్నారు. తిరుపతిలోని ఓ దేవాలయ భూమి వివాదం కోర్టులో నడుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫైలును క్లియర్ చేయిస్తానని చెప్పి, రూ.10 లక్షల వరకు తీసుకున్నాడని అధికారులు తెలిపారు.

14న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 14న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని పాఠశాల విద్యాశాఖ నిర్వహించనుంది. తల్లిదండ్రులను ఆహ్వానించేందుకు ఆహ్వాన పత్రికను సిద్ధం చేసింది. ప్రధానోపాధ్యాయులు సంతకం చేసి, దీన్ని తల్లిదండ్రులకు పంపిస్తారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలు, తరగతిలో విద్యార్థి అవగాహన, ప్రవర్తన, సబ్జెక్టుల వారీగా అభ్యసనను తల్లిదండ్రులకు వివరిస్తారు. బాలికల విద్య, మధ్యాహ్న భోజనం ప్రాధాన్యం, ఇంట్లో పాజిటివ్ వాతావరణం లాంటి అంశాలనూ చర్చిస్తారు. తల్లిదండ్రులకు రంగోలి తరహా పోటీలు నిర్వహించి, బహుమతులు అందిస్తారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట వరకు సమావేశం సాగుతుంది.

అధునాతన బస్సులు నడిపే డ్రైవర్లకు శిక్షణ ఏది?

- ఆన్‌లైన్‌లో విచారణకు హాజరై వివరణ ఇవ్వండి
- ఏపీఎస్ఆర్టీసీ ఎండీకి హైకోర్టు ఆదేశం
- నవంబర్ 6కు విచారణ వాయిదా

ఈనాడు, అమరావతి: వోల్వో, ఇతర అధునాతన, హైఎండ్ టెక్నాలజీ బస్సులను నడిపే డ్రైవర్లకు శిక్షణ ఎందుకు ఇవ్వడం లేదని ఆర్టీసీ ఉన్నతాధికారులను హైకోర్టు ప్రశ్నించింది. శిక్షణ లేని వారితో ఎలా బస్సులను నడిపిస్తున్నారని వ్యాఖ్యానించింది. అలాంటి బస్సులను నడిపే డ్రైవర్లకు శిక్షణ తప్పనిసరి అని ఒప్పందంలోనే ఉందికదా అని ప్రశ్నించింది. ఆ ఒప్పందాన్ని ఎందుకు అమలు చేయడం లేదంది. నవంబర్ 6న విచారణకు ఆన్‌లైన్ ద్వారా హాజరై వివరణ ఇవ్వాలని ఏపీఎస్ఆర్టీసీ ఎండీని ఆదేశించింది. రవాణశాఖ ముఖ్యకార్యదర్శి, ఆర్టీసీ ఎండీ, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజరు, వీఈ కమర్షియల్ వాహనాల లిమిటెడ్ (వోల్వో గ్రూప్, ఐషర్ మోటార్స్-జాయింట్ వెంచర్) సీఈవోకు నోటీసులు జారీచేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేసింది. శిక్షణ లేని డ్రైవర్లతో ఆర్టీసీ అధునాతన బస్సులను నడిపించడాన్ని సవాలు చేస్తూ ప్రకాశం జిల్లా ఎస్.ఎన్.పాడు మండలం పేర్నమిట్ట గ్రామానికి చెందిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మేడికొండ జార్జి హైకోర్టులో పిల్ వేశారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున న్యాయవాది తాండవ యోగేష్ వాదనలు వినిపించారు. శిక్షణ లేని డ్రైవర్ బస్సు నడపడం వల్ల ఇటీవల విజయవాడ బస్టాండ్‌లో ముగ్గురు చనిపోయారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆర్టీసీలో 344 వోల్వో, మరికొన్ని హైఎండ్ బస్సులున్నాయన్నారు. శిక్షణ తీసుకున్న వారు మాత్రమే వాటిని నడపాలని ఆయా కంపెనీలతో ఒప్పందం ఉందని పేర్కొన్నారు. ప్రతి రెండు బస్సులకు ఆరుగురు డ్రైవర్లు, ఓ ఇన్‌ఛార్జి ఉండాలని, వారికి శిక్షణ అవసరం అని బస్సుల కొనుగోలు సమయంలో వోల్వో.. ఆర్టీసీ మధ్య ఒప్పందం జరిగిందన్నారు. ఆర్టీసీలో ప్రస్తుతం 149 మంది మాత్రమే హైఎండ్ బస్సులను నడిపేందుకు అర్హమైన ధ్రువపత్రాలు పొందిన డ్రైవర్లు ఉన్నారని తెలిపారు.

- ఆర్టీసీ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం కావాలని కోరారు. ఇరు పక్షాల వాదనలూ విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణకు ఆన్‌లైన్ ద్వారా హాజరుకావాలని ఆర్టీసీ ఎండీని ఆదేశించింది.

ధాన్యం కొన్న 24గంటల్లోనే డబ్బు జమ

మంత్రి నాదెండ్ల మనోహర్



ఈనాడు డిజిటల్, అమరావతి: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరానికి చెందిన పోలిశెట్టి శేషయ్య అనే రైతు నుంచి ధాన్యం కొన్న 24 గంటల్లోనే ఆయన ఖాతాలో డబ్బు జమ చేశామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని 'ఎక్స్' వేదికగా బుధవారం తెలిపారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బు జమచేస్తామని హామీ ఇచ్చామని.. కానీ, ఇచ్చిన గడువుకంటే ముందే ఎన్డీయే ప్రభుత్వం చెల్లించినట్లు పేర్కొన్నారు. రైతులు, కౌలు రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేస్తున్న కృషికి ఇది తార్కాణమని మనోహర్ తెలిపారు. రైతుకు జమైన డబ్బు రశీదును ట్వీట్‌కు జత చేశారు.

ఒక క్లిక్‌తో వంద రకాల సేవలు

- రేషన్ పంపిణీ, జనన, మరణ ధ్రువపత్రాలు.. దైవ దర్శన స్లాట్లు, మార్కెట్ ధరలు పొందొచ్చు
- ఆర్టీసీ టికెట్, పార్సిల్ బుకింగ్ వాట్సప్‌లోనే..
- నవంబరు 30నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు మెటాతో ప్రభుత్వం ఒప్పందం



ఈనాడు, అమరావతి: రేషన్‌కార్డుల జారీ వివరాలు, రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్, పంటల మార్కెట్ ధరలు తెలుసుకోవడం, దైవదర్శనాల అందుబాటు, విద్యార్థుల హాజరులాంటి సేవలను ఇక నుంచి ఒక్క క్లిక్‌తో పొందొచ్చు. వాట్సప్ బిజినెస్ సర్వీసు వేదిక ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 30 నుంచి వాట్సప్ ద్వారా 100 రకాల సేవలను అందించేందుకు చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి వాట్సప్ మాతృ సంస్థ మెటాతో ప్రభుత్వం ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా వాట్సప్ బిజినెస్ సర్వీస్ డెలివరీ వేదికగా పలు రకాల పౌరసేవలను ప్రజలకు అందిస్తుంది. యువగళం పాదయాత్రలో సర్టిఫికెట్ల కష్టాలు తప్పిస్తానని మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మూడు ప్రాథమిక విధానాల్లో సేవలందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ప్రభుత్వం నుంచి పౌరులకు, వ్యాపారం నుంచి వినియోగదారుడికి, ప్రభుత్వంలోని విభాగాల నుంచి విభాగాలకు ఇది సేవలను అందిస్తుంది. మొదటి దశలో వాణిజ్య రంగంలో సమర్థమైన ప్రభుత్వ సర్వీసు డెలివరీ కోసం రీ-ఇంజినీరింగ్ ప్రక్రియ, విధానాలను అమలుచేస్తారు. రెండో దశలో ఎలాంటి ప్రతిబంధకాలు లేకుండా సులభంగా పౌరసేవలు అందిస్తారు.

ఏడు దేవాలయాల్లో..

- గ్రామ, వార్డు సచివాలయాల్లో 29 విభాగాల్లో 350 కిపైగా సేవలను ఇప్పటికే ఏకీకృతం చేశారు. వివిధ విభాగాలను అనుసంధానించి ఇతర సేవలను అందుబాటులోకి తెస్తారు. గంటకు 10 లక్షల అలర్ట్‌ల సామర్థ్యంతో రియల్‌టైం నోటిఫికేషన్లను వాట్సప్ ఇస్తుంది.
- పర్యాటక రంగానికి సంబంధించి ప్రయాణ సమాచారం అందుబాటులోకి వస్తుంది. పౌరులు తమ సమస్యలను తెలియజేసేందుకు వేదికగా పని చేస్తుంది.
- దేవాదాయ శాఖకు సంబంధించి ఏపీలోని ఏడు ప్రధాన ఆలయాల్లో దర్శనం, వసతి, విరాళాలు, వివిధ రకాల సేవల కోసం స్లాట్‌లను బుక్ చేసుకోవచ్చు. వాట్సప్ ద్వారా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి.
- రేషన్ కార్డుల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలనే మార్గదర్శకాలు విడుదలయ్యాక కార్డుల జారీ, రేషన్ పంపిణీ తీరుతెన్నులు తెలుస్తాయి.
- నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను చెల్లింపు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వాణిజ్య లైసెన్సులవంటి సేవలు వాట్సప్ ద్వారా పొందొచ్చు.
- రిజిస్ట్రేషన్లకు సంబంధించి వాట్సప్ సాంకేతిక భాగస్వామిగా సేవలను అభివృద్ధి చేస్తారు. భద్రతను నిర్ధారించే రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి సకాలంలో నోటిఫికేషన్లు, సర్టిఫికెట్ల జారీ, రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- వాట్సప్ ద్వారానే విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు. ప్రజల అభ్యర్థనల మేరకు జియో లొకేషన్ ఆధారంగా కొత్త హైటెన్షన్ లైన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం, ట్రాన్స్‌కో, అంతర్గత కమ్యూనికేషన్, అలర్ట్ సర్వీసులు అందుబాటులోకి వస్తాయి.
- అన్ని రవాణా లైసెన్సుల సేవలు, అనుమతులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి అన్ని సర్వీసులను వాట్సప్‌తో ఏకీకృతం చేస్తారు. దిల్లీ రవాణా సంస్థ మాదిరిగా ఏపీఎస్ఆర్టీసీతో మెటా బృందం కలిసి పనిచేస్తుంది. టికెట్ బుకింగ్, పార్సిల్ బుకింగ్‌ల కోసం ఆర్టీసీ సేవలను ఏకీకృతం చేస్తారు.

తల్లిదండ్రుల ఫోన్లకు విద్యార్థుల హాజరు వివరాలు

- విద్యార్థుల హాజరు, పనితీరుకు సంబంధించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చేందుకు మొబైల్ నంబరుతోపాటు ఆధార్ ప్రామాణీకరణతో సంక్షిప్త సందేశం వస్తుంది. పాఠ్యప్రణాళిక ఫలితాలను ట్రాక్ చేయడంతోపాటు మెటా బృందం అదనపు కోర్సులను అందుబాటులోకి తెస్తుంది.
- రాష్ట్రంలో అమలవుతున్న ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు, రహదారి పరిస్థితులపై రెగ్యులర్ అప్‌డేట్లు ఇస్తుంది. వ్యవసాయ మార్కెట్ ధరలు, వాతావరణం, ఉత్తమ యాజమాన్య నిర్వహణ పద్ధతులపై సమాచారం పొందవచ్చు.
- ఉన్నత విద్యలో ప్రవేశ పరీక్షలు, ప్రవేశాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. విద్యార్థి-సిబ్బంది సేవలు, వర్చువల్ బోధన, కమ్యూనికేషన్, నైపుణ్యాలు మెరుగుపర్చుకోవడానికి అభ్యసన మేనేజ్‌మెంట్ సిస్టమ్‌వంటివి అందుబాటులోకి వస్తాయి. విద్యా సేవలకు అంతరాయం లేని యాక్సెస్ కోసం అపార్ ఐడీని అనుసంధానిస్తారు. డ్రగ్, పొగాకు రహిత క్యాంపస్ కోసం ప్రచారాలు, విశ్వవిద్యాలయాల్లో వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చు.
- ప్రభుత్వ ప్రమాణాలుండే పలు రకాల నైపుణ్య శిక్షణలు అందుబాటులోకి వస్తాయి. నైపుణ్య గణనకు మెటా సహకరిస్తుంది.
- పరిశ్రమల శాఖ ఇప్పటికే ఔట్‌రీచ్ కమ్యూనికేషన్ కోసం చాట్‌బాట్‌లను వాడుతోంది. వ్యవస్థాపకుల కోసం సింగిల్‌డెస్క్ పోర్టల్‌ను ఏకీకృతం చేసేందుకు విధివిధానాలు సిద్ధమయ్యాయి. భూకేటాయింపునకు దరఖాస్తు, పెట్టుబడి విధానం, ప్రచారంవంటి వాటికి అవకాశం లభిస్తుంది.

ఫుట్‌బాల్ అసోసియేషన్‌ను కోటగిరి శ్రీధర్ ఆక్రమించారు

- సంఘాన్ని వదిలేయాలని ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి బెదిరించారు
- ఏపీఎఫ్ఏ వ్యవస్థాపక అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ

ఈనాడు, అమరావతి: వ్యవస్థలను పక్కదారి పట్టించి ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏపీఎఫ్ఏ) అధ్యక్షుడిగా చలామణి అవుతున్న వైకాపా మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అక్రమాలపై విచారణ జరిపించాలని ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. నిజమైన ఓటర్ల జాబితాతో కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. వైకాపా హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని.. సంఘాన్ని వదిలేయాలంటూ మాజీ ఎంపీ భయభ్రాంతులకు గురి చేశారని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ల శాఖ, శాప్ విభాగాలను తన గుప్పిట్లో పెట్టుకొని అక్రమంగా అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారని ఆరోపించారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. 'కడప జిల్లా అసోసియేషన్‌లో డేనియల్ ప్రదీప్ సభ్యుడు కాదు. అక్కడ నల్లపోచమ్మ తల్లి సేవా సంఘం పేరిట ఉన్న సంస్థను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్‌గా చూపారు. తెలంగాణ రిజర్వ్ పోలీసు విభాగంలో పని చేస్తున్న విజయ్‌కుమార్‌ను కర్నూలు జిల్లా కార్యదర్శిగా చూపారు. అనంతపురంలో చనిపోయిన వ్యక్తి పేరుతో సంఘాన్ని రెన్యువల్ చేయించారు. శ్రీధర్, డేనియల్ ప్రదీప్‌లు ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రాథమిక సభ్యత్వం లేకుండా వివిధ జిల్లాల్లో దొంగ సొసైటీ రిజిస్ట్రేషన్లు చేశారు. శ్రీధర్ అనుచరులు ఆరుగురు ఏడు జిల్లాల అసోసియేషన్లతోపాటు ఏపీ ఫుట్‌బాల్ ఫెడరేషన్‌లోనూ సభ్యులుగా చేరారు. ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో ఆరుగురు వ్యక్తులు వివిధ జిల్లాల్లో అక్రమ పద్ధతుల్లో ఓటర్లుగా నమోదై, కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఏపీఎఫ్ఏతో కోటగిరి శ్రీధర్‌కు ఎలాంటి సంబంధం లేదని అఖిల భారత ఫుట్‌బాల్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. వైకాపా కబంధ హస్తాల నుంచి ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు విముక్తి కల్పించాలి' అని పేర్కొన్నారు.

బుద్ధా.. క్షమించు!



అమరావతి, న్యూస్‌టుడే: నవ్యాంధ్రప్రదేశ్ చిహ్నమైన ధ్యాన బుద్ధుడి ప్రతిమలు నిరాదరణకు గురవుతున్నాయి. పల్నాడు జిల్లా అమరావతిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహ ప్రాంగణంలోని బురదలో పదుల సంఖ్యలో ప్రతిమలు ఉండటం విచారకరం. అమరావతిలోని కృష్ణా నది ఒడ్డున గత తెదేపా ప్రభుత్వం 125 అడుగుల ధ్యాన బుద్ధ విగ్రహం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే ధ్యాన బుద్ధ ప్రాజెక్టు ప్రహరీకి నలుదిక్కులా బుద్ధుడి విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకుంది. పెద్దసంఖ్యలో ప్రతిమలనూ చేయించింది. వాటిని అమరావతిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఉంచింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రాజెక్టును పక్కన పెట్టింది. ప్రస్తుతం వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులను దాన్నుంచి మరో చోటుకు తరలించారు. విగ్రహాలను అక్కడే వదిలేశారు. ఈ విషయమై పర్యాటకశాఖ ఈఈ శ్రీనివాసరావును అడగ్గా.. తాను బాధ్యతలు చేపట్టక ముందు నుంచే విగ్రహాలు అక్కడ ఉన్నాయని, ఏం జరిగిందో తెలుసుకొని, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుర్ల తాగునీటిలో 'కోలిఫామ్' బ్యాక్టీరియా

- ఆ కారణంగానే డయేరియా కేసుల నమోదు
- మురుగు, మంచినీటి పైపులు పక్కపక్కనే..
- క్లోరినేషన్ సవ్యంగా లేదు..
- వైద్య ఆరోగ్య శాఖకు నిపుణుల కమిటీ నివేదిక



గుర్లలో మురుగు కాలువలో మంచినీటి పైపులైన్

ఈనాడు, అమరావతి: విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా కేసుల నమోదుకు కలుషిత తాగునీరు కారణమని వైద్య నిపుణుల బృందం పేర్కొంది. అక్కడి పరిస్థితులపై అధ్యయనానికి ఇద్దరు జనరల్ మెడిసిన్ వైద్యులు, కమ్యూనిటీ మెడిసిన్, మైక్రోబయాలజీ, పీడియాట్రిక్స్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్‌లతో ఏర్పాటుచేసిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీనిలో ఉన్న ప్రధానాంశాలతో వైద్య ఆరోగ్య శాఖ బుధవారం ప్రకటన విడుదల చేసింది. 'రోగులు, వైద్యులు, వైద్య సిబ్బంది నుంచి కమిటీ వివరాలు సేకరించింది. గుర్ల, కోటగండ్రేడు, నాగులవలస, దమ్మసింగి, కెల్ల, ఇతర ప్రభావిత ప్రాంతాల్లోని పరిస్థితులు, నీటి వనరులు, పైపులైన్లు, మురుగుదొడ్ల నిర్వహణ తీరును గమనించింది. మల నమూనాల పరీక్షా ఫలితాలను విశ్లేషించింది. గుర్ల నుంచి సేకరించిన 44కు 31 నమూనాల్లో 'కోలిఫామ్'లు ఉన్నట్లు కమిటీ నిర్ధారించింది. మంచినీటిలో కలిసిన మురుగులో ఈ-కోలై బ్యాక్టీరియా ఉంది. 57 మలం నమూనాల పరీక్ష ఫలితాల ఆధారంగానూ భూగర్భజలాలు కలుషితమైనట్లు గుర్తించింది. సెప్టిక్ ట్యాంకులవల్ల ఈ పరిస్థితి తలెత్తింది. గుర్ల, ఇతర గ్రామాలకు ప్రధాన నీటివనరు చంపావతి నదిలో దహన సంస్కారాలు, జాతరలు, ఇతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. చంపావతి నది వెంటనున్న ప్రాంతాల్లోనే డయేరియా కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. విజయనగరం భౌగోళిక స్థితి, వాతావరణ పరిస్థితులు సంక్రమణ వ్యాధుల వ్యాప్తికి అనుకూలంగా ఉన్నందున వివిధ నమూనాలను పరీక్షించేందుకు వీలుగా ప్రాంతీయ ప్రయోగశాలను ఏర్పాటుచేయాలి' అని నివేదిక పేర్కొంది.

క్లోరినేషన్ సక్రమంగా లేదు..

'గుర్ల, పొరుగు గ్రామాలకు నీటిని సరఫరా చేసే బోర్‌వెల్ నది ఒడ్డునే ఉంది. నీటి పైపులైన్లు మురుగునీటి వ్యవస్థలో అంతర్భాగంగా ఉన్నాయి. చంపా నదీతీరం, గుర్ల గ్రామ సమీపంలో మురుగు, ఉప్పునీరు పారుతోంది. దీంతోపాటు ప్రజలు బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆ ప్రాంతంలో భూగర్భ నీటిమట్టం పెరిగింది. ఇదే సమయంలో వ్యాధులను అరికట్టేందుకు అవసరమైన క్లోరినేషన్ తక్కువగా ఉంది. పరీక్షించిన నీటి నమూనాలలో క్లోరిన్ అవశేషాలు కనిపించలేదు. నీటి నమూనాల్లో క్లోరిన్ బాగా ఉన్న ప్రాంతాల్లో కేసులు తక్కువగా నమోదయ్యాయి. తాగునీటికి ప్రధాన వనరు చంపా నది నీటిని క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలి. నీటి సరఫరా పైపులకు మరమ్మతు చేయాలి. మురుగులో పైపులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. తాగునీరు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఇళ్ల వద్ద పక్షం రోజులకోసారి తనిఖీ చేయాలి. ఇళ్లలో తాగు నీటిలో కలపడానికి క్లోరిన్ మాత్రలను అందుబాటులో ఉంచాలి. కమ్యూనిటీ టాయ్‌లెట్లను ఏర్పాటుచేయాలి. వ్యక్తిగత పరిశుభ్రతపట్ల చైతన్యపర్చేందుకు ప్రజాసంఘాలను భాగస్వామ్యం చేయాలి' అని కమిటీ సూచించినట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. ఈ నివేదికకు అనుగుణంగా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ గురువారం సమీక్షించనున్నారు.

నేడు విజయనగరం జిల్లాకు జగన్

ఈనాడు, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధ్యక్షుడు జగన్ గురువారం విజయనగరం జిల్లా గుర్లలో పర్యటించనున్నారు. అతిసార (డయేరియా)తో మృతి చెందినవారి కుటుంబాలను, చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తారని ఆయన కార్యాలయం బుధవారం ప్రకటించింది.



ఉత్తమ నిర్ణయాలతోనే విజేత కాగలరు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉత్తమ నిర్ణయాలు తీసుకోగలిగేవారే విజేతలుగా నిలుస్తారు. ఓ నిర్ణయంతో తక్షణం కలిగే ప్రయోజనాలు కాకుండా దీర్ఘకాలంలో కలిగే ప్రభావాన్ని అంచనా వేయగలిగేవారు, హేతుబద్ధతతో ఆలోచించేవారే మంచి నిర్ణేతలు కాగలరు. విద్యార్థులకు ఈ రెండు నైపుణ్యాలను బోధించేలా మన విద్యావ్యవస్థను సంస్కరించాల్సిన అవసరం ఉంది.

– కునాల్ షా, వ్యాపారవేత్త

చుక్కల భూములు కొట్టేయాలని వైకాపా నేతల యత్నం

- ఇందుకు గతంలో పనిచేసిన పలువురు కలెక్టర్ల వత్తాసు
- తెదేపా కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో చుక్కల భూముల్ని కొట్టేయడానికి కొందరు వైకాపా నాయకులు ప్రయత్నించారని బాపట్ల జిల్లా చినగంజాం మండలం పెదగంజాం గ్రామానికి చెందిన బాధితులు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. అప్పటి కలెక్టర్ కూడా వైకాపా నేతలకు భూములు ఇవ్వాల్సిందేనని ఒత్తిడి తెచ్చారని వాపోయారు. ఆయా భూములకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు తమ దగ్గర ఉన్నా తప్పులు చూపుతూ.. కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, దువ్వారపు రామారావు, తెదేపా నేత వెంకటగురుమూర్తి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు.

- ఎన్నికల్లో తెదేపాకు ఓటేశామన్న కోపంతో వేణుగోపాల్ అనే వ్యక్తి అర్ధరాత్రి ఇంటికి వచ్చి తన భార్య తల పగలగొట్టాడని, దీనిపై మార్టూరు ఠాణాలో ఫిర్యాదు చేసినా వారిపై పోలీసులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని బాపట్ల జిల్లా మార్టూరు మండలం రాజుపాలెంకు చెందిన బాధితుడు ఫిర్యాదు చేశారు.

శ్రీవాణి బ్రేక్ దర్శన టికెట్ల జనవరి కోటా విడుదల

దాతల దర్శనాల కోటా నేడు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవాణి బ్రేక్ దర్శనం 2025 జనవరి టికెట్ల కోటాను బుధవారం ఉదయం 11 గంటలకు తితిదే విడుదల చేసింది. రోజుకు 500 టికెట్లు, 100 గదుల చొప్పున అందుబాటులో ఉంచింది. తితిదే ట్రస్టులు, పథకాలతోపాటు శ్రీ వేంకటేశ్వర ఆపన్న హృదయ పథకానికి విరాళం ఇచ్చిన దాతల దర్శనాలు, గదుల కోటాను గురువారం ఉదయం 11.30 గంటలకు విడుదల చేయనుంది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని 2025 జనవరి 10 నుంచి 19 వరకు ఆయా దర్శనాల టికెట్ల విడుదల వాయిదా వేసిన నేపథ్యంలో భక్తులు తదనుగుణంగా మిగిలిన రోజులకు బుక్ చేసుకోవాల్సిందిగా తితిదే సూచించింది.

డ్రోన్ సమిట్‌లో నకిలీ ఐఏఎస్ కలకలం

ఇప్పటికే ఒకసారి తిరుమలలో అరెస్టు

ఈనాడు, అమరావతి: డ్రోన్ సమిట్‌లో ఒక నకిలీ ఐఏఎస్ అధికారి కలకలం సృష్టించాడు. తాను ఐఏఎస్ అధికారినంటూ నకిలీ గుర్తింపుకార్డులు ప్రదర్శించి మోసాలకు పాల్పడే నరసింహమూర్తి అమరావతి డ్రోన్ సమిట్‌లో బుధవారం హడావుడి చేశాడు. సమిట్‌కు తానే రూపకల్పన చేశానంటూ పలువురు ప్రతినిధులను పరిచయం చేసుకున్నాడు. ఇంతలో అక్కడున్న అధికారులు, డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె.దినేష్ కుమార్ అతడిని గుర్తించారు. గత ఏప్రిల్‌లో ఇదే నరసింహమూర్తి తిరుమలలో దర్శనం టికెట్ల కోసం అధికారులను బెదిరించడంతో తిరుమల పోలీసులు అతడ్ని అరెస్టు చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అతడు... మళ్లీ ఇప్పుడు నకిలీ ఐఏఎస్ అవతారమెత్తి ప్రతినిధులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేశాడు.

'సీసీఆర్‌సీ కార్డులున్న కౌలు రైతులకు పంటరుణాలివ్వండి'

ఈనాడు, అమరావతి: సాగుదారు హక్కుపత్రం (సీసీఆర్‌సీ) ఉన్న కౌలు రైతులకు.. ఎలాంటి హామీ లేకుండా రూ.1.60 లక్షల పంట రుణాన్ని మంజూరుచేయాలని బ్యాంకర్లకు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ సూచించారు. సీసీఆర్‌సీ కార్డుకు అంగీకారం తెలిపిన భూ యజమానులకు ఇప్పటివరకు పంటరుణం మంజూరు చేయకపోతే.. కౌలు రైతులకు రుణం ఇవ్వాలని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో కౌలు రైతులకు పంట రుణాల పురోగతిపై ఆయన రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో చర్చించారు.

ఫీజుల విడుదలపై మంత్రి లోకేశ్ చొరవకు కృతజ్ఞతలు: అపెక్మా

ఈనాడు, అమరావతి: కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై త్వరలో శుభవార్త వింటారని మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘం(అపెక్మా) హర్షం వ్యక్తం చేసింది. ఫీజు బకాయిల గురించి విన్నవించిన వెంటనే సానుకూలంగా స్పందించి విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ప్రకటించారని అపెక్మా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి విద్యాసాగర్, పెద్దిరెడ్డి మధుసూదనరావు వెల్లడించారు. ఫీజు బకాయిలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదని భావించి ప్రభుత్వం నేరుగా కళాశాలలకు చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఫీజులతోపాటు చివరి ఏడాది విద్యార్థుల బకాయిలు ముందుగా విడుదల చేయాలని కోరారు.

స్థానిక కరెన్సీల్లో వ్యాపార, ఆర్థిక లావాదేవీలు

బ్రిక్స్ దేశాల అంగీకారం

కజన్: ఆర్థిక, వాణిజ్య రంగాల్లో పరస్పరం సహకరించుకోవడంతో పాటు సత్వర అభివృద్ధి సాధన లక్ష్యంగా బ్రిక్స్ దేశాల మధ్య కీలకమైన అవగాహన కుదిరింది. స్థానిక కరెన్సీల్లోనే వ్యాపార, ద్రవ్య లావాదేవీలు నిర్వహించుకోవాలని, ఈ ప్రక్రియ సాఫీగా కొనసాగటానికి అవసరమైన యంత్రాంగాలను ఏర్పాటు చేసుకోవాలనే అంగీకారానికి వచ్చాయి. రష్యాలోని కజన్‌లో నిర్వహించిన బ్రిక్స్ సదస్సు ఈ మేరకు బుధవారం ప్రకటనను వెలువరించింది. సమాన అవకాశాలు కల్పించేలా 'బహువిధ అభివృద్ధి బ్యాంకు' (ఎండీబీ)ని సరికొత్త తరహాలో ఏర్పాటు చేసుకోవాలని అగ్రనేతలు నిర్ణయించినట్లు ఆ ప్రకటన తెలిపింది. పారదర్శకత, భద్రత, వేగం, స్వల్ప వ్యయం, అత్యధిక ప్రభావశీలత, సులభతర వాణిజ్యం, దేశాల మధ్య నిరాటంకమైన చెల్లింపుల వ్యవస్థను కలిగి ఉండటంతో పాటు వివక్షకు తావివ్వని విధంగా ఆయా వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించింది. తాజా పరిణామాన్ని స్వాగతిస్తున్నట్లు ఆ ప్రకటన పేర్కొంది. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో ఏర్పాటైన బ్రిక్స్‌లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సభ్యత్వాన్ని పొందాయి.

■ అభివృద్ధి చెందుతున్న దేశాలకు పర్యావరణ నిధుల కోసం గట్టిగా డిమాండ్ చేయాలని, వార్షిక పర్యావరణ సదస్సు వేదికపై తమ ఉమ్మడి గళాన్ని ప్రభావవంతంగా వినిపించాలని బ్రిక్స్ దేశాలు నిర్ణయించాయి. పర్యావరణ మార్పులపై పోరాటంలో ఆర్థిక వనరులు కీలక పాత్ర వహిస్తాయని తెలిపాయి.

■ గాజా స్ట్రిప్‌లో శాశ్వత కాల్పుల విరమణను పాటించాలని, ఇరు పక్షాలు బందీలను విడుదల చేయాలని బ్రిక్స్ సదస్సు పిలుపునిచ్చింది. గాజాపై ఇజ్రాయెల్ సైనిక దాడులను, సామూహిక జన హననాలను ఖండించింది.



ఆనందం మన సొంతం కావాలంటే..

ఆనందంగా ఉండగలగడమూ ఓ నైపుణ్యమే. ఇతర నైపుణ్యాల్లాగే దాన్ని కూడా సాధన చేయడం ద్వారా సొంతం చేసుకోవచ్చు. జీవితంలో ఏదో తక్కువైందనే భావనను మనసు నుంచి తొలగించి, ప్రస్తుత క్షణాలపైనా, ముఖ్యమైన విషయాలపైనా దృష్టిని కేంద్రీకరించినప్పుడు ఆనందం అనే అనుభూతి కలుగుతుంది.

– క్లింట్ మర్ఫీ,
కంటెంట్ ప్రొడ్యూసర్

యుద్ధానికి కాదు.. దౌత్యానికే మా మద్దతు

- ఉగ్రవాదాన్ని ముక్తకంఠంతో ఖండించాలి: మోదీ



రష్యాలోని కజన్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని మోదీతో చైనా, రష్యా అధ్యక్షులు జిన్‌పింగ్, పుతిన్

కజన్: చర్చలు, దౌత్యానికే తాము మద్దతు ఇస్తామనీ.. యుద్ధానికి మాత్రం కాదని భారత ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. శాంతియుత చర్చల ద్వారా రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారాన్ని సాధించాల్సి ఉందని పునరుద్ఘాటించారు. రష్యాలోని కజన్ నగరంలో బ్రిక్స్ దేశాల కూటమి 16వ శిఖరాగ్ర సదస్సునుద్దేశించి బుధవారం ఆయన ప్రసంగించారు. "కొవిడ్‌లాంటి మహమ్మారినే ఉమ్మడిగా ఎదుర్కొన్నాం. భద్రమైన, సుసంపన్న, బలమైన భవిష్యత్తును భావి తరాలకు అందించే సామర్థ్యం కూడా మనకు ఉంది. ఉగ్రవాదంపై పోరాడటంలో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదు. ఒకే సంకల్పంతో ఈ మహమ్మారిని అంతం చేసేందుకు మనమంతా చేతులు కలపాలి. ఉగ్రసంస్థలకు నిధులందే మార్గాలు మూసివేయాలి. అంతర్జాతీయ ఉగ్రవాదంపై సమగ్ర ఒప్పందాన్ని ఐరాసలో కుదుర్చుకునే అంశంపై మనమంతా పనిచేయాలి. సైబర్ భద్రత, సురక్షితమైన కృత్రిమ మేధ విషయంలోనూ అంతర్జాతీయ నియంత్రణల కోసం కృషిచేయాలి" అని మోదీ పిలుపునిచ్చారు.

ఏకాభిప్రాయంతోనే నిర్ణయాలు

బ్రిక్స్‌లో కొత్తగా చేరిన దేశాలను మోదీ ఆహ్వానించారు. నిర్ణయాలన్నీ ఏకాభిప్రాయంతో తీసుకోవాలని, కూటమి వ్యవస్థాపక దేశాల అభిప్రాయాలను గౌరవించాలని సూచించారు. ఐరాస భద్రతామండలి, అంతర్జాతీయ బ్యాంకులు, ప్రపంచ వాణిజ్య సంస్థ వంటివాటిలోనూ సంస్కరణలు రావాలని ఆకాంక్షించారు. ప్రపంచ సంస్థలను సమూలంగా మార్చేయడం తమ ఉద్దేశం కాదని, వాటిని సంస్కరించడమే ధ్యేయమని చెప్పారు. తాగునీరు, ఆహారం, ఇంధనం, ఆరోగ్యం వంటి రంగాల్లో భద్రత కల్పించడం ప్రపంచ దేశాలన్నింటికి ప్రాధాన్యాంశం కావాలని ఆకాంక్షించారు.

భారత ఆర్థికవృద్ధి భేష్: పుతిన్

ప్లీనరీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ అధ్యక్షత వహించారు. భారత ఆర్థిక వృద్ధికి కితాబిస్తూ ఇది బ్రిక్స్ కూటమిలోని అనేక దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అధిక ఆర్థిక వృద్ధి కోసం అందరూ మాట్లాడుతున్నా మోదీ మాత్రం దీనిని విజయవంతంగా సాధించి చూపించారని కొనియాడారు. బ్రిక్స్‌లో చేరడానికి 30 దేశాలు ఆసక్తిగా ఉన్నాయని తెలిపారు.

పరిరక్షకులుగా ఉందాం: జిన్‌పింగ్


బ్రిక్స్ దేశాలు లోతైన ఆర్థిక, వాణిజ్య సహకారం పెంపొందించుకోవాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సూచించారు. కూటమిలో చేరడానికి వివిధ దేశాలు చేస్తున్న అభ్యర్థనలపై బ్రిక్స్ స్పందించాలని కోరారు. దక్షిణార్ధ గోళ దేశాలకు సంఘీభావం, సహకారం అందించేలా బహుళ పాక్షిక యంత్రాంగాన్ని సభ్యదేశాలు తీర్చిదిద్దాలని సూచించారు. ఉక్రెయిన్ సంక్షోభానికి త్వరగా అడ్డుకట్ట వేయడానికి బ్రిక్స్ దేశాలు ప్రయత్నించాలన్నారు. అందరి భద్రతను చూసే సంరక్షకులుగా, శాంతి పరిరక్షకులుగా ఇవి వ్యవహరించాలని చెప్పారు. కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని, రణక్షేత్రాన్ని విస్తరించవద్దని సూచించారు. హరిత పరిశ్రమలు, శుద్ధ ఇంధనం వంటి రంగాల్లో తమ అనుభవాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బ్రిక్స్ దేశాల్లో శిక్షణ కేంద్రాలను చైనా ఏర్పాటు చేస్తుందని చెప్పారు. సహకారాన్ని ఉన్నతీకరించడంలో ఆసక్తి ఉన్న దేశాలు చేతులు కలపాలని పిలుపునిచ్చారు.

మోదీ థంబ్స్ అప్.. పుతిన్, జిన్‌పింగ్ మాటామంతీ

సదస్సుకు వచ్చిన ప్రపంచ నేతలకు పుతిన్ మంగళవారం రాత్రి విందు ఇచ్చారు. నరేంద్రమోదీ, జిన్‌పింగ్‌ల మధ్యలో ఆయన కూర్చొని సంగీతాన్ని ఆస్వాదించారు. పుతిన్, జిన్‌పింగ్ ముచ్చటిస్తుండగా.. మోదీ తన ఎదురుగా ఉన్న నేతను 'థంబ్స్అప్' అంటూ పలకరించారు. విందులో నేతలంతా సరదాగా గడిపిన దృశ్యాలు వైరల్ అయ్యాయి.

ఇండస్ట్రియల్ ఆల్కహాల్‌పై నియంత్రణాధికారం రాష్ట్రాలదే

- ఉత్పత్తి, సరఫరాలపై కూడా..
- 8:1 మెజారిటీతో సుప్రీంకోర్టు తీర్పు



దిల్లీ: మానవ వినియోగానికి ఉపయోగపడని పారిశ్రామిక మద్యం (ఇండస్ట్రియల్ ఆల్కహాల్) ఉత్పత్తి, నిల్వ, సరఫరాలపై నియంత్రణాధికారం రాష్ట్రాలదేనని సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం విస్పష్టం చేసింది. తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ఈ ధర్మాసనం 8:1 మెజారిటీతో బుధవారం ఈ తీర్పును వెలువరించింది. రాష్ట్రాల ఆదాయం పెంపునకు ఈ తీర్పు దోహదపడనుంది. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూలు రాష్ట్ర జాబితాలోని 8వ ప్రవేశిక పేర్కొన్న 'మత్తును కలిగించే మద్యం'(ఇంటాక్సికేటింగ్ లిక్కర్) పరిధిలో పారిశ్రామిక మద్యం కూడా ఉందని తీర్పు పేర్కొంది. మెజారిటీ న్యాయమూర్తులందరి తరఫున సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తాజా తీర్పు రాశారు. మత్తును కలిగించే మద్యం తయారీకి అవసరమైన ముడి పదార్థాలతో సహా అన్నింటినీ రాష్ట్ర జాబితాలోని 8వ ప్రవేశిక పరిధిలోనే రాజ్యాంగ కర్తలు ఉంచారని తెలిపారు. పారిశ్రామిక మద్యంపై నియంత్రణను తన పరిధిలోకి తెచ్చుకొనే శాసనాధికారం పార్లమెంటుకు లేదని 364 పేజీల తీర్పులో విస్పష్టం చేశారు. జస్టిస్ బి.వి.నాగరత్న భిన్నాభిప్రాయం వ్యక్తం చేస్తూ విడిగా తీర్పు రాశారు. పారిశ్రామిక లేదా సహజగుణ రహిత ఆల్కహాల్‌ను నియంత్రించే శాసనాధికారం రాష్ట్రాలకు ఉండదని ఆమె పేర్కొన్నారు. మెజారిటీ న్యాయమూర్తుల తాజా తీర్పుతో 1990లో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన తీర్పును తలకిందులు చేసినట్లయ్యింది. సింథటిక్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ వర్సెస్ ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం కేసులో పారిశ్రామిక మద్యం ఉత్పత్తిపై నియంత్రణాధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉంటుందని అప్పటి ఏడుగురు సభ్యుల ధర్మాసనం పేర్కొంది. దీనిని ఉత్తర్‌ప్రదేశ్ సహా పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి.

కాలుష్యరహిత పర్యావరణం పౌరుల ప్రాథమిక హక్కు

- సుప్రీంకోర్టు ఉద్ఘాటన

దిల్లీ: పంజాబ్, హరియాణాల్లో పంటవ్యర్థాల దహనంతో దేశ రాజధాని దిల్లీలో గాలి నాణ్యత గణనీయంగా పడిపోతున్నవేళ సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పర్యావరణ పరిరక్షణ చట్టాలను సవరణల ద్వారా నిర్వీర్యం చేశారంటూ కేంద్రప్రభుత్వంపై మండిపడింది. కాలుష్యరహిత పర్యావరణంలో జీవించడం ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కు అని ఉద్ఘాటించింది. పంటవ్యర్థాలను తగలబెట్టేవారిపై కేసుల విషయంలో కోర్టు ఉత్తర్వులను అమలు చేయడం లేదంటూ పంజాబ్, హరియాణా ప్రభుత్వాలపైనా సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ రాజధాని ప్రాంతం, దానికి ఆనుకొని ఉన్న ప్రాంతాల కోసం గాలి నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) చట్టం-2021ను రూపొందించినప్పటికీ.. దాని అమలుకు అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటుచేయకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. దిల్లీ, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో వాయుకాలుష్యాన్ని అరికట్టేందుకు ఆదేశాలు జారీ చేయాలంటూ 1985లో ఎం.సి. మెహతా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం బుధవారం ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరణ ద్వారా పర్యావరణ పరిరక్షణ చట్టంలోని సెక్షన్-15 కోరలను కేంద్రం పీకేసిందని పేర్కొంది. పంటవ్యర్థాల దహనంపై పంజాబ్‌లో 1084, హరియాణాలో 419 కేసులు నమోదైనా.. దోషులపై చర్యలు తీసుకోవడంలో రెండు రాష్ట్రాల అధికారులూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. సీఏక్యూఎం కూడా హరియాణా, పంజాబ్ అధికారులకు తాఖీదుల జారీతోనే సరిపెడుతోందంటూ పెదవి విరిచింది.

కిలో శనగపప్పు రూ.58.. మసూర్ పప్పు రూ.89

- భారత్ బ్రాండ్‌లో చేర్చిన కేంద్రం

దిల్లీ: పెరుగుతోన్న ధరలను నియంత్రించే ప్రయత్నంలో భాగంగా సబ్సిడీపై పప్పులను అందించే కార్యక్రమాన్ని కేంద్రం బుధవారం విస్తరించింది. ఈ మేరకు శనగ, మసూరు పప్పులను 'భారత్ బ్రాండ్' కింద చేర్చింది. ఫలితంగా జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య (ఎన్‌సీసీఎఫ్), జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య(ఎన్ఏఎఫ్ఈడీ), కేంద్రీయ భండార్ నెట్‌వర్క్‌ల ద్వారా కిలో శనగపప్పు రూ.58, కిలో మసూర్ పప్పు రూ.89కే లభించనున్నట్లు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. దీనికోసం మూడు లక్షల టన్నుల శనగ, 68 వేల టన్నుల మసూర్ పప్పుల బఫర్ స్టాక్‌ను సహకార సంఘాలకు కేటాయించామని పేర్కొన్నారు.

రాజకీయాల్లో నాకు 35 ఏళ్ల అనుభవం

- వయనాడ్‌లో నామినేషన్ వేసిన ప్రియాంకాగాంధీ



వయనాడ్‌లో నామినేషన్ పత్రాలపై సంతకం చేస్తున్న ప్రియాంక. చిత్రంలో ఖర్గే, రాహుల్, సోనియా

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం ఉప ఎన్నికకు కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. తల్లి సోనియాగాంధీ, సోదరుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెంట రాగా ఆమె నామినేషన్ పత్రాలు సమర్పించారు. ముందుగా రోడ్‌షోలో ప్రియాంక పాల్గొన్నారు. సభలో రాహుల్, ప్రియాంక ప్రసంగించారు. "17 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు తొలిసారి 1989లో నా తండ్రి కోసం ప్రచారంలో పాల్గొన్నాను. 35 ఏళ్ల నా రాజకీయ జీవితంలో నా తల్లి, సోదరుడు, నా తోటి నేతల కోసం ప్రచారంలో పాల్గొన్నాను. నా కోసం నేను ప్రచారం చేయడం ఇదే మొదటిసారి. వయనాడ్ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని నాకు దక్కిన గౌరవంగా భావిస్తాను" అని ప్రియాంక పేర్కొన్నారు. ప్రియాంక గెలిస్తే వయనాడ్ ప్రజల తరఫున పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించడానికి ఇద్దరు ఎంపీలు ఉంటారని రాహుల్ వ్యాఖ్యానించారు. తాను వయనాడ్‌కు అనధికారిక ఎంపీగా ఉంటానని స్పష్టం చేశారు. 'మా నాన్న చనిపోయినప్పుడు అమ్మ బాగోగులు నా సోదరి చూసుకుంది. కుటుంబం కోసం త్యాగాలకు ఆమె సిద్ధంగా ఉంటుంది. వయనాడ్ ప్రజలను తాను కుటుంబంలా భావిస్తోంది. మీరు కూడా అలానే చూసుకోవాలి' అని రాహుల్ అన్నారు.

నస్రల్లా వారసుడిని చంపేశాం

- ఇజ్రాయెల్ ప్రకటన
- ధ్రువీకరించిన హెజ్‌బొల్లా



హషీమ్ సఫీద్దీన్

బీరుట్/టెల్ అవీవ్: హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా వారసుడు హషీమ్ సఫీద్దీన్‌ను హతమార్చామని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) ప్రకటించింది. మూడు వారాల క్రితం బీరుట్‌పై జరిపిన వైమానిక దాడుల్లో సఫీద్దీన్ ప్రాణాలు కోల్పోయాడని తెలిపింది. నస్రల్లాకు సఫీద్దీన్ సన్నిహితుడు. హమాస్ గ్రూపు వ్యవస్థాపక సభ్యుడు కూడా. సఫీద్దీన్‌తో పాటు.. ఆ దాడిలో పలువురు హెజ్‌బొల్లా కమాండర్లు మృతి చెందినట్లు ఐడీఎఫ్ తెలిపింది. తమ సీనియర్ కమాండర్ మరణాన్ని హెజ్‌బొల్లా ధ్రువీకరించింది. మరోవైపు లెబనాన్‌లోని టైర్ నగరంపై బుధవారం ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. బాంబుల వర్షం కురిపించాయి.

భర్తను హిజ్రా అని పిలవడం క్రూరత్వమే

- కిందికోర్టు ఇచ్చిన విడాకులను సమర్థిస్తూ పంజాబ్, హరియాణా హైకోర్టు వ్యాఖ్య

చండీగఢ్: భర్తను భార్య హిజ్రా అని పిలవడం క్రూరత్వం కిందకే వస్తుందని పంజాబ్, హరియాణా హైకోర్టు స్పష్టం చేసింది. భర్తకు అనుకూలంగా కింది కోర్టు ఇచ్చిన విడాకుల ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ మహిళ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు పైవిధంగా వ్యాఖ్యానించింది. తాము 2017లో వివాహం చేసుకున్నామని, ఆమె పోర్న్ సైట్‌లకు బానిస అవడమే కాకుండా తనను శారీరకంగా బలహీనంగా ఉన్నావని, మరొకర్ని పెళ్లి చేసుకుంటానని నసపెట్టేదని భర్త కోర్టు ఎదుట వాపోయాడు. ఈ ఆరోపణలను భార్య ఖండిస్తూ. . తాను పోర్న్ సైట్‌లు చూసేదాన్నని చెప్పడానికి వారు ఎటువంటి ఆధారాలనూ ఇవ్వలేకపోయారని వాదించింది. వాదనలు విన్న ధర్మాసనం.. 'భర్తను హిజ్రా అని పిలవడం, ఎందుకూ పనికిరాని వాడిని కన్నావని అత్తను తిట్టడం మానసిక హింసకు గురి చేయడమే. ఈ కేసులో భార్యా భర్తలు గత 6 సంవత్సరాలుగా విడిగా ఉంటున్నారు. వారి బంధం బాగుచేయలేని స్థాయిలో పాడైపోయింది' అని వ్యాఖ్యానించింది. కింది కోర్టు ఇచ్చిన విడాకుల ఉత్తర్వుల్లో తప్పుపట్టడానికి ఏమీ లేదని భావిస్తున్నామని, ఆ ఉత్తర్వులను సమర్థిస్తున్నామని తీర్పు వెలువరించింది.

ట్రంప్‌ను ఓడించడమే లక్ష్యం



- కమలా హారిస్ స్పష్టీకరణ


వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయాన్ని ట్రంప్ ముందస్తుగా ప్రకటించుకుంటే సవాలు చేయడానికి తన టీం సిద్ధంగా ఉందని, ఆయనను ఓడించడంపైనే తాను ప్రస్తుతం దృష్టి పెట్టానని డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో లింగ వివక్ష పని చేస్తుందన్న ఆందోళన తనలో లేదని తేల్చి చెప్పారు. అమెరికాకు తొలి మహిళా అధ్యక్షురాలిని అవుతానని ధీమా వ్యక్తం చేశారు. బైడెన్ సమర్థంగా పని చేస్తున్నారని మరోసారి స్పష్టం చేశారు. ఎన్‌బీసీ న్యూస్‌తో ఆమె మాట్లాడారు. 'స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలను అడ్డుకునే వ్యక్తి డొనాల్డ్ ట్రంప్. ప్రజల అభిప్రాయాలను గౌరవించని నేత. అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పైనే దాడి చేయించిన వ్యక్తి' అని హారిస్ విమర్శించారు. తన అభ్యర్థిత్వంపై చరిత్రలోకి వెళ్లబోనని, తాను మహిళనని, ఎవరినీ తప్పుబట్టబోనని, తన అభ్యర్థిత్వానికి లింగ వివక్షవల్ల ఇబ్బంది లేదని తేల్చి చెప్పారు. లింగ భేదాన్ని, జాతిని బట్టి దేశానికి నేతను ఎన్నుకుంటారని అనుకోవడం లేదని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించేవారిని, స్ఫూర్తినందించే వారినే ప్రజలు ఎన్నుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఎన్నికల తర్వాత అమెరికాలో ఆందోళనలకు రష్యా, ఇరాన్ కుట్ర!

- నిఘా అధికారుల హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికాలో అధ్యక్ష ఎన్నికల తర్వాత హింసాత్మక ఆందోళనలకు రష్యా, ఇరాన్ కుట్ర పన్నాయని నిఘా అధికారులు హెచ్చరించారు. ఈ రెండు దేశాలు కోవర్టు ఆపరేషన్ల ద్వారాగానీ, స్థానిక గ్రూపులకు సహాయం చేయడం ద్వారాగానీ ఆందోళనలకు సహకరించవచ్చని మంగళవారం జాతీయ నిఘా డైరెక్టర్ కార్యాలయం వెల్లడించింది. విభజనను ప్రోత్సహించడం, ఎన్నికల ఫలితాలపై అనుమానాలను రేకెత్తించడం, అధికార మార్పిడికి అవాంతరాలు సృష్టించడం వంటివి అందులో ఉన్నాయని తెలిపింది. అమెరికాలో ఆందోళనలను నిర్వహించేందుకు అమెరికన్‌ను నియమించుకునే చర్యలను గత జనవరిలో రష్యా సైనిక నిఘా విభాగం చేపట్టిందని వివరించింది. అయితే అతడికి ఆ విషయం తెలియదని, రష్యా ఏజెంట్లతో అతడు కాంటాక్టులో ఉన్నాడో లేదో తెలియదని డైరెక్టరేట్ విడుదల చేసిన రహస్య డాక్యుమెంట్లలో ఉంది.

ట్రంప్ అంటేనే అంతర్జాతీయ నేతలకు భయం: బైడెన్



కాంకర్డ్: ట్రంప్ మళ్లీ అమెరికా అధ్యక్ష పదవి చేపడతారేమోనన్న భయం అంతర్జాతీయ నేతల్లో ఉందని అధ్యక్షుడు జో బైడెన్ తెలిపారు. అంతర్జాతీయంగా ప్రజాస్వామ్యానికి ఏమైనా అవుతుందేమోనన్న ఆందోళన వారిలో ఉందని పేర్కొన్నారు. 'నా ప్రతి అంతర్జాతీయ పర్యటనలోనూ ఇలాంటి ఆందోళనే వ్యక్తమైంది. ఇటీవల జర్మనీలో జరిగిన సదస్సుకు వెళ్లినప్పుడు ఇదే విషయం ప్రస్తావించారు. నన్ను పక్కకు తీసుకెళ్లి ఒకరి తర్వాత ఒకరు ట్రంప్ గెలవకూడదని చెప్పారు. తమ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని అభిప్రాయపడ్డారు' అని బైడెన్ వివరించారు.

పొత్తు కుదిరింది



- ఎంవీఏలో సీట్ల సర్దుబాటు కొలిక్కి..
- అభ్యర్థులను ప్రకటిస్తున్న ప్రధాన పార్టీలు
- మహారాష్ట్రలో వేడెక్కిన రాజకీయం

ముంబయి: ఎన్డీయే, ఇండియా కూటములకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులపై దాదాపుగా స్పష్టత వచ్చింది. భాజపా నేతృత్వంలోని మహాయుతిలో పొత్తుపై గతంలోనే అవగాహన కుదరగా.. బుధవారం శివసేన (ఉద్ధవ్), కాంగ్రెస్, ఎన్సీపీల (శరద్‌చంద్ర పవార్) మహా వికాస్ అఘాడీలో (ఎంవీఏ) సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చింది. మూడు ప్రధాన పార్టీలు తలో 85 సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించాయి. మిగిలిన సీట్లను ఇతర మిత్రపక్షాలకు కేటాయించనున్నాయి. పొత్తులు కుదరడంతో అభ్యర్థుల ప్రకటనపై పార్టీలు దృష్టి సారించాయి. బుధవారం శివసేన, ఎన్సీపీ, శివసేన (ఉద్ధవ్) పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి.

■ 65 మంది అభ్యర్థులతో శివసేన (ఉద్ధవ్) తొలి జాబితాను విడుదల చేసింది. ముంబయిలోని వర్లి నుంచి ఆదిత్య ఠాక్రేను నిలపాలని పార్టీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ నియోజకవర్గానికే ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఠాక్రే బంధువు, యువసేన నేత వరుణ్ సర్దేశాయ్ బాంద్రా ఈస్ట్ నుంచి బరిలోకి దిగుతున్నారు. పార్టీ విడిపోయినప్పుడు తనతో ఉన్న ఎమ్మెల్యేల్లో ఎక్కువ మందికి మళ్లీ టికెట్లు దక్కాయి. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేపై కేదార్ దిఘేను పార్టీ బరిలోకి దించింది.

■ అధికార శివసేన 45 మందితో తొలి జాబితాను విడుదల చేసింది. ముఖ్యమంత్రి శిందే.. ఠాణెలోని కోప్రి-పంచ్‌పఖడీ నుంచి పోటీ చేయనున్నారు. తొలి జాబితాలో అర డజను మంది మంత్రులకు గతంలో పోటీ చేసిన సీట్లే దక్కాయి. చీలిక సమయంలో శిందే పక్షాన నిలిచిన ఎమ్మెల్యేలందరికీ సీట్లు దక్కాయి.

■ అధికార ఎన్సీపీ 38 మంది అభ్యర్థులతో మొదటి జాబితాను విడుదల చేసింది. పార్టీ అధినేత అజిత్ పవార్ బారామతి నుంచి పోటీ చేయనున్నారు.

తలా 85 సీట్లపై అవగాహన

ఎంవీఏలో పొత్తు అంశం కొలిక్కి వచ్చిందని, 99శాతం పని పూర్తయిందని శివసేన (ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ ప్రకటించారు. తలా 85 సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించామని, 270 సీట్లపై అవగాహన కుదిరిందని తెలిపారు. మరోవైపు బుధవారం కాంగ్రెస్ నేతలు నానా పటోలే, విజయ్ వడెట్టివార్, బాలాసాహెబ్ థోరాట్‌లు శరద్ పవార్‌తో భేటీ అయ్యారు. కొన్ని సీట్లలో నెలకొన్న ప్రతిష్టంభనపై చర్చించారు. నాలుగైదు సీట్లపై చర్చలు జరుగుతున్నాయని పటోలే తెలిపారు.

తుర్కియేలో డిఫెన్స్ కంపెనీపై మిలిటెంట్ల దాడి

ఐదుగురి మృతి

అంకారా: తుర్కియే రాజధాని అంకారా శివారులో ఉన్న ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ కంపెనీ 'టుసాస్' ఆవరణపై బుధవారం మిలిటెంట్లు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులు మృతిచెందగా, 14 మంది గాయపడ్డారు. తుర్కియే అంతర్గత వ్యవహారాల మంత్రి అలి యలికయ ఈ విషయాన్ని 'ఎక్స్' ద్వారా ధ్రువీకరించారు. దుండగుల వైపు కనీసం ఇద్దరు మృతిచెందినట్లు తెలిపారు. ఈ దాడికి బాధ్యులు ఎవరన్నది వెంటనే తెలియరాలేదు. తుర్కియేలో కుర్దిష్ మిలిటెంట్లు, ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ సభ్యులు, వామపక్ష తీవ్రవాదులు గతంలో ఇటువంటి దాడులకు పాల్పడ్డారు. ప్రైవేటు టీవీ ఛానల్ కథనం మేరకు.. భద్రతా సిబ్బంది విధులు మారే సమయంలో దుండగుల సమూహం ఒకటి ట్యాక్సీలో కంపెనీ ఆవరణలోకి ప్రవేశించింది. వారిలో ఒకరు బాంబును పేల్చగా, మిగతావాళ్లు లోనికి చొరబడ్డారు. చాలాసేపు కాల్పుల శబ్దాలు వినిపించాయని ఆ ఛానల్ పేర్కొంది. కంపెనీ ఉద్యోగులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. భద్రతా దళాలు, అంబులెన్సులు, అగ్నిమాపక దళం ఘటనా స్థలికి చేరుకున్నాయి.

విమానాలకు బెదిరింపు పోస్టుల కట్టడికి మీ చర్యలేంటి?

- సోషల్ మీడియా సంస్థలను ప్రశ్నించిన కేంద్రం

ఇంటర్నెట్ డెస్క్: దేశీయంగా నడిచే, విదేశాలకు వెళ్లే పలు విమానాలకు బాంబు బెదిరింపు హెచ్చరికలు రావడం కలకలం సృష్టిస్తోంది. అయితే ఈ బెదిరింపులు ఎక్కువగా సామాజిక మాధ్యమాల వేదికగానే వస్తున్నట్లు ఇటీవల పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఈ క్రమంలోనే కేంద్రం ఆయా మాధ్యమాల ప్రతినిధులతో వర్చువల్‌గా భేటీ అయ్యింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సంకేత్ ఎస్.భోండ్వే అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో సామాజిక మాధ్యమాల పనితీరుపై ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో 'ఎక్స్', మెటాతో సహా పలు సామాజిక మాధ్యమాల ప్రతినిధులు హాజరయ్యారు. ఎక్స్ తీరు నేరాలను ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందంటూ కేంద్రం మండిపడినట్లు సమాచారం. అదేవిధంగా ఇటువంటి బెదిరింపులు మాధ్యమాల వేదికగా వ్యాప్తి చేస్తుంటే మీరు ఎలాంటి చర్యలు చేపట్టారో తెలియజేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

ఛత్తీస్‌గఢ్‌లో నదిలోకి దూసుకెళ్లిన పాఠశాల వ్యాను

- స్థానికుల చొరవతో తప్పిన పెను ప్రమాదం

ఇంటర్నెట్ డెస్క్ : ఛత్తీస్‌గఢ్‌లోని స్కతీ జిల్లాలో 15 మంది విద్యార్థులతో వెళ్తున్న పాఠశాల వ్యాన్ ప్రమాదవశాత్తు నదిలోకి దూసుకెళ్లింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టడంతో పెను ప్రమాదం తప్పింది. హస్దాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిసౌద్ గ్రామంలో సోన్ నదిపై కొన్నాళ్ల క్రితం ప్రభుత్వం వంతెనను నిర్మించింది. నదికి అవతల వైపున్న ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు వివిధ వాహనాల్లో అదే వంతెన మీదుగా ప్రయాణిస్తారు. ఈ క్రమంలో బుధవారం ఓ పాఠశాలకు చెందిన వ్యాన్ వంతెనపైకి చేరుకోగానే అదుపుతప్పి నదిలోకి దూసుకెళ్లింది. దీంతో స్థానికులు సహాయక చర్యలు చేపట్టి విద్యార్థులను సురక్షితంగా బయటకు తీశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ చిన్నారులంతా క్షేమంగా ఉన్నారని వైద్యులు ధ్రువీకరించారు.



నదిలో మునిగిపోయిన వ్యాను

జేఎంఎం రెండో జాబితా విడుదల

రాంచీ: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అభ్యర్థుల రెండో జాబితా బుధవారం సాయంత్రం విడుదలైంది. రాంచీ నుంచి రాజ్యసభ సభ్యురాలు మహువా మాఝీని పార్టీ మరోసారి బరిలోకి దింపింది. గతంలో ఆమె ఝార్ఖండ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా పని చేశారు. పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగానూ సేవలందించారు. 2014, 2019లలో రాంచీ నుంచి పోటీ చేసిన ఆమె భాజపా అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. అంతకు ముందు విడుదలైన తొలి జాబితాలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బర్హేట్ నుంచి, కల్పనా సోరెన్ గాండేయ్ నుంచి, దుమ్కా నుంచి బసన్ సోరెన్ పోటీ చేయనున్నట్లు పార్టీ ప్రకటించింది.

ఉరి వేసుకుని ఐఐటీ విద్యార్థి మృతి

దిల్లీ: దిల్లీలోని ఓ హాస్టల్‌లో ఐఐటీ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్‌లోని దేవ్‌గఢ్‌కు చెందిన కుమార్ యశ్(21) ఎంఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతడు కొద్ది రోజుల నుంచి మానసిక సమస్యకు చికిత్స పొందుతున్నాడు. మంగళవారం ఐఐటీ ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లాడు. అదే రోజు రాత్రి తాను ఉంటున్న హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్ సిబ్బంది సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కుమార్‌ను సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రిజర్వేషన్ రోస్టర్‌ను సమర్థంగా అమలు చేయండి

జోన్‌లకు సూచించిన రైల్వే బోర్డు

దిల్లీ: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్ రోస్టర్‌ను సమర్థంగా అమలు చేయాలంటూ అన్ని జోన్‌లు, సంబంధిత ప్రభుత్వ రంగ సంస్థలకు రైల్వే బోర్డు సూచించింది. ఇందుకోసం ఎప్పటికప్పుడు బోర్డు నిర్దేశించిన మార్గదర్శకాలను అమలు చేయాలని రైల్వే బోర్డు ఛైర్మన్ సతీశ్ కుమార్ 17 జోన్ల జనరల్ మేనేజర్లకు, దాని ప్రభుత్వ రంగ, స్వయంప్రతిపత్తి సంస్థల అధిపతులకు ఈ నెల 18న తెలియజేశారు. రిజర్వు చేసిన రోస్టర్ పద్ధతిలోనే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను నియమించాలని స్పష్టం చేశారు. సెప్టెంబరు 9న జరిగిన పార్లమెంటరీ కమిటీ సమావేశంలో రైల్వేల్లో, మరీ ముఖ్యంగా పీఎస్‌యూల్లో రిజర్వేషన్ రోస్టర్ల అమలుపై కొందరు సభ్యులు సమస్యను లేవనెత్తినట్లు పేర్కొన్నారు. రోస్టర్ల అమలును కనీసం నెలకు రెండుసార్లు అయినా సంబంధిత అధికారులు తనిఖీ చేయాలని సూచించారు. ఈ నివేదికను హెచ్‌వోడీకి సమర్పించాలని తెలిపారు.



యుక్త వయసు నుంచే ఇలా జీవించండి

కాలం ప్రతి ఒక్కరినీ నిరాడంబరంగా మారుస్తుంది. వయసు పెరిగేకొద్దీ విలాసాల కోసం వెంపర్లాడటం మాని చిన్న చిన్న అనుభూతుల విలువను తెలుసుకుంటాం. కంటినిండా నిద్ర, ఆరోగ్యకర ఆహారం, మనసారా మాట్లాడే స్నేహితులు, కుటుంబ సభ్యులతో సమయం గడపడం.. ఇలాంటి వాటికున్న విలువ అర్థమవుతుంది. మనశ్శాంతే నిజమైన సంపద అని, సాధారణ జీవితమే అంతిమ లక్ష్యమని గుర్తిస్తాం. యుక్త వయసులోనే దీన్ని అర్థం చేసుకుని జీవిస్తే మరీ మంచిది.

– వాలా అఫ్సర్, కాలమిస్ట్

40% యానాది కుటుంబాలకు జాబ్ కార్డులు లేవు

- నెల్లూరు జిల్లాలో వారి స్థితిగతులపై ప్రభుత్వ సర్వే
- 53 శాతం మందికి ఆరోగ్య బీమా లేదు
- రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులపై సర్వేకు సీఎం ఆదేశం

ఈనాడు, అమరావతి: పేదలకు ఉపాధి కల్పన, ఆరోగ్య రక్షణకు బీమా అవసరం. కానీ నెల్లూరు జిల్లాలోని యానాదుల్లో దాదాపు సగం కుటుంబాలకు ఈ రెండూ అందుబాటులో లేవు. ఉపాధి హామీ పథకం వారి దరి చేరట్లేదు. కుటుంబ పెద్ద మరణిస్తే ఇచ్చే బీమా కూడా అందడం లేదు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలిన విషయాలివి. పథకాలను, మౌలిక సదుపాయాలను గిరిజనులందరికీ అందించాలనే ఆలోచనతో రాష్ట్రవ్యాప్తంగా వారి స్థితిగతులపై సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పైలట్ ప్రాజెక్టు కింద నెల్లూరు జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ అధికారులు ఇటీవల సర్వే చేశారు. 40% కుటుంబాలకు ఉపాధిహామీ జాబ్ కార్డులు లేవని, 53% కుటుంబాలకు ఆరోగ్యబీమా లేదని, 19% మందికి ఆరోగ్యకార్డులు కూడా లేవని సర్వేలో తేలింది.

7% మందికి పథకాలు అందడం లేదు

నెల్లూరు జిల్లాలో 57,373 యానాదుల కుటుంబాలున్నాయి ఇందులో 56,231 (98%) కుటుంబాలపై సర్వే చేశారు. 2011 వీరిలో 7% మందికి ఆధార్ కార్డులే లేవు. అంటే వీరెవరికీ ప్రభుత్వ పథకాలు అందనట్లే. 7% మందికి రైస్ కార్డు లేదు. 18 ఏళ్లు నిండిన వారిలో 25% మందికి ఓటర్‌కార్డు లేదు. 13% మందికి బ్యాంకు ఖాతాలు లేవు.

అన్ని ఐటీడీఏల్లో సర్వేకు చర్యలు

ఈ సర్వే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని 9 ఐటీడీఏల పరిధిలో సర్వే చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆధార్ కార్డు, జాబ్ కార్డు, బీమా, తదితర వివరాలతోపాటు గృహం, నీటివసతి, రహదారులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, తదితర 17 శాఖలతో సమన్వయపరుచుకుని సమగ్రంగా సర్వే చేయాలన్నారు. ఇందుకు ఇప్పటికే గిరిజన సంక్షేమశాఖ అధికారులు 'రైజ్ ట్రైబ్స్' అనే యాప్‌ను సిద్ధంచేసి పాడేరు ఐటీడీఏ పరిధిలోని రెండు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా యాప్‌ను పరీక్షించారు. డిసెంబరు 31వ తేదీ నాటికి సర్వే పూర్తిచేసి గిరిజనులకు ప్రతి ప్రభుత్వ పథకం, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఎం ఆదేశించారు.

రూ. 72 లక్షలు కొట్టేశారు

భీమవరం వైద్యుడికి చేదు అనుభవం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సైబర్ పోలీసుల పేరిట దుండగులు ఓ వైద్యుడి నుంచి రూ.72 లక్షలు కాజేశారు. వైద్యుడికి ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లు చేసి తమను తాము సైబర్ పోలీసులుగా పరిచయం చేసుకున్నారు. మీ పేరిట ముంబయి నుంచి వచ్చిన పార్సిల్‌లో 5 పాస్‌పోర్టులు, ఏటీఎం కార్డులు, డ్రగ్స్ ఉన్నట్లు కొరియర్ సంస్థ నుంచి తమకు సమాచారం వచ్చిందని.. విచారణ నిమిత్తం పూర్తి వివరాలు చెప్పాలని పేర్కొన్నారు. తర్వాత అధికారుల పేరిట ఫోన్ చేసి బ్యాంకు ఖాతాల వివరాలు అడిగారు. వారు అధికారులేనని నమ్మిన బాధితుడు.. ఖాతాల నంబర్లు చెప్పారు. ఆ ఖాతాల్లో రూ.72 లక్షలు ఉన్నాయని.. తాము చెప్పిన ఖాతాకు బదిలీచేయాలని సూచించారు. ఎందుకని వైద్యుడు ప్రశ్నించగా ఇంత సొమ్ము మీకు ఎలా వచ్చిందో సరిచూడాలని తిరిగి మీ ఖాతాల్లో జమ చేస్తామని దుండగులు నమ్మబలికారు. తరువాత ఆ సొమ్మంతా కాజేశారు. ఎంతకీ నగదు తిరిగి జమ కాకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

అత్యాచార బాధితులకు రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలి

- వైకాపా అధినేత జగన్ డిమాండ్
- తమ పార్టీ తరఫున పదేసి లక్షలు ఇస్తామని ప్రకటన
- గుంటూరులో సహాన కుటుంబానికి పరామర్శ



గుంటూరు జీజీహెచ్‌లోని మార్చురీలో సహాన మృతదేహం వద్ద జగన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మహిళలపై జరిగిన అత్యాచారం, హత్యలకు సంబంధించి బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాల వద్దకు మంత్రులను పంపించి పరిహారం ఇచ్చి, క్షమాపణ చెప్పించాలన్నారు. వైకాపా నుంచి బాధితులకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించారు. రౌడీషీటర్ నవీన్ దాడిలో గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన సహాన కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పోలీసులు న్యాయంగా దర్యాప్తు చేస్తే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారాయని చెప్పడానికి ఈమెకు జరిగిన అన్యాయమే నిదర్శనమని జగన్ ఆరోపించారు. సహానను నవీన్ కారులో తీసుకెళ్లి ఇంకొందరితో కలిసి వేధించి శారీరకంగా హింసించడంతోపాటు లైంగిక దాడి చేశారని ఆరోపించారు. శరీరమంతా కందిపోయిన గుర్తులు కనిపిస్తున్నాయన్నారు.. వేర్వేరు ఆసుపత్రులకు తిప్పి బ్రెయిన్‌డెడ్ అయిన పరిస్థితిలో గవర్నమెంట్ ఆసుపత్రికి తెచ్చారన్నారు. తప్పు చేసినవారెవరైనా కచ్చితంగా శిక్ష పడుతుందన్న భరోసా ప్రభుత్వం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. తెదేపాకు చెందిన వ్యక్తి ఈ పని చేస్తే నిస్సిగ్గుగా కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను ఇక్కడికి వస్తున్నానని తెలిసి తెదేపా నేత ఆలపాటి రాజా వచ్చి వెళ్లారని, తెనాలి ఎమ్మెల్యే, మంత్రి కనీసం పరామర్శించలేదని.. హోంమంత్రి స్పందించలేదని చెప్పారు. బద్వేలులో 16 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి పెట్రోల్ పోసి కాల్చేశారని, శ్రీకాకుళం జిల్లాలో ఇద్దరు బాలికలకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేశారని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో తెదేపా కార్పొరేటర్ భర్త 16 ఏళ్ల బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేశారని ఆరోపించారు. లోకేశ్, అచ్చెన్నాయుడితో బాధ్యుడు ఫొటోలు దిగారని, డిప్యూటీ సీఎం ఆ పాప ఇంటికెళ్లి పరామర్శించారా? అని ప్రశ్నించారు. హిందూపురం నియోజకవర్గంలో దసరా రోజు అత్తాకోడలిపై గ్యాంగ్ రేప్ జరిగితే నిందితులను మూడు రోజుల వరకు అరెస్టు చేయలేదని.. అక్కడి ఎమ్మెల్యే బాలకృష్ణ పరామర్శించలేదని అన్నారు. అనకాపల్లి జిల్లాలో 9వ తరగతి బాలికను తెదేపా నేత సురేష్ నరికి చంపాడన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో దిశ యాప్ ద్వారా 31,607 మంది మహిళలు, బాలికలను కాపాడామని తెలిపారు. అలాంటి యాప్ పత్రాలను నారా లోకేశ్, హోంమంత్రి కాల్చివేయడం బుద్ధి తక్కువ పని అని అన్నారు. వీరి వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. జగన్ వెంట మాజీమంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, చంద్రగిరి ఏసురత్నం, లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు.

వైకాపాలో తిరగడం వల్లే నా కొడుకు రౌడీ అయ్యాడు

- సహాన కుటుంబీకులు మా బంధువులే
- ఆమెతో నవీన్ పెళ్లి చేయాలనుకున్నాం
- ఇంతలో ఇలా జరిగింది
- దయచేసి రాజకీయాలు చేయకండి
- స్పష్టం చేసిన నిందితుడి తల్లి



నవీన్ తల్లి కుమారి

ఈనాడు, అమరావతి: సహాన అనే యువతి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నవీన్. వైకాపా వారితో తిరగడం వల్లనే రౌడీషీటర్ అయ్యాడని అతడి తల్లి కుమారి ఆవేదన వ్యక్తంచేశారు. వైకాపా నేతలు ఈ ఘటనను రాజకీయంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. తమ కుటుంబాన్ని స్వార్థ రాజకీయాలకు బలి చేయొద్దని విజ్ఞప్తి చేస్తూ మంగళవారం రాత్రి కుమారి వీడియో విడుదల చేశారు. వైకాపా వారితోనే తిరుగుతూ వారి పనులకు వెళ్తుంటామని చెప్పారు. గతంలో తమ కొడుకును కారు నడపడానికని తీసుకెళ్లి రౌడీషీటర్‌గా మార్చారని మండిపడ్డారు. సహాన కుటుంబీకులు తమకు బంధువులేనని, నవీన్‌కు, ఆమెకు పెళ్లి చేయాలనుకున్న క్రమంలో ఇలా జరిగిందన్నారు. 'అమ్మాయి చనిపోయి వాళ్లు.. అబ్బాయికి ఇలా కావడంతో మేము ఎంతో బాధపడుతున్నాం. మా కుటుంబాలు ఏదో ఒకటి మాట్లాడుకుంటాయి. ఇప్పటికైనా మమ్మల్ని వదిలేయండి' అని ఆవేదన వ్యక్తం చేశారు. మా కుటుంబ విషయాన్ని రాజకీయాలకు ముడిపెట్టడం తగదన్నారు.

నవీన్ తల్లి ఇలా చెబుతుండగా, జగన్ మాత్రం గుంటూరు జీజీహెచ్ వద్ద హడావుడి చేస్తూ.. 'సహాన మృతికి కారణమైన నవీన్ అనే వ్యక్తి చంద్రబాబుతో దిగిన ఫొటోలు ఉన్నాయి. స్థానిక ఎంపీతో సన్నిహితంగా కూడా ఉన్నాడు. తెదేపాకు చెందిన వ్యక్తి ఈ పని చేస్తే నిస్సిగ్గుగా ఆ వ్యక్తిని కాపాడుతుండడం కన్నా హేయమైన పని ఉంటుందా?' అని ప్రశ్నించారు. ఒకవైపు నవీన్ తల్లి కుమారి తాము వైకాపాకు చెందినవారమని, వారి వల్లే తమ కుమారుడు రౌడీషీటర్‌గా మారాడని స్పష్టంగా చెప్పినా జగన్ తెదేపాకు చెందినవారంటూ చెప్పి రాజకీయం చేయడం గమనార్హం.

జగన్‌కు రాజకీయాల్లో ఉండే అర్హత లేదు

హోంమంత్రి అనిత

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు జగన్‌కు రాజకీయాల్లో ఉండే అర్హత లేదని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. బుధవారం ఏఎన్‌యూ వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ లేని దిశ చట్టం పేరుతో జగన్ ఐదేళ్లు కాలం గడిపేశారన్నారు. దిశ యాప్ ద్వారా ఒక్క మహిళనైనా కాపాడారా అని ప్రశ్నించారు. గతంలో ఐకాప్, ఫోర్త్‌ఐ అనే యాప్‌లు ఉన్నాయని, వాటికి పేరు మార్చి దిశ అని పెట్టారన్నారు. సొంత చెల్లెళ్లకు న్యాయం చేయలేని ఆయన ఇతరులకు ఎలా న్యాయం చేస్తారని అన్నారు. వాసిరెడ్డి పద్మ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఆయనకు ఉందా అని అనిత ప్రశ్నించారు.





మార్చురీ వద్దకు దూసుకొచ్చిన వైకాపా కార్యకర్తలు ★ జీజీహెచ్‌కు రోగులు వెళ్లే దారిలో అడ్డంగా కార్యకర్తలు

జీజీహెచ్‌లో వైకాపా శ్రేణుల హల్‌చల్

- ఇబ్బంది పడిన రోగులు, సహాయకులు
- కట్టడి చేయడంలో విఫలమైన పోలీసులు

ఈనాడు – అమరావతి, నగరంపాలెం – న్యూస్‌టుడే: గుంటూరు నగరంలో బుధవారం మాజీ సీఎం జగన్ పర్యటనలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. వేలమంది రోగులు, సహాయకులు ఉండే జీజీహెచ్ ప్రాంగణంలోకి ఆయన వెంట వందలమంది వైకాపా కార్యకర్తలను అనుమతించారు. జగన్ జీజీహెచ్‌లో ఉన్న గంటన్నర సేపు వారు ఆసుపత్రి పరిసరాల్లో గందరగోళం సృష్టించారు. జగన్ అనుకూల నినాదాలతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబును దూషిస్తూ ఇష్టానుసారం ప్రవర్తించారు. వైకాపా మూకల అరాచకం కారణంగా రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగన్ వచ్చి వెళ్లే వరకు అత్యవసర విభాగానికి వచ్చే ఆసుపత్రి ప్రధాన గేటు మూసేసి ఆ దారిలో అడ్డంగా నిల్చున్నారు. దీంతో రోగులు పడ్డ ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. రోగుల సహాయకుల పేరుతో కొందరు కార్యకర్తలు లోపలికి వెళ్లి హడావుడి చేశారు. అంబులెన్స్‌లు కూడా రాలేని పరిస్థితి కల్పించారు. కార్యకర్తలు బారికేడ్లు తోసేసి, చెట్లు ఎక్కి నానా బీభత్సం సృష్టించారు. జగన్ వచ్చినప్పుడు కొందరు వైద్యులు, సిబ్బంది కూడా అత్యుత్సాహం ప్రదర్శించడం గమనార్హం.

అప్పుడలా.. ఇప్పుడిలా...

వైకాపా పాలనలో బీటెక్ విద్యార్థిని రమ్య హత్యకు గురైనప్పుడు నారా లోకేశ్ ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించాలని గుంటూరుకు రాగా, పోలీసులు ఆయన్ను అడ్డుకుని అరెస్టు చేసి పెదనందిపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇప్పుడు మాత్రం జగన్‌కు రాచబాట పరిచారు. పరేడ్ మైదానంలో జగన్ హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతించారు. గతంలో ఏదైనా ఘటన జరిగితే 144 సెక్షన్ పెట్టి ఎక్కడికక్కడ జనాన్ని కట్టడి చేసిన పోలీసులు జగన్ పర్యటనలో మాత్రం వైకాపా కార్యకర్తలను స్వేచ్ఛగా వదిలేశారు.

సహాన కుటుంబానికి రూ. 10 లక్షల సహాయం

అందజేసిన మంత్రి నాదెండ్ల మనోహర్



సహాన తల్లి అరుణకుమారికి చెక్కును అందిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రౌడీషీటర్ దాడి కారణంగా మృతి చెందిన సహాన కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 10 లక్షల చెక్కును మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం రాత్రి ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. రౌడీషీటర్ల ఆగడాలను అదుపు చేస్తామని తెలిపారు. తెనాలి ఘటనలో పోలీసులు సత్వరం స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ప్రతి విషయాన్ని వైకాపా రాజకీయ లబ్ధి కోసం వినియోగించుకుంటుండడం సిగ్గుచేటన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, సహాన తోబుట్టువుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, తమకు ఇల్లు మంజూరు చేయాలని ఆమె తల్లి మంత్రిని కోరారు. సహాన అంత్యక్రియలు స్థానిక హయ్యర్‌పేటలోని శ్మశానవాటికలో పూర్తయ్యాయి.

సహాన లైంగిక దాడికి గురికాలేదు

ప్రాథమికంగా జీజీహెచ్ వైద్యుల గుర్తింపు

గుంటూరు (నగరంపాలెం), న్యూస్‌టుడే: రౌడీషీటర్ నవీన్ దాడితో బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందిన తెనాలి యువతి సహాన లైంగిక దాడికి గురి కాలేదని గుంటూరు జీజీహెచ్ వైద్యులు ప్రాథమికంగా తేల్చారు. ఆమె గర్భం దాల్చడంతో ప్రసూతి వైద్యుల సమక్షంలో.. వీడియోతీస్తూ శవపరీక్ష నిర్వహించారు. నమూనాలు తీసి పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్లు వైద్యులు తెలిపారు. ఆమెపై లైంగిక దాడి జరగలేదని నిర్ధారణకు వచ్చినట్లు చెప్పారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక వస్తే పూర్తి వివరాలు తెలియవచ్చని వెల్లడించారు.

బాలిక కుటుంబానికి సీఎం భరోసా

- రూ.10 లక్షల సాయం
- ఇతరులు భయపడేలా నిందితుడికి శిక్ష
- ఫోన్‌లో బాధితులను పరామర్శించిన చంద్రబాబు



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసేందుకు వచ్చిన వైఎస్సార్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నేత రితీష్‌రెడ్డి, తదితరులు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, బద్వేలు: వైఎస్సార్ జిల్లా బద్వేలు సమీపంలో పెట్రోల్ దాడిలో బలైన బాలిక కుటుంబ సభ్యులను బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌రెడ్డి ద్వారా రూ.10 లక్షల సాయం అందజేశారు. ఈ సందర్భంలో చంద్రబాబు శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేసి బాధితులతో మాట్లాడారు. 'తీవ్ర అన్యాయం జరిగింది. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు. చాలా దుర్మార్గం చోటుచేసుకుంది. నిందితుడికి పడే శిక్ష.. ఇతరులు భయపడేలా ఉంటుంది. ఈ కేసును ప్రత్యేక కోర్టులో ఫాస్ట్ ట్రాక్ విధానంలో విచారణ చేపడతాం. పోలీసు అధికారుల ద్వారా సిట్ ఏర్పాటు చేస్తాం' అని బాధితులతో చెప్పారు. బాలిక సోదరుడిని రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివించేలా, తల్లికి ఉద్యోగం ఇచ్చేలా కలెక్టర్‌ను ఆదేశించారు. గంజాయితో కొందరు యువకులు పెడతోవ పట్టారని, వ్యవస్థలను దారికి తెస్తున్నామని బాధితులతో అన్నారు. ముందుగా రూ.5 లక్షలు ఇవ్వాలని భావించిన అధికారులు.. సీఎం ఆదేశాలతో రూ.10 లక్షలకు పెంచారు. ఈ మేరకు బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ చెక్కులను అందజేశారు.

మీ ఆరోపణలపై చర్చకు సిద్ధమా?

జగన్‌కు మంత్రి నారా లోకేశ్ సవాల్



ఈనాడు డిజిటల్, అమరావతి: రాజకీయ పార్టీ ముసుగులో మాజీ సీఎం జగన్ నేర సామ్రాజ్యాన్ని నిర్మించారని మంత్రి లోకేశ్ ధ్వజమెత్తారు. నేరగాళ్లకు వైకాపా అండగా ఉంటే.. మహిళలకు ఎన్డీయే ప్రభుత్వం రక్షణగా ఉందని ఉద్ఘాటించారు. జగన్ చేస్తున్న ఆరోపణపై చర్చకు రావాలని 'ఎక్స్' వేదికగా బుధవారం సవాల్ విసిరారు. 'దిశ చట్టాన్ని ప్రభుత్వం నిలిపేసింది. 2019-24 మధ్య శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నాయి, ఎన్డీయే ప్రభుత్వంలో పోలీసులు శాంతిభద్రతల్ని పట్టించుకోవడం లేదు' అంటూ జగన్ చేసిన పలు ఆరోపణలకు లోకేశ్ ఘాటుగా స్పందించారు. 'దిశ చట్టమే లేనప్పుడు మేమెలా ఆపేస్తాం? 2019-24 మధ్య జగన్ పాలనా కాలంలో ఒక్క నిందితుడిపైన కూడా దిశ చట్టం కింద విచారణ జరగలేదు. మహిళలను దుర్భాషలాడటానికి, దాడులకు తెగబడటానికి జగన్ తన నేరగాళ్లకు స్వేచ్ఛనిచ్చారు. వ్యవస్థల్ని గాడిలో పెట్టి, మహిళలు సురక్షితంగా భావించే వాతావరణాన్ని కల్పించేందుకు ఎన్డీయే ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. సొంత చెల్లెళ్లను, తల్లిని హింసించే జగన్‌కు మహిళలు సురక్షితంగా ఉండటం ఇష్టం లేదు. ఇదే వైకాపా సంస్కృతి' అని లోకేశ్ విమర్శించారు.

చంద్రబాబు ఇకనైనా మేల్కోవాలి: జగన్

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, బద్వేలు: రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలపై సీఎం చంద్రబాబు ఇకనైనా మేల్కోవాలని వైకాపా అధినేత జగన్ అన్నారు. ఇటీవల పెట్రోలు దాడిలో మృతి చెందిన వైఎస్సార్ జిల్లా బద్వేలుకు చెందిన బాలిక కుటుంబ సభ్యులను బుధవారం జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థిని ఘటన శనివారం జరిగితే ఎవరూ సాయం అందించలేదని.. తానొస్తున్నానని తెలిసి ఉదయమే ఆర్థిక సాయం అందించారని విమర్శించారు. "రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలపై గుంటూరులోనూ సుదీర్ఘంగా మాట్లాడా. చంద్రబాబుకు ఒకటే చెబుతున్నా.. ప్రజలకు ఏదైనా జరిగినప్పుడు వారికి అండగా ఉండాలి. చదువులో ప్రతిభ చూపుతున్న బాలికను దారుణంగా చంపేశారు. ఈ ఘటన బాధాకరం' అని వ్యాఖ్యానించారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో పులివెందుల చేరుకోవాల్సిన జగన్.. వాతావరణం అనుకూలించలేదంటూ పర్యటన రద్దు చేసుకొని తాడేపల్లికి వెళ్లిపోయారు. జగన్ పర్యటనలో ఎంపీ అవినాష్‌రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ గోవింద్‌రెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.

EENADU Vol: 51, Iss: 74 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

జర్నలిస్టుల స్థానంలో ఏఐ ప్రయోక్తలు

- పోలండ్ రేడియో స్టేషన్ చర్యపై వెల్లువెత్తిన విమర్శలు

వార్సా: పోలండ్‌లోని ఓ రేడియో స్టేషన్ జర్నలిస్టులను తొలగించి వారి స్థానాన్ని కృత్రిమ మేధ (ఏఐ)తో రూపొందించిన ప్రయోక్తలతో భర్తీ చేసింది. ఈ చర్యపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి. ఉద్యోగులను తొలగించిన వారాల వ్యవధిలోనే ఆఫ్ రేడియో కకోవ్ అనే రేడియో స్టేషన్ ఏఐతో సృష్టించిన వర్చువల్ క్యారెక్టర్లతో రేడియో స్టేషన్‌ను పునఃప్రారంభించింది. చిన్నారులను ఆకర్షించేందుకు ఎల్‌జీబీటీక్యూ, సామాజిక సమస్యలు, కళలు, సంస్కృతులపై కార్యక్రమాలను చేపట్టింది. సంవత్సరాల తరబడి మీడియా రంగంతో అనుబంధం ఉన్న అనుభవజ్ఞులైన ఉద్యోగులను యంత్రాలతో భర్తీ చేయడం ఎంతో ప్రమాదకరమని ఓ జర్నలిస్ట్ బహిరంగ లేఖ రాయడంతో విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో రేడియో స్టేషన్‌కు వ్యతిరేకంగా బుధవారం 15వేల మందికి పైగా పిటిషన్‌ను దాఖలు చేశారు. ఏఐతో జర్నలిస్టులను భర్తీ చేయడాన్ని తాను ఖండిస్తున్నట్లు ఉప ప్రధానమంత్రి తెలిపారు. కాగా ఏఐతో జర్నలిస్టులను భర్తీ చేశారన్న ఆరోపణలను రేడియో స్టేషన్ హెడ్ మార్సిన్ పులిట్ తోసిపుచ్చారు.

వీసా గడువు ముగిసి.. నిద్రలేని రాత్రులు గడిపా

- మళ్లీ పొడిగింపుపై షాకు తస్లీమా థాంక్స్



దిల్లీ: భారత్‌లో తన నివాస గడువు ముగియటంతో కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సామాజిక మాధ్యమాల్లో సోమవారం ఉదయం పోస్టు పెట్టగా, సాయంత్రానికల్లా పొడిగింపునకు అనుమతి ఇచ్చారని బంగ్లాదేశ్ రచయిత్రి, హక్కుల కార్యకర్త తస్లీమా నస్రీన్ (62) తెలిపారు. గత మూడు నెలలుగా తాను ఆందోళన చెందుతున్న విషయానికి ఒకేరోజులో పరిష్కారం చూపిన అమిత్ షాకు థాంక్స్ చెబుతూ వెంటనే 'ఎక్స్'లో మరో పోస్టు పెట్టినట్లు బుధవారం ఆమె వెల్లడించారు. ఇంకో ఏడాదికాలం తన నివాస అనుమతి పొడిగిస్తున్నట్లుగా భారత ప్రభుత్వం ఈ బంగ్లా రచయిత్రికి సమాచారం చేరవేసింది. ఇస్లామిక్ ఛాందసవాదానికి వ్యతిరేకంగా గళమెత్తిన మహిళావాద రచయిత్రిగా పేరొందిన తస్లీమా నస్రీన్ సంచలనం రేపిన 'లజ్జ' నవలతో వివాదాల్లో చిక్కుకొన్నారు. 1994లో బంగ్లాదేశ్ ఆమెను దేశం నుంచి బహిష్కరించాక, 2004 నుంచి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. "నా వీసా గడువు మూడు నెలల క్రితమే ముగిసింది. ఈసారి పునరుద్ధరణ ఆలస్యం కావడంతో ప్రభుత్వం పొడిగించాలని అనుకోవడం లేదేమో అని ఆందోళనకు గురయ్యా. అదే నిజమైతే నేను ఎక్కడికి వెళ్లాలి? ఎక్కడ ఉండాలి? అని నిద్ర లేని రాత్రులు గడిపా. చివరి అవకాశంగా నేరుగా అమిత్ షాకు విజ్ఞప్తి చేశా" అని తస్లీమా వివరించారు. ఇస్లామిక్ ఛాందసవాదులు, వామపక్ష నేతలు చాలా మంది తనను భాజపా మద్దతుదారుగా భావిస్తారని, వాస్తవానికి ప్రభుత్వంలోని వ్యక్తులెవరూ తనకు తెలియదన్నారు. కొంతమంది జిహాదీలు తాను చనిపోయినట్లు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని పంపడంతో ఫేస్‌బుక్ తన ఖాతాను నిలిపివేసిందని, ఆ తర్వాత పలుమార్లు విజ్ఞప్తి చేసినా పునరుద్ధరించలేదని ఆమె తెలిపారు. తన నకిలీ మరణంపై జిహాదీలతో కలిసి ఫేస్‌బుక్ వేడుక చేసుకొంటున్నట్లు తస్లీమా నస్రీన్ వ్యాఖ్యానించారు.

చైనాతో ఒప్పందం వివరాలు బయటపెట్టాలన్న కాంగ్రెస్

దిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో వాస్తవాధీన రేఖ వెంబడి సేనల పహారా విషయమై భారత్, చైనాల మధ్య సోమవారం కుదిరిన ఒప్పందం వివరాలను దేశ ప్రజలకు వెల్లడించాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. సరిహద్దు నుంచి రెండు దేశాల సైనిక దళాల ఉపసంహరణకు కుదిరిన ఈ ఒప్పందం 2020 మార్చి నాటి పరిస్థితిని పునరుద్ధరిస్తుందని ఆశిస్తున్నామని కాంగ్రెస్ బుధవారం పేర్కొంది. గతంలో భారత సైనికులు డెప్సాంగ్‌లో మనదని ప్రకటించిన రేఖ నుంచి బాటిల్ నెక్ కూడలిలోని అయిదు ప్రాంతాల వరకు పహారా కాసేవారనీ, తాజా ఒప్పందం తరవాత మళ్లీ అక్కడ మన జవాన్ల పహారా కొనసాగుతుందో.. లేదో మోదీ ప్రభుత్వం వివరించాలని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. అలాగే డెమ్‌చోక్‌లో గత నాలుగేళ్ల నుంచి మన సైనికులకు అందుబాటులో లేకుండా పోయిన మూడు ప్రాంతాల్లో మళ్లీ పహారా సాగించగలమా అని ప్రశ్నించారు. ఒప్పందం తరవాత భారతీయ పశువులు, గొర్రెల కాపరులు గతంలో తమ జీవాలను మేపుకొన్నచోట్లకు తిరిగి వెళ్లగలుగుతారో.. లేదో కూడా చెప్పాలని కోరారు. మనకన్నా ఎంతో పెద్ద ఆర్థికవ్యవస్థ అయిన చైనాతో లడాయి పెట్టుకోలేమని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఇంతకుముందు వ్యాఖ్యానించడాన్ని జైరాం రమేశ్ తప్పుపట్టారు. తూర్పు లద్దాఖ్‌లో ఘర్షణలు జరగడానికి ముందున్న దానికన్నా గడచిన నాలుగేళ్లలో భారత్, చైనా వాణిజ్యం ఎంతో విస్తరించిందని చెప్పారు. 2018-19లో భారత్‌కు చైనా ఎగుమతుల విలువ 7,000 కోట్ల డాలర్లు కాగా, 2023-24లో అది 10,100 కోట్ల డాలర్లకు పెరిగిందన్నారు.

గుండెపోటుతో మరణం ముప్పును

4.5 రెట్లు పెంచుతున్న స్కిజోఫ్రేనియా!

దిల్లీ: స్కిజోఫ్రేనియా బాధితులు గుండెపోటుతో అకాల మరణం బారిన పడే ముప్పు నాలుగున్నర రెట్లు ఎక్కువగా ఉంటోందని తాజా అధ్యయనమొకటి గుర్తించింది. కుంగుబాటు వంటి ఇతర మానసిక అనారోగ్యంతో బాధపడేవారికి ఆ ముప్పు.. సాధారణ వ్యక్తులతో పోలిస్తే రెట్టింపు ఉంటున్నట్లు నిర్ధారించింది. డెన్మార్క్‌లోని కోపెన్‌హాగెన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు 10-90 ఏళ్ల మధ్య వయసున్నవారిపై ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. సాధారణ వ్యక్తులతో పోలిస్తే.. బైపోలార్ డిజార్డర్ బాధితులు ఆకస్మిక గుండెపోటుతో మరణించే ముప్పు మూడింతలు అధికంగా ఉంటున్నట్లు వారు తేల్చారు. మానసిక అనారోగ్య బాధితులు ఇతర కారణాలతో మృత్యువాతపడే అవకాశాలు కూడా మూడు రెట్లు ఎక్కువగా ఉంటున్నట్లు తెలిపారు. 70 ఏళ్ల ఓ వ్యక్తికి మానసిక ఆరోగ్యం సరిగా లేకపోతే అతడు మరో పదేళ్లపాటే జీవించే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. అదే వ్యక్తికి మానసిక అనారోగ్యం బాగుంటే మాత్రం మరో 14 ఏళ్లపాటు జీవించగలుగుతున్నట్లు వెల్లడించారు.



రష్యాలోని కజన్‌లో బ్రిక్స్ సదస్సులో ఇథియోపియా ప్రధాని అబీ అహ్మద్, ఈజిప్టు, దక్షిణాఫ్రికా, చైనా, రష్యా అధ్యక్షులు అబ్దుల్ ఫతా ఎల్-సిసి, సిరిల్ రమఫోసా, జిన్‌పింగ్, పుతిన్, భారత ప్రధాని మోదీ, యూఏఈ, ఇరాన్ అధ్యక్షులు షేక్ మహమ్మద్ బిన్, మసౌద్ పెజెష్కియాన్, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వియెరా

ఓటేసిన 2.1 కోట్ల మంది!

- అమెరికాలో ముందుగా ఓటేసే అవకాశాన్ని వినియోగించుకున్న ప్రజలు
- భారత సంతతిలోనూ ఉత్సాహం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటర్లకు అరుదైన అవకాశం ఉంటుంది. అదే ముందస్తుగా ఓటు హక్కును వినియోగించుకోవడం. పోలింగ్ తేదీకి నాలుగు వారాల ముందు నుంచే ప్రజలు ఓటేయవచ్చు. ఒకవైపు ప్రచారం.. మరోవైపు ఓటింగ్ సమాంతరంగా కొనసాగుతుంటాయి. ఈసారి ఎన్నికల్లోనూ ఇప్పటిదాకా 2.1 కోట్ల మంది ముందస్తుగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో భారత సంతతి వారూ ఉత్సాహంగా పాల్గొనడం విశేషం.

డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ తలపడుతున్న అధ్యక్ష ఎన్నికలకు రెండు వారాల ముందుగానే భారీగా జనం ఓటేశారు. అభ్యర్థులు ఒకవైపు ఉద్ధృతంగా ప్రచారం చేస్తుండగానే మరోవైపు జనం ఓటేశారు. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాలోని ఎలక్షన్ ల్యాబ్ అందించిన డేటా ప్రకారం.. 78 లక్షల మంది స్వయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేశారు. 1.33 కోట్ల మంది మెయిల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. భారత్‌లో మాదిరిగా పోలింగ్‌కు 36 గంటల ముందు ప్రచారం ముగించడం కాకుండా అమెరికాలో ఓటింగ్, ప్రచారం సమాంతరంగా జరుగుతాయి. నాలుగు వారాల ముందు నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు ఇక్కడ ఉంటుంది. దేశవ్యాప్తంగా పోలింగ్ నవంబరు 5వ తేదీన జరగనుంది.



మిల్వాకీలో ఓటు వేస్తున్న స్థానికులు

ఎలా సాధ్యం..

అమెరికాలో పోలింగ్ తేదీకి ముందు నుంచే ఓటేసే అవకాశం ఉంటుంది. భారత్‌లో పోస్టల్ బ్యాలెట్ తరహాలో ఇక్కడ మెయిల్-ఇన్-బ్యాలెట్ విధానం ఉంటుంది. ఓటర్లు మెయిల్ ద్వారా ఓటేసేందుకు దరఖాస్తు చేసుకుంటే అవకాశం కల్పిస్తారు.

■ ఇక రెండో విధానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. కొన్ని వారాల ముందుగానే చాలా రాష్ట్రాలు పోలింగ్ ప్రక్రియను ప్రారంభించాయి. దీంతో ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు.

1.7శాతం ఆసియన్ అమెరికన్లు

ఎలక్షన్ ల్యాబ్ డేటా ప్రకారం.. 1.7శాతం ఆసియన్ అమెరికన్లు ఓటేశారు. అందులో భారత సంతతి వారు ఉత్సాహంగా క్యూలలో నిల్చుని మరీ ఓటేశారు. ఇల్లినోయీ, టెక్సాస్ వంటి రాష్ట్రాల్లో భారతీయులు క్యూలలో ఉండి మరీ ఓటేశారు.

రిపబ్లికన్లే అధికం..

ముందస్తు ఓటింగ్‌లో పాల్గొన్న వారిలో రిపబ్లికన్లే అధికంగా ఉన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటేసిన వారిలో రిపబ్లికన్లు 41.3%, డెమోక్రాట్లు 33.6% ఉన్నారు.

■ మెయిల్-ఇన్-బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో డెమోక్రాట్లు 20.4%, రిపబ్లికన్లు 21.2% ఉన్నారు.

■ జార్జియా రాష్ట్రంలో నాలుగో వంతు మంది ఇప్పటికే ఓటేశారు. ఈ రాష్ట్రంలో 18.4 లక్షల మంది ముందస్తు ఓటుహక్కును వినియోగించుకున్నారు.

జగదాంబికా పాల్ తీరు దురదృష్టకరం

- 'వక్ఫ్' ఘటన మీడియాకు వెల్లడిపై విపక్షాల ఆక్షేపణ
- దీటుగా స్పందించి స్పీకర్‌కు లేఖ రాసిన భాజపా

దిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశ వివరాలను గోప్యంగా ఉంచాల్సి ఉండగా, స్వయానా కమిటీ ఛైర్మన్ జగదాంబికా పాల్ మీడియాకు వెల్లడించడం దురదృష్టకరమని జేపీసీ సభ్యుడు, డీఎంకే ఎంపీ ఎ.రాజా వ్యాఖ్యానించారు. సమావేశంలో విపక్ష సభ్యుడు బాటిలు పగలగొట్టిన ఘటన గురించి పాల్ మీడియా ఎదుట మాట్లాడటం నియమాలను ఉల్లంఘించడమేనని అన్నారు. హడావుడిగా నిర్వహిస్తున్న ప్యానెల్ సమావేశాలతో న్యాయం జరగదేమో అనే అనుమానాలు సభ్యుల్లో, ప్రజల్లో తలెత్తుతున్నాయని బుధవారం 'ఎక్స్' ద్వారా రాజా స్పందించారు. ఆప్ రాజ్యసభ సభ్యుడైన సంజయ్ సింగ్ సైతం జేపీసీ ఛైర్మన్ పాల్ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం నాటి సమావేశంలో జరిగిన ఘటన గురించి బయట ఎక్కడా మాట్లాడకూడదన్న నియమానికి విపక్ష సభ్యులైన తామంతా కట్టుబడ్డామని, స్వయంగా ఛైర్మన్ మీడియాకు ఆ వివరాలు వెల్లడించడం చాలా దురదృష్టకరం అన్నారు. విపక్ష సభ్యుల ఆరోపణలపై జేపీసీ ఛైర్మన్ పాల్ సహా భాజపా సభ్యులు దీటుగా స్పందించారు.

నియమాలు ఉల్లంఘించలేదు: పాల్

జేపీసీ సమావేశం వివరాలు మీడియాకు వెల్లడించి తాను నియమాలు ఉల్లంఘించినట్లు విపక్ష సభ్యులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని భాజపా ఎంపీ, 'వక్ఫ్' జేపీసీ ఛైర్మన్ జగదాంబికా పాల్ తెలిపారు. సమావేశంలో జరిగిన చర్చల గురించి కాకుండా.. టీఎంసీ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ హింసాత్మక ఘటనకు పాల్పడటంపై మాత్రమే తాను మాట్లాడినట్లు వివరణ ఇచ్చారు. విపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్న మాటను నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని పాల్ అన్నారు. పార్లమెంటరీ సంస్థల సంప్రదాయాలను అవమానించేలా కల్యాణ్ బెనర్జీ వ్యవహరించారని, ఆయన ప్రవర్తనపై 'ఇండియా' కూటమి నేతల వైఖరేమిటో చెప్పాలని కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్ డిమాండ్ చేశారు. జేపీసీ సమావేశంలో హింసాత్మక ఘటనకు పాల్పడినందుకు కల్యాణ్ బెనర్జీపై ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించాలని, సభ నుంచి ఆయనను వెంటనే సస్పెండు చేయాలని కోరుతూ భాజపా ఎంపీలు నిశికాంత్ దుబే, అపరాజితా సారంగీ, అభిజిత్ గంగోపాధ్యాయ్ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. బెనర్జీ పార్లమెంటు సభ్యత్వం రద్దు అంశాన్ని పరిశీలించేందుకు లోక్‌సభ ఎథిక్స్ కమిటీ ద్వారా దర్యాప్తు జరిపించాలని అందులో కోరారు.

బంగ్లాలో మళ్లీ విద్యార్థుల ఆందోళనలు

ఢాకా: బంగ్లాదేశ్‌లో మళ్లీ విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ రాజీనామా చేయాలని, 1972 నాటి రాజ్యాంగాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం రాత్రి అధ్యక్ష భవనం ముట్టడించారు. ఈ ఘటనలో చాలా మంది పోలీసులకు గాయాలయ్యాయి. విద్యార్థుల ఆందోళనలతో ఆగస్టు 5న దేశం విడిచి భారత్‌కు వెళ్లిపోయిన షేక్ హసీనా రాజీనామాకు సంబంధించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అధ్యక్షుడు షహబుద్దీన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హసీనా భారత్‌కు వెళ్లే సమయంలో ప్రధాని పదవికి రాజీనామా చేసినట్లు లేదని.. ఆమె రాజీనామా లేఖ తనకు ఎక్కడా దొరకలేదని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు బంగ్లాలో కలకలం సృష్టించాయి. విద్యార్థులు మళ్లీ వీధుల్లోకి వచ్చారు. అధ్యక్ష భవనం.. బంగభవన్‌ను ముట్టడించారు. తక్షణం షహబుద్దీన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాజకీయ నిర్ణయం త్వరలోనే తీసుకుంటామని తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. హసీనా రాజీనామా చేశారని.. ఇందులో ఎలాంటి అయోమయం లేదని వివరణ ఇచ్చింది.

వైవిధ్య పోషకాహారానికి నోచని 77 శాతం పిల్లలు

దిల్లీ: దేశంలోని 6-23 నెలల మధ్య గల 77శాతం మంది పిల్లలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిర్దేశించిన వైవిధ్యభరితమైన పోషకాహారం అందడం లేదని ఒక అధ్యయనం చెబుతోంది. ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో నివసించే పిల్లల్లో ఈ లోపం 80% వరకు కనిపిస్తోంది. తల్లిపాలు ఇవ్వడంతోపాటు గుడ్లు, పండ్లు, చిక్కుళ్లు, విత్తనాలున్న పదార్థాలను తినిపించడం వల్ల పిల్లలకు సంపూర్ణ పోషకాహారం లభిస్తుందని అధ్యయనం పేర్కొంది. 2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) వివరాలు, జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థ గణాంకాల ఆధారంగా పోషకాహార విశ్లేషణ చేశారు. 2005-06లో నిర్వహించిన ఆరోగ్య సర్వే-3లో 87.4శాతమున్న పోషకాహార లోపమున్న పిల్లలు ఇప్పుడు తగ్గారు. అయినప్పటికీ డబ్ల్యూహెచ్‌వో నిర్దేశిత ప్రమాణాలకన్నా (75శాతం) ఇప్పుడున్న 77శాతం ఎక్కువేనని పేర్కొంది. ప్రధానంగా గుడ్ల వినియోగం పెరగడం ఈ మేలి మార్పునకు కారణమవుతోందని వివరించింది. ఈ వివరాలు జాతీయ వైద్య జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

లారెన్స్ సోదరుడితో సిద్దిఖీ హత్య కేసు నిందితుల చాట్

ముంబయి: మహారాష్ట్రలో ఎన్సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్యకు ముందు లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్‌తో షూటర్లు స్నాప్‌చాట్ ద్వారా సంప్రదింపులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. స్నాప్‌చాట్‌లో 24 గంటల్లోపు చాట్ మాయమయ్యే సదుపాయాన్ని ఉపయోగించి సంప్రదింపులు జరుపుకునేవారని, దానిద్వారానే అన్మోల్ వారికి సిద్దిఖీ, అతడి కుమారుడి ఫొటోలు పంపాడని నిందితులు పేర్కొన్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఈ కేసులో 10 మంది నిందితులను అరెస్టు చేశామని, మరో నిందితుడు శివకుమార్ గౌతమ్ పరారీలో ఉన్నాడని తెలిపారు. స్నాప్‌చాట్‌లో 24 గంటల తర్వాత మెసేజ్‌లు మాయమయ్యే అవకాశం ఉండటం వల్ల వారి సంభాషణలను సేకరించలేకపోయినట్లు పేర్కొన్నారు. సిద్దిఖీని హత్య చేసేందుకు కాంట్రాక్ట్ తీసుకున్న షూటర్లు దాడికి ముందు అటవీ ప్రాంతంలో చెట్లను లక్ష్యంగా చేసుకొని షూటింగ్ ప్రాక్టీస్ చేసినట్లు పేర్కొన్నారన్నారు. దీనిపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉన్న సిద్దిఖీపై దుండగులు ఆరు రౌండ్ల కాల్పులు జరిపి హతమార్చిన సంగతి తెలిసిందే.

బందీలను ఇంటికి తెచ్చుకోండి: బ్లింకెన్

బీరుట్/టెల్ అవీవ్: కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాలని ఇజ్రాయెల్‌కు అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సలహా ఇచ్చారు. బందీలను ఇంటికి తెచ్చుకోవాలని సూచించారు. పశ్చిమాసియా పర్యటనకు వచ్చిన ఆయన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. "గాజాకు సంబంధించి కీలక లక్ష్యాలన్నింటినీ దాదాపు ఇజ్రాయెల్ సాధించింది. ఇప్పుడు వాటిని ఎప్పటికీ నిలిచిపోయే వ్యూహాత్మక విజయాలుగా మలచుకోవాలి. చేయడానికి ఇక రెండు పనులే మిగిలి ఉన్నాయి. బందీలను ఇంటికి తెచ్చుకోవడం.. యుద్ధాన్ని ముగించడం" అని చెప్పారు. అనంతరం ఆయన సౌదీ అరేబియా పర్యటనకు బయల్దేరారు. బ్లింకెన్.. టెల్ అవీవ్‌లో ఉన్న సమయంలో సైరన్లు మోగాయి. లెబనాన్ నుంచి రాకెట్లు దూసుకొచ్చాయి. వీటిని మధ్యలోనే ఇజ్రాయెల్ అడ్డుకుంది. ఇందుకు సంబంధించిన పొగలు.. బ్లింకెన్ బస చేసిన హోటల్ నుంచి కనిపించాయి.



గాజాలోని ఖాన్ యూనిస్‌లో స్వచ్ఛంద సంస్థ పంపిణీ చేస్తున్న రొట్టెల కోసం ఎగబడుతున్న పాలస్తీనియులు

భారత్‌పై ఆరోపణలకు ముందే..

అమెరికా మీడియాకు ట్రూడో సహాయకుల లీక్

దిల్లీ: తమ దేశ వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకుంటోందంటూ కెనడా ఇటీవల ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. భారత్‌పై ఆరోపణలు చేయడానికి ముందే మన దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని అమెరికా వార్తా పత్రికకు ట్రూడో సన్నిహితులు అందజేశారని తెలిసింది. ఈ మేరకు కెనడా వార్తా పత్రిక 'ది గ్లోబ్ అండ్ మెయిల్' తాజా కథనం ప్రచురించింది. ట్రూడో ప్రభుత్వ జాతీయ భద్రతా సలహాదారు నథాలీ డ్రౌయిన్, డిప్యూటీ మంత్రి డేవిడ్ మారిసన్‌లు వాషింగ్టన్ పోస్టుకు సున్నితమైన సమాచారం అందజేసినట్లు కెనడా పత్రిక పేర్కొంది. ముఖ్యంగా ఖలిస్థానీ వేర్పాటువాదుల హత్యలో పాత్రతోపాటు తమ వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకోవడం వంటి అంశాలపై వారు మాట్లాడినట్లు తెలిపింది. భారత్‌పై కెనడా పోలీసులు ఆరోపణలు చేసే కొన్ని రోజుల ముందే అమెరికా మీడియాకు ట్రూడో సన్నిహితులు ఈ సమాచారం చేరవేశారని పేర్కొంటూ కథనంలో తెలిపింది.

హేతుబద్ధమైన జవాబుదారీతనం ఉండాలి

పన్నూ కేసులో అమెరికా వ్యాఖ్య

వాషింగ్టన్: ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్‌సింగ్ పన్నూ హత్యకు పన్నిన కుట్ర కేసులో భారత్ దర్యాప్తులో హేతుబద్ధమైన జవాబుదారీతనం ఉండేంత వరకూ తాము పూర్తిస్థాయిలో సంతృప్తి చెందలేమని అమెరికా పేర్కొంది. ఆ కుట్రను అమెరికా విఫలం చేసింది. అమెరికా పౌరుడి(పన్నూ)ని ఆ దేశ గడ్డపైనే హత్య చేసేందుకు జరిగిన కుట్రలో తమకు ఎటువంటి పాత్ర లేదని భారత ప్రభుత్వం పేర్కొంటోంది. అయితే అమెరికా ఆరోపణల నేపథ్యంలో వాటిపై దర్యాప్తునకు భారత్ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. 'భారత్ చేపట్టిన దర్యాప్తులో హేతుబద్ధమైన జవాబుదారీతో కూడిన ఫలితాలను మేం ఆశిస్తున్నాం. ఆ రకంగా జరగనంత వరకూ మేం పూర్తిస్థాయిలో సంతృప్తి చెందలేం" అని విదేశీ వ్యవహారాల విభాగం ఉప అధికారప్రతినిధి వేదాంత పటేల్ మీడియాతో పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌కు 5 వేలకోట్ల డాలర్ల రుణాలపై ముందుకే వెళ్లనున్న జీ-7: అమెరికా

వాషింగ్టన్: వివిధ దేశాల్లో స్తంభింపజేసిన రష్యా సెంట్రల్ బ్యాంకు ఆస్తులపై వచ్చే వడ్డీ ద్వారా ఉక్రెయిన్‌కు 5 వేల కోట్ల డాలర్ల రుణాలు అందించాలన్న తమ ప్రణాళికపై జీ-7 దేశాలు ముందుకే వెళ్లనున్నట్లు అమెరికా స్పష్టం చేసింది. అందులో తమ వంతు వాటాగా 2 వేల కోట్ల డాలర్లు అందిస్తామని తెలిపింది. ఈ మొత్తాన్ని ఆర్థిక, సైనిక సాయంగా విభజిస్తామని శ్వేతసౌధంలో జాతీయ భద్రత ఉప సలహాదారు దలీప్ సింగ్ వెల్లడించారు. మిలిటరీ సాయం కింద అందించే మొత్తానికి చట్టసభల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. మిగిలిన 3 వేల కోట్ల డాలర్లను ఈయూ, బ్రిటన్, కెనడా తదితర దేశాలు సమకూర్చుస్తాయని వివరించారు.

చెట్ల నరికివేతకు కోర్టు అనుమతి అవసరమా..!

- ఆ విషయంపై నాకు అవగాహన లేదు
- సుప్రీంకోర్టులో దిల్లీ ఎల్‌జీ ప్రమాణపత్రం

దిల్లీ: దేశ రాజధానిలో చెట్ల నరికివేతకు న్యాయస్థానం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలనే విషయం తనకు తెలియదని దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) వి.కె.సక్సేనా తెలిపారు. ఆ విషయాన్ని ఎవరూ తన దృష్టికి తీసుకురాలేదన్నారు. సుప్రీంకోర్టులో తాజాగా ఈ మేరకు ప్రమాణపత్రం సమర్పించారు. దిల్లీ అభివృద్ధి ప్రాధికార సంస్థ (డీడీఏ) ఛైర్‌పర్సన్‌గా కూడా ఎల్‌జీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అక్కడి రిడ్జ్ ప్రాంతంలో దాదాపు 600 చెట్లను నరికేయడంపై సుప్రీంకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలైంది. దానిని పరిశీలించిన న్యాయస్థానం.. ప్రమాణపత్రం సమర్పించాలంటూ ఎల్‌జీని ఆదేశించింది. "రిడ్జ్ ప్రాంతంలో వైద్య కేంద్రం నిర్మించాలనుకున్న ప్రదేశాన్ని ఫిబ్రవరి 3న సందర్శించాను. అప్పుడు ఆ నిర్మాణ అవసరం, ప్రాధాన్యం, దానికి కేటాయించిన వనరుల అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాను. అక్కడి నుంచి తిరిగొస్తున్నప్పుడు రోడ్డు విస్తరణ జరుగుతున్న ప్రదేశంలో ఆగాను. కోర్టు అనుమతి లేకుండా చెట్లను నరికివేయకూడదనే విషయాన్ని నాడు ఎవరూ నా దృష్టికి తీసుకురాలేదు. చెట్లను నరికివేయడానికి గుత్తేదారులకు డీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆ విభాగానికి చెందిన కొందరు అధికారులు ఆదేశాలు ఇచ్చారు" అని ప్రమాణపత్రంలో ఎల్‌జీ వివరించారు.

వైవాహిక అత్యాచారం వ్యాజ్యంపై విచారణ 4 వారాలకు వాయిదా

- తన పదవీ విరమణ తేదీ నవంబరు 10లోగా తీర్పునివ్వడం సాధ్యం కాదన్న సీజేఐ

దిల్లీ: వైవాహిక అత్యాచారం కేసుల్లో భర్తలకు కల్పించిన రక్షణలను సవాల్ చేస్తూ దాఖలైన వాజ్యంపై వాదనలకు మరింత సమయాన్ని న్యాయవాదులు కోరిన నేపథ్యంలో విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది. నవంబరు 10న తాను పదవీ విరమణ చేయనున్నందున ఆ లోగా విచారణ పూర్తయ్యే పరిస్థితి లేదని, తీర్పు వెలువరించడం కూడా సాధ్యం కాదని ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. అందువల్ల ఈ కేసును మరో ధర్మాసనానికి అప్పగించాల్సిన అవసరం ఉందని బుధవారం తెలిపారు. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

వివాహ వివాదాల్లోని ఎఫ్ఐఆర్‌లను సాధారణ పద్ధతిలో రద్దు చేయకూడదు

- దిల్లీ హైకోర్టు

దిల్లీ: వైవాహిక బంధంలో వివాదాల కారణంగా భార్య నుంచి విడిపోయిన భర్త తనపై గతంలో నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేయాలంటూ వేసిన పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు తిరస్కరించింది. సంబంధిత క్రిమినల్ కేసును కొట్టివేసేందుకు నిరాకరించింది. విడిపోయిన జంట పరస్పర అంగీకారంతో విడాకులను పొందాలని నిర్ణయించుకున్నప్పటికీ, సెటిల్మెంట్ మొత్తాన్ని భర్త తిరిగి తీసుకున్నారని పేర్కొంటూ సదరు మహిళ కేసును ఎత్తివేయడాన్ని వ్యతిరేకించిందని జస్టిస్ చంద్రధారి సింగ్ పేర్కొన్నారు. దీంతో ఈ వివాదాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించి, సెటిల్‌మెంట్ డీడ్‌లతో కోర్టులను ఆశ్రయించినప్పటికీ వివాదాన్ని పరిష్కరించుకోవడానికి బాధిత పక్షాన్ని బలవంతం చేస్తూ సంపన్నులు చట్టాన్ని ఉల్లంఘించడానికి ఎలా ప్రయత్నిస్తారో తెలియడానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ అని కోర్టు తెలిపింది. దీంతో వివాహ వివాదాల్లోని ఎఫ్ఐఆర్‌లను సాధారణ పద్ధతిలో రద్దు చేయకూడదని కోర్టు పేర్కొంది. వైవాహిక బంధం రద్దు అనంతరం సంబంధిత పురుషుడు, మహిళకు కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం..మహిళకు రూ.45 లక్షల మొత్తాన్ని చెల్లిస్తానని తనపై ఉన్న పెండింగ్ కేసులను ఉపసంహరించుకోవాలని పురుషుడు కోరాడు. అనంతరం తనపై ఉన్న క్రిమినల్ కేసును రద్దు చేయాలని దిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశాడు. దీనిని వ్యతిరేకించిన మహిళ ఆ పురుషుడు వేసిన పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ తమకు జరిగిన ఒప్పందం పూర్తిగా సఫలీకృతం కాలేదని, నిందితుడు ఒప్పంద రుసుము మొత్తాన్ని వెనక్కి తీసుకున్నాడని పేర్కొంది. దీంతో పిటిషనర్ నేర స్వభావాన్ని పరిగణనలోకి తీసుకున్న దిల్లీ హైకోర్టు అతడిపై నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేయడానికి నిరాకరించింది.

జామా మసీదును రక్షిత స్మారకంగా ప్రకటిస్తే ఆ ప్రాంతంలో ఆంక్షలు వస్తాయి

- దిల్లీ హైకోర్టుకు వివరించిన పురాతత్త్వ విభాగం

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని జామా మసీదును రక్షిత స్మారక కట్టడంగా ప్రకటిస్తే గణనీయమైన ప్రభావాలను ఎదుర్కోవలసి వస్తుందని భారత పురాతత్త్వ విభాగం (ఏఎస్ఐ) స్థానిక హైకోర్టుకు తెలిపింది. ఈ దిశగా ఇప్పటివరకూ ఎటువంటి చర్యలూ తీసుకోలేదని చెప్పింది. ఈ అంశానికి సంబంధించి దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తన వాదనను తెలుపుతూ అఫిడవిట్ దాఖలు చేసింది. అందులో..ఒకసారి మసీదును రక్షిత స్మారక కట్టడంగా ప్రకటిస్తే ఆ ప్రాంతంలో పలు నిబంధనలను, ఆంక్షలను అమలు పరచాల్సి వస్తుందని వివరించింది. ప్రస్తుతం ఆ మసీదు దిల్లీ వక్ఫ్‌బోర్డు సంరక్షణలో ఉందని, ఆ కట్టడానికి సంబంధించిన పరిరక్షణ, సంరక్షణ చర్యలను ఏఎస్ఐ నిర్వహిస్తోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో జామా మసీదును స్మారక కట్టడంగా ప్రకటించేందుకు విముఖంగా ఉన్నట్లు జస్టిస్ ప్రతిభా ఎం సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

కృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా వివాదం.. పిటిషన్ల కలిపివేత ఆదేశాలను వెనక్కు తీసుకోం

- అలహాబాద్ హైకోర్టు స్పష్టీకరణ

ప్రయాగ్‌రాజ్: మథురలోని కృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా వివాదంపై హిందువుల తరఫు పిటిషన్లన్నింటిని కలిపేస్తూ ఇచ్చిన ఆదేశాలను వెనక్కు తీసుకోవాలంటూ దాఖలైన వినతిని అలహాబాద్ హైకోర్టు తోసిపుచ్చింది. ముస్లింల తరఫున దాఖలైన ఈ పిటిషన్‌ను జస్టిస్ మాయాంక్ కుమార్ జైన్ తిరస్కరించారు. ఒకే రకమైన రెండు లేదా అంతకంటే ఎక్కువ కేసులుంటే వాటన్నింటినీ ఒక్కటిగా విచారించాలా? లేదా? అన్నది న్యాయస్థానం నిర్ణయిస్తుందని, ఇందులో కక్షిదారుల సమ్మతితో తమకు సంబంధంలేదని స్పష్టం చేశారు.

గ్యాంగ్‌స్టర్ ఛోటా రాజన్‌కు బెయిల్ మంజూరు

ముంబయి: గ్యాంగ్‌స్టర్ ఛోటా రాజన్‌కు బాంబే హైకోర్టులో ఊరట లభించింది. 2001లో హోటల్ యజమాని జయాశెట్టి హత్య కేసులో విధించిన జీవితఖైదును రద్దు చేస్తూ బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయినప్పటికీ ఇతర కేసుల కారణంగా రాజన్ జైల్లోనే ఉండనున్నారు.

ఇమ్రాన్‌ఖాన్ భార్యకు బెయిలు

ఇస్లామాబాద్: తోషాఖానా అవినీతి కేసులో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ భార్య బుష్రా బీబీకి ఇస్లామాబాద్ హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. ఇమ్రాన్ ప్రధానిగా ఉన్న కాలంలో విదేశీ అతిథులు ఇచ్చిన కానుకలను ఇమ్రాన్ దంపతులు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని ఆరోపణ.



మధ్యప్రదేశ్‌లోని శివపురిలో మంటలు చెలరేగడంతో కాలిపోతున్న పాఠశాల బస్సు. ఈ ప్రమాదం నుంచి 12మంది విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు

ఈనాడు సినిమా

సరికొత్త అవతారంలో



ప్రభాస్

హారర్ అన్నది కొత్త హాస్యం అంటూ తన కొత్త అవతారాన్ని ప్రదర్శించారు అగ్ర కథానాయకుడు ప్రభాస్. ఆయన తొలిసారి హారర్ కథతో 'రాజాసాబ్' చేస్తున్న సంగతి తెలిసిందే. మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. బుధవారం ప్రభాస్ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'రాజాసాబ్' మోషన్ పోస్టర్‌ని విడుదల చేశారు. అందులో ప్రభాస్ వయసు మీద పడిన వ్యక్తి గెటప్‌లో సరికొత్త అవతారంలో దర్శనమిచ్చారు. స్టైలిష్ లుక్ మాత్రమే కాకుండా... సినిమాలో మరో అవతారం కూడా ఉందని ఆ ప్రచార చిత్రం చాటింది. భాషతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ విశేషమైన అభిమానగణాన్ని సొంతం చేసుకున్నారు ప్రభాస్. ఆయన చేస్తున్న ఈ కొత్త రకమైన కథపై భారీ అంచనాలున్నాయి. బుధవారం వెల్లువెత్తిన పుట్టినరోజు శుభాకాంక్షలతో ప్రభాస్ తడిసి ముద్దయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో సినిమాలు చేస్తున్న నిర్మాణ సంస్థలు, ఆయా చిత్రాలకి సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాల్ని బయట పెట్టాయి.

'సలార్ 2' మొదలైంది

ప్రభాస్ కథానాయకుడిగా... ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'సలార్ 2' చిత్రీకరణ మొదలైనట్టు నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ వెల్లడించింది. ఘన విజయం సాధించిన 'సలార్'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమిది. ప్రశాంత్ నీల్ చేస్తున్న సినిమాల కారణంగా 'సలార్ 2' ఆలస్యమవుతుందేమో అనుకున్నారంతా. కానీ 20 రోజులపాటు సాగే షెడ్యూల్‌ని ఇప్పటికే మొదలు పెట్టినట్టు నిర్మాణ సంస్థ ప్రకటించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఈ కబురు అభిమానుల్లో మరింత జోష్ నింపింది.

వజ్రాల వేటలో తమన్నా



ఓ వైపు కథానాయికగా తెరపై సందడి చేస్తూనే.. మరోవైపు భిన్నమైన కథలతో ఓటీటీ వేదికగా ప్రేక్షకులను మురిపిస్తుంది అందాల తార తమన్నా. ఇటీవలే 'ఆజ్ కీ రాత్..' అంటూ 'స్త్రీ 2' లోని ప్రత్యేక గీతంతో కుర్రకారుని ఉర్రూతలూగించిన ఈ భామ.. ఇప్పుడు మరో సరికొత్త కథతో రావడానికి సన్నద్ధమవుతోంది. ప్రముఖ దర్శకుడు నీరజ్ పాండే తెరకెక్కిస్తున్న 'సికందర్ కా ముకద్దర్' అనే చిత్రంలో తమన్నా కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది తమన్నా. "చోరికి గురైన రూ.60కోట్లు విలువ చేసే వజ్రాలు..ఓటమిని అంగీకరించని ఇన్‌స్పెక్టర్" అని వ్యాఖ్యల్ని జోడించింది. రహస్యం, నేరం, సంకల్పం లాంటి అంశాలతో క్రైమ్ డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో అవినాశ్ తివారీ, జిమ్మీ షెర్గిల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్వరలో ఓటీటీ వేదికగా విడుదల కానున్నట్లు తెలిపింది చిత్రబృందం.

'వార్ 2'లో పఠాన్?



షారుక్ ఖాన్

సినిమాల్లో హీరోగా తన యాక్షన్‌తో ప్రేక్షకులను అదరగొడుతూనే.. అవకాశం వచ్చినప్పుడల్లా అతిథి పాత్రల్లో తళుక్కున మెరుస్తూ సందడి చేస్తుంటారు అగ్రకథానాయకుడు షారుక్ ఖాన్. ఇప్పుడాయన 'వార్ 2'లో ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. "ఎన్టీఆర్, హృతిక్ కాంబినేషన్‌లో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. దీనికి అనుగుణంగానే భారీ యాక్షన్ సీక్వెన్స్, కొన్ని సర్‌ప్రైజ్‌లను ప్లాన్ చేస్తుంది చిత్రబృందం. ఇందులో భాగంగా షారుక్ ఈ చిత్రంలో 'పఠాన్' తరహా పాత్రలో మరోసారి సందడి చేయడానికి సన్నద్ధమయ్యారు. తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను కూడా ప్రారంభించారాయన" అని షారుక్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఈ చిత్రంలో ఈ ముగ్గురు అగ్రతారల సందడి చూడాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.

అందరి కథ... లగ్గం



ప్రగ్యా, సాయిరోనక్

"తెలంగాణ నేపథ్యంలో బలమైన కథ చెప్పాలని.. అది అందరి కథలా ఉండాలనే ఈ చిత్రాన్ని తెరకెక్కించా" అన్నారు రమేశ్ చెప్పాల. ఆయన దర్శకత్వంలో... సాయిరోనక్, ప్రగ్యా నగ్రా నాయకానాయికలుగా తెరకెక్కిన చిత్రం 'లగ్గం'. రాజేంద్రప్రసాద్, సప్తగిరి, రోహిణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి నిర్మాత. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంచి కథతో రూపొందిన ఇలాంటి చిత్రాలకు ప్రోత్సాహం దక్కినప్పుడే సమాజంలో మార్పు మొదలవుతుందని ఆమె అన్నారు. ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "తండ్రీ కూతుళ్ల కథ ఇది. ఇందులో తెలంగాణ బిడ్డగా నటించడం నా అదృష్టం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "అరిటాకులో వడ్డించిన విందు భోజనంలా ఉంటుందీ చిత్రం" అన్నారు. నటి రోహిణి మాట్లాడుతూ "దర్శకుడు కథ చెప్పే సమయంలో చాలా సందర్భాల్లో నా కళ్లు చెమ్మగిల్లాయి. ఇందులోని భావోద్వేగాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే రాజేంద్రప్రసాద్‌తో కలిసి నటించే అవకాశాన్ని వదులుకోకూడదని ఇందులో నటించా. తప్పకుండా ఈ చిత్రం ప్రేక్షకుల మెప్పు పొందుతుంది" అన్నారు. ఒక మంచి సందేశం ఉన్న అందమైన చిత్రమిదన్నారు నిర్మాత. సంప్రదాయబద్ధమైన సినిమా ఇదన్నారు నటుడు సప్తగిరి. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొంది.

థ్రిల్లర్ @ లండన్



అను ఇమ్మానుయేల్

అగ్ర హీరోలతో కలిసి నటించిన కథానాయిక అను ఇమ్మానుయేల్... యువ కథానాయకుడు శివ కందుకూరి జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఛాయాగ్రాహకుడు ఐ.ఆండ్రూ బాబు దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. లండన్ గణేశ్, డా.ప్రవీణ్ రెడ్డి వూట్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. థ్రిల్లర్ కథతో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం లండన్‌లో జరుగుతోంది. "ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తిస్తూ సాగే థ్రిల్లర్ కథ ఇది. ప్రస్తుతం లండన్‌లోని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరణ చేసుకుంటోంది. త్వరలోనే సినిమా పేరుని ప్రకటిస్తామ"ని చిత్రవర్గాలు తెలిపాయి. వైవా హర్ష, వెన్నెల కిశోర్, ఎస్.నివాసిని, షకలక శంకర్, మహేంద్ర, రెడిన్ కింగ్‌స్లీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు.

ఆర్మీ జాబ్ కాదు జీవితం



శివకార్తికేయన్, సాయిపల్లవి

ఈ దీపావళి సందర్భంగా విడుదలవుతున్న సినిమాల్లో 'అమరన్' ఒకటి. అమరవీరుడు మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితం ఆధారంగా.. బయోగ్రాఫికల్ యాక్షన్ వార్ చిత్రంగా రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్నారు. శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటిస్తున్నారు. సోనీ పిక్చర్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి అగ్ర కథానాయకుడు కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్నారు. పలు భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖితారెడ్డి విడుదల చేస్తున్నారు. ఈ నెల 31న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా బుధవారం కథానాయకుడు నాని ట్రైలర్‌ని విడుదల చేశారు. మేజర్ ముకుంద్, ఆయన కుమార్తెతో కలిసి పాడుతున్న నిజమైన వుటేజీతో ప్రారంభమయ్యే ట్రైలర్‌లో ఆర్మీ నేపథ్యం, కుటుంబ అనుబంధాలు మనసుల్ని హత్తుకోవడంతోపాటు, సినిమాపై ఆసక్తిని పెంచుతాయి. 'ఆర్మీ నాకు జాబ్ కాదు, ఇది నా జీవితం...' అంటూ సాగే మాటలు స్ఫూర్తిని, దేశభక్తిని నింపుతాయి. ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ పుస్తకంలోని మేజర్ వరదరాజన్ అధ్యాయం ఆధారంగా ఈ చిత్రం రూపొందింది.

'నరుడి బ్రతుకు నటన'కు భావోద్వేగాలే బలం



శివ కుమార్, నితిన్ ప్రసన్న

"హృదయాల్ని హత్తుకునే భావోద్వేగాలున్న చిత్రమే మా 'నరుడి బ్రతుకు నటన'" అంటున్నారు శివ కుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న. ఆ ఇద్దరూ కథానాయకులుగా నటించిన చిత్రమిది. రిషికేశ్వర్ యోగి దర్శకత్వం వహించారు. టి.జి.విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, సింధురెడ్డి నిర్మించారు. ఈ నెల 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా కథానాయకులు బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో సమావేశమయ్యారు. శివకుమార్ రామచంద్రవరపు మాట్లాడుతూ "సత్య అనే యువకుడిగా నేను నటించా. సంపన్న కుటుంబంలో పుట్టిన యువకుడైన సత్యకి నటుడు కావాలనేది కోరిక. అందుకోసం ఏం చేశాడు? సకల సౌకర్యాలతో బతికిన ఆ యువకుడు కేరళకి వెళ్లి ఎలాంటి జీవితం గడిపాల్సి వచ్చిందన్నది ఇందులో కీలకం. 'శివపుత్రుడు' తరహాలో ఒక మంచి అనుభూతిని, భావోద్వేగాల్ని పంచుతుందీ చిత్రం. 'మజిలీ', 'వకీల్‌సాబ్', 'భజే వాయువేగం' తదితర చిత్రాలతో మంచి పేరొచ్చింది. ఈ సినిమాతో ప్రధాన పాత్రలో నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. పట్టుదలతో ఉంటూ, కష్టపడితే సినిమా పరిశ్రమలో తప్పకుండా గుర్తింపు వస్తుందని ఈ ప్రయాణం నాకు చెప్పింది" అన్నారు. నితిన్ ప్రసన్న మాట్లాడుతూ "నేను 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు' తర్వాత చేసిన చిత్రమిది. అందులో వ్యతిరేక ఛాయలతో ఉన్న పాత్ర చేయగా, ఇందులో అందుకు పూర్తి భిన్నమైన పాత్రని చేస్తున్నా. దర్శకుడు రిషికేశ్వర్ చెప్పిన కథ నాకెంతో నచ్చింది. మన సమాజం ఇలా ఉండాలని, ఇలాంటి ఓ స్నేహితుడు ఉండాలని కోరుకుంటూ కథ, పాత్రలతో కనెక్ట్ అవుతారు ప్రేక్షకులు. కేరళ నేపథ్యంలో ఎంతో అందంగా రూపొందిన చిత్రమిది. నేను, శివకుమార్ ఈ సినిమా ప్రయాణంలో మంచి స్నేహితులం అయిపోయాం. కథ, భావోద్వేగాలే ప్రధానబలంగా తెరకెక్కిన ఈ సినిమా ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి ప్రేక్షకుల ముందుకొస్తుండడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం తెలుగుతోపాటు, తమిళ, మలయాళ భాషల్లో నటిస్తున్నా" అన్నారు.

మాట్లాడాలని ఉంది!



అభిషేక్ బచ్చన్

'నేను మాట్లాడటానికి ఇష్టపడను, కానీ మాట్లాడటానికే జీవించానేమో... జీవించి ఉన్న వారికి చనిపోయిన వారికి మధ్య తేడా ఏమిటంటే బతికున్న వారు మాట్లాడతారు.. చనిపోయిన వారు మాట్లాడలేరు..' అంటూ అభిషేక్ బచ్చన్ గాత్రంతో తాజాగా 'ఐ వాంట్ టు టాక్' చిత్రాన్ని సినీ ప్రియులకు పరిచయం చేసింది చిత్రబృందం. వైవిధ్యభరితమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకున్న అగ్ర కథానాయకుడు అభిషేక్ బచ్చన్. ప్రస్తుతం ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని సుజిత్ సర్కార్ రూపొందిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను పంచుకుంది చిత్రబృందం. 'మాట్లాడటానికే జీవించిన ఓ వ్యక్తి మనకి తెలుసు.. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా వాటన్నింటినీ ఎదుర్కొని.. అవకాశాలను వెతుక్కుంటూ ముందుకు సాగే వ్యక్తి' అనే వ్యాఖ్యను జోడించింది. ఈ చిత్రంలో అహల్యా బమ్రూ, జానీ లివర్, జయంత్ కృపలాని తదితరులు కీలక పాత్రలు పోషించారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం నవంబరు 22న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలిపింది చిత్రబృందం.

కలల్లో జీవించడం అంటే ప్రేమలో మరణించడమే



త్రిప్తి, కార్తిక్

"నీ కళ్లతో నా హృదయాన్ని చూడూ.. నీ ప్రేమలో నేను నా ప్రేమలో నువ్వు.. కలల్లో జీవించడం అంటే ప్రేమలో మరణించడమే.." అంటూ కార్తిక్, త్రిప్తిల మధ్య కెమిస్ట్రీని చూపిస్తూ 'జానా సంఝా నా' అనే పాటను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. కార్తిక్ ఆర్యన్, త్రిప్తి దిమ్రీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హారర్ కామెడీ చిత్రం 'భూల్ భులయ్యా 3'. భూషణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్నారు. 'భూల్ భులయ్యా ఫ్రాంఛైజీల్లో భాగంగా రూపొందుతున్న చిత్రమిది. తాజాగా విడుదలైన ఈ గీతం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రంలో రూహ్ బాబాగా కార్తిక్, మంజులికగా విద్యా బాలన్, మాధురీ దీక్షిత్ ప్రేక్షకులను అలరించనున్న సంగతి తెలిసిందే. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

త్వరలో 'స్పైడర్‌మ్యాన్ 4'



సూపర్‌హీరో సినిమా ఏదైనా వస్తుందంటే చాలు సినీప్రియులకు పండగే. అందులోనూ పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరినీ విశేషంగా ఆకట్టుకున్న 'స్పైడర్‌మ్యాన్' చిత్రాలంటే ఇంకాస్త ఆసక్తి ఎక్కువ. హాలీవుడ్ కథానాయకుడు టామ్ హాలండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించారు. జాన్ వాట్స్ తెరకెక్కించిన ఈ చిత్రాలు ఇప్పటికే మూడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి ఆదరణను సొంతం చేసుకున్నాయి. ఇందులో ప్రపంచాన్ని రక్షించడం కోసం దుష్టశక్తులతో స్పైడర్‌మ్యాన్ చేసే యుద్ధ విన్యాసాలు అలరించాయి. ఇప్పుడు నాల్గో భాగం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానులకు ఓ తీపి కబురు వినిపించారు టామ్ హాలండ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. 'స్పైడర్ మ్యాన్ 4' రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. "స్పైడర్‌మ్యాన్ మరోసారి కొత్త విన్యాసాలు, సాహసాలతో వచ్చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది వేసవిలో చిత్రీకరణ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం. చిత్రబృందమంతా ఈ ప్రాజెక్టు గురించి చాలా ఉత్సాహంగా ఉంది" అని చెప్పుకొచ్చారు.

ఈనాడు బిజినెస్

117% పెరిగిన హెరిటేజ్ ఫుడ్స్ లాభం



ఈనాడు, హైదరాబాద్: హెరిటేజ్ ఫుడ్స్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి మెరుగైన ఆదాయాలు ఆర్జించింది. ఏకీకృత ఖాతాల ప్రకారం ఆదాయం రూ.1019.5 కోట్లు, నికరలాభం రూ.48.6 కోట్లు నమోదయ్యాయి. త్రైమాసిక ఈపీఎస్ రూ.5.24 గా ఉంది. 2023-24 ఇదేకాలంలో ఆదాయం రూ.978.5 కోట్లు, నికరలాభం రూ.22.4 కోట్లు, ఈపీఎస్ రూ.2.42గా ఉన్నాయి. దీంతో పోలిస్తే ఆదాయం 4.2%, నికర లాభం 117% పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలలకు హెరిటేజ్ ఫుడ్స్ ఆదాయం రూ.2052.2 కోట్లు, నికరలాభం రూ.107.1 కోట్లు, ఈపీఎస్ రూ.11.54గా నమోదయ్యాయి.

విలువ ఆధారిత ఉత్పత్తులు కలిసొచ్చాయ్.. బ్రాహ్మణి నారా: సమీక్షా త్రైమాసికంలో పాల సేకరణ 11.46%, పాల అమ్మకాలు 5.11%, విలువ ఆధారిత ఉత్పత్తుల అమ్మకాలు 15.5% పెరిగినట్లు హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడించింది. వివిధ వ్యాపార విభాగాల్లో తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాల వల్ల, అధిక లాభాలు ఆర్జించగలిగినట్లు హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రాహ్మణి నారా వివరించారు. విలువ ఆధారిత ఉత్పత్తుల అమ్మకాలు పెరగడానికి మార్కెటింగ్ కార్యకలాపాలను అధికం చేశామని, విభిన్న ఉత్పత్తులను ఆవిష్కరించడం సత్ఫలితాలు ఇచ్చినట్లు తెలిపారు.

జీఎంఆర్ గ్రూపునకు ఏడీఐఏ రూ.6,300 కోట్ల రుణం

ఈనాడు, హైదరాబాద్: జీఎంఆర్ గ్రూపునకు ఏడీఐఏ (అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ) నుంచి రూ.6,300 కోట్ల రుణం లభించింది. జీఎంఆర్ గ్రూపు ప్రమోటర్ల సంస్థ జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (జీఈపీఎల్)కు ఉన్న అప్పు తీర్చడానికి ఈ సొమ్ము వినియోగిస్తారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్‌కు జీఈపీఎల్ ప్రమోటర్‌గా ఉంది. ఏడీఐఏ రుణం వల్ల జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌ను వృద్ధి బాట పట్టించేందుకు వీలవుతుందని జీఎంఆర్ గ్రూపు కార్పొరేట్ ఛైర్మన్ కిరణ్ కుమార్ గ్రంధి పేర్కొన్నారు. దేశంలో విమాన రంగం దీర్ఘకాలిక వృద్ధి బాటలో సాగుతోందని, దీనికి అనుగుణంగా తాము జీఎంఆర్ గ్రూపుతో కలిసి పనిచేయడానికి సిద్ధపడినట్లు ఏడీఐఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖదెమ్ అల్ రెమైథీ వివరించారు.

సాగర్ సిమెంట్స్ నష్టం పెరిగింది

ఈనాడు, హైదరాబాద్: సాగర్ సిమెంట్స్, ఏకీకృత ఖాతాల ప్రకారం సెప్టెంబరు త్రైమాసికానికి రూ.475 కోట్ల ఆదాయం, రూ.56.98 కోట్ల నికర నష్టం నమోదు చేసింది. 2023-24 ఇదేకాలంలో ఆదాయం రూ.586.82 కోట్లు, నికర నష్టం రూ.10.85 కోట్లుగా ఉన్నాయి. దీంతో పోలిస్తే ఈసారి ఆదాయం 19% తగ్గితే, నష్టం పెరిగింది. సిమెంటు అమ్మకాలు 12% తగ్గినట్లు సంస్థ వెల్లడించింది.

సిమెంటుకు గిరాకీ అనుకున్నంత లేదు: సిమెంటు రంగం ఇబ్బందుల్లో ఉన్నట్లు ప్రస్తుత పరిస్థితులను విశ్లేషిస్తే అర్థమవుతోందని సాగర్ సిమెంట్స్ జాయింట్ ఎండీ శ్రీకాంత్ రెడ్డి వివరించారు. వర్షాలు అధికంగా పడటం వల్ల సిమెంటుకు డిమాండ్ అనుకున్నంత లేదని తెలిపారు. ఈ రంగంలో పోటీ పెరిగి, సిమెంటు ధర తగినంత లేక నష్టపోతున్నట్లు వివరించారు.

కాస్త తగ్గిన బంగారం, వెండి

ఈనాడు వాణిజ్య విభాగం: బంగారం, వెండి ధరలు బుధవారం దిగి వచ్చాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం మంగళవారం 2746 డాలర్ల వద్ద, హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల (24 క్యారెట్ల) బంగారం ధర రూ.80,900; కిలో వెండి ధర రూ.1,02,100 స్థిరపడ్డాయి. బుధవారం రాత్రికి ఔన్సు ధర 30 డాలర్లకు పైగా తగ్గి 2714 డాలర్లకు పరిమితం కావడంతో, హైదరాబాద్‌లోనూ 10 గ్రాముల మేలిమి బంగారం జీఎస్టీతో కలిపి రూ.80,100, కిలో వెండి రూ.99,100కు దిగి వచ్చాయి.

వినోద పరిశ్రమకు పైరసీ నష్టం రూ.22,400 కోట్లు



2023పై ఈవై-ఐఏఎంఏఐ నివేదిక

దిల్లీ: భారతీయ వినోద పరిశ్రమను పైరసీ భూతం వేధిస్తోందని ఈవై, ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ) సంయుక్తంగా రూపొందించిన 'ది రాబ్ రిపోర్ట్' తెలిపింది. పైరసీ వల్ల 2023లో వినోద పరిశ్రమ రూ.22,400 కోట్ల భారీ నష్టాన్ని మూటగట్టుకుందని పేర్కొంది. పైరసీని సమర్థంగా తగ్గించడానికి కఠిన నిబంధనలు అమలు చేయాలని సూచించింది. నివేదిక ప్రకారం..

- సినిమా థియేటర్ల నుంచి పైరసీ కంటెంట్ రూ.13,700 కోట్ల విలువను కలిగి ఉండగా, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా రూ.8,700 కోట్లుగా ఉంది. రూ.4,300 కోట్ల వరకు జీఎస్టీ నష్టాలు ఉన్నాయని అంచనా.
- మన దేశంలోని 51% మంది మీడియా వినియోగదార్లు పైరేటెడ్ మూలాల నుంచి కంటెంట్‌ను యాక్సెస్ చేస్తున్నారు. ఇందులో స్ట్రీమింగ్ సేవలు 63% వాటా కలిగి ఉన్నాయి.
- 2023లో పైరసీ ఆర్థిక వ్యవస్థ పరిమాణం రూ.22,400 కోట్లుగా ఉంది. ఇది భారత మీడియా, వినోద పరిశ్రమలోని వివిధ విభాగాల వారీగా వచ్చే ఆదాయంలో నాలుగో స్థానంలో నిలిచింది.

పైరసీ ఇలా

సంగీతం, సినిమాలు, సాఫ్ట్‌వేర్ వంటి మేధో హక్కులు కలిగి ఉండే మెటీరియల్‌ను అనధికారికంగా కాపీ చేయడం, పంపిణీ చేయడం, వినియోగించడం. ఒక రకంగా దీనినీ దొంగతనంగా పరిగణించాలి. కంటెంట్ సృష్టికర్తల హక్కులను ఇది ఉల్లంఘించడమే. వారికి గణనీయమైన ఆర్థిక నష్టం కలిగిస్తోంది కూడా.

ఎందుకు?

అధిక సబ్‌స్క్రిప్షన్ రుసుములు, కావాల్సిన కంటెంట్ అందుబాటులో లేకపోవడం, బహుళ సబ్‌స్క్రిప్షన్ల నిర్వహణలో అడ్డంకుల వంటి కారణాలతో పైరేటెడ్ కంటెంట్‌ను వీక్షకులు ప్రోత్సహిస్తున్నారు.

ధరలు మార్చితే ప్రయోజనం

- పైరసీ ముఖ్యంగా 19-34 ఏళ్ల యువ ప్రేక్షకుల్లో ప్రబలంగా ఉంది. వీరిలో మహిళలు ఓటీటీ షోలను ఇష్టపడుతుండగా, పురుషులు క్లాసిక్ చిత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు.
- ఆసక్తికర అంశం ఏమిటంటే.. పైరేటెడ్ కంటెంట్‌ను యాక్సెస్ చేసే వారిలో 64% మంది ప్రకటనల అంతరాయాలు ఉన్నప్పటికీ, ఉచితంగా ఆఫర్ చేస్తే అధీకృత ఛానెళ్లకు మారడానికి సుముఖత వ్యక్తం చేశారు. అందువల్ల కంటెంట్ ప్రొవైడర్లు తమ ధరల నమూనాలు, వ్యూహాలపై పునరాలోచించాల్సి ఉంది. 70% మంది పైరేటెడ్ కంటెంట్ వినియోగదార్లు తాము ఏ ఓటీటీ చందా తీసుకోవడానికి ఆసక్తిగా లేమని తెలిపారు.

పైరసీపై అందరూ పోరాడాలి

పైరసీ సమస్య ఎదుర్కొంటున్న వారంతా కలిసి పోరాడితేనే ప్రయోజనం ఉంటుందని ఐఏఎంఏఐ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ కమిటీ ఛైర్మన్ రోహిత్ జైన్ వెల్లడించారు. మన దేశంలో డిజిటల్ వినోదం వేగవంత వృద్ధిని సాధిస్తోందని, ఇందులో చిత్రీకరించిన (ఫిల్మ్‌డ్) వినోదం 2026 నాటికి రూ.14,600 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. పైరసీకి అడ్డుకట్ట వేయడానికి వాటాదార్లు, ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమ కలిసికట్టుగా పోరాడాలని సూచించారు.

హెచ్‌యూఎల్ లాభం రూ.2,595 కోట్లు

మధ్యంతర, ప్రత్యేక డివిడెండు కలిపి రూ.29

దిల్లీ: ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం హిందుస్థాన్ యునిలీవర్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.2,595 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే కాల లాభం రూ.2657 కోట్లతో పోలిస్తే ఇది 2.33% తక్కువ. ఉత్పత్తుల విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం రూ.15,340 కోట్ల నుంచి 2.36% పెరిగి రూ.15,703 కోట్లకు చేరుకుంది. 'సెప్టెంబరు త్రైమాసికంలో ఎఫ్ఎమ్‌సీజీ రంగ గిరాకీ పట్టణ ప్రాంతాల్లో మోస్తరు వృద్ధిని నమోదు చేస్తుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో క్రమంగా పుంజుకుంటోంద'ని కంపెనీ సీఈఓ, ఎండీ రోహిత్ జావా పేర్కొన్నారు. మొత్తం వ్యయాలు 3.03% పెరిగి రూ.12,581 కోట్లకు చేరగా.. మొత్తం ఆదాయాలు 2.14% వృద్ధితో రూ.16,145 కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కంపెనీ బోర్డు, ఒక్కో షేరుకు రూ.19 మధ్యంతర డివిడెండు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. అదనంగా రూ.10 ప్రత్యేక డివిడెండునూ ప్రకటించింది.

హెచ్‌యూఎల్ ఐస్‌క్రీమ్ వ్యాపారం విడిగా..: హెచ్‌యూఎల్ వద్ద క్వాలిటీ వాల్స్, కార్నెటో, మ్యాగ్నమ్ పేరిట ఐస్‌క్రీమ్ బ్రాండ్లు ఉన్నాయి. కంపెనీ టర్నోవర్‌లో 3% వాటా ఉన్న ఈ వ్యాపారానికి స్వతంత్ర విలువను లెక్కగట్టించారు. తద్వారా దీనిని విడిగా నిర్వహించాలన్నది హెచ్‌యూఎల్ ఆలోచనగా ఉంది. ఐస్‌క్రీమ్ వ్యాపారాన్ని హెచ్‌యూఎల్ నుంచి విడదీయడానికి కంపెనీ బోర్డు బుధవారం అంగీకారం తెలిపింది.

కెంట్ కాఫీ మేకర్ - బీన్ గ్రైండర్



హైదరాబాద్: కాఫీషాపుల తరహా కాఫీని ఇంట్లోనే తయారు చేసుకునేందుకు అనువైన కాఫీ మేకర్, కాఫీ గింజలను పొడి చేసే గ్రైండర్‌ను ప్రముఖ గృహోపకరణాల సంస్థ కెంట్ తీసుకొచ్చింది. పండగల సందర్భంగా ఈ రెండింటిని రూ.13,500 (పన్నులతో కలిపి)కే అందిస్తున్నట్లు తెలిపింది. కాఫీ మేకర్‌లోని 20 బార్ ఇటాలియన్ పంప్ సాయంతో కప్‌లో చూసేందుకు ఆకర్షణీయ డిజైన్‌లో, రుచికరంగా కాఫీ చేసుకోవచ్చని, డిజిటల్ డిస్‌ప్లే వల్ల వినియోగమూ సులభంగా ఉంటుందని తెలిపింది. ఒక్కసారికి రెండు కప్పుల కాఫీ ఇందులో తయారు చేసుకోవచ్చని పేర్కొంది. ఎక్కువ మంది అతిథుల కోసం కాఫీ తయారు చేసేందుకు 2-ఇన్-1 పోర్టా ఫిల్టర్ ఉపయోగపడుతుందని కంపెనీ వివరించింది. కాఫీ బీన్ గ్రైండర్‌లో ఎప్పటికప్పుడు కాఫీ గింజలను పొడి చేసుకోవచ్చని, ఇందువల్ల మంచి సువాసనతో కాఫీ అనుభూతి మరో స్థాయికి వెళ్తుందని కెంట్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు మహేశ్ గుప్తా తెలిపారు.

ఇండోఫాస్ట్ ఎనర్జీతో రాపిడో భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ ఆటోలకు ఛార్జింగ్ సదుపాయం, బ్యాటరీ స్వాపింగ్ కోసం ఇండోఫాస్ట్ ఎనర్జీ (ఇండియన్ ఆయిల్, సన్ మొబిలిటీ ఉమ్మడి సంస్థ)తో రాపిడో ఒక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది చివరికి హైదరాబాద్‌లో 100, బెంగళూరులో 200లకు పైగా బ్యాటరీ స్వాపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. రెండేళ్లలో దేశ వ్యాప్తంగా 1,000కి పైగా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి వెల్లడించారు. ప్రజా రవాణాలో విద్యుత్ వాహనాలను పెంచేందుకు, రాపిడో క్యాప్టెన్లు మరింత ఎక్కువ ఆర్జించేందుకు ఇది దోహదం చేస్తుందన్నారు. హైదరాబాద్, బెంగళూరు తర్వాత దిల్లీ, చెన్నైలకు విస్తరిస్తామని ఇండోఫాస్ట్ ఎనర్జీ సీఈఓ అనంత్ బాద్జాత్య తెలిపారు. దేశంలో 50వేలకు పైగా పియాజియో ఏప్ విద్యుత్ ఆటోలు తిరుగుతున్నాయని సంస్థ ఛైర్మన్, ఎండీ డిగో గ్రాఫీ పేర్కొన్నారు. ఇందులో 2,500లకు పైగా ఆటోలకు బ్యాటరీ స్వాపింగ్ సౌకర్యం ఉందన్నారు. రాపిడో, ఇండోఫాస్ట్ భాగస్వామ్యం నేపథ్యంలో మరో రెండేళ్లలో 10వేలకు పైగా బ్యాటరీ స్వాపింగ్‌కు వీలున్న ఆటోలు తీసుకొస్తామని వెల్లడించారు.

కార్యాలయాల అద్దెలు పెరుగుతున్నాయ్

హైదరాబాద్‌లో చ.అడుగు సగటు అద్దె రూ.76.7



దిల్లీ: దేశంలోని 6 ప్రధాన నగరాల్లో కార్యాలయాల అద్దె కొవిడ్ ముందుస్థాయికి చేరింది. ఈ నగరాల్లో చదరపు అడుగు సగటు అద్దె నెలకు రూ.101.3కు చేరిందని స్థిరాస్తి సేవల సంస్థ కొలియర్స్ ఇండియా 2024 మూడో త్రైమాసిక నివేదికలో వెల్లడించింది. 2019లో ఈ సగటు అద్దె రూ.99.5గా ఉంది. కొవిడ్ కారణంగా 2020లో సగటు అద్దె రూ.97.1కి తగ్గింది. 2021లో మరింత తగ్గి రూ.94.8కి చేరింది. ఆ తర్వాత నుంచి 2022లో అద్దెలు స్థిరంగా కొనసాగాయి. సగటు అద్దె రూ.94.9గా ఉండగా, 2023లో 96.5కు చేరింది. ఇప్పుడు కొవిడ్ ముందు స్థాయికి చేరినట్లు నివేదిక వెల్లడించింది. నగరాల వారీగా చూస్తే ముంబయిలో చదరపు అడుగు సగటు అద్దె రూ.151.6 ఉండగా, దిల్లీ-ఎన్‌సీఆర్‌లో రూ.105.9, బెంగళూరులో రూ.96.7, పుణెలో 81.6, చెన్నైలో 77.8, హైదరాబాద్‌లో 76.7గా ఉంది. ఇందులో ఉమ్మడి స్థల(కామన్ ఏరియా) నిర్వహణ ఖర్చులు, పన్నులు కలపలేదని కొలియర్స్ పేర్కొంది.

బీఎస్ఎన్ఎల్‌కు 50 లక్షల కొత్త చందాదార్లు

దిల్లీ: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్)కు జులై-సెప్టెంబరు త్రైమాసికంలో కొత్త చందాదార్లు 50-60 లక్షల మేర జతచేరారని కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. ప్రైవేటు సంస్థలు ఛార్జీ (టారిఫ్)లు పెంచగా, బీఎస్ఎన్ఎల్ మాత్రం సమీప భవిష్యత్తులోనూ పెంచబోమని స్పష్టం చేయడం వినియోగదార్లను ఆకర్షిస్తోంది. గత రెండేళ్లలో నిర్వహణ లాభాన్ని నమోదు చేసిన బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ బాటలో పయనిస్తోందని మంత్రి వివరించారు. నెట్‌వర్క్ అప్‌గ్రేడ్‌తో సేవలు మెరుగయ్యాయని సింధియా వెల్లడించారు. 12 ఏళ్లుగా నష్టాల్లో ఉన్న బీఎస్ఎన్ఎల్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు 2023 జూన్‌లో రూ.89,047 కోట్ల ప్యాకేజీని ప్రకటించడం కలిసి వస్తోంది.

కోడి గుడ్డు

24న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	515
వరంగల్	517
విజయవాడ	540
గోదావరి	535
విశాఖపట్నం	540
చిత్తూరు	568

బైజూస్‌కు సుప్రీం షాక్

దివాలా ప్రక్రియ నిలిపివేత ఆదేశాల కొట్టివేత

దిల్లీ: ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు అత్యున్నత న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. బైజూస్‌పై దివాలా ప్రక్రియ నిలిపివేయాలంటూ నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు పక్కన పెట్టింది. ఇదే సమయంలో బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ)కి కూడా శరాఘాతం అయ్యింది. క్రికెట్ బోర్డుతో బైజూస్ రూ.158.9 కోట్ల బకాయిల సెటిల్‌మెంట్‌కు ఆమోదిస్తూ జారీ అయిన ఎన్‌సీఎల్ఏటీ ఆదేశాలనూ సుప్రీం రద్దు చేయడం ఇందుకు నేపథ్యం. రూ.158.9 కోట్ల సెటిల్‌మెంట్ మొత్తాన్ని కమిటీ ఆఫ్ క్రెడిటర్స్ (సీఓసీ) వద్ద డిపాజిట్ చేయాలంటూ క్రికెట్ బోర్డుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

✦ తాజా ఆదేశాలతో బైజూ రవీంద్రన్, ఆయన సోదరుడు రిజు రవీంద్రన్‌లు బైజూస్ లేదా థింక్ అండ్ లెర్న్‌పై నియంత్రణ కోల్పోతారు.

✦ ఎన్‌సీఎల్‌టీ, ఎన్‌సీఎల్ఏటీ వద్ద జరిగే కార్పొరేట్ దివాలా ప్రక్రియల్లో జోక్యం చేసుకోవడానికి ఒక రుణదాతగా అమెరికా కంపెనీ గ్లాస్ ట్రస్ట్ కంపెనీ ఎల్ఎల్‌సీకి అధికారం ఉందనీ ధర్మాసనం తీర్పు చెప్పింది. ఎన్‌సీఎల్ఏటీ తీర్పును సవాలు చేస్తూ అమెరికా సంస్థ దాఖలు చేసుకున్న పిటిషన్‌పై ఇచ్చిన 61 పేజీల తీర్పులో కోర్టు ఈ మేరకు స్పష్టం చేసింది.

బాస్మతియేతర తెల్ల బియ్యం ఎగుమతి ధరపై ఆంక్షల తొలగింపు

దిల్లీ: బాస్మతి యేతర (నాన్- బాస్మతి) తెల్ల బియ్యం ఎగుమతుల కోసం, గతంలో నిర్దేశించిన కనీస ఎగుమతి ధరను ప్రభుత్వం తొలగించింది. ఈ తరహా బియ్యం ఎగుమతులను ప్రోత్సహించాలన్నదే దీని వెనక ప్రభుత్వ ఉద్దేశం. బాస్మతియేతర తెల్లబియ్యం ఎగుమతులపై ఈ ఏడాది సెప్టెంబరు 28న ఆంక్షలు ఎత్తివేస్తూ.. టన్నుకు 490 డాలర్లను కనీస ఎగుమతి ధర (ఎంఈపీ)గా ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు ఎంఈపీని తొలగిస్తున్నట్లు బుధవారం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ వెల్లడించింది.

2023 జులై నుంచి ఆంక్షలు: 2023 జులై 20న బాస్మతియేతర తెల్ల బియ్యం ఎగుమతులపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఆ సమయంలో వీటి నిల్వలు పరిమితంగా ఉండటంతో, దేశీయంగా ధరలు పెరగకుండా చూసేందుకు ఈ చర్య చేపట్టింది. అయితే మాల్దీవులు, మారిషస్, యూఏఈ, ఆఫ్రికా దేశాలకు మాత్రం బియ్యం ఎగుమతి చేసేందుకు అనుమతినిచ్చింది.

చమురుపై విండ్‌ఫాల్ పన్ను రద్దు?



దిల్లీ: దేశీయంగా వెలికి తీస్తున్న ముడి చమురుపై విధిస్తున్న విండ్‌ఫాల్ (అదాటు లాభాల) పన్నును రద్దు చేసే అంశంపై ఆర్థిక శాఖ త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సలహాదారు అయిన తరుణ్ కపూర్ పేర్కొన్నారు. చమురు ధర భారీగా పెరిగినప్పుడు, కంపెనీలు పొందిన అదాటు లాభాలపై విండ్‌ఫాల్ పన్నును 2022లో ప్రవేశ పెట్టారు. ఇపుడు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినందున పన్ను అవసరం లేదని కపూర్ అన్నారు. ఈ విషయంపై ఆర్థిక శాఖ తన నిర్ణయాన్ని ప్రకటిస్తుందని.. ఇప్పటికే పెట్రోలియం మంత్రిత్వ శాఖ నుంచి ఆర్థిక శాఖకు ఆ మేరకు లేఖ వెళ్లిందని వివరించారు.

ఎందుకు పెట్టారంటే..

అంతర్జాతీయంగా గిరాకీ, ధర అధికంగా ఉన్నందున.. దేశీయ సరఫరాలను పక్కనపెట్టి మరీ, విదేశాలకు చమురు ఎగుమతి చేస్తూ భారీ ఎత్తున లాభాలను పొందుతున్న కొన్ని చమురు రిఫైనరీలను అడ్డుకోవడానికి ఈ పన్నును ప్రవేశపెట్టినట్లు అప్పట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. చమురు శుద్ధి ద్వారా వచ్చే పెట్రోలు, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్)పైనా అదనపు పన్ను విధించారు. దేశీయ ముడి చమురుపై విండ్‌ఫాల్ పన్నును సెప్టెంబరు 17న కేంద్రం సున్నాకు చేర్చింది. ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం(ఎస్ఏఈడీ) రూపంలో వసూలు చేస్తున్న ఈ పన్నును డీజిల్, పెట్రోలు, ఏటీఎఫ్‌పైనా సెప్టెంబరు 18 నుంచి సున్నాకు చేర్చారు. ఈ రేట్లను పక్షం రోజులకోసారి సమీక్షిస్తున్నారు.

చమురు బ్యారెల్ ధర 60 డాలర్లకు?

జేపీ మోర్గాన్ అంచనాల ప్రకారం... 2025 చివరకు బ్యారెల్ ముడి చమురు ధర 60 డాలర్ల దిగువకు చేరొచ్చు. చైనా, అమెరికా దేశాల్లో బలహీన గిరాకీకి తోడు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు అదుపులోకి వస్తాయన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. ఉక్రెయిన్‌పై రష్యా దాడుల నేపథ్యంలో బ్రెంట్ చమురు బ్యారెల్ ధర ఒక దశలో 139.13 డాలర్లకు చేరింది కూడా. 2008 ఆర్థిక మాంద్యం తర్వాత చమురుకు గరిష్ఠ స్థాయి ఇదే. గత నెలరోజుల్లోనూ పశ్చిమాసియాలో అనిశ్చితుల కారణంగా, చమురు ధరలు పెరుగుతూ వచ్చాయి. సెప్టెంబరులో 71 డాలర్లున్న బ్యారెల్ చమురు ధర అక్టోబరు ప్రారంభానికి 81 డాలర్లకు చేరింది.

వారీ ఎనర్జీస్ ఐపీఓకు 76 రెట్ల అధిక బిడ్లు

దిల్లీ: వారీ ఎనర్జీస్ ఐపీఓ ముగిసే సరికి 76.34 రెట్ల స్పందన లభించింది. కంపెనీ 2,10,79,384 షేర్లను ఆఫర్ చేయగా, 160,91,61,741 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ విభాగంలో 10.79 రెట్ల స్పందన వచ్చింది. ఈ ఇష్యూకు మొత్తం 97.34 లక్షల దరఖాస్తులు వచ్చాయి. బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ (90 లక్షలు), టాటా టెక్ (73 లక్షలు) ఐపీఓ దరఖాస్తుల కంటే అధికం.

నాణ్యమైన రెస్టారెంట్లకు 'స్విగ్గీ సీల్'

దిల్లీ: తన రెస్టారెంట్ భాగస్వాములు మరింత శుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసేందుకు, ఆహార నాణ్యత ప్రమాణాలను పెంచడం కోసం 'స్విగ్గీ సీల్' పేరిట కొత్త కార్యక్రమాన్ని స్విగ్గీ చేపట్టింది. ప్రస్తుతం పుణెలో అమల్లో ఉన్న ఈ సీల్‌ను నవంబరులో దేశవ్యాప్తంగా 650కి పైగా నగరాలకు విస్తరించనుంది. 'రెండు వారాల కిందట తీసుకొచ్చిన ఈ పథకానికి రెస్టారెంట్ల నుంచి భారీ ఆసక్తి వచ్చింది. హైజీన్ ఆడిట్ కోసం వందల కొద్దీ విజ్ఞప్తులు వచ్చాయి. ఒక వేళ సీల్ ఉన్న రెస్టారెంట్లు ప్రమాణాలను కొనసాగించడంలో విఫలమైతే మాత్రం సీల్ (బ్యాడ్జ్)ను వెనక్కి తీసుకుంటామ'ని స్విగ్గీ తెలిపింది. రెస్టారెంట్‌లో లభించే ఆహార పదార్థాల వివరాలను స్విగ్గీ యాప్‌లో చూపే చోట, స్విగ్గీ సీల్ బ్యాడ్జ్‌ను ప్రచురిస్తారు. రెస్టారెంట్లలో సరైన కుకింగ్, ప్యాకేజింగ్ నాణ్యత వంటి కీలక విషయాలను స్విగ్గీ సవివరంగా పంచుకుంటుంది. తద్వారా అవి మరింత మెరుగుపడడానికి వీలవుతుంది. ఆడిట్ల కోసం ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు ఉన్న ఏజెన్సీలతో స్విగ్గీ ఇప్పటికే జట్టు కట్టింది.

బెంగళూరులో జేఎల్ఆర్ ఆవిష్కరణల కేంద్రం

దిల్లీ: అంకుర సంస్థలతో కలిపి కొత్త తరం ఉత్పత్తులు, సేవలను అభివృద్ధి చేసే నిమిత్తం బెంగళూరులో 'ఓపెన్ ఇన్నోవేషన్ హబ్'ను (ఆవిష్కరణల కేంద్రం) జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) ప్రారంభించింది. భవిష్యత్ వినియోగదార్లకు మెరుగైన అనుభవాన్ని అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది. ఇప్పటికే బ్రిటన్, అమెరికా, బ్రెజిల్, ఇజ్రాయిల్‌లలో ఈ తరహా కేంద్రాలను జేఎల్ఆర్ ప్రారంభించింది. అవి విజయవంతమైనందున భారత్‌లోనూ అటువంటి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కృత్రిమ మేధ, బిగ్ డేటా, అనలటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఏడీఏఎస్ (అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్), సెన్సార్లు, డివైజెస్ లాంటి వాటిపై భారత కేంద్రం దృష్టి సారిస్తుందని జేఎల్ఆర్ తెలిపింది. 'భారత్‌లో అంకుర వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోంది. జేఎల్ఆర్‌కు ఇప్పటికే అందులో ప్రవేశం ఉండటం, టాటా గ్రూపుతో సంబంధాల వల్ల కొత్త ఇన్నోవేషన్ హబ్‌కు భారత్ సరైన ప్రాంతంగా భావిస్తున్నామ'ని జేఎల్ఆర్ ఇన్నోవేషన్ డైరెక్టర్ ఇగార్ మురకామి తెలిపారు. కొత్త తరం నిపుణులతో అనుసంధానం అయ్యేందుకు ఈ కేంద్రాలు జేఎల్ఆర్‌కు తోడ్పడతాయని పేర్కొన్నారు.

వాహన, భారీ యంత్ర పరికరాల షేర్లు పడేశాయ్

మూడో రోజూ నష్టాల్లో ముగిసిన సూచీలు

సమీక్ష


విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతుండటంతో సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. వాహన, భారీ యంత్ర పరికరాల షేర్లలో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో విక్రయాల ఒత్తిడి కనిపించింది. దీంతో సెన్సెక్స్ 139 పాయింట్లు, నిఫ్టీ 37 పాయింట్ల మేర నష్టపోయాయి. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.97% పెరిగి 75.30 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ మార్పు లేకుండా 84.08 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లలో సియోల్, షాంఘై, హాంకాంగ్ లాభపడగా, టోక్యో సూచీ నష్టపోయింది. ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా కదలాడాయి.

సెన్సెక్స్ ఉదయం 79,921.13 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,220.72 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 79,891.68 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. తర్వాత లభించిన కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లోకి వచ్చిన సూచీ 80,646.31 పాయింట్ల వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. చివరకు మళ్లీ నష్టాల్లోకి జారుకుని 138.74 పాయింట్లు కోల్పోయి 80,081.98 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 36.60 పాయింట్ల నష్టంతో 24,435.50 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,378.10-24,604.25 పాయింట్ల వద్ద కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 నష్టపోయాయి. ఎం అండ్ ఎం 3.23%, సన్ ఫార్మా 2.57%, పవర్‌గ్రిడ్ 1.86%, ఎన్‌టీపీసీ 1.74%, అదానీ పోర్ట్స్ 1.68%, ఎల్ అండ్ టీ 1.56%, యాక్సిస్ బ్యాంక్ 1.30%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.28%, టైటన్ 1.25%, టాటా స్టీల్ 1.10%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.02%, నెస్లే ఇండియా 1.02% చొప్పున పడ్డాయి. బజాజ్ ఫైనాన్స్ 4.95%, టెక్ మహీంద్రా 2.28%, హెచ్‌సీఎల్ టెక్ 1.29%, టీసీఎస్ 1.27%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.26%, ఇన్ఫోసిస్ 1.18%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.97% మేర లాభపడ్డాయి. రంగాల వారీ సూచీలకొస్తే విద్యుత్, భారీ యంత్ర పరికరాలు, వాహన, యుటిలిటీస్ రంగాలు డీలా పడ్డాయి. ఐటీ, టెక్, టెలికాం, ఆర్థిక సేవల రంగాలు రాణించాయి.

ఎఫ్ఐఐల అమ్మకాలు: రూ.5685 కోట్లు

డీఐఐల కొనుగోళ్లు: రూ.6,040 కోట్లు



బీఎస్ఈలో 2,096 షేర్లు సానుకూలంగా, 1,827 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 108 షేర్లలో మార్పు లేదు.

✦ **హ్యుందాయ్ మోటార్ ఇండియా** షేరు బీఎస్ఈలో 4.19% లాభపడి రూ.1,896.70 వద్ద ముగిసింది. ఒక దశలో 5.91% పెరిగి రూ.1,928.15 కు చేరింది కూడా. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,824.15 కోట్లు పెరిగి రూ.1,54,114.67 కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ▼ 139	నిఫ్టీ ▼ 37
80082	24436

✦ **పేటీఎం**లో కొత్త యూపీఐ వినియోగదార్లను చేర్చుకునేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుమతి ఇవ్వడంతో మాతృ సంస్థ **వన్97 కమ్యూనికేషన్స్** షేరు బీఎస్ఈలో 8.40% పెరిగి రూ.745 వద్ద ముగిసింది. ఒక దశలో 12.21% లాభంతో రూ.771.25 స్థాయిని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,680.36 కోట్లు పెరిగి రూ.47,436.58 కోట్లకు చేరింది.

✦ త్రైమాసిక ఫలితాలు మదుపర్లను మెప్పించడంతో **బజాజ్ ఫైనాన్స్** షేరు బీఎస్ఈలో 4.95% లాభపడి రూ.7,007.95 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.20,460.93 కోట్లు పెరిగి రూ.4,33,789.53 కోట్లకు చేరింది.

✦ **సోనా కామ్‌స్టార్**కు తన రైల్వే ఎక్విప్‌మెంట్ వ్యాపారాన్ని రూ.1,600 కోట్లకు విక్రయిస్తున్నట్లు **ఎస్కార్ట్స్ కుబోటా** వెల్లడించింది.

✦ హరియాణా జీఎస్టీ అప్పీల్స్ అథారిటీ రూ.139.3 కోట్ల పన్ను డిమాండ్‌ను సమర్థించిందని **మారుతీ సుజుకీ** వెల్లడించింది. 2023 సెప్టెంబరు 28న షోకాజ్ నోటీసు రావడానికి ముందే కంపెనీ ఈ పన్ను చెల్లించినట్లు ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది.

నేటి బోర్డు సమావేశాలు

ఐటీసీ, ఎన్‌టీపీసీ, ఏసీసీ, గోద్రేజ్ కన్జూమర్ ప్రోడక్ట్స్, సైయెంట్, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లారస్ ల్యాబ్స్, కోరమాండల్ ఇంటర్నేషనల్, వీఎస్‌టీ ఇండస్ట్రీస్, సంఘి ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్, డిక్సన్ టెక్నాలజీస్, కోల్గేట్ పామోలివ్, అదానీ టోటల్ గ్యాస్, పతంజలి ఫుడ్స్, పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్, యునైటెడ్ బ్రూవరీస్, పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, నిప్పన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్, అదానీ విల్మర్, గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్, ర్యాడికో ఖైతాన్, క్యాస్ట్రాల్ ఇండియా, ఫినోలెక్స్ ఇండస్ట్రీస్, టాటా టెలీసర్వీసెస్ (మహారాష్ట్ర), స్ట్రైడ్స్ ఫార్మా, ఎల్‌టీ ఫుడ్స్, గ్లెన్‌మార్క్ లైఫ్ సైన్సెస్, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, డీసీబీ బ్యాంక్, సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్

జులై- సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2024-25	2023-24	2024-25	2023-24
డాక్టర్ లాల్‌పాథ్ ల్యాబ్స్1	131	111	660	601
ఎస్‌బీఐ లైఫ్	529	380	40,015	28569
గోద్రేజ్ ప్రాపర్టీస్	335.21	66.80	1346.54	605.11
ఎన్ఐఐటీ	57.03	46.88	397.44	381.92
కోఫోర్జ్2	202.2	181	3062.3	2276.2
కేపీఐటీ టెక్నాలజీస్	203.7	141.4	1471.4	1199
బజాజ్ ఫిన్‌సర్వ్	2087	1929	33704	26023
యునైటెడ్ స్పిరిట్స్	341	339	6672	6737
పిడిలైట్ ఇండస్ట్రీస్	540.30	458.53	3235	3076
ఏయూ స్మాల్‌ఫైనాన్స్‌బ్యాంక్	571	402	4549	2957
ఫినో పేమెంట్స్ బ్యాంక్	21.15	19.52	455.41	358
ఎన్‌డీటీవీ	(53.45)	5.55	111.32	95.55
బిర్లా సాఫ్ట్	127.50	145.00	1,368.20	1,309.80
టీవీఎస్ మోటార్	588.13	415.93	11,301.68	9,932.82

1) రెండో మధ్యంతర డివిడెండ్ రూ.6 2)మధ్యంతర డివిడెండ్ రూ.19

మకరందం
makarandam@eenadu.in
7
హైదరాబాద్, గురువారం అక్టోబరు 24, 2024
ఈనాడు
మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

వందే విష్ణుం!



వృషాకృతిః


విష్ణుసహస్రనామావళిలో 113వది. వృషాకృతిః (ఓం వృషాకృతయే నమః) అంటే ఆ శ్రీమహావిష్ణువు మూర్తీభవించిన ధర్మస్వరూపుడని వివరించడం. వృష పదానికి ధర్మం, ఆకృతి పదానికి ఆకారం అనే అర్థాలున్నాయి. ధర్మమే ఆకారంగా ఉన్నవాడు వృషాకృతి. తాపత్రయాలతో తపిస్తున్న భక్తులకు అమృతంలా చల్లనైన రూపంతో దర్శనమిస్తాడు. సుఖసంతోషాలను కలిగించే ధర్మ కర్మములు కలవాడు అనేది వృషాకృతి నామంలోని అంతరార్థం. అలాగే నిత్యం ధర్మాన్ని ఆచరించేవాడనే అర్థం కూడా చెబుతారు.

- వై.తన్వి

దానం.. మోక్ష ద్వారం

ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాల సాధన ధార్మికుల లక్ష్యం. ఇందులో చివరిదైన మోక్షం కృత, త్రేత, ద్వాపర యుగాల్లో తపస్సు, యజ్ఞయాగాదుల ద్వారా పొందేవారు. కానీ కలియుగంలో అలా కఠోర తపస్సు చేయటానికి, యజ్ఞాలు నిర్వహించటానికి అవకాశం తక్కువ. అందుకు ప్రత్యామ్నాయం దానం. దానం, దైవారాధన, నామ పారాయణ, దైవస్మరణలతో కఠోర తపస్సును మించిన ఫలితాన్ని పొందవచ్చని పురాణాలు పేర్కొన్నాయి. ఆపదలో ఉన్న వ్యక్తులను గట్టెక్కించే ఉద్దేశంతో పుట్టినవే దానధర్మాలు. ఇవి మానవతను చాటుతాయి. ఇచ్చినవారికి సంతృప్తిని, పుచ్చుకున్నవారికి సుఖశాంతులను కలిగిస్తాయి.

దానానికి తూకాలూ కొలతలూ అంటూ లేవు. తమ శక్తిని బట్టి దానం చేయొచ్చు. అయితే అత్త సొమ్ము అల్లుడుదానం అన్నట్టు ఒకరి సొమ్ము ఇంకొకరు లేదా వేరొకరు అనుభవించాల్సిన దాన్ని మరొకరు దానం చేస్తే ఫలితం శూన్యమే. దానం మనస్ఫూర్తిగా చెయ్యాలి. ఆడంబరాలకు పోకూడదు. ఇచ్చినందుకు ప్రచారం లభించాలని ఆశించకూడదు. రెండో చేతికి, మూడో కంటికి తెలియని విధంగా చేసే గుప్తదానం ఉత్తమం.



అన్ని గుణాల్లో దానగుణం ఉత్తమం అన్నది పెద్దల మాట. అది సామాజిక సంక్షేమానికి నిలువుటద్దం, మోక్షానికి ద్వారం. సమకాలీన సమాజంలో అన్ని వర్గాలవారు ఎంత సంక్షేమంగా, ఆనందంగా ఉన్నారని తెలుసుకోవడానికి అక్కడి దాతల సంఖ్యే ప్రమాణం.

ఆధునిక దానాలు

దశదానాలు, షోడశ దానాలు ఇవన్నీ సంప్రదాయసిద్ధమైనవైతే.. నేటి ఆధునిక సమాజంలో దానాల విషయంలో మరిన్ని మార్పులు కనిపిస్తున్నాయి. వాటిలో రక్తదానం, అవయవదానం లాంటివి చోటు చేసుకున్నాయి. ఇవి నేటి తరానికి కావలసిన దానాలు. ప్రాణాన్ని నిలిపే, కొత్త జీవితాన్ని ప్రసాదించే ఈ దానాలు మాటలకు అందని పుణ్య ఫలాన్ని ప్రసాదిస్తాయనటంలో అతిశయోక్తి లేదు.

ఇవ్వకుంటే వ్యర్థమే..

సంపాదించిన ధనానికి అసలు సార్థకత ఎప్పుడు సమకూరుతుంది అంటే అది దానం చేసినప్పుడు మాత్రమే. ఈ విషయాన్ని 'దానము భోగము నాశము, పూనికతో మూడు గతులు భువి ధనమునకున్, దానము భోగము నెరుగని దీనుని ధనమునకు గతి తృతీయమే పొసగున్' అనేది ఆ సుభాషితం. అయితే అనుభవించు లేదంటే దానం చెయ్యి. ఈ రెండూ చేయకుంటే.. ఉన్న సంపదంతా నాశనమైపోతుందన్న హెచ్చరిక ఇక్కడ అందుతుంది. కనుక దానగుణాన్ని అలవరచుకుంటే సంపాదనకు నాశనం అనే దశ తప్పుతుంది.

ఎన్నెన్ని దానాలో

అన్న, వస్త్ర, జల, గో, కన్య, సువర్ణ, భూదానం- ఇలా దానాలనేకం. దేశకాలాలకు అనుగుణంగా, సందర్భానుసారంగా ఇచ్చే దానాల స్వరూపం మారుతుంటుంది. మన జీవయాత్రలో అనేక సందర్భాల్లో దానం చెయ్యాలని ధర్మగ్రంథాలెన్నో ప్రబోధించాయి. అందుకే పుట్టింది మొదలు గిట్టిన తర్వాత జరిగే కార్యక్రమాల్లో కూడా దశదానాలు, షోడశదానాలు ఉంటాయి. గోదానం, భూదానం, హిరణ్య (బంగారం), రౌప్య (వెండి), ఆజ్య (నెయ్యి), వస్త్ర, ధాన్య, లవణ (ఉప్పు), గుడ (బెల్లం), తిలాదానం (నువ్వులు) - ఇవి దశ దానాలు. గోదానం, భూ, తిల, హిరణ్య, రత్న, విద్య, కన్య, దాసి, శయ్య, గృహ, అగ్రహార, రథ, గజ, అశ్వ, ఛాగ (మేక), మహిష దానం- అనేవి షోడశ దానాలు. వేటికవే పుణ్యప్రదం. వీటి గురించి ఆంధ్ర వాచస్పత్యం, శబ్దరత్నాకరం నిఘంటువులు పేర్కొన్నాయి.

గుక్కెడు మంచినీళ్లైనా..

దానాల్లో ఎక్కువ సంతృప్తినిచ్చేది అన్నదానం. దాహార్తిని తీర్చేది జలదానం. అందునా వేసవిలో గుక్కెడు మంచినీళ్లిచ్చి బాటసారుల దాహాన్ని తీర్చటం అధిక పుణ్యఫలమని అనేక పురాణాలు పేర్కొన్నాయి. నరకంలో దాహ బాధలు కలగకుండా ఉండాలంటే దాహార్తుడికి మంచినీళ్లు ఇచ్చి, సంతృప్తి కలిగిందా- అని అడిగి తెలుసుకోవాలంటుంది గరుడ పురాణం. అలా చేస్తే మరణానంతర ప్రయాణంలో పాపుల మార్గంలో కాకుండా పుష్పోదకి అనే అమృతతుల్య జలప్రవాహంతో ఉన్న నది ఒడ్డున చల్లటి చెట్ల నీడలో సాగిపోవచ్చని వివరించింది. జల దానంలో మానవతా ధోరణి, ఎదుటి వ్యక్తి బాధను అర్థంచేసుకుని తక్షణం స్పందించాలన్న సందేశం కనిపిస్తాయి.

పూజలూ వ్రతాల్లో, పుష్కరాలు, అక్షయతృతీయ, కార్తిక మాసం లాంటి పర్వదినాల్లో జలకుంభ దానాలు, దీప దానాలు తదితర దానాలుంటాయి. దానం ఏదైతేనేం.. తోటి మనిషిని అవసరంలో ఆదుకోమని హితవు చెప్పేదే. అందుకే దానంగా ఇచ్చేది ఏదైనా గ్రహీతకు ఉపకరించేదిగా ఉండాలన్న నియమం ఉంది. అలాగే అపాత్ర దానం పనికిరాదని నొక్కి వక్కాణించాయి పురాణాలు. అర్హత లేనివారికి దానం చేస్తే పుణ్యానికి బదులు వ్యతిరేక ఫలితం వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరించాయి.

తమకు కలిగినవాటిని వేరొకరికి ఇవ్వటం, విరాళాలు సమర్పించటం, అవి నిస్సహాయులకు అందేలా చూడటం.. ప్రజల ఔదార్యాన్ని, ప్రభుత్వాల పారదర్శకతను తేటతెల్లం చేస్తాయి. అందుకే పురాణ కాలం నుంచి రాజులు కూడా తమకు తాము వ్యక్తి పరంగా దాన గుణం నిరూపించుకుంటూ నిరంతరం యజ్ఞయాగాలను నిర్వహించేవారు. విశ్వజిత్ యాగాన్ని చేసి సర్వస్వాన్నీ చివరికి తాగటానికి ఉంచుకున్న మంచినీళ్లను కూడా దానం చేసిన రంతిదేవుడు లాంటి మహారాజులు దానం విలువను, అవసరాన్ని ప్రజలకు నేర్పారు. అలాంటి ధర్మం నెలకొన్న దేశం మనది.

భారతీయ సంప్రదాయంలో పుణ్య సముపార్జనకు ఎన్నో మార్గాలున్నాయి. వాటిల్లో దానం ఒకటి. దానాల్లో శారీరకంగా తోడ్పడే శ్రమదానం, ఆందోళనలో కూరుకుపోయినవారికి మంచి మాటలతో వేదన తగ్గించే మాట సాయం, తాను ధనసాయం చేయలేకున్నా వేరొకరి దగ్గర సేకరించి ఇవ్వటం వంటి సులువుగా చేయగలిగినవి, ఆర్థిక భారం లేనివి కూడా ఉన్నాయి. కనుక ధనికులే కాదు.. పేదలు కూడా దానధర్మాలు చేయొచ్చు. మన శక్తి, స్థాయిని అనుసరించి చెయ్యతగ్గ దానాలు చేసి ఇహలోకంలో సంతోషం, పరలోకంలో పుణ్యం సంపాదించుకుందాం.

– డాక్టర్ వైయమ్మార్, గుంటూరు

క్రీస్తువాణి



దేవుడు హర్షిస్తాడా?

మన మెదడులో అనేక ఆలోచనలు గజిబిజిగా ఉంటాయి. వాటిలో కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి. దేవుని సన్నిధిలో మన ఆలోచనలు ఎలా ఉన్నాయనేది పరిశీలించుకోవాలి. వక్రమైన ఆలోచనలు చేటు చేస్తాయి. జీవితం అల్లకల్లోలం అవుతుంది. మనం ఒక పని చేస్తున్నాం అంటే.. అంతకంటే ముందే మదిలో ఆలోచన వేళ్లూనుతుంది. కనుక ఆ తలపు మంచిదా కాదా, దేవుడు హర్షిస్తాడా లేదా అని ఆలోచించుకోవాలి.



ఇశ్రాయేలుకు చెందిన సమ్సోను మహా బలవంతుడు. అతను తమకు అనుకూలం కాని ఫిలిష్తీయ స్త్రీని మోహించాడు. ఆమెతో వివాహం చేయమని అడిగితే తల్లిదండ్రులు సమ్మతించలేదు. తమ జాతి మహిళను చేసుకోమన్నారు. సమ్సోను తన పట్టు వీడలేదు. విగ్రహారాధన చేసే కుటుంబం లోని స్త్రీని వివాహం చేసుకోవడం దైవాజ్ఞకు వ్యతిరేకం. ఆయనకు సమ్మతం కాని పని చేసి దేవుని కోపానికి లోనయ్యాడు. పడరాని పాట్లూ పడ్డాడు. హీన స్థితిలో అతని జీవితం ముగిసింది. తప్పు ఆలోచన ఫలితమది. మరో సంఘటనలో గొప్ప భక్తుడైన దావీదు బత్షెబా అనే వివాహితను మోహించి, పాపానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత పశ్చాత్తాపంతో కన్నీరుమున్నీరై విలపించాడు. తన ఆలోచన క్రియారూపం దాల్చకముందే పరిశీలించుకోని ఫలితమది. మనం చేయాలనుకున్న అంశం గురించి దైవ సన్నిధిలో విచారించిన తర్వాతే ఆచరించాలని దైవగ్రంథం తెలియజేస్తోంది. దైవాజ్ఞ పాటించడమే క్షేమదాయకం.

– ఉషారాణి

ఇస్లాం సందేశం

పెళ్లి చేసుకోవాల్సిందే!


పూర్వం ముగ్గురు వ్యక్తులు తమ నిర్ణయాలను ఇలా ప్రకటించుకోసాగారు. మొదటి వ్యక్తి 'నేను ఇక నుంచి రోజూ రాత్రంతా మేల్కొని నమాజు చేస్తాను' అన్నాడు. రెండో వ్యక్తి 'నేనికపై రోజూ ఉపవాసం పాటిస్తాను. ఒక్కరోజు కూడా విడిచిపెట్టను' అన్నాడు. మూడో అతను 'నేను ఎన్నటికీ పెళ్లి చేసుకోను. దైవారాధనకే జీవితాన్ని అంకితం చేస్తాను' అన్నాడు.



అంతలో దైవప్రవక్త (స) అక్కడికి వచ్చారు. వారి మాటలు విని 'మీరేనా ఈ మాటలు అంటున్నది! వినండి. నేను మీ అందరి కంటే ఎక్కువగా దేవుడికి భయపడేవాణ్ణి. మీ అందరినీ మించిన దైవభక్తి గలవాణ్ణి. అయినప్పటికీ.. రాత్రులు నమాజు చేస్తున్నాను, నిద్ర కూడా పోతున్నాను. ఉపవాసాలు పాటిస్తున్నాను, వాటిని వదిలేస్తున్నాను కూడా. వివాహం కూడా చేసుకున్నాను. గుర్తుంచుకోండి! సంప్రదాయాలను విడనాడే వారితో నాకెలాంటి సంబంధం లేదు' అన్నారు. ఎవరూ పెళ్లి చేసుకోకుండా ఉండవద్దని వారించారు. 'యువకుల్లారా! మీలో వివాహయోగ్యత ఉన్నవారు పెళ్లి చేసుకోండి. యోగ్యత లేనివారు ఉపవాసం పాటించండి. ఉపవాసం కామవాంఛను అదుపులో ఉంచుతుంది' అంటూ ప్రవక్త (స) హితవు పలికారు.

– ముహమ్మద్ ముజాహిద్

జెన్ కథ




నల్లముక్కు బుద్ధుడు

ఒక బౌద్ధసన్యాసిని బుద్ధుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారుచేయించింది. తలపై బంగారు ఆకుతో గొడుగులా ఏర్పాటుచేసింది. ఆమె ఎక్కడికి వెళ్లినా తనతోపాటు ఆ స్వర్ణ విగ్రహాన్ని కూడా తీసుకువెళ్లేది. సంవత్సరాలు గడిచిపోతున్నా ఆమెలో మార్పు లేదు. ఆ విగ్రహాన్ని ఎన్నడూ వదిలి ఉండేది కాదు. ఎక్కడికి వెళ్లినా వెంట తీసుకెళ్లి పూజించేది. ఒకసారి ఆమె ఓ మారుమూల ప్రాంతంలో అనేక బుద్ధ విగ్రహాలు ఉన్న మందిరానికి కొన్నాళ్లు నివసించేందుకు వెళ్లింది. అక్కడి ప్రతిమల్లో దేనికదే విశేషంగా, విశిష్టంగా ఉంది. సన్యాసిని బంగారు బుద్ధుణ్ణి జాగ్రత్తగా తన గదిలోనే ఉంచుకుంది. ఇంట్లో పద్ధతి ప్రకారం ప్రతిమకు ధూపం వేయాలనుకుంది. కానీ అగరొత్తుల పరిమళానికి ఆకర్షితులైతే ఎవరైనా గదిలోకి వస్తారేమో, ప్రతిమను చూస్తారేమో అనే సందేహం కలిగింది. దాంతో సువాసన ఆ పరిసరాలకు విస్తరించకుండా గిన్నెతో విగ్రహాన్ని కప్పేసింది. అలా పొగను అడ్డుకోవడం వల్ల అది విగ్రహానికి మాత్రమే తాకి బుద్ధుడి ముక్కు నల్లబడిపోయింది. అంతవరకూ స్వర్ణ తేజస్సుతో దివ్యంగా దర్శనమిచ్చిన ప్రతిమ ఇప్పుడు వికారంగా కనిపించింది. అది సన్యాసిని మనసుకు దర్పణం పట్టినట్టుంది. – నాగరత్న

యాత్రలు అవసరమే..

ధనికులైన భార్యాభర్తలు ఓ సాధువును దర్శించారు. భర్త లోభి. అతడి భార్య ఒంటరిగా సాధువును కలిసి.. 'స్వామీ! నాకు యాత్రలకు వెళ్లాలని, నదీస్నానాలు చేయాలని ఉంది. కానీ అందువల్ల డబ్బు దండగ, లేనిపోని ప్రయాస కలుగుతాయి. ఊళ్లో ఉన్న ఆలయాల్లోనే ప్రార్థన చేసుకోవచ్చు. దేవుడు ఎక్కడైనా ఒకటేగా అంటున్నారు నా భర్త' అంది. సాధువు అతణ్ణి పిలిచి 'నీకు ఏ పిండివంటలు ఇష్టం?' అని అడగ్గా.. అతను క్లిష్టమైన రెండు తీపిపదార్థాల పేర్లు చెప్పాడు. ఇంతలో సాధువు గది తలుపులు మూసేయమని శిష్యులకు సైగచేశాడు. గాలి వీచకపోయేసరికి ఊపిరాడక తలుపులు తెరిపించమన్నాడు. 'నాయనా! గాలి లేని ప్రదేశమే లేదు, అంతటా ఉంది. కానీ కాసేపు తలుపులు మూస్తే తట్టుకోలేకపోయావు. బయటి చల్లటిగాలి తాకగానే ఎంత ఊరట కలిగిస్తుందో చూశావుగా. తలుపులు మూసినంత మాత్రాన గాలి లేదనలేం. అలాగే భగవంతుడు అంతటా ఉన్నా, పుణ్యక్షేత్రాల్లో మరింత మహత్తు ఉంటుంది. ఆ ఆధ్యాత్మిక అనుభూతి ఆస్వాదిస్తేనే తెలుస్తుంది. ఇందాక నీకు ఇష్టమైన పదార్థాలేమిటో చెప్పావు. నీకు ఇష్టమైంది తీపి. మరి పంచదారో, బెల్లమో, తిని ఊరుకోక.. ఆమెతో మిఠాయిలు చేయించడం ఎందుకు? అదనపు శ్రమ, ఖర్చు కాదా? ఆ మాధుర్యాలను ఎలా ఆనందిస్తున్నావో, అలాగే నీ భార్య పుణ్యక్షేత్రాలను సందర్శించి భగవంతుని ఉనికిని ఆస్వాదించాలి అనుకుంటోంది. నీకు డబ్బుకు లోటు లేదు. యాత్రలతో భక్తి పారవశ్యం, ఆధ్యాత్మిక చింతన, మనసుకు ఆహ్లాదం కలుగుతాయి. ఆ అనుభూతి వర్ణనాతీతం. కనుక లోభత్వం వదిలి, నీ శక్తికి తగ్గట్టు దానధర్మాలు చేస్తూ యాత్రలకు వెళ్లండి' అని వివరించటంతో అతనికి జ్ఞానోదయం అయ్యింది.


– పరాశరం సచ్చిదానందమూర్తి



ఎవరి చిట్టాలో వేయాలి?!


తనను చూసేందుకు వచ్చిన ప్రత్యేక అతిథులకు తానే వంటచేసి వడ్డించాలి అనుకున్నాడో రాజు. స్వయంగా వండి, ఆ పదార్థాలను తీసుకెళ్తున్నాడు. అప్పుడో డేగ పాముతో ఆకాశంలో ఎగురుతోంది. సరిగ్గా అప్పుడే పాము విషం చిమ్మడంతో ఒక చుక్క వచ్చి రాజు చేతిలోనున్న ఆహారంలో పడింది. ఈ విషయం తెలియని రాజు భోజనం వడ్డించాడు. అది తిన్న అతిథులు చనిపోయారు. పాపపుణ్యాల లెక్క రాస్తున్న చిత్రగుప్తుడు 'ఈ పాపాన్ని రాజు, డేగ, పాము.. ఎవరి ఖాతాలో రాయమంటావు స్వామీ?' అనడిగాడు. యముడు కొన్నాళ్లు ఆగమన్నాడు. తన ప్రమేయం లేనప్పటికీ కొందరి ప్రాణాలు పోవడం రాజును బాధించింది. ఆ పాపానికి పరిహారంగా అన్నసత్రం ఏర్పాటుచేసి, నిత్యాన్నదానం చేయసాగాడు. కొన్నాళ్లకు ఆ ఊరి మీదుగా వెళ్తున్న కొందరు సాధువులు.. అరుగుమీద కూర్చున్న వృద్ధురాలిని ఉద్దేశించి అన్నసత్రం ఎక్కడని అడిగారు. దారి చెప్పిన పెద్దావిడ 'ఆ రాజు మహా పాపాత్ముడు. చూస్తూచూస్తూ కొందరి ప్రాణాలు తీశాడు తెలుసా! అలాంటి అతడు పెట్టే తిండి తింటారా? అది విషతుల్యం' అంది.

యమధర్మరాజు నవ్వి 'విన్నావుగా చిత్రగుప్తా! ఆ పాపాన్ని ఈ వృద్ధురాలి ఖాతాలో జమ చెయ్యి' అన్నాడు. అందువల్ల మనకు తెలియని విషయాల గురించి మాట్లాడకపోవటం మంచిది. ఒకరిని చులకనచేసినా, నిందించినా.. వాళ్ల పాపం కూడా మనకే వస్తుంది. ఇతరుల సంగతి వదిలేసి, మనం ఎవరికీ హాని చేయకుండా ఉండాలి. ఆ పాపపుణ్యాల లెక్కలు పైవాడు చూసుకుంటాడు. తన చుట్టూ చేరిన భక్తులకు సాయిబాబా చెప్పిన కథ ఇది.



– డా.జయదేవ్ చల్లా

ఆనందంగా జీవించాలి



ధర్మరాజు మాయాజూదంలో ఓడిపోయాడు. నియమం మేరకు తమ్ములతో కలసి అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తిచేశాడు. తదుపరి జరగాల్సిన కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. వాళ్లంతా తాము పడిన కష్టాల గురించి మాట్లాడుకుంటున్న సందర్భంలో 'మనం ఎన్ని ఇబ్బందులు పడినా చివరికి ధర్మమే జయించింది' అని ధర్మరాజు చెప్పగా.. కష్టాన్ని వెన్నంటి ఆనందం ఉంటుంది. మోహం వల్ల సంతోషం కలిగే మాట నిజమే. కానీ అది శాశ్వతం కాదు, కలిగినంత త్వరగానే మాయమౌతుందన్న పెద్దల మాటను గుర్తుచేసుకున్నారు సోదరులు.

కీచకుడు ద్రౌపది అందం చూసి మోహించాడు. ఆమెని సొంతం చేసుకోవాలన్న దుర్బుద్ధితో వెంటాడుతూ వేధించ సాగాడు. అది గమనించిన భీమసేనుడు యుద్ధానికి దిగాడు. కీచకుడు హతమయ్యాడు. మోహావేశంతో కూడిన పరవశం అతడితోనే అంతమయింది. సీతమ్మను చెరపట్టిన రావణుడు తాను గొప్ప ఘనకార్యం చేశానని అహంకారంతో విర్రవీగాడు. నిత్యం అశోకవనానికి వెళ్లి, శ్రీరాముణ్ణి నిందిస్తూ ఆనందించేవాడు. కానీ రాముడు వానరసేనతో లంకకు వెళ్లాడు. రావణాసురుణ్ణి సంహరించాడు. అక్కడితో లంకేశ్వరుడి అహంకారంతో కూడిన ఆనందం ముగిసింది. అల్ప సంతోషం కంటే నిత్యం ఉండే ఆనందసిద్ధి కోసం మనం ప్రయత్నించాలి.

పరమశివుణ్ణి పతిగా పొందటం కోసం పార్వతీదేవి కఠోర తపస్సు చేసింది. బలిష్టమైన పురుషులకు మాత్రమే సాధ్యమయ్యే మహా తపస్సు స్త్రీమూర్తి అయిన పార్వతి చేసిందంటూ సప్తరుషులు ఎంతగానో ప్రశంసించారు. అద్వైత ఆనందాన్ని పొందటం కోసమే ఆమె తపస్సు చేసిందని కాళిదాసు కుమారసంభవంలో వివరించాడు. ధర్మం ఉత్కృష్టమైంది అన్నది పురాణవచనం.


– శివరాజేశ్వరి

బలిని శపించిన విష్ణువు


బలి చక్రవర్తి శిశువుగా ఉన్నప్పుడు ఆయనను ఊయలలో వేసే ఉత్సవానికి విష్ణుమూర్తికి ఆహ్వానం అందలేదు. అందుకాయన కోపించి 'ఈ బాలుడు పెద్దయ్యాక తన వద్దకు యాచన కోసం వచ్చిన బ్రాహ్మణులను సంతృప్తి పరచకపోతే చేటు వాటిల్లుతుంది' అని శపించాడు. తాను చక్రవర్తి అయ్యాక కూడా విష్ణు శాపాన్ని మర్చిపోలేదు బలి.

ఒకరోజు పొట్టిగా ఉన్న బ్రాహ్మణుడు వచ్చి 'మీ రాజ్యంలో పశుపక్ష్యాదులకు ఆవాసముంది కానీ ఈ దీన బ్రాహ్మణుడు తలదాచుకోవడానికి గుడిసె కూడా లేదయ్యా. ఏ అరుగు మీదనైనా పడుకుందామంటే నీళ్లు జల్లి పొమ్మంటున్నారు. మీ రాజ్యంలో ఆలయాలు కిటకిటలాడుతుంటాయి. అక్కడా కుదరదు. కనుక మూడడుగుల నేల ఇస్తే.. స్థిమితంగా ఉంటాను' అన్నాడు. అందుకు బలి 'మూడడుగులేనా? నీకు ఎక్కడ, ఎంత స్థలం కావాలన్నా ఇస్తాను' అన్నాడు. మూడడుగులే చాలన్న బ్రాహ్మణుడి పాదం బ్రహ్మాండంగా ఎదిగి భూభాగమంతా ఆక్రమించింది. మరో అడుగు ఆకాశాన్ని ఆక్రమించింది. వచ్చిందెవరో, జరుగుతున్నదేమిటో గ్రహించిన బలి 'మూడో అడుగు నా తల మీద పెట్టు స్వామీ' అన్నాడు. వామన రూపంలో ఉన్న విష్ణుమూర్తి హృదయం మెత్తబడి ఏదైనా వరం కోరుకోమన్నాడు. పాతాళలోకానికి వెళ్లబోతున్న బలిచక్రవర్తి 'ఈ రోజున దీపంపెట్టి దానం చేసేవారి ఇళ్లు లక్ష్మీనిలయాలు అయ్యేటట్టు వరమివ్వు' అన్నాడు. అలా దీపావళి పండుగ ఆరంభమైంది. ఆరోజు బలిచక్రవర్తిని తలచుకుంటూ దీపదానం చేయాలంటారు.

శ్రీ మయూఖ




"భగవంతుడు ప్రసాదించిన సంపదను తనకోసం లేదా ఇతరుల అవసరాలు తీర్చేలా సద్వినియోగ పరచాలి. అలా తోటివారితో పంచుకుంటే పరమపవిత్రమవుతుంది. అందుకు భిన్నంగా దాచి ఉండితే.. ఆ సొమ్ము శవంతో సమానమవుతుంది.



- గురునానక్

ఇంజినీరింగ్ (ఈసీఈ) ఫస్టియర్ చదువుతున్నాను. మరోపక్క కోడింగ్ నేర్చుకోవాలనుంది. ఇలాచేస్తే త్వరగా ఉద్యోగం వస్తుందా? – పి.తేజ

కోడింగ్‌లో ప్రావీణ్యం పొందితే?



■ చాలామంది విద్యార్థులు ఇంజినీరింగ్ మూడో సంవత్సరంలో ఉద్యోగ నియామకాలకు అవసరమైన నైపుణ్యాలను తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కానీ మీరు మొదటి సంవత్సరంలోనే కోడింగ్ గురించి ఆలోచించడం అభినందనీయం. బీటెక్ (ఈసీఈ) తోపాటు కోడింగ్ నైపుణ్యాలు కూడా పెంచుకొంటే మెరుగైన ఉద్యోగావకాశాలుంటాయి. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కోడింగ్‌లలో ప్రావీణ్యం పొందితే ఎంబెడెడ్ సిస్టమ్స్, వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ వెరిఫికేషన్, టెలికమ్యూనికేషన్స్ అండ్ నెట్‌వర్కింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఐఓటీ, డేటా సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఆటోమేటివ్, అటానమస్ డ్రైవింగ్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, హెల్త్ కేర్, రోబోటిక్స్, ఐటీ సర్వీసెస్, ఫిన్ టెక్, సెమీ కండక్టర్, మాన్యుఫాక్చరింగ్, డిఫెన్స్ లాంటి రంగాల్లో వివిధ ఉద్యోగాలు లభిస్తాయి. కోడింగ్‌తో పాటు సీ, సీ ప్లస్ ప్లస్, పైథాన్, జావా లాంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, మ్యాట్ ల్యాబ్, సిమ్యులింక్, స్పైస్, వెరిలాగ్ లాంటి ఎలక్ట్రానిక్స్ టూల్స్, జీఐటీ, లినక్స్, డాకర్, ఏడబ్ల్యూఎస్, అజూర్ లాంటి సాఫ్ట్‌వేర్ టూల్స్, టీసీపీ/ఐపీ వైర్‌లెస్ ప్రోటోకాల్స్, ఎస్‌డీఎన్ లాంటి నెట్‌వర్కింగ్ టూల్స్‌పై పట్టు సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

దూసుకుపోదాం లిబరల్‌గా!

ఫిజిక్స్‌తో మ్యూజిక్ నేర్చుకోగలమా? సైన్స్‌తో సైకాలజీనీ ఎంచుకోవచ్చా? కోరిన సబ్జెక్టులతో కోర్సులను మనమే డిజైన్ చేసుకోవచ్చా? వీటికి సమాధానం.. లిబరల్ స్టడీస్. కొన్నేళ్లుగా ఈ చదువులకు ఆదరణ పెరుగుతోంది. ఎన్నో విద్యా సంస్థలు యూజీలో భాగంగా వీటిని అందిస్తున్నాయి. ఆసక్తి ఉన్నవారు ఇంటర్ తర్వాత లిబరల్‌గా దూసుకుపోవచ్చు. వచ్చే విద్యా సంవత్సరంలో కోర్సుల్లో ప్రవేశానికి వివిధ సంస్థలు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి.



వైవిధ్యాన్ని ఆశించేవారు లిబరల్ స్టడీస్ బాట పట్టవచ్చు. ప్రపంచ దృక్పథంతో స్థానికతను మేళవించి, వీటిని రూపొందించారు. విభిన్న సబ్జెక్టుల నుంచి నచ్చినవి ఎంచుకునే స్వేచ్ఛ ఈ విధానంలో దక్కుతుంది. వీటి కోసమే ప్రత్యేకంగా కొన్ని విశ్వవిద్యాలయాలు, సంస్థలు ఏర్పాటయ్యాయి. సృజనాత్మకంగా, ప్రభావంతంగా ఆలోచించడానికి, సర్వతోముఖాభివృద్ధికీ లిబరల్ స్టడీస్ దారిచూపుతాయి. బహుముఖ నైపుణ్యాలు పెంపొందించడానికి, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకోవడానికి ఈ చదువులు దిశానిర్దేశం చేస్తాయి. పరిశోధన, విశ్లేషణ, సమస్య పరిష్కార, మాట, రాత నైపుణ్యాలనూ మరింతగా పెంపొందించుకోవచ్చు. సరైన నిర్ణయం తీసుకోవడం, కచ్చితమైన ప్రశ్నలు వేయడం లాంటి మెలకువలూ తెలుసుకోవచ్చు.

ఈ కోర్సుల్లో ఫౌండేషన్‌లో భాగంగా వివిధ సబ్జెక్టులపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు. అనంతరం విద్యార్థులు నచ్చినవి ఎంచుకోవచ్చు. ఈ కోర్సులు అందించే సంస్థలు ప్రమాణాలు, వసతులు, బోధన పరంగా ఉన్నతమైనవి. అందువల్ల ఫీజులూ అదే స్థాయిలో ఉంటాయి. అయితే విద్యార్థి నైపుణ్యాలు, ఆర్థిక నేపథ్యాలను అనుసరించి కొన్ని సంస్థలు ఫీజు పూర్తిగా మినహాయిస్తున్నాయి లేదా రాయితీతో ప్రోత్సహిస్తున్నాయి. సంస్థను బట్టి ఏడాదికి సుమారుగా రూ.1.5 లక్షల నుంచి రూ.10 లక్షలు.. ఫీజు, వసతి, భోజనం కోసం చెల్లించాలి.

ప్రవేశం ఎలా?

లిబరల్ స్టడీస్ అందించే సంస్థల్లో చేరడానికి ప్రవేశ పరీక్షలో ప్రావీణ్యం తప్పనిసరి. స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్టు (ఎస్ఏటీ) లేదా అమెరికన్ కాలేజ్ ఆఫ్ టెస్టింగ్ (ఏసీటీ) స్కోరు ఉన్నవారికి మినహాయింపు. ఇవేవీ లేకపోతే ఆ సంస్థలు నిర్వహించే పరీక్షలు రాయాలి. వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్ అంశాల్లో పరీక్షిస్తారు. సంస్థను బట్టి పరీక్ష విధానం, ప్రశ్నలడిగే అంశాల్లో స్వల్ప మార్పులు ఉంటాయి. స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ (ఎస్ఓపీ), రికమెండేషన్ లెటర్లు, వ్యాసం దాదాపు అన్ని సంస్థలకూ తప్పనిసరి. ప్రవేశానికి అకడమిక్ ప్రతిభ, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్.. మొదలైనవాటికీ ప్రాధాన్యమిస్తారు. మౌఖిక పరీక్ష తర్వాతే కోర్సులోకి తీసుకుంటారు. అశోకా, క్రియా, ఫ్లేమ్, ఓపీ జిందాల్, క్రైస్ట్, సింబయాసిస్, శివనాడార్, అజీం ప్రేమ్‌జీ, ఎస్ఆర్ఎం, బెన్నెట్, పండిట్ దీన్‌దయాళ్... తదితర సంస్థలు ఈ చదువుల్లో పేరు గడించాయి.

కరిక్యులమ్

కోరుకున్న అంశాలను క్రమ పద్ధతిలో నేర్చుకోవచ్చు. కరిక్యులమ్‌లో మేజర్, మైనర్, ఫౌండేషన్..ఇలా విభాగాలు ఉంటాయి. ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌కు ప్రాధాన్యమిస్తారు. యూజీ స్థాయిలో ఏ కోర్సులో చేరినప్పటికీ మొదటి రెండు సెమిస్టర్లూ దాదాపు ఉమ్మడి అంశాలనే బోధిస్తారు. ఆ తర్వాత విద్యార్థి నచ్చిన సబ్జెక్టులను మేజర్, మైనర్లుగా ఎంచుకోవచ్చు. వివిధ అంశాల్లో విస్తృత పరిజ్ఞానం కల్పించడం, ఎంచుకున్న అంశంలో లోతైన అవగాహన పెంపొందించడం, నేర్చుకున్న దాన్ని ప్రాక్టికల్‌గా, వాస్తవ ప్రపంచంలో అనువర్తించడం.. మొదలైనవాటికి లిబరల్ స్టడీస్‌లో ప్రాధాన్యమిస్తారు.

క్రియా యూనివర్సిటీ

శ్రీసిటీ (తిరుపతి దగ్గర)లో నెలకొల్పారు. వివిధ రంగాల ప్రముఖులు గవర్నింగ్ కౌన్సిల్‌లో ఉన్నారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, కేంబ్రిడ్జ్, ఐఐటీ, ఐఐఎస్సీ నేపథ్యం ఉన్న ఫ్యాకల్టీ సభ్యులే ఎక్కువ. అల్లిక పద్ధతిలో నేర్చుకోవడానికి, సొంతంగా ఆలోచించడాన్ని, ప్రశ్నించడాన్ని ప్రోత్సహిస్తారు. యూజీ కోర్సులకు ఏడాదికి రూ.9 లక్షలకు పైగా చెల్లించాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం తక్కువగా ఉండి, మెరిట్ విద్యార్థులకు ఫీజు మినహాయిస్తారు. కోర్సులు రెసిడెన్షియల్ విధానంలోనే అందిస్తున్నారు.

బీఏ: ఆర్ట్స్, ఎకనామిక్స్, హిస్టరీ, లిటరేచర్, పాలిటిక్స్, సోషల్ స్టడీస్.

బీఎస్సీ: బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, సైకాలజీ.

బిజినెస్ స్టడీస్, ఫిలాసఫీ అదనపు మైనర్లు. ఎలక్టివ్స్‌లో భాగంగా ఇంటర్నేషనల్ ట్రేడ్, ఫిల్మ్, న్యూరో సైన్స్, ఇమ్యునాలజీ, ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ, స్టాటిస్టికల్ క్వాంటమ్ కంప్యూటింగ్, సస్టెయినబిలిటీ.. మొదలైనవి ఉంటాయి. వీటితో పాటు ఇంటర్ డిసిప్లినరీ కోర్ కోర్సులు, కో కరిక్యులర్ యాక్టివిటీస్ ఉంటాయి. ఈ కోర్సులను మూడేళ్ల వ్యవధితో అందిస్తున్నారు. అడ్వాన్స్‌డ్ స్టడీస్ కొనసాగించాలనుకునేవాళ్లు మరో ఏడాది అదనంగా చదువుకోవచ్చు. ఈ సంస్థ ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏనూ అందిస్తోంది.

> ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికీ, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించుకోవడానికీ, సరైన దిశలో ఆలోచించడానికీ ఈ కోర్సులు మేలు చేస్తాయి

ఫ్లేమ్ యూనివర్సిటీ

దేశంలో పేరున్న లిబరల్ స్టడీస్ సంస్థల్లో పుణెలోని ఫ్లేమ్ ఒకటి. మూడేళ్ల వ్యవధితో ఇక్కడ పలు యూజీ కోర్సులు ఉన్నాయి.

బీఏ: ఎకనామిక్స్, సైకాలజీ, లిటరరీ అండ్ కల్చరల్ స్టడీస్, ఇంటర్నేషనల్ స్టడీస్, ఎన్విరాన్మెంటల్ స్టడీస్, జర్నలిజం, పబ్లిక్ పాలసీ, సోషియాలజీ.

బీఎస్సీ: అప్లైడ్ మ్యాథమెటిక్స్.

బీబీఏ: ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఆపరేషన్స్, జనరల్ మేనేజ్‌మెంట్.

బీబీఏ (కమ్యూనికేషన్స్ మేనేజ్‌మెంట్) అడ్వర్టైజింగ్ అండ్ బ్రాండింగ్, డిజిటల్ మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్, ఫిల్మ్ అండ్ టెలివిజన్, కమ్యూనికేషన్ స్టడీస్ డిజైన్, డ్యాన్స్, మ్యూజిక్, థియేటర్ వీటిని మైనర్‌గా అందిస్తున్నారు.

మూడేళ్ల కోర్సు అనంతరం ఆసక్తి ఉన్నవారు నాలుగో ఏడాది ఫ్లేమ్ స్కాలర్స్ ప్రోగ్రామ్‌లో చేరవచ్చు. యూజీ కోర్సుల్లో చేరినవారు ఏడాదికి ఫీజు, వసతి, భోజనం. నిమిత్తం రూ.8 లక్షలకుపైగా చెల్లించాలి.

అశోకా యూనివర్సిటీ

పూర్తి స్థాయిలో లిబరల్ స్టడీస్‌ను మన దేశంలో ప్రారంభించిన తొలి సంస్థ హర్యానాలోని అశోకా యూనివర్సిటీ. ఇక్కడ యూజీ స్థాయిలో పలు కోర్సులు ఉన్నాయి. వీటిని మేజర్స్, ఇంటర్ డిసిప్లినరీ మేజర్స్ విధానంలో అందిస్తున్నారు. ఇక్కడ చదవడానికి ట్యూషన్, వసతి నిమిత్తం ఏడాదికి సుమారు రూ. పది లక్షలు చెల్లించాలి. మెరిట్ విద్యార్థులు రాయితీలు అందుకోవచ్చు.

మేజర్స్: బీఎస్సీ ఆనర్స్: బయాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్.

బీఏ ఆనర్స్: ఎకనామిక్స్, ఇంగ్లిష్, హిస్టరీ, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సోషియాలజీ/ ఆంత్రపాలజీ.

ఇంటర్ డిసిప్లినరీ మేజర్స్: బీఎస్సీ ఆనర్స్: కంప్యూటర్ సైన్స్ అండ్ ఆంత్రప్రెన్యూరల్ లీడర్‌షిప్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్ అండ్ ఫైనాన్స్. **బీఏ ఆనర్స్:** ఇంగ్లిష్ అండ్ క్రియేటివ్ రైటింగ్, ఎకనామిక్స్ అండ్ హిస్టరీ, ఇంగ్లిష్ అండ్ మీడియా స్టడీస్, హిస్టరీ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్; పాలిటిక్స్, ఫిలాసఫీ అండ్ ఎకనామిక్స్; పాలిటిక్స్ అండ్ సొసైటీ.

పండిట్ దీన్ దయాళ్ పెట్రోలియం వర్సిటీ

స్కూల్ ఆఫ్ లిబరల్ స్టడీస్

బీబీఏ, బీఏ, బీకాం, బీఎస్సీ ఆనర్స్ కోర్సులు అందిస్తోంది.

బీఏ ఆనర్స్: ఎకనామిక్స్, ఇంగ్లిష్, గవర్నెన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సైకాలజీ, పొలిటికల్ సైన్స్, మాస్ కమ్యూనికేషన్.

బీబీఏ ఆనర్స్: మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్.

బీకాం ఆనర్స్: ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్, మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ ఇంటర్నేషనల్ ట్రేడ్.

బీఎస్సీ ఆనర్స్: మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ

ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, ఏపీ (అమరావతి)

బీఏ, బీఎస్సీ కోర్సులు అందిస్తోంది. ఇంగ్లిష్, హిస్టరీ, సోషియాలజీ అండ్ ఆంత్రపాలజీ, పొలిటికల్ సైన్స్, మీడియా స్టడీస్, ఎకనామిక్స్, సైకాలజీ సబ్జెక్టులు ఎంచుకోవచ్చు. ట్యూషన్ ఫీజు ఏడాదికి రూ.1.55 లక్షలు. వసతి, భోజనం నిమిత్తం అదనంగా చెల్లించాలి. మెరిట్ విద్యార్థులకు ఫీజు పూర్తిగా మినహాయిస్తున్నారు.

జిందాల్ స్కూల్

బీఏ లిబరల్ ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ కోర్సు అందిస్తోంది. ఎకనామిక్స్, ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టెయినబిలిటీ, ఎక్స్‌ప్రెసివ్ ఆర్ట్స్ (విజువల్ ఆర్ట్స్), సోషియాలజీ అండ్ ఆంత్రపాలజీ, హిస్టరీ, ఇంటర్నేషనల్ బిజినెస్, లిటరరీ స్టడీస్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ మేజర్స్‌గా ఈ కోర్సులు అందిస్తున్నారు. కోర్సు ఫీజు అన్నీ కలిపి ఏడాదికి సుమారు రూ.9 లక్షలు.

సింబయాసిస్

స్కూల్ ఫర్ లిబరల్ స్టడీస్, నర్సీమోంజీ, గీతం యూనివర్సిటీ, పలు సంస్థలు.. లిబరల్ విధానంలో భిన్న సబ్జెక్టుల్లో బీఏ, బీఎస్సీ కోర్సులను అందిస్తున్నాయి.

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో కన్సల్టెంట్లు

కోల్‌కతాలోని సమాచార, ప్రసారాల మంత్రిత్వ శాఖకు చెందిన సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్.. 13 కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

- కన్సల్టెంట్: 08
- అకడమిక్ కన్సల్టెంట్: 01
- అడ్మినిస్ట్రేటివ్ కన్సల్టెంట్: 01
- ఔట్‌రీచ్ ఆఫీసర్: 01
- లీగల్ అడ్వైజర్: 01
- అకడమిక్ కోఆర్డినేటర్: 01

విభాగాలు: ప్లేస్‌మెంట్, ఇంక్యుబేషన్ సెంటర్, యూజీసీ, అడ్మిన్, పబ్లిక్ రిలేషన్, అఫిషియల్ లాంగ్వేజ్, ఫైనాన్స్ అండ్ ఆడిట్, సివిల్, ఎలక్ట్రికల్, లాయర్/ లీగల్ ఫర్మ్ ఎంప్యానల్‌మెంట్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ (బీబీఏ), పీజీ (ఎంబీఏ), పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.

వేతనం: నెలకు రూ.50,000 - రూ.99,000.

వయసు: అకడమిక్/ అడ్మినిస్ట్రేటివ్ కన్సల్టెంట్ పోస్టులకు 68 ఏళ్లు; మిగతా పోస్టులకు 63 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ది డైరెక్టర్, సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్, ఈఎం బైపాస్ రోడ్, పంచశయర్, కోల్‌కతా' చిరునామాకు పంపించాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30-10-2024.

వెబ్‌సైట్: https://srfti.ac.in/

రబ్బర్ బోర్డులో యంగ్ ప్రొఫెషనల్స్

కేరళ రాష్ట్రం కొట్టాయంలోని రబ్బర్ బోర్డు 50 యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

ప్రాంతాల వారీగా: నార్త్ ఈస్టర్న్ రీజియన్ -40; ఇతర రాష్ట్రాల్లో-10

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ (అగ్రికల్చర్/ హార్టికల్చర్/ ఫారెస్ట్రీ) లేదా మాస్టర్స్ డిగ్రీ (బోటనీ/ ప్లాంట్ సైన్స్)తో పాటు పని అనుభవం.

వయసు: 30 ఏళ్లు మించకూడదు.

స్టైపెండ్: నెలకు రూ.40,000.

పని ప్రదేశాలు: దేశవ్యాప్తంగా ఉన్న రబ్బరు బోర్డు కేంద్రాల్లో ఎక్కడైనా విధులు నిర్వర్తించాలి.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13-11-2024.

వెబ్‌సైట్: https://rubberboard.gov.in/

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌లో ట్రెయినీ పోస్టులు

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) 802 డిప్లొమా ట్రెయినీ, జూనియర్ ఆఫీసర్ ట్రెయినీ మొదలైన పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



1. **డిప్లొమా ట్రెయినీ (ఎలక్ట్రికల్)–600:** ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ (పవర్)/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ పవర్ సిస్టమ్స్ ఇంజినీరింగ్/ పవర్ ఇంజినీరింగ్ (ఎలక్ట్రికల్) డిప్లొమా 70 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ/ ఎస్టీ/దివ్యాంగులు ఉత్తీర్ణులైతే సరిపోతుంది. డిప్లొమాతోపాటు బీటెక్/బీఈ/ ఎంటెక్/ఎంఈ చేసినా లేదా బీటెక్/బీఈ/ ఎంటెక్/ఎంఈ చేసినా దరఖాస్తుకు అనర్హులు.
2. **డిప్లొమా ట్రెయినీ (సివిల్)–66:** సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత. బీటెక్/బీఈ/ ఎంటెక్/ఎంఈ చేసినవారు అనర్హులు.
3. **జూనియర్ ఆఫీసర్ ట్రెయినీ (హెచ్ఆర్)–79:** మూడేళ్ల రెగ్యులర్ బీబీఏ/ బీబీఎం/ బీబీఎస్/ తత్సమాన పరీక్ష 60 శాతం మార్కులతో పాసవ్వాలి. పీజీ/పీజీ డిప్లొమా చేసినవారు అనర్హులు.
4. **జూనియర్ ఆఫీసర్ ట్రెయినీ (ఎఫ్అండ్ఏ)–35:** ఇంటర్ సీఏ/ ఇంటర్ సీఎంఏ ఉత్తీర్ణత. పీజీ/ పీజీ డిప్లొమా/ సీఏ/ సీఎంఏ చేసినవారు దరఖాస్తుకు అనర్హులు.
5. **అసిస్టెంట్ ట్రెయినీ (ఎఫ్అండ్ఏ)–22:** బీకామ్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు పాసైతే సరిపోతుంది. పీజీ/ పీజీ డిప్లొమా/ సీఏ/ సీఎంఏ చేసినవారు అనర్హులు.

12.11.2024 నాటికి వయసు 27 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు, మాజీ సైనికోద్యోగులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: అన్ని పోస్టులకూ రూ.300. అసిస్టెంట్ ట్రెయినీ (ఎఫ్అండ్ఏ) పోస్టుకు రూ.200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

ఎంపిక ఇలా..

రాత పరీక్ష/ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఆధారంగా ఎంపిక చేస్తారు. ఆబ్జెక్టివ్ విధానం. ప్రశ్నపత్రంలో రెండు పార్టులు ఉంటాయి. పార్ట్-1లో 120 ప్రశ్నలు (టీకేటీ/పీకేటీ) ఇస్తారు. డీటీఈ/డీటీసీ పోస్టులకు టెక్నికల్ నాలెడ్జ్ (టీకేటీ) ప్రశ్నలు అడుగుతారు. జేఓటీ (హెచ్ఆర్)/ అసిస్టెంట్ ట్రెయినీ (ఎఫ్అండ్ఏ) పోస్టులకు ప్రొఫెషనల్ నాలెడ్జ్ ప్రశ్నలు ఇస్తారు.

- పార్ట్-2లో 50 ఆప్టిట్యూడ్ టెస్ట్ ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ ఒకాబ్యులరీ, వెర్బల్ కాంప్రహెన్షన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, డేటా సఫిషియన్సీ అండ్ ఇంటర్‌ప్రెటేషన్, న్యూమరికల్ ఎబిలిటీ అండ్ జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.
- ప్రతిప్రశ్నకూ ఒక మార్కు. తప్పు సమాధానానికీ, ఒకటికంటే ఎక్కువ జవాబులను గుర్తించినా పావు మార్కు తగ్గిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.
- జనరల్ అభ్యర్థులు పార్ట్-1, 2ల్లో 30 శాతం చొప్పున, రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులు ప్రతి పార్ట్‌లోనూ 25 శాతం చొప్పున కనీసార్హత మార్కులు సాధించాలి.
- రాత పరీక్ష/ సీబీటీలో అర్హత సాధించినవారిని కంప్యూటర్ స్కిల్ టెస్టుకు ఎంపికచేస్తారు. ఇది అర్హత పరీక్ష మాత్రమే. దీంట్లో జనరల్ అభ్యర్థులు 50 శాతం, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 40 శాతం కనీసార్హత మార్కులు సంపాదించాలి.
- రాత పరీక్షకు 100 శాతం వెయిటేజీ ఉంటుంది. దీంట్లో సాధించిన మార్కులు, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు.

సన్నద్ధత ఎలా?

- పార్ట్-1లో టెక్నికల్ నాలెడ్జ్, ప్రొఫెషనల్ నాలెడ్జ్‌కు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. డిప్లొమా/ డిగ్రీలో చదివిన సబ్జెక్టులపై గట్టి పట్టుసాధించాలి. ముఖ్యాంశాలను పునశ్చరణ చేసుకుంటే ఈ పార్ట్‌లో ఎక్కువ మార్కులు సంపాదించొచ్చు.
- పార్ట్-2లో ఆప్టిట్యూడ్ ప్రశ్నలకు వివిధ పోటీ పరీక్షల పాత ప్రశ్న పత్రాలను సాధన చేయాలి.
- మాక్ టెస్టులు రాయడం వల్ల నిర్ణీత వ్యవధిలోగా జవాబులు రాయగలుగుతున్నారో లేదో అలాగే ఏయే అంశాల్లో వెనకబడి ఉన్నారో తెలుసుకోవచ్చు.

పరీక్ష కేంద్రాలు: దేశవ్యాప్తంగా 32 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం.

దరఖాస్తుకు చివరి తేదీ: 12.11.2024

వెబ్‌సైట్: www.powergrid.in

ఎన్‌టీపీసీలో అవకాశాలు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన 50 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

జూనియర్ ఎగ్జిక్యూటివ్ (బయోమాస్) మొత్తం ఉద్యోగాల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 22, ఈడబ్ల్యూఎస్‌లకు 5, ఓబీసీలకు 13, ఎస్సీలకు 7, ఎస్టీలకు 3 కేటాయించారు.

దరఖాస్తు చేయదలిచినవారు బీఎస్సీ (అగ్రికల్చర్ సైన్స్) పూర్తిచేసివుండాలి. ఏడాది కాలానికి ఉద్యోగంలోకి తీసుకున్నప్పటికీ.. సంస్థ అవసరాలూ, అభ్యర్థి పనితీరును బట్టి పొడిగించే అవకాశం ఉంటుంది. వయసు 28.10.2024 నాటికి 27 సంవత్సరాలు మించకూడదు. గరిష్ఠ వయసులో ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు, మాజీ సైనికోద్యోగులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు ఫీజు రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, మహిళలకు ఫీజు లేదు. ఎంపికైన వారికి నెలకు రూ.40,000 వేతనం చెల్లిస్తారు. వసతి/ హెచ్ఆర్ఏ, వ్యక్తిగత, కుటుంబ వైద్య బీమా సదుపాయాలు కల్పిస్తారు.

ఎంపిక: ఆన్‌లైన్ స్క్రీనింగ్/ షార్ట్‌లిస్టింగ్/ సెలక్షన్ టెస్టుల ద్వారా అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ఈ పోస్టుకు ఎంపికైనవారు... జంతువులూ, వృక్షాల వ్యర్థాల నుంచి తయారయ్యే బయోగ్యాస్‌పై రైతులూ, ఇతర ప్రజలకూ అవగాహన కల్పిస్తారు.

▲ ఎన్‌టీపీసీ స్టేషన్లు/ ప్రాజెక్టులు/ జేవీఎస్/ సబ్సిడరీలు/ ఆఫీసుల్లో ఎక్కడైనా నియమిస్తారు. దేశంలో ఎక్కడైనా పనిచేయడానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28.10.2024

వెబ్‌సైట్: www.ntpc.co.in

చదువు

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీ సందేహాలు మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

మార్కెటింగ్
సంస్థ: కాంటిలీవర్ ల్యాబ్స్
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.6,000
☛ internshala.com/i/23d89c

రిజల్‌లో

1. కంటెంట్
నైపుణ్యాలు: వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ.15,000
☛ internshala.com/i/125ff0

2. వీడియో ఎడిటింగ్/ మేకింగ్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.15,000
☛ internshala.com/i/90844c

సికం కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రై.లి.లో

1. హ్యూమన్ రిసోర్సెస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హెచ్ఆర్ అనలిటిక్స్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్, నెగోషియేషన్ అండ్ ప్రాబ్లమ్-సాల్వింగ్
స్టైపెండ్: రూ.8,000-12,000
☛ internshala.com/i/61703d

2. ఫైనాన్షియల్ అకౌంటెంట్
నైపుణ్యాలు: అకౌంటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, గూగుల్ సూట్ (జీ సూట్), ఎంఎస్-ఆఫీస్, ట్యాలీ
స్టైపెండ్: రూ.8,000-12,000
☛ internshala.com/i/134209

కంటెంట్ క్రియేటర్
సంస్థ: మల్టీవే
నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్, కంటెంట్, సోషల్ మీడియా మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.8,000-12,000
☛ internshala.com/i/64f2f6

వీటికి దరఖాస్తు గడువు: నవంబరు 14

మార్కెటింగ్
సంస్థ: లోయల్ డ్రీమ్స్
నైపుణ్యాలు: మార్కెటింగ్, సేల్స్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: నవంబరు 9
☛ internshala.com/i/9e00ef

ఎల్1 సపోర్ట్
సంస్థ: టురిటో
నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్, సీఆర్ఎం, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.15,000
దరఖాస్తు గడువు: నవంబరు 16
☛ internshala.com/i/ed807a

హైదరాబాద్, విజయవాడల్లో

యూఐ/యూఎక్స్ డిజైన్
సంస్థ: టెక్‌వర్క్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వైర్‌ఫ్రేమింగ్ స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: నవంబరు 15
☛ internshala.com/i/800ab9

హైదరాబాద్, సికింద్రాబాద్‌ల్లో

బిజినెస్ డెవలప్‌మెంట్ ట్రెయినీ
సంస్థ: 8వ్యూస్
నైపుణ్యం: బిజినెస్ డెవలప్‌మెంట్
స్టైపెండ్: రూ.6,000-10,000
దరఖాస్తు గడువు: నవంబరు 7
☛ internshala.com/i/e2143b

విజయవాడలో

కంపెనీ సెక్రటరీ (సీఎస్)
సంస్థ: మార్లండ్ లీగల్ అడ్వైజర్స్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: నవంబరు 13
☛ internshala.com/i/7b6d29

విశాఖపట్నంలో

మార్కెటింగ్
సంస్థ: ప్రో గేమర్
నైపుణ్యం: మార్కెటింగ్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: నవంబరు 15
☛ internshala.com/i/f4073f

సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: క్లౌడ్‌ఐ టెక్నాలజీస్ ఇండియా ప్రై.లి. నైపుణ్యాలు: అడోబ్ ప్రీమియర్ ప్రో, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డ్‌ఇన్ మార్కెటింగ్, గూగుల్ యాడ్‌వర్డ్స్
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: నవంబరు 16
☛ internshala.com/i/67960f

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



■ భారత నౌకాదళానికి చెందిన ఏ యుద్ధ నౌక 2024, ఆగస్టులో మధ్యధరా సముద్రంలో స్పానిష్ నేవీ షిప్ అటాలయాతో మారిటైమ్ పార్టనర్‌షిప్ ఎక్సర్‌సైజ్ (ఎమ్ పీ ఎక్స్)లో పాల్గొంది. **జ:** ఐఎన్‌ఎస్ తాబర్

■ పసిఫిక్ ఆసియా ట్రావెల్ అసోసియేషన్ (పీఏటీఏ) గోల్డ్ అవార్డు - 2024ను భారత్‌కు చెందిన ఏ రాష్ట్రం గెలుచుకుంది? (బ్యాంకాక్‌లో జరిగిన పాటా ట్రావెల్ మార్ట్ - 2024లో ఈ అవార్డును ప్రదానం చేశారు. 'పాటా' అనేది పర్యాటక రంగంలో ప్రసిద్ధి చెందిన సంస్థ.) **జ:** కేరళ

■ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ఇటీవల ఎవరికి 'యూత్ ఐకాన్స్ ఆఫ్ ఇండియా' పురస్కారాన్ని ప్రదానం చేసింది?

జ: బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, జావెలిన్ త్రో క్రీడాకారుడు నీరజ్ చోప్రా.

■ ఆఫ్రికన్ సంతతి ప్రజల కోసం అంతర్జాతీయ దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు? (ఈ దినోత్సవాన్ని మొదటిసారిగా 2021లో నిర్వహించారు. ఆఫ్రికన్ సంతతి ప్రజల కోసం అంతర్జాతీయ దశాబ్దంగా 2015 - 2024ను నిర్వహించారు.) **జ:** ఆగస్టు 31

■ పర్యాటక రంగంలో సహకారాన్ని బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఇటీవల భారత్‌తో ఏ దేశం ఒప్పందం చేసుకుంది? **జ:** మలేసియా

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్


పాఠాలకు సంబంధించిన క్లిష్టమైన భావనలను అర్థం చేసుకోడానికి, గైడెన్స్ కోసం ఇప్పుడు యాప్‌లు, యూట్యూబ్ లేదా ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల్లో ఉన్న వీడియోలు, మెటీరియల్‌ను ఉపయోగించుకోవచ్చు.

డీఎస్సీ - 2024
హిందీ కంటెంట్

రసాయన విలువ మారితే రంగుల్లో తేడాలు!

జనరల్ స్టడీస్
రసాయన శాస్త్రం

పదార్థ లక్షణాలు, రుచుల ఆధారంగా ద్రావణాలను ఆమ్లాలు, క్షారాలుగా విభజిస్తారు. సాధారణంగా ఒక పదార్థం ఆమ్లమా లేదా క్షారమా అని నిర్ణయించడానికి సహజ, రసాయన, ఘ్రాణ సూచికలు అవసరమవుతాయి. కానీ ఒక పదార్థం బలమైన, బలహీనమైన ఆమ్లం లేదా క్షారం అని తెలుసుకోవడానికి ఆ సూచికలు ఉపయోగపడవు. ఆమ్ల, క్షారాల మధ్య తేడాను గుర్తించడానికి కావాల్సిన సూచికలు ఏమిటి, వాటిని ఎలా వాడాలి అనే కనీస రసాయన శాస్త్ర పరిజ్ఞానం పోటీ పరీక్షార్థులకు ఉండాలి. వివిధ ద్రావణాలు, నేల, నీరు, మానవ దేహంలోని ఆమ్ల, క్షారాలు; వాటి విలువలు, అవి సమతాస్థితిని కోల్పోతే వచ్చే సమస్యలు, సరిచేయడానికి కావాల్సిన సహజ పదార్థాలు, రసాయన ఔషధాల గురించి నిజజీవిత అనువర్తనాలతో సహా తెలుసుకోవాలి.





మట్టి రసాయన విశ్లేషణలో pH విలువ పరీక్ష

ఆమ్లాలు - క్షారాలు

ఒక పదార్థం బలమైన/బలహీనమైన ఆమ్లమా, క్షారమా అని నిర్ణయించడానికి సార్వత్రిక ఆమ్ల క్షార సూచిక (యూనివర్సల్ యాసిడ్ బేస్ ఇండికేటర్) ఉపయోగిస్తారు.

సార్వత్రిక ఆమ్ల క్షార సూచిక: ఇది అనేక సూచికల మిశ్రమం. ఇది ద్రావణంలో ఉన్న హైడ్రోజన్ అయాన్ల గాఢత ఆధారంగా బలమైన, బలహీనమైన ఆమ్ల, క్షారాలను గుర్తిస్తుంది. ఈ సూచిక ద్రావణంలోని హైడ్రోజన్ అయాన్ల గాఢత ఆధారంగా వేర్వేరు రంగులను ప్రదర్శిస్తుంది. ఒక ద్రావణంలోని హైడ్రోజన్ అయాన్ల గాఢతను కొలవడానికి pH స్కేల్‌ను 'సోరెన్‌సన్' అభివృద్ధి చేశారు. జర్మన్ భాషలో pHలో p ని పొటెన్జ్/సామర్థ్యం అని అంటారు.

◆ pH స్కేల్‌లో pH అనేది ద్రావణ ఆమ్ల లేదా క్షార స్వభావాన్ని సూచించే ఒక సంఖ్యగా భావించాలి. pH విలువలతో సాధారణంగా 0 నుంచి 14 వాటి వరకు ఆమ్ల, క్షార స్వభావాలను కొలవవచ్చు. హైడ్రోనియం అయాన్ గాఢత ఎక్కువగా ఉంటే pH విలువ తక్కువగా ఉంటుంది.



pH స్కేలు

◆ pH స్కేలుపై 7 కంటే తక్కువ విలువలు (pH < 7) ఆమ్ల ద్రావణాన్ని సూచిస్తాయి.

◆ pH స్కేలుపై 7 కంటే ఎక్కువ విలువలు (pH > 7) క్షార ద్రావణాన్ని సూచిస్తాయి.

◆ తటస్థ ద్రావణాల pH విలువ 7. సాధారణ pHను కొలవడానికి సార్వత్రిక సూచికలో నానబెట్టిన కాగితాన్ని ఉపయోగిస్తారు.

వరుసగా ఉత్పత్తి చేసిన H^+, OH^- అయాన్ల సంఖ్యపై ఆమ్లాలు, క్షారాల బలం ఆధారపడి ఉంటుంది. ఒక మోలార్ గాఢత ఉన్న హైడ్రోక్లోరిక్ ఆమ్లం, ఎసిటిక్ ఆమ్లం తీసుకుంటే, అప్పుడు అవి వేర్వేరు మొత్తాల్లో హైడ్రోజన్ అయాన్లను ఉత్పత్తి చేస్తాయి. ఎక్కువ H^+ అయాన్లను ఇచ్చే ఆమ్లాలను 'బలమైన ఆమ్లాలు'గా, తక్కువ H^+ అయాన్లను ఇచ్చే ఆమ్లాలను 'బలహీన ఆమ్లాలు' పేర్కొంటారు.

నిత్యజీవితంలో pH ప్రాముఖ్యం: శరీరంలోని రసాయనాల pH విలువలు 7.0 - 7.8 పరిధిలో ఉంటాయి. జీవరాశులన్నీ pH విలువలోని అతిస్వల్ప మార్పులకు గురై మాత్రమే జీవించగలుగుతాయి. వర్షపు నీటి pH విలువ 5.6 కంటే తక్కువైతే దాన్ని 'ఆమ్ల వర్షం' అంటారు. ఆమ్ల వర్షపు నీరు నదీ జలాల్లో కలిసినప్పుడు ఇది నదీ జలాల pH విలువను కూడా తగ్గించడం వల్ల నదుల్లోని జలచరాల జీవనం ప్రమాదంలో పడుతుంది.

❖ సల్ఫ్యూరిక్ ఆమ్లానికి చెందిన మందపాటి తెలుపు, పసుపురంగు మేఘాలతో శుక్ర గ్రహ వాతావరణం ఉంటుంది.

పెరటిలోని మట్టి pH విలువ: మొక్కల ఆరోగ్యకరమైన పెరుగుదలకు నిర్దిష్ట పరిధిలో pH ఉన్న మట్టి చాలా అవసరం. నేల స్వభావం అధిక ఆమ్ల స్వభావం లేదా అధిక క్షార స్వభావంతో ఉండకూడదు. తటస్థ స్వభావం ఉన్న నేల పంటలకు అనుకూలంగా ఉంటుంది. నేల స్వభావం ఆమ్లత్వానికి గురైతే దాన్ని తటస్థీకరించడానికి క్షార స్వభావం ఉండే పొడిసున్నం లేదా తడిసున్నం లేదా క్యాల్షియం కార్బొనేట్‌ను ఉపయోగించాలి. అలాగే నేల స్వభావం క్షారత్వానికి గురైతే దాన్ని తటస్థీకరించడానికి సేంద్రియ ఎరువులు (కంపోస్టు) వాడాలి.

❖ హైడ్రాంజియా అనే మొక్క పెరిగే నేల pH విలువ ఆధారంగా రంగు రంగుల పుష్పాలను ఇస్తుంది. ఈ మొక్క పెరిగే నేల pH విలువ 6.5 కంటే ఎక్కువ ఉంటే గులాబీ (పింక్) రంగు పుష్పాలు, 5.5 కంటే తక్కువ ఉంటే నీలం రంగు పుష్పాలు ఇస్తుంది.

జీర్ణవ్యవస్థ pH: మనిషి జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఉత్పత్తి అవుతుంది. ఇది జీర్ణాశయానికి నష్టం కలిగించకుండా ఆహారాన్ని జీర్ణం చేయడంలో ఉపయోగపడుతుంది. అజీర్తి సమయంలో జీర్ణాశయం అధిక పరిమాణంలో ఆమ్లాన్ని ఉత్పత్తి చేయడం వల్ల కడుపులో మంట, అసహనం కలుగుతాయి. ఈ బాధ నుంచి విముక్తి పొందడానికి యాంటాసిడ్‌గా పిలిచే బలహీన క్షారాలను ఉపయోగిస్తారు. యాంటాసిడ్‌లు అధికమైన ఆమ్లాన్ని తటస్థీకరిస్తాయి. ఇందు కోసం సాధారణంగా మెగ్నీషియం హైడ్రాక్సైడ్/ మిల్క్ ఆఫ్ మెగ్నీషియాగా పిలిచే బలహీన క్షారాన్ని ఉపయోగిస్తారు.

దంత క్షయానికి pH మార్పు: లాలాజలం pH విలువ 5.5 కంటే తగ్గితే దంత క్షయం ప్రారంభమవుతుంది. దీనివల్ల శరీరంలోనే అత్యంత దృఢమైన ఎనామిల్ పొర క్షయానికి గురవుతుంది. ఈ సందర్భంలో చల్లని/వెచ్చని పదార్థాలు దంతాలకు తాకినప్పుడు జివ్వుమనే బాధ కలుగుతుంది. ఈ బాధ నుంచి ఉపశమనం పొందడానికి బలహీన క్షారస్వభావం ఉండే టూత్‌పేస్ట్‌ను ఉపయోగించాలి.

రసాయన యుద్ధం ద్వారా జంతువులు, మొక్కల స్వీయ రక్షణ: తేనెటీగ కుట్టినప్పుడు మానవ శరీరంలోకి మిథనోయిక్ ఆమ్లం విడుదలవుతుంది. దీనివల్ల కలిగే నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి బేకింగ్ సోడాను ఉపయోగిస్తారు. అలాగే చీమ కుట్టినప్పుడు మానవ శరీరంలోకి ఫార్మిక్ ఆమ్లం విడుదలవుతుంది. దీనివల్ల ఏర్పడే నొప్పి నుంచి ఉపశమనానికి బేకింగ్ సోడా/కాలమైన్ వాడతారు. దూలగొండి మొక్క శరీరాన్ని తాకితే అది శరీరంలోనికి మిథనోయిక్ ఆమ్లం విడుదల చేస్తుంది. దీనివల్ల కలిగే దురద, మంటను నివారించడానికి బలహీన క్షారస్వభావం ఉన్న దుష్టిపాకు ఉపయోగించాలి. కందిరీగ కుట్టినప్పుడు మన శరీరంలోకి క్షారం విడుదలవుతుంది. దీని నుంచి ఉపశమనానికి బలహీన ఆమ్ల స్వభావం ఉండే నిమ్మరసాన్ని వినియోగించాలి.

ముఖ్యమైన పదార్థాలు, వాటి pH విలువలు: ✦ స్వేదజలం - 7 ✦ సముద్రపు నీరు - 8 ✦ వంటసోడా - 8.2 ✦ అమ్మోనియం - 11.2 ✦ మిల్క్ ఆఫ్ మెగ్నీషియా -10.6 ✦ పాలు - 6.6 ✦ రక్తం - 7.4 ✦ కాఫీ - 4.8 ✦ వెనిగర్ - 3 ✦ సోడానీరు - 2.4 ✦ నిమ్మరసం - 2.2 ✦ H_2SO_4 - 0.2 ✦ గ్యాస్ట్రిక్ రసం - 1.2 ✦ NaOH ద్రావణం - 14.



రచయిత: చంటి రాజుపాలెం

జూనియర్ ఇంటర్ - జంతు శాస్త్రం



జీవుల నుంచే జీవుల ఆవిర్భావం

ప్రశ్నలు జవాబులు

2 మార్కులు **జీవ ప్రపంచ వైవిధ్యం**

1) బయోజెనిసిస్ అంటే ఏమిటి?

జ: 'జీవం లేదా జీవులు అంతకు ముందున్న జీవం లేదా జీవుల నుంచి మాత్రమే ఉద్భవిస్తాయి, నిర్జీవుల నుంచి కాదు.' అని తెలిపే జీవ పరిణామ సిద్ధాంతమే 'బయోజెనిసిస్'.

2) కణజాల శాస్త్రాన్ని నిర్వచించండి. దీనికి ఉన్న మరో పేరు ఏమిటి?

జ: జీవిలోని వివిధ కణజాలాలకు సంబంధించిన సూక్ష్మ అధ్యయనాన్ని కణజాల శాస్త్రం అంటారు. దీన్ని 'సూక్ష్మ అంతర్నిర్మాణ శాస్త్రం' అని కూడా అంటారు.

3) త్రినామ నామీకరణ అంటే ఏమిటి? ఉదాహరణ ఇవ్వండి.

జ: ఒక జీవికి మూడు పదాలున్న శాస్త్రీయ నామాన్ని ప్రతిపాదించే విధానాన్ని 'త్రినామ నామీకరణ' అంటారు.

ఉదా: హోమో సెపియన్స్ సెపియన్స్

ఒక త్రినామంలో మొదటి పదం ప్రజాతిని, రెండో పదం జాతిని, మూడో పదం ఉపజాతిని సూచిస్తాయి.

4) టాటోనిమీ అంటే ఏమిటి? రెండు ఉదాహరణలు ఇవ్వండి.

జ: ఒక జీవికి ప్రతిపాదించిన ద్వినామంలో ప్రజాతి నామం, జాతి నామం ఒకే విధంగా ఉండేలా నామీకరణం జరిగే విధానాన్ని టాటోనిమీ అంటారు. **ఉదా:** నాజా నాజా - నాగుపాము, ఎక్సిస్ ఎక్సిస్ - మచ్చల జింక

5) ICZN ను విపులీకరించండి.

జ: ICZN అంటే 'అంతర్జాతీయ జంతు నామీకరణ నియమావళి'.

విపులీకరణ: 'ఇంటర్నేషనల్ కోడ్ ఆఫ్ జువాలాజికల్ నామెన్‌క్లేచర్'.

6) జాతి సమృద్ధతను నిర్వచించండి.

జ: ఒక నిర్దిష్ట వైశాల్యం ఉన్న భూభాగంలో నివసించే జాతుల సంఖ్యను జాతి సమృద్ధత అంటారు.

$\log S = Z \log A + \log C$

S = జాతి సమృద్ధత

A = వైశాల్యం

C = Y అంతర ఖండం

Z = రేఖ వాలు

ముఖ్యమైనవి మరికొన్ని..

(2 మార్కులు)

జవాబుల కోసం

1) ప్రోటోస్టోమియా, డ్యుటిరోస్టోమియాలను విభేదీకరించండి.

2) ప్రకృతి నుంచి లభించే ఏవైనా రెండు ఔషధాలను పేర్కొనండి.

3) భారతదేశంలోని ఏవైనా నాలుగు పావన వనాలను పేర్కొనండి.

4) IUCN ను విపులీకరించండి. అంతరించిపోతున్న జాతుల పట్టికను ఏ పుస్తకంలో ఇస్తారు?

- కె. రవిచరణ్

SUBSCRIBE CHANNEL

ఆ విలక్షణ సమాజాల్లో వర్గభేదాలు తక్కువ!

భారతీయ సమాజంలో భిన్నత్వంలో ఏకత్వం లాంటి గొప్ప భావనలతోపాటు సామాజికంగా, ఆర్థికంగా కొన్ని వర్గాల్లో వెనుకబాటుతనం కూడా కనిపిస్తుంది. అభివృద్ధి క్రమంలో లోపించిన సమతూకం కారణంగా అవకాశాలను అందుకోవడంలో ఆ వర్గాలు వివక్షను ఎదుర్కొంటున్నాయి. భారతీయ మూలాలకు ప్రతినిధులైన ఆదివాసీలూ అందులో ప్రముఖంగా ఉన్నారు. గనులు, మైనింగ్ కారణంగా మనుగడ ముప్పు ఎదుర్కొంటూ వారు స్థానభ్రంశానికి గురవుతున్నారు. దేశవ్యాప్తంగా ఆదివాసీల స్థితిగతులు, విశ్వాసాలు, ఉపాధిమార్గాలు, జీవన విధానం, అడవులతో వారికి ఉన్న అనివాభావ అనుబంధం, రాష్ట్రాలు, ప్రాంతాల వారీగా ఉన్న ఆదివాసీ తెగలు, ప్రత్యేకతలతో పాటు వీరి రక్షణ కోసం ఉన్న చట్టాలు, రాజ్యాంగ ఏర్పాట్ల గురించి పోటీ పరీక్షార్థులకు తగిన అవగాహన ఉండాలి. దేశంలోని వివిధ సమాజాల స్థితిగతులు, ముస్లిం సమాజంలో వెనుకబాటుతనాన్ని సూచించే గణాంకాలను తెలుసుకోవాలి.



డీఎస్సీ - 2024 పౌర శాస్త్రం

వివక్షను అర్థం చేసుకుందాం

1. కిందివాటిలో ఆదివాసీలకు సంబంధించిన సరైన జవాబులు గుర్తించండి.
   ఎ) 'ఆదివాసీలు' అనే పదానికి సరైన అర్థం మూలవాసులు.
   బి) గిరిజనులను 'ఆదివాసీలు' అని కూడా అంటారు.
   సి) భారత ప్రభుత్వం వివిధ అధికారిక పత్రాల్లో 'ఆదివాసీ' అనే పదానికి బదులుగా 'షెడ్యూల్డ్ తెగలు' అనే పదాన్ని వాడుతోంది.
   డి) ఆదివాసీలు సాధారణంగా అటవీ ప్రాంతాల్లో లేదా వాటికి సమీపంలో నివసిస్తూ అడవులతో అవినాభావ సంబంధం కలిగి ఉంటారు.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

2. దాదాపు 60 విభిన్న జాతుల ఆదివాసీ సమూహాలకు ఆవాసంగా ఉన్న రాష్ట్రం ఏది?
   1) బిహార్ 2) ఛత్తీస్‌గఢ్
   3) ఒడిశా 4) మిజోరం

3. ఆదివాసీల వివరణకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భారతదేశ జనాభాలో దాదాపు 8% ప్రజలు ఆదివాసీలు.
   బి) భారతదేశంలోని ప్రముఖ ఖనిజ పారిశ్రామిక కేంద్రాలన్నీ ఆదివాసీ ప్రాంతాల్లోనే ఉన్నాయి.
   సి) భారతదేశంలో దాదాపు 500 విభిన్న ఆదివాసీ జాతులున్నాయి.
   డి) హరియాణాలో 72 ఆదివాసీ జాతులున్నాయి.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

4. కిందివాటిలో ఆదివాసీల సామాజిక జీవనానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఆదివాసీ సమాజాలు చాలా విలక్షణమైనవి. వీటిలో వర్గభేదాలు చాలా తక్కువ.
   బి) ఆదివాసీ సమాజాలు కుల సమూహాలకు, రాజుల పాలనలోని సమూహాలకు భిన్నంగా ఉంటాయి.
   సి) ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, మణిపుర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఆదివాసీ జనాభా అధికంగా ఉంది.
   డి) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఆదివాసీ జనాభా ఎక్కువగా ఉంది.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

5. ఆదివాసీల మతవిశ్వాసానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఇస్లాం, హిందూ, క్రైస్తవ మతాలకు భిన్నంగా గిరిజన మతాలను ఆచరిస్తారు.
   బి) పితృ దేవతారాధన, గ్రామ ప్రకృతి శక్తుల ఆరాధన చేస్తారు.
   సి) పర్వతారాధన, నదీ ఆరాధన, జంతువుల ఆరాధన చేస్తారు.
   డి) గ్రామ దేవతలను గ్రామం మధ్యలో నిలిపి పూజిస్తారు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి



6. ఆదివాసీలు 19వ శతాబ్దంలో ఏ మతంలోకి గణనీయంగా మారారు?
   1) బౌద్ధ 2) జైన 3) క్రైస్తవ 4) భక్తి

7. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఆదివాసీల్లో ఎక్కువ మంది 'సంథాలి' భాష మాట్లాడతారు.
   బి) 19వ శతాబ్దం వరకు భారతదేశపు అధిక శాతం భూభాగం అడవులతో ఉండేది.
   సి) 19వ శతాబ్దపు మధ్యవరకు ఆదివాసీలకు అడవుల గురించి లోతైన పరిజ్ఞానం ఉండేది.
   డి) ఒడిశాలోని ఆదివాసీలు జగన్నాథుడిని ఆరాధిస్తారు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

8. ఏ ప్రాంతంలోని ఆదివాసీలు 1830లలో భారతదేశంలో, ప్రపంచంలోని వివిధ తోటలకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు?
   1) ఝార్ఖండ్ 2) దిబ్రూగఢ్
   3) ముర్షిదాబాద్ 4) హుగ్లీ

9. ఇచ్చిన అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఆదివాసీల శ్రమ ఫలితంగా భారతదేశ 'టీ' పరిశ్రమ అస్సాంలో నెలకొంది.
   బి) నేడు అస్సాంలోనే దాదాపు 70 లక్షల మంది ఆదివాసీలున్నారు.
   సి) 19వ శతాబ్దంలో 5 లక్షల మంది వలస వెళ్లిన ఆదివాసీలు మరణించారు.
   డి) 20వ శతాబ్దం ముగిసే నాటికి దేశ జనాభాలో ఆదివాసీల జనాభా 2% ఉంది.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

10. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఒడిశాలోని కలహండి జిల్లాలో 'నియంగిరి కొండ' ఉంది.
   బి) 'నియంగిరి కొండ' ప్రాంతంలో 'దోంగారియా కోండ్స్' అనే ఆదివాసీ సమాజం నివసిస్తోంది.
   సి) దోంగారియా కోండ్స్ సమాజానికి నియంగిరి ఒక పవిత్ర పర్వతం.
   డి) నియంగిరి కొండ ప్రాంతంలో అల్యూమినియం ఖనిజ నిక్షేపాలున్నాయి.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

11. కిందివాటిలో ఆదివాసీలు ఉపయోగించే వృక్షజాతులకు సంబంధించి సరైన జవాబు గుర్తించండి.
   ఎ) ఆదివాసీలు సుమారు 10,000 వృక్షజాతులను ఉపయోగిస్తారు.
   బి) ఔషధ ప్రయోజనాల కోసం 8000 జాతులను ఉపయోగిస్తున్నారు.
   సి) పురుగు మందుల తయారీ కోసం 325 జాతులను ఉపయోగిస్తారు.
   డి) సుగంధ ద్రవ్యాల తయారీ కోసం 398 జాతులను ఉపయోగిస్తారు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

12. ఆదివాసీలు ఉపయోగించే వృక్షజాతులకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) జిగుర్లు, రెసిన్లు, రంగుల కోసం 425 వృక్ష జాతులను ఉపయోగిస్తున్నారు.
   బి) పీచులుగా 550 వృక్ష జాతులను వినియోగిస్తున్నారు.
   సి) ఆహారానికి 3500 వృక్ష జాతులను ఉపయోగిస్తున్నారు.
   డి) అధికారిక లెక్కల ప్రకారం గనులు, మైనింగ్ ప్రాజెక్టుల కారణంగా 50 శాతానికి పైగా గిరిజనులు స్థానభ్రంశం చెందారు.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

13. ఏ ప్రాంతంలో అధిక శాతం అటవీ భూములు సైనికీకరణకు గురయ్యాయి?
   1) వాయవ్య భారతదేశం 2) ఈశాన్య భారతదేశం
   3) దక్షిణ భారతదేశం 4) మధ్య భారతదేశం

14. ఆదివాసీల మధ్య పనిచేసే సంస్థలు జరిపిన సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఝార్ఖండ్‌ల నుంచి నిర్వాసితులైనవారిలో గిరిజనులు ఎంతశాతం ఉన్నారు?
   1) 22% 2) 37% 3) 55% 4) 79%

15. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భారతదేశంలో 40,564 చ.కి.మీ. విస్తీర్ణంలో 104 జాతీయ పార్కులున్నాయి.
   బి) 1,19,776 చ.కి.మీ. విస్తీర్ణంలో 543 వన్యప్రాణి అభయారణ్యాలున్నాయి.
   సి) 75,162 చ.కి.మీ. విస్తీర్ణంలో 192 జాతీయ ఆనకట్టలున్నాయి.
   డి) తమ భూములపై నియంత్రణ కోల్పోవడం అంటే గిరిజనులు వారి జీవనోపాధిని, ఆహార వనరులను కోల్పోవడమే.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

16. భారతదేశంలో గిరిజన సమాజాల పేదరికానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   1) గ్రామీణ ప్రాంతాల్లో 32%, పట్టణ ప్రాంతాల్లో 21% దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.
   2) గ్రామీణ ప్రాంతాల్లో 29%, పట్టణ ప్రాంతాల్లో 19% దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.
   3) గ్రామీణ ప్రాంతాల్లో 45%, పట్టణ ప్రాంతాల్లో 35% దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.
   4) గ్రామీణ ప్రాంతాల్లో 41%, పట్టణ ప్రాంతాల్లో 29% దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.

17. "వారు మా వ్యవసాయ భూమిని తీసుకున్నారు. శ్మశానవాటిక, గుడి, బావి, చెరువులను తీసేసుకున్నారు. మేం ఎలా బతకాలి?" అని ఒడిశాలోని రిఫైనరీ ప్రాజెక్టు కోసం స్థానభ్రంశం చెందిన ఎవరు వాపోయారు?
   1) గోవింద మారన్ 2) రణవ్ చోటి
   3) ప్రగ్యా దివ్య 3) నాయక్ మారో

18. కిందివాటిలో 'మైనారిటీ'లకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) మైనారిటీ అనే పదం జనాభాలో తక్కువ సంఖ్యాబలం ఉండే వర్గాలను సూచిస్తుంది.
   బి) మత, భాషాపరమైన మైనార్టీలకు ప్రాథమిక హక్కుల ద్వారా రక్షణ కల్పించారు.
   సి) మెజార్టీ ప్రజల సాంస్కృతిక ఆధిపత్యం నుంచి మైనారిటీ సమూహాలను కాపాడటానికి రక్షణ అవసరం.
   డి) చట్టాన్ని అమలు పరచడంలో, ప్రాథమిక హక్కులు కాపాడటంలో న్యాయవ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుంది.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

19. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభాలో 'ముస్లిం'లు ఎంత శాతం ఉన్నారు?
   1) 13.5 2) 14.2 3) 17.4 4) 21.5

20. భారత మానవాభివృద్ధి నివేదిక, 2011 ప్రకారం వివిధ మత సమూహాల 'పక్కా ఇల్లుకు' సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) హిందూ - 65.4% బి) ముస్లిం - 63.8%
   సి) క్రైస్తవ - 69.3% డి) సిక్కు - 91.3%
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

21. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో వివిధ మత సమూహాల అక్షరాస్యత శాతానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భారతదేశంలో అక్షరాస్యత శాతం - 74%.
   బి) హిందూ సమాజం - 63%, ముస్లిం సమాజం - 57%, క్రైస్తవ సమాజం - 74%.
   సి) సిక్కు సమాజం - 67%, బౌద్ధ సమాజం - 71%, జైన సమాజం - 86%.
   డి) పారశీక సమాజం - 51%, జొరాస్ట్రియన్ సమాజం - 63%.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

22. ముస్లిం సమాజ సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతుల్ని అధ్యయనం చేసేందుకు భారత ప్రభుత్వం 2005లో ఎవరి అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది?
   1) జస్టిస్ అరవింద్ మిశ్రా
   2) జస్టిస్ భూపేంద్రపాల్
   3) జస్టిస్ రాజేందర్ సచార్
   4) జస్టిస్ అరుణ్ రాయ్



రచయిత: బంగారు సత్యనారాయణ


సమాధానాలు

1-4, 2-3, 3-1, 4-4, 5-1, 6-3, 7-4, 8-1, 9-3, 10-4, 11-1, 12-4, 13-2, 14-4, 15-1, 16-3, 17-1, 18-4, 19-2, 20-4, 21-1, 22-3.

మానవ వనరుల అభివృద్ధి - మానవాభివృద్ధి సూచిక

మానవ వనరుల అభివృద్ధి భావన

"విద్యపై పెట్టిన పెట్టుబడి జాతీయ పెట్టుబడితో సమానం. అన్ని రకాల పెట్టుబడుల కంటే మానవ వనరులపై పెట్టుబడి చాలా విలువైంది." - ఆల్ఫ్రెడ్ మార్షల్, బ్రిటిష్ ఆర్థికవేత్త



థియోడర్ భావన

"విద్యపై పెట్టుబడి పెడితే మూలధన సమీకరణ పెరుగుతుంది. కేవలం నైపుణ్యం, చదువు లేని శ్రామికుల సహాయంతో ఉత్పత్తి కొనసాగిస్తే అది ఉపద్రవంగా ప్రస్తుత స్థాయి నుంచి తగ్గుతుంది."

- థియోడర్ డబ్ల్యు షుల్ట్జ్, అమెరికన్ ఆర్థికవేత్త

మానవుడి ఉత్పాదక శక్తిని పెంచే చర్య ఏదైనా మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్న షుల్ట్జ్, అందుకు అనుగుణంగా అయిదు ప్రతిపాదనలు చేశారు. అవి:

1. ఆరోగ్య సదుపాయాలు, సేవలు, ప్రజల ఆయుష్షు, శక్తి - సామర్థ్యం, బలం, సజీవత్వాన్ని ప్రభావితం చేసే వ్యయాలు.
2. సంస్థలు నిర్వహించే అప్రెంటిస్‌షిప్, ఉద్యోగులకు ఇచ్చే శిక్షణ.
3. ప్రాథమిక, సెకండరీ, ఉన్నత స్థాయిలో లాంఛనప్రాయంగా నిర్వహించే విద్య.
4. సంస్థలు నిర్వహించని విద్యా పథకాలు, వ్యవసాయ రంగంలో విస్తరణ కార్యకలాపాలు.
5. మారుతున్న ఉద్యోగ అవకాశాలకు సర్దుబాటు అయ్యేలా వ్యక్తులు, కుటుంబ వలస.



అమర్త్యసేన్ అభిప్రాయం

"విద్యని ఆస్తిగా పరిగణిస్తారు. దీని ద్వారానే వ్యక్తుల అర్హత అవకాశాలు పెరుగుతాయి." - అమర్త్యసేన్

మానవ వనరుల అభివృద్ధికి ఇవ్వాల్సిన ప్రాముఖ్యతను అమర్త్యసేన్ కూడా వివరించారు. దీనికి అర్హత, సామర్థ్య సిద్ధాంతాలను ఉపయోగించారు.

❖ సామర్థ్యం ఒకరి సంక్షేమ లేదా ఆరోగ్య స్థితిని తెలుపుతుంది. ఒక ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఆరోగ్యవంతులు ఎక్కువగా తోడ్పడతారు. ముఖ్యంగా స్త్రీలు తమ ఆరోగ్యానికి సంబంధించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఆర్థికాభివృద్ధిలో మానవ వనరుల పాత్ర

ఆర్థికాభివృద్ధిలో మానవ వనరుల అభివృద్ధి ముఖ్యపాత్ర పోషిస్తుంది. భౌతిక మూలధనాన్ని సమర్థవంతంగా ఉపయోగించడం అనేది వీటిపైనే ఆధారపడి ఉంటుంది. దీనికోసం సాంకేతిక వృత్తి, పరిపాలనా సంబంధ నిపుణులు అవసరం. అందుకే మానవ వనరుల అభివృద్ధికి ఎక్కువ పెట్టుబడి పెట్టాలి.

◆ మానవ వనరులు అభివృద్ధి చెందని దేశాల్లోని సాధారణ ప్రజలు నిరక్షరాస్యులుగా లేదా తక్కువ చదువుకున్న వారిగా, నైపుణ్యం లేకుండా, అనారోగ్యంతో ఉంటారు.

◆ మానవ వనరుల అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి ప్రక్రియ రెండూ జంటగా పనిచేయడమే కాకుండా ఒకదాన్ని మరొకటి ప్రభావితం చేసుకుంటాయి.

◆ మానవ వనరుల అభివృద్ధికి విద్య, నైపుణ్య శిక్షణ ముఖ్యం.

"ఆర్థికవృద్ధి కోరుకునేవారు కేవలం ఆదాయ విస్తరణ అనే ఒక్క అవకాశాన్ని తీసుకుంటే; మానవ అభివృద్ధి వాదులు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయపరమైన మానవ అవకాశాలను తీసుకుంటారు."



- మహబూబ్-ఉల్-హక్



స్థూల జాతీయోత్పత్తికి ప్రత్యామ్నాయమే..

మానవాభివృద్ధి సూచిక!

ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

మానవ అభివృద్ధి నివేదిక 2023-24

ఆర్థికాభివృద్ధిని కొలవడానికి స్థూల జాతీయోత్పత్తికి ప్రత్యామ్నాయాన్ని శోధించే క్రమంలో మానవ అభివృద్ధి సూచికను ప్రవేశపెట్టారు.

◗ పాకిస్థాన్ ఆర్థికవేత్త మహబూబ్-ఉల్-హక్ ఆధ్వర్యంలో 1990లో ఐక్యరాజ్య సమితి అభివృద్ధి పథకం (యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం - యూఎన్‌డీపీ) తన మొదటి మానవ అభివృద్ధి నివేదికను తయారు చేసింది. అందులో మానవాభివృద్ధి సూచికను ప్రవేశపెట్టారు.

◗ మానవాభివృద్ధి సూచిక రూపకల్పనలో భారతదేశం తరపున సహకారం అందించిన ఆర్థికవేత్త అమర్త్యసేన్.

◗ తర్వాతి కాలంలో మానవాభివృద్ధిని కొలిచే పద్ధతులను కనుక్కునే, సంస్కరించే ప్రయత్నం చేశారు. ఫలితంగా యూఎన్‌డీపీ మానవ అభివృద్ధి నివేదికలో కింది సూచికలను అభివృద్ధి చేసింది. అవి:

1. లింగ సంబంధిత అభివృద్ధి సూచిక (1995)
2. లింగ సాధికారిక కొలమానం (1995)
3. లింగ అసమానత సూచిక (1995)
4. మానవ పేదరిక సూచిక (1997)
5. బహుముఖ పేదరిక సూచిక (2010)

యూఎన్‌డీపీ - మానవాభివృద్ధి నివేదిక - 1997

యూఎన్‌డీపీ - మానవాభివృద్ధి నివేదిక - 1997లో మానవ అభివృద్ధిని కింది విధంగా పేర్కొంది.

■ మానవ అభివృద్ధి అనేది ప్రజలకు ఉన్న అవకాశాలు, వాళ్లు సాధించే సంక్షేమ స్థాయిలను విస్తృతపరిచే ప్రక్రియ. అభివృద్ధి స్థాయి ఏదైనా సరే అందులో మూడు ప్రధాన అవకాశాలు ఉండాలని అది వివరించింది. అవి:

1. దీర్ఘకాలిక ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపే అవకాశం
2. జ్ఞానాన్ని సముపార్జించుకునే అవకాశం
3. ఉన్నత జీవన ప్రమాణాలను పొందడానికి కావాల్సిన వనరులను పొందే అవకాశం.

■ చాలా మంది ప్రజలు ఎక్కువగా విలువ ఇచ్చే ఇతర అవకాశాల్లో రాజకీయ, ఆర్థిక, సామాజిక స్వేచ్ఛ అవకాశాలు; సృజనాత్మకంగా, ఉత్పాదకంగా, ఆత్మాభిమానంతో ఉండటానికి మానవ హక్కుల హామీకి అవకాశాలు ఉన్నాయి.

కొలమానాలు

మానవాభివృద్ధి సూచికను మూడు అంశాల ఆధారంగా కొలుస్తారు. అవి:

1. ఆయుష్షు 2. అక్షరాస్యత రేటు
3. ఉన్నత జీవన ప్రమాణం (దీన్ని తలసరి స్థూల జాతీయోత్పత్తి ద్వారా లెక్కిస్తారు.)

☛ మానవ అభివృద్ధి సూచికను లెక్కించే మూడు అంశాల్లో ఒక్కొక్క అంశానికి సూచికను తయారు చేస్తారు. ఇందుకోసం ఒక్కొక్క సూచికకు గరిష్ఠ, కనీస విలువలను కల్పిస్తారు.

క్ర.సం.	సూచిక	కనీస విలువ	గరిష్ఠ విలువ
1	ఆయుష్షు	25 సంవత్సరాలు	85 సంవత్సరాలు
2	i. వయోజన అక్షరాస్యత రేటు	0	100
	ii. స్థూల నమోదు నిష్పత్తి	0	100
3	జీవన ప్రమాణం (డాలర్లలో)	100	40,000

● ఈ విలువలను కింది సూత్రంలో ఉపయోగించి సూచిక విలువను లెక్కగడతారు.

$$\text{అంశం సూచిక} = \frac{\text{వాస్తవ విలువ} - \text{కనీస విలువ}}{\text{గరిష్ఠ విలువ} - \text{కనీస విలువ}}$$

ప్రతి అంశం పని తీరును 0 నుంచి 1 మధ్య తెలుపుతారు.

▮ యూఎన్‌డీపీ మానవాభివృద్ధి నివేదిక 2023-24లో మానవాభివృద్ధి సూచిక 2022ను ప్రకటించారు. ఇందులో మొత్తం 193 దేశాలు ఉన్నాయి. వాటిలో భారత్ 134వ స్థానంలో (హెచ్‌డీఐ విలువ 0.644) ఉంది.

▮ మొదటి స్థానంలో స్విట్జర్లాండ్ ఆ తర్వాతి స్థానాల్లో నార్వే, ఐలాండ్, హాంగ్‌కాంగ్ చైనా (ఎస్ఏఆర్), డెన్మార్క్ ఉన్నాయి. చివరి స్థానంలో సోమాలియా (193వ స్థానం) ఉంది.

▮ చైనా (75), శ్రీలంక (78), భూటాన్ (125), బంగ్లాదేశ్ (129), మయన్మార్ (144), పాకిస్థాన్ (164), ఆఫ్ఘనిస్థాన్ (182) ర్యాంకుల్లో ఉన్నాయి.

▮ ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన 10 దేశాల్లో భారత్ 5వ స్థానంలో ఉండగా, మానవాభివృద్ధి సూచికలో మాత్రం 134వ స్థానంలో ఉంది. అంటే చైనా, శ్రీలంక, భూటాన్, బంగ్లాదేశ్ దేశాల కంటే మన దేశం వెనుకంజలో ఉంది.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

ఆర్థికాభివృద్ధిలో విద్య పాత్ర

1. విద్య – ఆర్థికాభివృద్ధి: విద్యపై పెట్టుబడి పెడితే ఆర్థికాభివృద్ధిని ఉన్నత స్థాయికి చేరుస్తుంది.

▼ థియోడర్ - ఆడమ్ స్మిత్ ప్రకారం "విద్య వల్ల పరిజ్ఞానం, నైపుణ్యం పెరుగుతాయి. కాబట్టి ఎక్కువ మంది ఉత్పాదక శ్రామికులను సృష్టించవచ్చు."

▼ విద్య వల్ల ఉద్యోగ, ఆదాయ ఆర్జన అవకాశాలు మెరుగవుతాయి. విద్యావంతులైన నాయకులు తయారవుతారు. విద్య నైపుణ్యాన్ని అందిస్తుంది.

2. ఆదాయ అసమానతల తగ్గింపు: సంపూర్ణ విద్య ద్వారా ప్రజల సామర్థ్యం అధికమవుతుంది. ఇది వారి ఆదాయాల పెంపునకు సహకరిస్తుంది.

3. విద్య – గ్రామీణాభివృద్ధి: విద్య ద్వారా గ్రామీణ ప్రజలకు పరిజ్ఞానం చేకూరుతుంది. దీంతో వారు అజ్ఞానాన్ని, మూఢనమ్మకాలను అధిగమిస్తారు.

▼ రైతులు విద్యావంతులైతే నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తారు. దీంతో తక్కువ శ్రమతో అధిక దిగుబడి పొందొచ్చు.

▼ కుటీర పరిశ్రమలను స్థాపించడానికి అవసరమయ్యే నైపుణ్యాన్ని విద్య అందిస్తుంది. దీంతో ప్రచ్ఛన్న నిరుద్యోగిత తగ్గుతుంది.

4. కుటుంబ నియంత్రణ – విద్య: జీవన ప్రమాణ స్థాయిని పెంచుకోవడం, దానికోసం కుటుంబ పరిమాణాన్ని తగ్గించుకోవాల్సిన అవసరాన్ని ప్రజలు విద్య ద్వారా తెలుసుకుంటారు.

▼ దీర్ఘకాలంలో కుటుంబ నియంత్రణకు విద్య ఉత్తమ సాధనంలా పనిచేస్తుంది.

5. ఉద్యోగ శిక్షణ: అనేక సంస్థలు వారి ఉద్యోగులకు పనిలో శిక్షణను అందిస్తాయి. మానవ మూలధనంలో పెరుగుదల అంటే భౌతిక మూలధన ఉత్పాదకత పెరగడమే.

▼ ఉద్యోగ శిక్షణ వల్ల శ్రామికుల నైపుణ్యం సామర్థ్యం అధికమై ఉత్పాదకత, ఉత్పత్తి పెరుగుతాయి.

మేధా వలస:

మేధా వలస (Brain drain) అంటే ఉన్నత విద్యావంతులు, నైపుణ్యం ఉన్న వృత్తిపరమైన సాంకేతిక సిబ్బంది అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి అభివృద్ధి చెందిన దేశాలకు తరలిపోవడం.

ఈనాడు ప్రతిభ
■ e-mail: pratibhadesk@eenadu.net

449 Word of the Day

Contentiously

Telugu meaning: ఉద్రేకపూర్వక, వివాదాస్పద

English meaning: The word 'contentiously' (కంటెన్షియస్లీ) is an adverb that describes something done in a quarrelsome or argumentative manner.

Synonyms: Argumentatively, Combatively

Antonyms: Harmoniously, Peacefully

Usage: **1.** They contentiously debated the new policy, with neither side willing to back down.

2. She contentiously interrupted the meeting, challenging every point the speaker made.

Latest Updates

AIASL, Kolkata

AI Airport Services Limited (AIASL) invites applications for the recruitment of Handyman, Utility Agent cum Ramp Driver posts on a contract basis at Netaji Subhash Chandra Bose International Airport, Kolkata. The total no. of posts is 142. Eligible candidates can apply online before 31 October 2024.

Diploma Apprentice Posts

Bharat Electronics Limited (BEL), Ghaziabad invites applications for Diploma Apprentice for one year of apprenticeship training in the Mechanical Engineering, Computer Science, Electronics, Civil Engineering branches. The total no. of posts is 90. The last date for online application is 4 November 2024.

Free Coaching for Competative Exams

Telangana Study Circle for STs- PETC Warangal, invites applications from eligible ST candidates for admission into Foundation Course for Groups, Police, Banking, Railways, SSC etc. The last date for online registration is 27 October 2024.

Did You Apply..?

Today (October 24) is the last date for the following Jobs/ Apprentice posts/ Admissions

☛ 3306 Group C and D posts in Allahabad High Court. ***Qualification:*** 6th, 10th, 12th, ITI, Diploma, Degree.

☛ Managerial posts in HCSL, Howrah. ***Qualification:*** Diploma, Degree, PG and work experience.

☛ 600 Apprentice posts in Bank of Maharashtra. ***Qualification:*** Bachelor's degree.

☛ B.Sc Courses in Jawaharlal Institute of Postgraduate Medical Education and Research (JIPMER), Puducherry. ***Eligibility:*** 10+2.

For more information and other notifications - scan QR code



స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పడే సంస్థలే స్థానిక ప్రభుత్వాలు. భారత రాజ్యాంగంలోని 40వ నిబంధన పంచాయతీ రాజ్ సంస్థలను ఏర్పాటు చేయాలని పేర్కొంటోంది.

☛ ఈ వీడియోలో 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాలు - వాటి అమలుకు ప్రధాన కారణాలు, స్థానిక సంస్థల చారిత్రక నేపథ్యం మొదలైన అంశాలను వివరించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మేమందించే వీడియోలు ఎప్పటికప్పుడు మిస్ కాకుండా చూసేందుకు ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేయండి!

Current Affairs



The organisers of the 2026 edition of the Glasgow Commonwealth Games confirmed on 22 October 2024 that badminton, cricket, hockey, squash, table tennis, and wrestling were excluded from the Games' programme.

▮ The disciplines that will be part of Glasgow Games are athletics and para-athletics (track & field), swimming and para-swimming, artistic gymnastics, track cycling and para track cycling, netball, weightlifting and para powerlifting, boxing, judo, bowls and para bowls, and 3x3 basketball and 3x3 wheelchair basketball.

The International Monetary Fund (IMF) maintained its projection for India's GDP growth at 7% for the current fiscal year (2024-25). It also forecast India's growth rate to moderate to 6.5% in the fiscal year 2025-26. The latest estimates, published in the IMF's World Economic Outlook (WEO).

Maldives President Mohamed Muizzu has announced the introduction of India's Unified Payments Interface (UPI) on 21 October 2024 to enhance the country's economy. Muizzu set up a consortium to introduce UPI in the country and appointed TradeNet Maldives Corporation Limited as its leading agency.

Indian archer Deepika Kumari won the silver medal in the Archery World Cup final at Tlaxcala, Mexico on 21 October 2024. She lost the match with a 0-6 against Chinese Li Jiaman.

☛ This is her sixth World Cup medal. Deepika captured silver medals in 2011, 2012, 2013, 2015 and 2024. She also won a bronze medal in 2018.

For more Current Affairs: Scan QR code

Bank Exams

Reasoning

Directions

1. Vikas walked 20 metres towards South, took a right turn and walked 5 metres. He took a right turn again and walked 20 metres before stopping. Which direction does Vikas face after stopping?

A) West B) North
C) South D) East
E) Can't be determined

2. W walked 40 metres towards West, took a left turn and walked 30 metres. He then took a right turn and walked 20 metres. He again took a right turn and walked 30 metres. How far was he from the starting point?

A) 70 metres B) 60 metres
C) 90 metres D) Can't be determined
E) None of these

3. Sushil walked 15 meters towards South, took a left turn and walked 20 meters again he took a left turn and walked 15 meters. How far and in which direction is he from the starting point?

A) 20 meters, West
B) 20 meters, East
C) 50 meters, West
D) 50 meters, East
E) Data inadequate

4. Mohan walked 30 meters towards South, took a left turn and walked 15 meters. He then took a right turn and walked 20 meters. He again took a right turn and walked 15 meters. How far is he from the starting point?

A) 95 meters B) 50 meters
C) 70 meters D) Can't be determined
E) None of these

5. Prabir started walking towards South. He took a right turn after walking 10 metres. He again took a left turn after walking 20 metres. Which direction is he facing now?

A) South B) North
C) West D) East
E) Cannot be determined

6. P walked 2 km west of his house and then turned South covering 4 km. Finally, he moved 3 km towards East and then again 1 km West. How far is he from his initial position?

A) 10 km B) 9 km
C) 2 km D) 4 km
E) None of these

7. A walked 30 meters towards East, took a right turn and walked 20 meters, again took a right turn and walked 20 meters. In which direction he is from the starting point?

A) North-West B) West-East
C) South-East D) North-East
E) None of these

8. Pooja started walking straight facing West. After walking some distance she took a left turn and again after walking some distance she took a left turn. Which direction is she facing now?

A) West B) North
C) East D) South
E) Can't be determined

9. Prakash started to walk from point P in the South and walked 40m. Then he turned to his left and walked 30m and reached at Q. What is the least distance from P and Q and in what direction is Q from P?

A) 45m, South
B) 50m, South-East
C) 60m, North-Tast
D) 65m, South-West
E) None of these

10. A man went 10 kms towards South. Then turned East and covered 10 kms and turned to the right. Again after 10 kms, he turned to left and covered 10 kms to reach the destination. In which direction is he from the starting point?

A) North B) West
C) North-East D) South-East
E) None of these

11. Town D is to the West of town M. Town R is to the South of town D. Town K is to the East of town R. Town K is towards which direction of town D?

A) South B) East
C) North-East D) South-East
E) None of these

12. From his house, Ankit walks 15 km to the North. Then he turns West and covered 20 km. Then he turns South and covered 5 km. Finally turning to East, he covers 25 km. In which direction is he from his house?

A) North-West B) North-East
C) South-East D) South-West
E) None of these

Scan the QR code for the Key

These model questions were prepared by subject experts of RACE Institute Hyderabad

డ్రోన్‌తో మందుల పంపిణీ

● వైద్యపరీక్షల నమూనాల తరలింపు
● సాధారణ రవాణాతో పోలిస్తే.. 2 గంటల ముందే చేరవేత
● రిషికేష్‌లోని ఎయిమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రాజెక్టుల అమలు

ఈనాడు, అమరావతి: వైద్యరంగంలో డ్రోన్ సాంకేతికత విస్తరిస్తోంది. జాతీయ ఆరోగ్య మిషన్ కింద హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో వైద్యపరీక్షల నమూనాలను డ్రోన్ల ద్వారా తరలించారు. రోడ్డు రవాణా లేని ఉత్తర హిమాలయ పర్వత ప్రాంతాల్లో డ్రోన్లతో తక్కువ సమయంలో మందులు చేరవేస్తున్నారు. కొవిడ్ సమయంలో మేఘాలయలో టీకాలను కూడా సరఫరా చేశారు. డ్రోన్ సమిట్‌లో భాగంగా 'ప్రజారోగ్య రంగంలో డ్రోన్ టెక్నాలజీ, వైద్య మద్దతు' అనే అంశంపై రిషికేష్‌లోని ఎయిమ్స్ ఈడీ డాక్టర్ అన్షైత పూరి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఈ అంశాలను వివరించారు. దోమల కారణంగా వచ్చే డెంగీ, మలేరియా, గన్యా తదితర వ్యాధుల పర్యవేక్షణ, నియంత్రణకు డ్రోన్లను ఉపయోగించవచ్చని సూచించారు. రిషికేష్, హరిద్వార్, దేహ్రాదూన్‌ల్లో ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. డ్రోన్ సేవలను విస్తరించేందుకు హబ్, స్పోక్ మోడల్ అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు.

వైద్యరంగంలో అవకాశం

- మందులు, టీకాల డెలివరీ
- వ్యాధి నిర్ధారణ కోసం సేకరించిన నమూనాల చేరవేత
- గాయాలు, ఇతర అత్యవసర సమయాల్లో రక్తం సరఫరా
- అవయవ దానం సమయంలో సత్వరం గమ్యస్థానానికి చేర్చడం

165 నిమిషాల నుంచి 34 నిమిషాలకు..

దేశంలోనే తొలిసారిగా రిషికేష్‌లోని ఎయిమ్స్ డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించి టీబీ నివారణ మందుల పంపిణీ ప్రారంభించింది. రోడ్డు రవాణాతో పోలిస్తే డ్రోన్ల ద్వారా తక్కువ సమయాల్లో మందులు సరఫరా చేస్తోంది. గూగుల్ మ్యాప్ ప్రకారం ప్రయాణ సమయం 165 నిమిషాలు ఉంటే.. డ్రోన్ ద్వారా 34 నిమిషాల్లోనే మందులు అందిస్తున్నారు. జిల్లా ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామాలకు మందులు చేర్చడానికి ఎంతెంత సమయం పడుతుందనే దానిపై 2023 ఫిబ్రవరి, మార్చి, ఆగస్టు, ఈ ఏడాది జనవరిలో ట్రయల్స్ నిర్వహించినట్లు పూరి వివరించారు.

సవాళ్లు ఉన్నాయి..

'ఉత్తరాఖండ్‌లో పర్వత ప్రాంతాలు, పేలవమైన రవాణా వ్యవస్థల కారణంగా వైద్యసేవలకు ఆటంకాలేర్పడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో మరింత సంక్లిష్టంగా మారుతుంది. ఇలాంటి సమయంలో డ్రోన్ ద్వారా సేవలకు వీలుంటుంది' అని పూరి తమ ప్రజంటేషన్‌లో వెల్లడించారు. 'అయితే డ్రోన్ల ద్వారా మందులు, టీకాల సరఫరాలోనూ సవాళ్లున్నాయి. పరిపాలనాపరమైన సమస్యలతోపాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులు, బ్యాటరీ ఛార్జింగ్ లేకపోవడం, విద్యుత్తు సమస్యలు అవరోధంగా మారుతున్నాయి. వీటిని అధిగమించే దిశగా సురక్షిత కమ్యూనికేషన్ వ్యవస్థ రూపొందించుకోవడంతోపాటు వ్యూహాలు సిద్ధం చేసుకోవాలి' అని సూచించారు.


రోబోటిక్ డ్రోన్

అందుబాటులోకి డ్రోన్ అంబులెన్స్‌లు

● త్వరితగతిన రెడ్‌జోన్ అనుమతులొచ్చేలా చూడాలి ● ఆరోగ్య రంగంలో డ్రోన్ సేవలపై నిపుణులు

ఈనాడు, అమరావతి: వైద్యసేవల్లో డ్రోన్ సాంకేతికత వినియోగానికి సంబంధించి సున్నా నుంచి ప్రారంభించి ఒక అడుగు మాత్రమే పడిందని నిపుణులు అభిప్రాయపడ్డారు. వైద్యరంగంలో మందులు, ఇతర అవసరాలకు వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుందని.. ఇందులో అనేక సవాళ్లున్నాయని వివరించారు. డ్రోన్ సాంకేతికత అభివృద్ధి చేసేందుకు దేశంలో అనువైన కారిడార్ వ్యవస్థ, టెస్టింగ్ సౌకర్యాలు లేవని.. ఈ విషయంలో ఇప్పుడు ఏపీ ముందడుగు వేసిందని ప్రశంసించారు. డ్రోన్ సమిట్‌లో భాగంగా బుధవారం 'దేశ ఆరోగ్య రంగంలో డ్రోన్ డెలివరీలు, అనువైన పర్యావరణ వ్యవస్థ సృష్టించడం' అంశంపై జరిగిన చర్చకు రెడ్‌వింగ్ ల్యాబ్స్ సీఈఓ అన్షుల్ శర్మ సమన్వయకర్తగా వ్యవహరించారు. దేశ విస్తీర్ణంలో 90% మేర గ్రీన్‌జోన్ పరిధిలోనే ఉందని, అక్కడ డ్రోన్ సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదని ఏరోస్పేస్ ప్రతినిధి దినేశ్ వివరించారు. అవయవ రవాణాకు ప్రత్యేక కారిడార్ అవసరమని సూచించారు. ప్రజారోగ్య సౌకర్యాలను బలోపేతం చేయడంలో డ్రోన్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని లీడ్ కన్సల్టెంట్ ఆంజనేయసాహి పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య రంగంలో డ్రోన్ డెలివరీకి ఎన్నో సవాళ్లున్నాయని పులెన్ శర్మ పేర్కొన్నారు. మందుల రవాణాకు రెడ్, గ్రీన్‌జోన్ సమస్యలున్నాయని తెలిపారు. ర్యాబిస్, పాముకాటు సమయాల్లో సత్వరమే మందులు అందించాల్సి ఉంటుందన్నారు. ఈ రంగంలో డ్రోన్ వినియోగానికి హోల్‌సేల్ మెయింటెనెన్స్ ఎంతో ముఖ్యమన్నారు. అనుమతులు, టెస్టింగ్ సౌకర్యాలు పెరిగితేనే ఉపయోగకరమని గౌరవ్ పేర్కొన్నారు.

50% అవయవాలే సద్వినియోగం

అవయవ దానానికి దాతలు ముందుకొచ్చినా రవాణాలో జాప్యం కారణంగా నిర్దేశిత సమయంలో ఆసుపత్రులకు చేర్చలేకపోతున్నామని క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో లక్ష్మీశ వివరించారు. 55 మంది దాతలిచ్చిన అవయవాలతో 330 మంది జీవితాలను కాపాడే అవకాశమున్నా 167 మందికి మాత్రమే అందించగలిగామని చెప్పారు. 50శాతం అవయవాలను మాత్రమే సద్వినియోగం చేసుకోగలిగామని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు అవయవాలు చేర్చాలంటే 500 కి.మీ.కుపైగా ప్రయాణించాల్సి ఉంటుందని, అసాధ్యమవుతుందని తెలిపారు. అదే డ్రోన్ ద్వారా 3 నుంచి 4 గంటల్లోనే చేర్చే అవకాశం ఉంటుందని వివరించారు. మెడికల్ డ్రోన్, ఆర్గాన్ అంబులెన్స్ తరహా ఏర్పాట్లు అవసరమని అభిప్రాయపడ్డారు. స్పోక్, హబ్ విధానంలో జోన్లు ఏర్పాటుచేసి అక్కడ సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచడం, బ్యాటరీలను మార్చడం ద్వారా సత్వర సేవలకు వీలుంటుందని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల నివారణలోనూ డ్రోన్ సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు.

వ్యవసాయ డ్రోన్ బ్యాటరీలకు వారంటీ ఏదీ?

వ్యవసాయంలో ఉపయోగించే డ్రోన్ల బ్యాటరీలకు వారంటీ లేదని రైతు వివరించారు. ఒక్కో బ్యాటరీకి రూ.50 వేలకుపైగా ఖర్చు చేస్తే అవి పనిచేయకపోతే రైతు పరిస్థితేంటని ప్రశ్నించారు. ఆరు బ్యాటరీలకు రూ.3 లక్షలవుతుందని వివరించారు. బ్యాంకుల నుంచి అప్పు తెచ్చి కొనుగోలు చేసే రైతులు ఏం కావాలని ఆవేదన వెలిబుచ్చారు. పెట్రోల్ డ్రోన్ యూనిట్‌కే వారంటీ లేదని ప్రస్తావించారు. వారంటీ ఉన్న డ్రోన్లనే కొనాలని వేదికపై ఉన్న నిపుణులు సూచించారు.

ఉపాధికి కేరాఫ్‌గా డ్రోన్ పరిశ్రమ

● ఐదు రోజుల శిక్షణతోనే పైలట్‌గా అవకాశం ● సమస్యగా మారిన పైలట్ల కొరత
● డ్రోన్ సేవల రంగంలో 20 నుంచి 30 ఏళ్ల పాటు ఉపాధి

ఈనాడు, అమరావతి: 'డ్రోన్ సేవల రంగం ఉపాధికి కేరాఫ్‌గా మారింది. కేవలం ఐదు రోజుల శిక్షణ పొందితే లీగల్‌గా డ్రోన్ పైలట్ కావచ్చు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రం కూడా వస్తుంది. ప్రస్తుతం నిపుణులైన పైలట్ల కొరత డ్రోన్ పరిశ్రమకి సవాల్‌గా మారింది. దీన్ని ఉద్యోగార్థులు, విద్యార్థులు అందిపుచ్చుకోవాలి' అని డ్రోన్ రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. 'భారతీయ డ్రోన్ పరిశ్రమకు నిపుణులైన మానవ వనరుల తరాన్ని అభివృద్ధి చేయడం' అనే అంశంపై అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 వేదికగా నిర్వహించిన బృంద చర్చలో నిపుణులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.


పంటలపై పురుగు మందు పిచికారీ చేసే డ్రోన్ గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

దశాబ్దాలపాటు ఉపాధి

'డ్రోన్ సేవల రంగంలో ఉపాధి తాత్కాలికం అనేది అపోహ మాత్రమే. ఒక్కసారి ఇందులోకి అడుగుపెడితే 20 నుంచి 30 ఏళ్లపాటు కొనసాగవచ్చు. ఉపాధి, ఆదాయానికి ఇబ్బంది ఉండదు. అయితే అవసరమైనప్పుడు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి. డ్రోన్ల తయారీకి ఏపీ వేదికగా మారనుంది' అని వెల్లడించారు.

అక్కడితో ఆగిపోకూడదు

'డ్రోన్ సేవలు అనగానే ఎక్కువగా వ్యవసాయ రంగంలో ఉపయోగిస్తారని అనుకుంటున్నారు. కానీ, డ్రోన్ సాంకేతికత అక్కడితోనే ఆగిపోలేదు. విభిన్న రంగాలకు విస్తరించింది. ఈ అంశాలపై విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చేయించి, వాటిపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ప్రత్యేక పాఠ్యప్రణాళిక రూపొందించాలి. పైలట్‌గా సాధారణ శిక్షణతో ఆగిపోకుండా, అప్లికేషన్లవారీగా శిక్షణ పొందితే ప్రయోజనం ఉంటుంది' అని పేర్కొన్నారు. ఈ రంగంలో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించారు.

సమస్యలు..

- డ్రోన్ పైలట్‌గా శిక్షణ పొందిన వారి సంఖ్య.. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న పైలట్ల సంఖ్యకు పొంతన ఉండటం లేదు. శిక్షణ పొందినవారు లైసెన్స్ తీసుకుని, ఈ రంగంలో కొనసాగకుండా వెళ్లిపోతున్నారు.
- వ్యవసాయం వంటి కొన్ని పరిమిత రంగాలకు సంబంధించినంత వరకే డ్రోన్ సేవలు, పైలట్ల శిక్షణపై ఎక్కువగా దృష్టి పెడుతున్నారు.

పరిష్కారం ఇలా..!

- పైలట్‌గా శిక్షణ పొందినవారు ఈ రంగంలోనే కొనసాగేలా ప్రోత్సహించాలి.
- థియరీతోపాటు క్షేత్రస్థాయిలో తర్ఫీదు ఇవ్వడంతో ఈ రంగంపై ఆసక్తి పెంచవచ్చు.
- వ్యవసాయ రంగంలో సేవలందించే పైలట్లకు పంటపొలాలు, ఎరువుల మోతాదులపై అవగాహన కల్పించాలి.

190 మందికి శిక్షణ ఇచ్చాం

–కె.రఘు, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈడీ

డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇవ్వడానికి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఇప్పటికే సుమారు 190 మందికి శిక్షణ ఇచ్చాం. డ్రోన్ రంగం పట్ల ఉద్యోగార్థులకు అవగాహన కల్పించాలి. దీంతో ఉపాధి కల్పనకూ అవకాశం ఉంటుంది.

డ్రోన్‌ల రంగం అభివృద్ధికి మార్గం సుగమం

● పరిశోధన, అభివృద్ధిలో ఐఐటీ తిరుపతి సహకారం
● క్యూసీఐ ఒప్పందంతో ధ్రువీకరణ వ్యవస్థల ఏర్పాటుకు అవకాశం

ఈనాడు, అమరావతి: డ్రోన్ సాంకేతికతలో సృజనాత్మకత, నైపుణ్యం పెంపొందించడంలో ఏపీ డ్రోన్ కార్పొరేషన్ (ఏపీడీసీ) నిబద్ధతను బలోపేతం చేయడానికి అమరావతి డ్రోన్ సమిట్-2024 ఒక వేదికగా ఉపయోగపడింది. డ్రోన్ రంగంలో జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికిల్ (యూఏవీ) వ్యవస్థలు, సేవలకు ఏపీని కేంద్రంగా మార్చాలనే కలను సాకారం చేయడంలో భాగంగా ఏపీడీసీ రెండు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసింది. ఐఐటీ తిరుపతి నవావిష్కార్ ఐ హబ్ ఫౌండేషన్, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ)తో ఎంఓయూలు కుదుర్చుకుంది. వాటిద్వారా రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీ, ఇన్నోవేషన్, క్వాలిటీ అస్యూరెన్స్ పెంచడం, ఏపీలో డ్రోన్ రంగం అభివృద్ధికి అనువైన వాతావరణం కల్పించేందుకు మార్గం ఏర్పడుతుందని ప్రభుత్వం పేర్కొంది.

ఏపీడీసీ, ఐఐటీ తిరుపతితో ఒప్పందం వల్ల ప్రయోజనాలు

- **రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్:** అడ్వాన్స్‌డ్ అటానమస్ డ్రోన్ సిస్టం, కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత అనలిటిక్స్, జియోస్పేషియల్ ఇంటిగ్రేషన్
- **శిక్షణ, నైపుణ్య కార్యక్రమాలు:** పరిశ్రమ అవసరాల కోసం యూఏవీ టెక్నాలజీల్లో నిపుణులైన మానవ వనరులను తీర్చిదిద్దడానికి సర్టిఫికేషన్ అందించడం
- **స్టార్టప్‌ల కోసం:** డ్రోన్ ఆధారిత ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి ఇంక్యుబేషన్ సౌకర్యాలు, మెంటారింగ్, పెట్టుబడి నెట్‌వర్క్ కల్పించడం
- **నావిక్ ఇంటిగ్రేషన్:** డ్రోన్‌ల వినియోగంలో మెరుగైన కచ్చితత్వం కోసం దేశంలోని నావిక్ వ్యవస్థలను వినియోగించి స్వదేశీ ఉపగ్రహ ఆధారిత నేవిగేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయడం.
- ఈ ఒప్పందాల ఆధారంగా వర్క్‌షాప్‌లు, హ్యాకథాన్‌లు, సాంకేతికత ద్వారా సృజనాత్మక వాతావరణాన్ని పెంపొందించడం, వ్యవసాయం, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, పట్టణ ప్రణాళిక వంటి రంగాల్లో సాంకేతిక సహకారం అందనుంది.


పెట్రోల్‌తో నడిచే కార్గో, సర్వేలెన్స్ డ్రోన్ ఇది. లీటరు పెట్రోల్‌తో 45 కి.మీ. ప్రయాణించగలదు. 16 కిలోల సరకులు మోసుకెళ్లగలదు

క్యూసీఐతో ఒప్పందం వల్ల ప్రయోజనాలు

- డ్రోన్ పరిశ్రమలో నాణ్యతా ప్రమాణాల కోసం ఒక నిర్దిష్ట విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడం
- **డ్రోన్ ఎకోసిస్టం:** డ్రోన్ అప్లికేషన్లకు అవసరమైన సాంకేతిక సహకారం, నాణ్యమైన మానవ వనరులను అందించడం ద్వారా డ్రోన్ రంగం విస్తరణకు అనువైన వాతావరణాన్ని కల్పించడం
- **సర్టిఫికేషన్.. అక్రెడిటేషన్:** నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించడానికి పరిశ్రమకు అవసరమైన సర్టిఫికేషన్ వ్యవస్థల ఏర్పాటు
- **కార్యక్రమాల ప్రోత్సాహం:** డ్రోన్ సాంకేతితలో రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు మార్కెటింగ్, అవగాహన కార్యక్రమాల్లో సహకారం.

నిందితుడు తెదేపా కార్యకర్తగా నిరూపించడానికే జగన్ కష్టపడ్డారు

● హోంమంత్రి అనిత ఎద్దేవా

ఈనాడు డిజిటల్, అమరావతి: గుంటూరు జిల్లాలో యువతి సహనాపై దాడి చేసి ఆమె మృతికి కారకుడైన యువకుడు తెదేపా కార్యకర్తంటూ ప్రజల్ని నమ్మించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ చాలా కష్టపడ్డారని హోంమంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. దళితులపై అంత చిత్తశుద్ధి ఉంటే తన ఐదేళ్ల పాలనలో డాక్టర్ సుధాకర్, ఓంప్రతాప్, వరప్రసాద్‌ల కేసులను ఏం చేశారని నిలదీశారు. రాష్ట్ర సచివాలయంలో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. 'విజయవాడలోని ఆసుపత్రిలో మూడు రోజులపాటు దళిత వర్గానికి చెందిన దివ్యాంగురాలిపై అత్యాచారం చేస్తే ఏం చేశారు? రాజమహేంద్రవరంలో దిశ పోలీసుస్టేషన్ ఏర్పాటుచేసిన రోజే ఓ యువతిని వారంపాటు అత్యాచారం చేసి అదే స్టేషన్ ముందు వదిలి నిందితులు మీకు సవాలు విసిరితే ఎందుకు మాట్లాడలేదు? కేవలం కుల రాజకీయాలు చేసి ప్రభుత్వంపై నెపం వేయాలని మాత్రమే జగన్ చూస్తున్నారు..' అని మండిపడ్డారు. 'జగన్ ఏ రోజూ మహిళలపై జరిగిన అఘాయిత్యాలపై మాట్లాడలేదని ఆయనపై ఈగ కూడా వాలనివ్వని మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. కనీసం మహిళలంటే గౌరవం ఆయనకు లేదని చెప్పారు. ఆస్తుల్లో వాటా కోసం సొంత తల్లి, చెల్లిపై కేసు పెట్టే స్థాయికి జగన్ దిగజారారు. అలాంటి జగన్ నీతులు చెబుతున్నారు. రౌడీషీటర్లు, గంజాయి స్మగ్లర్లు, చివరకు అమ్మాయిలను ఇబ్బంది పెట్టేవారిని సమాజానికి చూపించాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. 4 నెలల్లో మహిళలపై జరిగిన ప్రతీ కేసులో మూడు రోజుల్లోపు నిందితులను పట్టుకున్నాం. సత్వరమే శిక్షలు పడేలా ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని హైకోర్టును కోరాం' అని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్

ఈనాడు డిజిటల్, అమరావతి: పెండింగులో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు కోరారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన్ని బుధవారం కలిశారు.

రాష్ట్రంలో 840 టీఎంసీల నీటి నిల్వ

● మరో 143 టీఎంసీలు నింపేందుకు ఆస్కారం
● ఉత్తరాంధ్ర, కోస్తా చెరువుల్లో జలకళ.. సీమలో వెలవెల
● సీఎంకి జలవనరులశాఖ నివేదిక

ఈనాడు – అమరావతి: ఈ వర్షాకాలంలో వచ్చిన వరదలను ఆధారంగా చేసుకుని రాష్ట్రంలో 983 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి 840 టీఎంసీలు నింపారు. జలాశయాలను నింపే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ జలవనరులశాఖతో సమీక్షిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష సందర్భంగా బుధవారం సీఎంకు జలవనరులశాఖ అధికారులు రాష్ట్రంలోని జలాశయాల పరిస్థితులు, నీటి నిల్వ, భూగర్భజలాల మెరుగుదల, నీటి నిల్వ పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై నివేదిక సమర్పించారు. ప్రధాన రిజర్వాయర్లలో తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజి, ధవళేశ్వరం కాటన్ బ్యారేజి, ఏలేరు జలాశయాల్లో మొత్తం 709.53 టీఎంసీల నీటి నిల్వకు అవకాశం ఉండగా 695.93 టీఎంసీలు నిల్వ చేయగలిగారు.

భూగర్భజలాలు మెరుగుదల

రాష్ట్రంలో భూగర్భజలాలు కూడా మెరుగయ్యాయని ముఖ్యమంత్రికి అధికారులు నివేదించారు. గత పదేళ్లలో వర్షాకాలానికి ముందు సగటున 11.71 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండేవని.. వానలు పడ్డాక సగటున 9.02 మీటర్ల మేరకు పెరిగేవని చెప్పారు. ఈ ఏడాది వర్షాకాలానికి ముందు 11.81 మీటర్ల స్థాయికి అడుగంటినా సెప్టెంబరు నాటికి 8.51 మీటర్ల మేరకు జలమట్టాలు పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం భూగర్భజలాలను 278 టీఎంసీల వరకు వాడుకోగలుగుతున్నామని గణాంకాలు పేర్కొంటున్నాయి.

830 గ్రామాలు ఎడారే!

రాష్ట్రంలో భూగర్భజలాలు అసలు లేకుండా 830 గ్రామాలు ఎడారిలా మారిపోయినట్లే. భూగర్భజలం అత్యంత దారుణ పరిస్థితుల్లో ఉన్న గ్రామాలు 450. దారుణ పరిస్థితులు ఏర్పడేందుకు చేరువలో ఉన్న పల్లెలు 1,271. ప్రస్తుతం రాష్ట్రంలో భూగర్భజలాల విషయంలో రక్షణాత్మక స్థితిలో ఉన్న గ్రామాలు 14,020 ఉన్నట్లు గుర్తించారు.

చెరువులకు జలకళ

రాష్ట్రంలో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. శ్రీకాకుళం నుంచి ఉత్తరాంధ్ర, గోదావరి, దక్షిణ కోస్తా జిల్లాలు బాపట్ల వరకు మొత్తం 15 జిల్లాల్లో 24,487 చెరువుల్లో 65 శాతం మేర నీటితో కళకళలాడుతున్నాయి. పల్నాడు నుంచి ప్రారంభించి సీమ జిల్లాల్లో మొత్తం 13,957 చెరువులు ఉంటే అక్కడ 28.2 శాతం మాత్రమే నింపగలిగారు.

పథకం	జలాశయాలు	మొత్తం నిల్వ సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నిల్వ
గాలేరు- నగరి సుజల స్రవంతి	8	70.89	61.78
తెలుగు గంగ	4	39.275	27.41
సోమశిల, కండలేరు	2	99.5	46.5
హంద్రీనీవా సుజల స్రవంతి	6	6.97	4.41
తుంగభద్ర ఎగువ కాలువ	6	19.81	5.41
ఉత్తరాంధ్ర	13	44.4	21.8

టెట్ స్కూల్ అసిస్టెంట్ ఆంగ్ల సబ్జెక్టుపై ఫిర్యాదులు

● మొదటి భాష తెలుగుకు బదులు ఆంగ్లం రాసిన కొందరు అభ్యర్థులు
● టెట్ నిబంధనలకు ఇది విరుద్ధమంటూ ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) స్కూల్ అసిస్టెంట్ (2ఏ) ఆంగ్ల సబ్జెక్టులో రెండో సెక్షన్‌లో మాతృ భాషగా తెలుగు సబ్జెక్టు రాయాల్సి ఉండగా.. చాలామంది ఆంగ్ల భాషను ఎంపిక చేసుకోవడం వివాదంగా మారింది. ఎస్ఏ ఆంగ్ల భాష సబ్జెక్టుకు టెట్‌లో నాలుగు సెక్షన్లు ఉంటాయి. చైల్డ్ డెవలప్‌మెంట్ పెడగాజీ, మాతృభాష, జనరల్ ఆంగ్లం, సబ్జెక్టు కంటెంట్-మెథడాలజీ ఉంటాయి. రెండో సెక్షన్‌కు సంబంధించి మాతృభాషగా తెలుగు సబ్జెక్టును ఎంపిక చేసుకోవాల్సి ఉండగా..చాలా మంది మళ్లీ ఆంగ్లాన్నే ఎంపిక చేసుకున్నారు. ఇప్పుడు దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన టెట్ ప్రకారం మాతృభాషను ఎంపిక చేసుకోవాల్సి ఉండగా.. ఇందుకు విరుద్ధంగా కొందరు అభ్యర్థులు చేసినట్లు తెలిసింది. కొందరు తెలుగు ఎంపిక చేసుకోవడం, మరికొందరు నిబంధనలకు విరుద్ధంగా ఆంగ్లం ఎంపిక చేసుకోవడంతో మార్కుల్లో వ్యత్యాసం వస్తుందని అభ్యర్థులు వాపోతున్నారు.

- టెట్ రాసే వారిలో తమిళ్, కన్నడ, ఒడియావారు ఉండడంతో మాతృభాషగా అన్ని సబ్జెక్టులూ వచ్చేలా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. పరీక్ష రాసే సమయంలో రెండో సెక్షన్ మాతృభాషకు సంబంధించి ఎవరికి వారు ఆయా భాషలను ఎంపిక చేసుకోవాలి. తెలుగు రాయాల్సిన వారు తెలుగుకు బదులు మళ్లీ ఆంగ్లాన్నే ఎంచుకున్నారు.
- టెట్ నిబంధనల ప్రకారం నాలుగు విభాగాలకు కలిపి 150 మార్కులు ఉంటాయి. సబ్జెక్టు కంటెంట్-పెడగాజీకి సంబంధించి 90మార్కులు మిగతా మూడు సెక్షన్లకు 30చొప్పున మార్కులు ఉంటాయి. ఇప్పుడు మాతృభాష సబ్జెక్టు ఎంపికలో జరిగిన మార్పు కారణంగా 30 మార్కుల్లో తేడాలు వస్తే ర్యాంకులు మారిపోతాయని అభ్యర్థులు వాపోతున్నారు.

దరఖాస్తు నుంచి అదే సమస్య

టెట్‌కు దరఖాస్తు చేసే సమయంలో మాతృభాషను ఎంపిక చేసుకున్న ఆంగ్ల సబ్జెక్టే వచ్చింది. దీనిపై అప్పట్లో అభ్యర్థులు ఫిర్యాదు చేస్తే సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా ఇలా వచ్చిందని, పరీక్ష కేంద్రాల్లో మార్పు చేస్తామని పేర్కొన్నారు. కానీ, ఆన్‌లైన్ పరీక్షలో మాత్రం అభ్యర్థుల మాతృభాష ఆధారంగా అదే భాష సబ్జెక్టు ఓపెన్ కావాల్సి ఉండగా.. అన్ని సబ్జెక్టులూ ఓపెన్ అయ్యేలా లాగిన్ ఇచ్చారు. దీంతో అభ్యర్థులు తెలుగు పరీక్ష రాయలేదు.

సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో చెన్నైలోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా కాన్సుల్ జనరల్ కిమ్‌చాంగ్‌యున్ బుధవారం సమావేశమయ్యారు. పలు రంగాల్లో కొరియా, ఏపీ ప్రభుత్వాల మధ్య భాగస్వామ్యం, పరస్పర సహకారంపై ఈ సమావేశంలో చర్చించారు.



సీఎం సహాయనిధికి విరాళాలిచ్చిన దాతల వివరాలు..

వ్యక్తి/సంస్థ	సాయం (రూ.లలో)
● పి.సత్యనారాయణ	2 లక్షలు
● కామినేని మల్లికార్జున	1.55 లక్షలు
● ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ	1.5 లక్షలు
● నిహారికా ఏజెన్సీస్	1.4 లక్షలు
● న్యూక్లియస్ ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ సొసైటీ	1.10 లక్షలు
● శ్రీఆంధ్రరాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం	1.01 లక్షలు
● ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్	లక్ష
● నాగేశ్వరరావు అవధాని	లక్ష
● ఎస్.గోవర్ధన్‌రెడ్డి	లక్ష
● ఎస్.సాదిక్‌బాషా	75 వేలు
● శ్రీవీరాంజనేయస్వామి	70 వేలు
● ఏవీ నాగేశ్వరరావు	40 వేలు
● వి.సాంబశివరావు	40 వేలు
● జేసీవీ కెమికల్స్	32 వేలు
● శ్రీసాయిరామ్ ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ సొసైటీ	25 వేలు
● కరుణామయ ఇంగ్లీష్ మీడియం స్కూల్	25 వేలు
● రవీంద్ర ఎడ్యుకేషనల్ సొసైటీ	25 వేలు
● శ్రీవినాయక సర్వీసెస్	25 వేలు
● దివిలి కృష్ణా	20 వేలు
● సింహాద్రి నాగరాజు	20 వేలు
● డియ్యాల మధుసూదన్‌రావు	12 వేలు
● బాలవెంకటయ్య	10 వేలు
● సాయిశ్రీనివాస్ ఫెర్టిలైజర్స్	7,516
● మొగల్ సలీం బాషా	5,200